అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

శుక్రవారం 03-01-2025 సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 11 సంచిక : 04 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు | వెల : 6.50



మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా
సావిత్రిబాయి పూలే జయంతి
ఇక జనవరి 3 రాష్ట్ర పండుగ

ప్రభుత్వ ఉత్తర్వులు విడుదల..నేడు సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మహాత్మా జోతిబాఫూలే సతీమణి సావిత్రిబాయి ఫూలే జయంతిని మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా జరపాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) శాంతికుమారి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. జనవరి 3ను మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా రాష్ట్ర వ్యాప్తంగా జరపాలని కోరారు. ఏటా ఆమె జయంతి రోజును రాష్ట్ర పండుగగా నిర్వహించాలని వివరించారు. మహిళలకు విద్య కోసం ఆమె చేసిన సేవకు గుర్తింపుగా ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. అన్ని జిల్లాల కలెక్టర్లు జనవరి 3న సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా జరపాలని ఆదేశించారు. అందుకు సంబంధించిన వ్యయాన్ని విద్యాశాఖ బడ్జెట్ నుంచి కేటాయించాలని కోరారు. ఇందుకోసం విద్యాశాఖ తగిన చర్యలు చేపట్టాలని సూచించారు.

మహిళల విద్యాభివృద్ధికి సావిత్రిబాయి పూలే కృషి

భారతీయ సంఘ సంస్కర్త, ఉపాధ్యాయురాలు, రచయిత్రి సావిత్రి బాయి పూలే 1831 జనవరి 3న జన్మించారు. 1897, మార్చి 10న ఆమె మరణించారు. బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతి, మహిళల విద్యాభివృద్ధి కోసం విశేష కృషి చేశారు. ఆధునిక విద్య ద్వారానే స్త్రీ విముక్తి సాధ్యపడుతుందని నమ్మి అందుకోసం పాటుపడ్డారు. ఆమె భర్త జ్యోతిబాపూలేతో కలిసి 1848, జనవరి 1న పూణేలో మొట్టమొదటగా బాలికల పాఠశాలను ప్రారంభించారు. కులవ్యవస్థ, పితృస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా శూద్రులు, అస్పృశ్యులు, మహిళల హక్కుల కోసం పోరాటం చేశారు. నూతన వ్యవస్థ కోసం ప్రాణాల్ని సైతం పణంగా పెట్టి సమిష్టిగా పోరాడారు. ఆధునిక భారతదేశంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలిగా ఆమె పేరుగాంచారు. పీడిత ప్రజలు ముఖ్యంగా స్త్రీల విద్యాభివృద్ధికి కృషి చేసిన తొలితరం మహిళా ఉద్యమకారిణిగా గుర్తింపు పొందారు. భారత తొలి ఉప రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని కేంద్ర ప్రభుత్వం ఏటా సెప్టెంబర్ 5న జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నది. జనవరి 3న సావిత్రిబాయి ఫూలే జయంతిని మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా జరపాలని పలు ప్రజా సంఘాలు, సామాజిక, విద్యార్థి, ఉపాధ్యాయ సంఘాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేస్తున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం సావిత్రి బాయి పూలే జయంతి రోజును ఏటా మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా జరపాలని ఉత్తర్వులు విడుదల చేయడం గమనార్హం. ప్రభుత్వ నిర్ణయం పట్ల ప్రజాసంఘాలు, సామాజిక, విద్యార్థి, ఉపాధ్యాయ సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి.

టీఎస్ యూటీఎఫ్ హర్షం

చదువుల తల్లి సావిత్రిబాయి ఫూలే జయంతిని రాష్ట్ర పండుగగా ప్రకటిస్తూ, ఏటా మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా జరపాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడం పట్ల టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావ రవి, ప్రధాన కార్యదర్శి ఎ వెంకట్ హర్షం ప్రకటించారు. గత పదేండ్లుగా రాష్ట్రంలో టీఎస్‌యూటీఎఫ్, జాతీయ స్థాయిలో ఎస్టీఎఫ్ఐ సావిత్రిబాయి ఫూలే జయంతిని జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించాలని డిమాండ్ చేస్తున్నాయని గురువారం ఒక ప్రకటనలో గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకున్నా రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలో మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా జరపాలని నిర్ణయించడాన్ని స్వాగతిస్తున్నామని తెలిపారు. టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు.

బహుజన చైతన్య స్ఫూర్తి సావిత్రిబాయి పూలే : సీఎం రేవంత్‌రెడ్డి

మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించడం హర్షణీయం : ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

వివరాలు 13లో

షరతులతో భరోసా!
పంటల సాగుపై సొంత పూచీకత్తు

- ప్రతి సీజన్‌కూ సెల్ఫ్ డిక్లరేషన్
- శాటిలైట్ ఇమేజ్, రిమోట్ సెన్సింగ్ డేటాతో నిర్ధారణ
- రేపటి క్యాబినెట్‌లో ఆమోదం పొందే అవకాశం
- సర్కారు తీరుపై భిన్నాభిప్రాయాలు



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

అన్నదాతలు ఎంతో ఆశగా ఎదురు చూస్తున్న రైతు భరోసా పథకంపై రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు పూర్తి చేసింది. దఫాదఫాలుగా అన్నిస్థాయిల్లో అభిప్రాయాలు తీసుకున్న మంత్రివర్గ ఉపసంఘం ఎట్టకేలకు రైతు భరోసాపై అప్‌డేట్ ఇచ్చింది. సంక్రాంతి తర్వాత రైతు భరోసా రైతుల ఖాతాల్లో జమ చేస్తామని చెప్పింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రకటన నేపథ్యంలో రైతు సంఘాలు, వ్యవసాయ నిపుణులు, మేధావుల్లో రైతు భరోసాపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రాళ్లు, రప్పలు, బీడు భూములకు, సాగు చేయని భూములకు రైతు భరోసా ఇవ్వబోమంటూ కాంగ్రెస్ తన ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించింది.

ఈ నేపథ్యంలో రైతు భరోసాకు ఏడున్నర ఎకరాలు లేదా పదెకరాల్లోపు సాగు భూమికి రైతు భరోసా ఇచ్చేలా పరిమితిని విధిస్తున్నట్టు సమాచారం. దీంతోపాటు రైతు తన పొలంలో ఎన్నెకరాలను సాగు చేస్తున్నారు. ఎన్నెకరాల్లో ఏయే పంట వేస్తున్నారనే విషయమై రైతు సొంత పూచీకత్తును ఇవ్వాలనే నిబంధన పెట్టబోతున్నది. రైతు ఇచ్చిన సెల్ఫ్ డిక్లరేషన్‌ను శాటిలైట్ ఇమేజ్, రిమోట్ సెన్సింగ్ డేటాతో సరిపోల్చి చూడనుంది. ఆ తర్వాతే రైతుకు రైతు భరోసా దక్కనుంది. దీని ద్వారా కచ్చితమైన సాగు విస్తీర్ణం తెలుసుకోవచ్చనే ఆలోచనలో సర్కారు ఉన్నది. కచ్చితమైన సాగు భూమి నిర్ధారణకు నాలుగైదు సర్వేలు ఇప్పటికే అందుబాటులో ఉన్నప్పటికీ దాని ఆధారంగా రైతు భరోసా ఇవ్వకుండా కొత్త కొర్రీలు పెడుతున్నది. ఈ నేపథ్యంలోనే సర్కారు ప్రతి సీజన్‌కు రైతు నుంచి సెల్ఫ్ డిక్లరేషన్ తీసుకోవాలని భావిస్తున్నది.

మొత్తంగా రైతు భరోసాకు కోతలు పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం రకరకాల లీకులు ఇస్తున్నది. సాగులో ఉన్న రైతులను గుర్తించేందుకు ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం కూడా సర్వే చేసింది. దాన్ని పరిగణనలోకి తీసుకోకుండా ఇప్పుడే కొత్త షరతులు పెట్టడం రైతు భరోసాను ఎగ్గొట్టే ప్రయత్నమేనన్న విమర్శలొస్తున్నాయి. ఈనెల 4న జరగనున్న రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో సర్కారు వైఖరేమిటో స్పష్టం కానుంది. ఇవన్నీ వాస్తవాలో, పుకార్లో తేలనుంది.

పంట సాగుచేసిన ప్రతి రైతుకు రైతు భరోసా మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయం

పంట వేసిన ప్రతి రైతుకు రైతు భరోసా ఇవ్వాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలోని క్యాబినెట్ సబ్ కమిటీ సూత్రప్రాయంగా నిర్ణయించింది. ఈ అభిప్రాయాన్ని మంత్రివర్గం ముందుంచనుంది.గురువారం సచివాలయంలో భట్టి అధ్యక్షతన కమిటీ భేటీ అయింది. రాష్ట్ర ప్రభుత్వం అందించనున్న రైతు భరోసాపై ముందుగా గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని నిర్ణయించింది.

పాలసీ రాలేదు...స్పందించను వ్యవసాయ, రైతు కమిషన్ ఛైర్మెన్ ఎం కోదండరెడ్డి

రైతు భరోసాపై విధానం రాకుండా తాను స్పందించబోనని కోదండరెడ్డి చెప్పారు. పాలసీ విధానాన్ని క్యాబినెట్‌లో నిర్ణయిస్తారని చెప్పారు. అప్పటివరకు పత్రికల్లో వస్తున్న కథనాలపై ఆధారపడి తాను మాట్లాడటం సరికాదన్నారు. రైతు సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ...5లో

5 నుంచి గ్రామ సభల్లో దరఖాస్తులకు ఆహ్వానం

5, 6, 7 తేదీల్లో గ్రామ సభలు నిర్వహించి రైతు భరోసాపై విస్తృత ప్రచారం నిర్వహించాలని మంత్రివర్గ ఉపసంఘం తీర్మానించింది. ఒక మండలాన్ని మూడు విభాగాలుగా చేసి రైతు భరోసా కోసం దరఖాస్తులు ఆహ్వానించాలని అభిప్రాయపడినట్టు తెలిసింది.

పెట్టుబడి సాయం అర్హులందరికీ దక్కాలి

షరతులతో ఎగ్గొట్టే ప్రయత్నాలు తగదు : టి సాగర్, ప్రధాన కార్యదర్శి తెలంగాణ రైతు సంఘం

రకరకాల సాకులతో రైతు భరోసాను ఎగ్గొట్టే ప్రయత్నాలను ప్రజలు హర్షించరని, అర్హులైన సాగుదారులందరికీ రైతు భరోసా ఇవ్వాలని తెలంగాణ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి టి సాగర్ కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ...5లో



హాస్టల్ బాత్‌రూమ్‌లో కెమెరాలు
మేడ్చల్ సీఎంఆర్ కాలేజీలో విద్యార్థినుల ఆందోళనలు



బాసటగా ఎస్ఎఫ్ఐ,పలు విద్యార్థి సంఘాలు

సమగ్ర న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్

కళాశాలను సందర్శించిన మహిళా కమిషన్ కార్యదర్శి

నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కండ్లకోయలోని సీఎంఆర్ ఇంజినీరింగ్ కళాశాల వసతి గృహం వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. గర్ల్స్ హాస్టల్‌లోని బాత్‌రూంలో కెమెరాలతో వీడియోలు తీశారంటూ విద్యార్థినులు బుధవారం రాత్రి నుంచి ఆందోళనకు దిగారు. బాత్‌రూముల్లో కెమెరాలు అమర్చి రహస్యంగా వీడియోలు తీస్తున్నారంటూ ఆరోపించారు. హాస్టల్ మెస్‌లో పనిచేసే ఐదుగురిపై విద్యార్థినులు అనుమానం వ్యక్తం చేయగా, గురువారం వారిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. వివరాలిలా ఉన్నాయి.. గుండ్లపోచంపల్లి మున్సిపల్ పరిధిలోని సీఎంఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో అమ్మాయిల కోసం ప్రత్యేక హాస్టల్ నిర్వహిస్తున్నారు. బాత్రూంలో ఉన్నప్పుడు ఎవరో తమ వీడియోలు తీస్తున్నారంటూ బుధవారం రాత్రి నుంచి వసతి గృహం వద్ద విద్యార్థినులు ధర్నాకు దిగారు. వెంటిలేటర్ వద్ద ఒకరి షాడో కనిపించిందని, అక్కడ వేలిముద్రలు కూడా పడ్డాయని వారు చెప్పారు. విషయం తెలుసుకున్న ఎస్ఎఫ్ఐ, ఎన్ఎస్‌యూఐ, ఏబీవీపీ నాయకులు అక్కడికి చేరుకుని వారికి మద్దతు తెలిపి ఆందోళనలో పాల్గొన్నారు. అయితే, గర్ల్స్ హాస్టల్ వద్దకు విద్యార్థి సంఘాల నాయకులు వెళ్లకుండా కళాశాల గేటు మూసేయడంతో వారు గేటు ఎక్కి వెళ్లారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విద్యార్థినులను శాంతింపజేసేందుకు ప్రయత్నించారు.

ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కార్తీక్, జిల్లా ప్రధాన కార్యదర్శి రాథోడ్ సంతోష్ మాట్లాడుతూ.. ఈ ఘటనపై సమగ్ర న్యాయ విచారణ జరిపి దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కళాశాలలో విద్యార్థినుల బాత్రూంలలో ...13లో

మహబూబాబాద్‌లో పేదలను ఆదుకోండి
ప్రభుత్వ భూమిలో ఉన్న వారికి పట్టాలిచ్చి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయండి

సీఎం రేవంత్‌రెడ్డికి సీపీఐ(ఎం) ప్రతినిధి బృందం వినతి



సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ(ఎం) నేతలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మహబూబాబాద్‌లో పేదలను ఆదుకోవాలని సీపీఐ(ఎం) రాష్ట్ర ప్రతినిధి బృందం కోరింది. ఆ జిల్లా కేంద్రంలోని సర్వేనెంబర్ 255 ప్రభుత్వ భూమిలో వారు వేసుకున్న ఇండ్లకు పట్టాలిచ్చి ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయాలని సూచించింది. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని గురువారం హైదరాబాద్‌లోని సచివాలయంలో సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు జి నాగయ్య, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ వీరయ్య, జూలకంటి రంగారెడ్డి, టి సాగర్, రాష్ట్ర కమిటీ సభ్యులు ఆర్ వెంకట్రాములు కలిసి వినతిపత్రం సమర్పించారు. మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని సర్వే నెంబర్ 255లోని 220 ఎకరాల ప్రభుత్వ భూమిలో 150 ఎకరాల భూమిని ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరాగాంధీ హయాంలో కొంతమంది పేద రైతులకు అగ్రిమెంటు పట్టాలు ఇచ్చిందని గుర్తు చేశారు. మిగిలిన 70 ఎకరాల భూమి గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్, అతని బినామీలు అయిన రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆక్రమించి ...13లో



మను బాకర్, గుకేశ్
ఖేల్ రత్నాలు
హర్మన్‌ప్రీత్, ప్రవీణ్‌లకు సైతం..

దీప్తి జీవాంజీకి అర్జున పురస్కారం

వివరాలు 14లో

రూపాయి చతికిల

9 పైసలు పతనమై 85.73 కనిష్టానికి

వివరాలు 13లో

ఫోన్ ట్యాపింగ్ కేసులో
దర్యాప్తును అడ్డుకోలేం

తిరుపతన్న పాత్రపై దర్యాప్తు వివరాలు సమర్పించాలని సుప్రీం ఆదేశం 6లో..

ఉద్యమం కొనసాగడానికి
కేంద్రం వైఖరే కారణం

స్పష్టం చేసిన రైతులు 6లో..

పేదరికంపై తప్పుడు అంచనాలు
దేశంలో నాలుగో వంతు మంది పేదలే

అమెరికా జనాభా కంటే మన దేశంలోనే పేదవారు ఎక్కువ

సంఖ్యాపరంగా భారత్‌లోనే అధికం : నిగ్గు తేల్చిన అధ్యయనం



దేశంలో పేదరికం దాదాపు అంతరించిపోయిందంటూ కొన్ని ప్రభుత్వ సంస్థలు ఊదరగొడుతు న్నాయని, కానీ వాస్తవాలు అందుకు విరుద్ధంగా ఉన్నాయని ఓ అధ్యయనం తేల్చింది. ఈ వాదనలు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని, దేశంలో పేదరికం ఏ మేరకు ఉన్నదనే విషయంపై తగిన గణాంకాలు అందుబాటులో లేనందున ప్రజల దృష్టిని మళ్లించడానికి ఇలాంటి అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని ఆ అధ్యయనం తెలిపింది. సీఏ సేతు, ఎల్టీ అభినవ్ సూర్య, సీఏ రుతు సంయుక్తంగా నిర్వహించిన అధ్యయనం ఇటీవల ప్రచురితమైంది. 13లో.

అంబేద్కర్ వర్సిటీ డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించిన సీఎం రేవంత్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం నూతన సంవత్సరం డైరీ, క్యాలెండర్‌ను గురువారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఘంటా చక్రపాణి పాల్గొన్నారు. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై వారు చర్చించారు.

104 ఉద్యోగుల బకాయి వేతనాలు చెల్లించాలి

- కమిషనర్‌కు టీయూఎంహెచ్ఇయూ వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

104 ఉద్యోగుల బకాయి వేతనాలు చెల్లించాలని తెలంగాణ యునైటెడ్ మెడికల్, హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ (టీయుఎంహెచ్ఇయూ) కోరింది. ఈ మేరకు గురువారం హైదరాబాద్ కోఠిలో ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ ఆర్వీ కర్ణన్‌ను యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు భూపాల్, రాష్ట్ర అధ్యక్షులు ఎండీ ఫసియొద్దీన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.యాదానాయక్, రాష్ట్ర కార్యదర్శి వి.విజయవర్ధన్ రాజు, 104 ఉద్యోగుల నాయకులు కలిసి వినతిపత్రం సమర్పించారు. 2024 అక్టోబర్ వరకు ఆరు మాసాలుగా వేతనాల బకాయిలు రూ.12.56 కోట్లను ప్రభుత్వం విడుదల చేసిందని తెలిపారు. అయినప్పటికీ వేతనాలు చెల్లించకపోవడంతో ఉద్యోగుల కుటుంబాలు అనేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాయని చెప్పారు. 2023 నవంబర్, డిసెంబర్ నెలలతో కలిపితే మొత్తం ఎనిమిది నెలల జీతాలు బకాయిలు ఉన్నాయని తెలిపారు. జోక్యం చేసుకుని వెంటనే జీతాలు ఇప్పించాలని వారు కోరారు. 104 ఉద్యోగులను డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ పరిధిలో ఉన్న కాలేజీలో, ఇన్‌స్టిట్యూట్‌లోకి సర్దుబాటు చేస్తామని ప్రభుత్వం చెప్పిందని గుర్తుచేశారు. దానికి సంబంధించిన ఉత్తర్వులు కూడా ఇప్పటికీ రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగ భద్రత లేక ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. డీఎంఈ పరిధిలోని కాలేజీలో, ఆస్పత్రుల్లో సొంత జిల్లాల పరిధిలోకి 104 ఉద్యోగు లను బదిలీ చేయాలని కోరారు. అనంతరం కమిషనర్ ఆర్వీ కర్ణన్, రెండు రోజుల్లో బకాయి వేతనాలను చెల్లిస్తామని యూనియన్ నాయకులకు తెలిపారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరిస్తాం

- మంత్రి పొంగులేటి టీయూడబ్ల్యూజే డైరీ ఆవిష్కరణ

నవతెలంగాణ-హైదరాబాద్

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం సచివాలయంలోని తన కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్ట్స్ యూనియన్ 2025 మీడియా డైరీని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ డాక్టర్ ఎస్. హరీష్, మీడియా అకాడమీ మాజీ అధ్యక్షులు దేవులపల్లి అమర్, ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె.విరాహత్ అలీ, ప్రధాన కార్యదర్శి కె రాంనారాయణ, సీనియర్ నేతలు వై. నరేందర్ రెడ్డి, కె. సత్యనారాయణ, జాతీయ కార్యవర్గ సభ్యులు, కె రాములు కె. శ్రీకాంత్ రెడ్డి, కార్యదర్శి, యం. వెంకట్ రెడ్డి, ఏ. రాజేష్, బి. కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవితకు బీసీల గురించి మాట్లాడే హక్కు లేదు

- బీసీలకు పెద్దపీట వేసింది కాంగ్రెస్ ప్రభుత్వమే : బీసీ రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మెన్ నూతి శ్రీకాంత్‌గౌడ్



నవతెలంగాణ-మెహిదీపట్నం

ఎమ్మెల్సీ కవితకు బీసీల గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని బీసీ రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మెన్ నూతి శ్రీకాంత్‌గౌడ్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్ సభలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని కవిత డిమాండ్ చేయడంలో అర్థం లేదన్నారు. కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు బీఆర్ఎస్ పార్టీలో బీసీలకు ఏ మాత్రం గౌరవం లభించలేదని గుర్తు చేశారు. బీఆర్ఎస్ అధ్యక్షుడిగా లేదా కనీసం పార్టీ కార్యవర్గ చీఫ్‌గానైనా బీసీ అభ్యర్థిని కేసీఆర్ ఎందుకు నియమించలేదని ప్రశ్నించారు. అప్పుడు కవిత ఆమె తండ్రిని ఎందుకు ఇలా అడగలేదని పేర్కొన్నారు. ఇప్పుడు బీసీల కోసం మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లించినట్టు ఉందని ఎద్దేవా చేశారు. ప్రజా పాలన పేరుతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీసీలకు పెద్దపీట వేస్తున్న సంగతి కనిపించటం లేదా అని ప్రశ్నించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2024-25 బడ్జెట్‌లో బీసీ సంక్షేమానికి రూ.9200.32 కోట్లు కేటాయించిందని గుర్తు చేశారు. కవిత ఒక్కసారి గతాన్ని గుర్తు తెచ్చుకొని వారు అధికారంలో ఉన్న పది సంవత్సరాల కాలంలో బీసీలకు చేసిందేమిటో చెప్పాలని పేర్కొన్నారు. ప్రజా పాలనలో ప్రత్యేకంగా బీసీ వర్గాల విద్యార్థులకు కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నదని తెలిపారు. గత పదేండ్లలో విద్యా వ్యవస్థను ధ్వంసం చేసిన వారు ఇప్పుడు హామీల గురించి ప్రశ్నించడం సిగ్గుచేటన్నారు. ప్రతి నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు ఏర్పాటు చేస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. తెలంగాణ జాగృతి పేరుతో కవిత ఎంత అవినీతికి పాల్పడ్డారో ప్రజలకు తెలుసని, కనీసం జాగృతి అధ్యక్షులుగా వెనుకబడిన తరగతుల వారిని ఎందుకు నియమించలేదని ప్రశ్నించారు. కవిత వాస్త వాలు తెలుసుకొని ప్రకటనలు చేస్తే బాగుంటుందని పేర్కొన్నారు. కవిత లిక్కర్ కేసు గురించి జనవరి 3న జరిగే సభలో వివరణ ఇవ్వాలని తెలిపారు. ఇకనైనా కాంగ్రెస్ ప్రభుత్వంపై బట్ట కాల్చి మీద వేయడం మానుకోవాలని పేర్కొన్నారు.

సివిల్ సప్లయ్, జీసీసీ హమాలీ కార్మికుల సమ్మెకు మద్దతు : సీఐటీయూ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పెరిగిన రేట్లకు అనుగుణంగా ఏరియర్స్ చెల్లించాలని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా సివిల్ సప్లయ్, జీసీసీ హమాలీ కార్మికుల సమ్మెకు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్టు సీఐటీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చుక్కరాములు, పాలడుగు భాస్కర్ ప్రకటించారు. సీఐటీయూ అనుబంధ సంఘాలన్నీ సమ్మెకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. శుక్రవారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా సివిల్ సప్లయ్, జీసీసీ హమాలీ కార్మికుల ఎగుమతి-దిగుమతి రేట్ల ఒప్పందం 2023 డిసెంబర్‌తో ముగిసిందని తెలిపారు. హమాలీ కార్మిక సంఘాల పోరాటాలు, విన్నపాలతో గత అక్టోబర్ 3న ఎగుమతి, దిగుమతి రేట్లను ప్రస్తుతమున్న రూ.26 నుంచి రూ.29కి ప్రభుత్వం పెంచిందని తెలిపారు. పెరిగిన రేట్లను 2024 జనవరి నుంచి అమలు చేస్తామని ఏరియర్స్‌తో సహా చెల్లిస్తామనీ, మహిళా స్వీపర్లకు గోదాముల సామర్థ్యాన్ని బట్టి ప్రస్తుతం చెల్లిస్తున్న వేతనాలపై రూ.వెయ్యి పెంచారని పేర్కొన్నారు. బోనస్‌ను రూ.7,500కు, డ్రెస్ కుట్టుకూలి చార్జీలను రూ.1,300 నుంచి రూ.1,600కి, దసరా పండుగ స్వీట్ బాక్స్‌కు రూ.900 ఇస్తామని నిర్ణయించినట్టు తెలిపారు. సివిల్ సప్లయ్, హమాలీల వలే జీసీసీ హమాలీలకు పీఎఫ్ సౌకర్యం కల్పిస్తామని ఇతర సమస్యలను పరిష్కరిస్తామని కమిషనర్ హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడంతోనే తప్పనిసరి పరిస్థితుల్లో వారు సమ్మెలోకి వెళ్లారని తెలిపారు. ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని వారి సమస్యలను పరిష్కరించి సమ్మెను నివారించాలని కోరారు.

పుష్ప అరెస్టుతో రేవంత్‌రెడ్డి పాన్ ఇండియా సీఎం అయ్యారు

- ఇష్టాగోష్టిలో ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం పుష్పను అరెస్టు చేయడంతో ఎనుముల రేవంత్‌రెడ్డి పాన్ ఇండియా ముఖ్యమంత్రి అయ్యారని ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. గురువారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో సింగిల్ విండో ద్వారా ఆదేశాలు చేసేవని ఎద్దేవాచేశారు. ఈ ఫార్ములా కేసులో కేటీఆర్ రోజుకో మాట మాట్లాడుతున్నారని విమర్శించారు. కేసీఆర్ అనాలోచిత నిర్ణయం వల్ల రైతు బంధు పథకం ద్వారా అనర్హుల ఖాతాల్లో రూ. 22 వేల కోట్లు పడ్డాయని ఆరోపించారు.

నేరెళ్ల ఇసుక మాఫియా బాధితులకు పరిహారం ఇచ్చారా?

పోలీసులపై చర్యలు తీసుకున్నారా?: వివరణ కోరిన హైకోర్టు



నవతెలంగాణ-హైదరాబాద్

సిరిసిల్ల జిల్లా నేరెళ్ల, రామచంద్రాపురాలలో ఎనిమిది మంది దళితులపై ఇసుక మాఫియా దాడి ఘటనపై దర్యాప్తు నివేదిక ఇవ్వాలని ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశించింది. దాడి, చిత్రహింసలకు సంబంధించి నమోదైన కేసు దర్యాప్తు పురోగతిని తెలియజేయాలంది. చీర్లవంచ, కొదురుపాక ప్రాంతాల నుంచి ఇసుక లారీలు, టిప్పర్లు తిరగడంతో ప్రమాదాలపై 2017 జులైలో నిరసన వ్యక్తం చేసిన సంఘటనలో ఎనిమిది మంది దళితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు చిత్రహింసలకు గురి చేశారంటూ ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, రిటైర్డు న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్ పిల్ వేశారు. వీటిని చీఫ్ జస్టిస్ ఆలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాసరావులతో కూడిన డివిజన్ బెంచ్ గురువారం విచారించింది. బాధ్యులైన పోలీసులపై కేసు నమోదు చేశారో లేదో చెప్పాలనీ, బాధితులకు పరిహారం ఇచ్చారో లేదో చెప్పాలనీ, అసలు కేసు దర్యాప్తు ఏదశలో ఉందో చెప్పాలని పోలీసులను, ప్రభుత్వాన్ని ఆదేశించింది. తొలుత ప్రభుత్వ ప్లీడర్ వాయిదా వేయాలని కోరడంతో హైకోర్టు ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది. దీంతో అదనపు అడ్వొకేట్ జనరల్ వచ్చి పోలీసులపై కేసు పెట్టామని చెప్పి వాయిదా అడిగారు. దీంతో విచారణను ఈ నెల 20కి వాయిదా పడింది.

చెరువుల ఎఫ్‌టీఎల్ తేల్చండి : హైకోర్టు

హెచ్ఎండీయే పరిధిలోని చెరువుల ఎఫ్‌టీఎల్ గుర్తింపు ప్రక్రియ పురోగతిపై నివేదిక ఇవ్వాలని హైకోర్టు ఆదేశించింది. చెరువుల ఎఫ్‌టీఎల్ ప్రక్రియ పూర్తి చేయాలంది. వీటిపై పూర్తి వివరాలతో నివేదిక సమర్పించాలంది. ఫైనల్ నోటిఫికేషన్ జారీకి సంబంధించి తీసుకుంటున్న చర్యలపై పూర్తి వివరాలు ఇవ్వాలంది. ఇందుకు వచ్చేనెల నాలుగు వరకు గడువు ఇచ్చింది. రామమ్మ కుంటలో ఎఫ్‌టీఎల్ పరిధిలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ కట్టడాలపై పిల్ దాఖలైంది. దీనిపై విచారణ చేపట్టిన హైకోర్టు, హెచ్ఎండీయే పరిధిలోని చెరువులపై విచారణ ప్రారంభించింది. చీఫ్ జస్టిస్ ఆలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాసరావులతో కూడిన బెంచ్ ఎదుట గురువారం విచారణ చేపట్టింది. హెచ్ఎండీయే పరిధిలో 3,342 చెరువులున్నాయి. వాటిలో 2,793లకు ఎఫ్‌టీఎల్ గుర్తింపునకు ప్రాథమిక నోటిఫికేషన్ వెలువడింది. 708 చెరువులకు ఎఫ్‌టీఎల్ కోసం ఫైనల్ నోటిఫికేషన్ వెలువడింది.. అని ప్రభుత్వం చెప్పింది. సమగ్ర వివరాలతో నివేదిక సమర్పించాలని ప్రభుత్వాన్ని ఆదేశించిన హైకోర్టు విచారణను వచ్చే నెల నాలుగుకు " వాయిదా వేసింది.

లగచర్ల రైతుల ముందస్తు బెయిలు పిటిషన్

వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం లగచర్లలో ఆఫీసర్లపై దాడి చేశారంటూ దాఖలైన కేసులో తమకు ముందస్తు బెయిల్ ఇవ్వాలంటూ పవర్ నాయక్ మరో 11 మంది పిటిషన్ వేశారు. వీటిని జస్టిస్ కె.లక్ష్మణ్ విచారించి ప్రభుత్వానికి, బొమ్మరాస్‌పేట పీఎస్‌కు నోటీసులు జారీ చేశారు. గతేడాది నవంబరు 11న పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు అధికారులపై దాడిలో తమ పాత్ర లేదని పిటిషనర్ల వాదన. కౌంటర్లు వేయాలన్న హైకోర్టు, తదుపరి విచారణను ఈనెల 9వ తేదీకి వాయిదా వేసింది.

నోటిఫికేషన్ తర్వాత కట్టడాలా?

నల్గొండ జిల్లా శివన్నగూడెం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మాణం చేసేందుకు భూసేకరణ చేపట్టాక సదరు భూముల్లో నిర్మాణాలు చేయడంపై హైకోర్టు ఆగ్రహాన్ని వెలిబుచ్చింది. భూసేకరణ నోటిఫికేషన్ జారీ చేశాక అనుమతులు ఎలా ఇస్తారని, మండల, గ్రామ పంచాయతీ అధికారులను ప్రశ్నించింది. ఇలాంటి అధికారులపై చర్యలు తీసుకోవాలని జస్టిస్ టి.వినోద్‌కుమార్ అభిప్రాయపడ్డారు. భూసేకరణకు వ్యతిరేకం కాదని, నష్టపోయిన తనకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం, పునరావాస చర్యలు తీసుకునేలా ప్రభుత్వానికి ఆదేశాలు ఇవ్వాలని పిటిషనర్ శ్రీనివాసాచారి కోరారు. విచారణ ఈ నెల 20కి వాయిదా పడింది.

బీఆర్ఎస్ నేత కవిత బీసీలపై కపట ప్రేమ

- పదేండ్లలో ఏనాడు పట్టించుకోలేదు
- స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల గొంతునొక్కింది : ఎమ్మెల్సీ కవిత వ్యాఖ్యలపై మహేశ్‌కుమార్ ఫైర్



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

బీఆర్ఎస్ నేత కల్వకుంట్ల కవిత బీసీలపై కపట ప్రేమ చూపుతున్నారని టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ ఎద్దేవా చేశారు. పదేండ్లు అధికారంలో ఉండి బీసీలను ఏనాడూ పట్టించుకోలేదని విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో వారి గొంతునొక్కారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు.బీఆర్ఎస్ బీసీలను వంచించడమే కాకుండా, వారికి న్యాయంగా అందాల్సిన నిధులను ఖర్చు చేయకుండా మోసం చేసిందని విమర్శించారు. అధికారం పోయిన తర్వాత బీసీలపై ఆమె మొసలికన్నీరు కారుస్తున్నారని ఎద్దేవా చేశారు. బీసీలకు కాంగ్రెస్ పార్టీయే న్యాయం చేయగలదని ధీమా వ్యక్తం చేశారు.

లిక్కర్ స్కాంలో మరకలంటించుకున్న ఎమ్మెల్సీ కవిత దాన్ని పోగొట్టుకునేందుకు అనేక ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీలో ఆమెకు ప్రాధాన్యత తగ్గడంతో ఇప్పుడు బీసీల పేరిట కపట నాటకం మొదలు పెట్టారని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ అధ్యక్షులుగా బీసీ నేతను చేయడం కేసీఆర్‌కు సాధ్యపడుతుందా? బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మంత్రులుగా బీసీలకు ఎంత ప్రాధాన్యతనిచ్చారో బహిరంగ రహస్యమేనన్నారు. బీసీలను అడుగడుగునా అణగదొక్కిన బీఆర్ఎస్ ఇప్పుడు బీసీ జపం చేయడం సిగ్గు చేటన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ గొప్ప నిర్ణయం

సావిత్రి భాయి పూలే జయంతి సందర్భంగా మహిళ ఉపాధ్యాయుల దినోత్సవంగా ప్రకటిస్తూ తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం హర్షించదగ్గ విషయమని టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం అన్ని వర్గాల ప్రజలు స్వాగతించాల్సిన విషయమేనని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సావిత్రి భాయి జయంతిని, మహిళ ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా జరుపుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

వీఆర్ఏల సమస్యలు పరిష్కరించండి

- వీఎల్ఓ నియామకాల్లో వారసులకు ప్రాధాన్యతివ్వండి
- డిప్యూటీ సీఎం భట్టి, రెవెన్యూ మంత్రి పొంగులేటికి వీఆర్ఏల జేఏసీ వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వీఆర్ఏల సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డితో కలిసి వీఆర్ఏ జేఏసీ కన్వీనర్ వంగూరి రాములు, ఇతర నేతలు గురువారం హైదరాబాద్‌లోని సచివాలయంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కలిసి పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందించారు. జీవో 81 ప్రకారం 61 ఏండ్ల వయస్సు పైబడిన వీఆర్ఏల వారసులకు గ్రామ లెవల్ అధికారి (వీఎల్ఓ) నియామకాల్లో ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. వీఆర్ఏలకు పేస్కేల్, వారసులకు ఉద్యోగాలు ఇస్తామని 2020 సెప్టెంబర్‌లో జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో గత సర్కార్ ప్రకటించినా ఇప్పటికీ అమలు కాలేదని ఆందోళన వ్యక్తం చేశారు. రెవెన్యూ వ్యవస్థను రద్దు చేసినప్పుడు తమ పోరాట ఫలితంగానే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 20,555 మంది వీఆర్ఏల్లో వారి అర్హతను బట్టి రెవెన్యూ శాఖతో పాటు ఇతర శాఖల్లో 16,758 మందిని సర్దుబాటు చేశారని గుర్తు చేశారు. మిగతా 3,797 మంది వీఆర్ఏ వారసులు ఉద్యోగ ఉత్తర్వుల కోసం గత 17 నెలలుగా ఎదురు చూస్తున్నారని వినతి పత్రంలో పేర్కొన్నారు. ప్రభుత్వం వీఆర్ఏల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వీఆర్ఏ సంఘాల నాయకులు నగేష్ కుమార్, హరీష్, చింత శివ, గంగమల్లు, అనిల్, వెంకటేష్, చిర్రా నాగేశ్వరరావు, శ్రీకాంత్, రవీందర్, సుల్తాన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో నేడు బీసీ గర్జన

- రిజర్వేషన్ల అమలు, ఇతర హామీలపై పోరుబాట
- ఇందిరా పార్క్ వద్ద ఏర్పాట్లు పూర్తి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కామారెడ్డి డిక్లరేషన్‌ను అమలు చేయాలనీ, స్థానిక సంస్థల్లో 42శాతం బీసీ కులాలకు రిజర్వేషన్లు కల్పించాలనే డిమాండ్లతో తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద ఏర్పాటు చేస్తున్న భారీ సభకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా బీసీ కుల సంఘాలు, వృత్తి సంఘాలతో పాటు విద్యార్థి, యువజన, మహిళా సంఘాలు ఈ సభలో పాల్గొననున్నాయి. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత ఎక్స్ వేదికగా స్పందించారు ఎన్నికల సమయంలో బీసీలకిచ్చిన హామీలను కాంగ్రెస్ విస్మరించిందని విమర్శించారు. "కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు తీరని అన్యాయం చేస్తోంది. బీసీలను రేవంత్ సర్కార్ అడుగడున దగా చేసింది. సావిత్రీ బాయి పూలే జయంతి సందర్భంగా బీసీల హక్కుల సాధనకై చేపట్టిన మహసభను విజయవంతం చేయాలి" అని కవిత పిలుపునిచ్చారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్ష ఫీజు గడువు 22

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఓపెన్ పదో తరగతి, ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఫీజు చెల్లింపు గడువు ఈనెల 22 వరకు ఉందని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ (టాస్) డైరెక్టర్ పివి శ్రీహరి గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆలస్య రుసుం లేకుండా ఈనెల తొమ్మిది నుంచి ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఫీజు చెల్లించాలని కోరారు. తుది గడువు ఈనెల 22 వరకు ఉందని తెలిపారు. ఆలస్య రుసుం రూ.25తో ఈనెల 29 వరకు, రూ.50తో వచ్చేనెల మూడు వరకు, తత్కాల్ పద్ధతిలో అదేనెల ఆరో తేదీ వరకు ఫీజు చెల్లించేందుకు అవకాశముందని వివరించారు.

విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఏప్రిల్ లేదా మేలో ఓపెన్ పదో తరగతి, ఇంటర్ పరీక్షలను నిర్వహిస్తామని తెలిపారు. ఇతర వివరాలకు http://telanganaopenschool.org వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

దీప్తి జీవాంజీకి అర్జున అవార్డు రావడం హర్షణీయం

- మంత్రి కొండా సురేఖ


నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పారిస్‌లో జరిగిన పారాలింపిక్స్‌లో 400 మీటర్ల పరుగు పందెంలో కాంస్య పతకం సాధించి దేశ కీర్తి పతాకాన్ని రెపరెపలాడించిన ఓరుగల్లు ముద్దుబిడ్డ, పారా అథ్లెట్ దీప్తి జీవాంజికి కేంద్ర ప్రభుత్వం అర్జున అవార్డు ప్రకటించడం పట్ల మంత్రి కొండా సురేఖ హర్షం వ్యక్తం చేశారు. దీప్తికి అభినందనలు తెలిపారు. గురువారం ఈ మేరకు ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. మానసిక సామర్థ్య సమస్యలతో బాధపడుతున్నప్పటికీ, కుంగిపోకుండా విధిని ఎదిరించి తన శక్తిసామర్థ్యాలను ప్రపంచానికి చాటిన అథ్లెట్ దీప్తి జీవాంజి ప్రస్థానం ఎందరికో స్ఫూర్తినిచ్చిందని తెలిపారు. ఆమెకు తమ సహకారం ఎల్లవేళలా ఉంటుందని హామీనిచ్చారు. దీప్తి మరెన్నో కీర్తి శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. తెలంగాణ రాష్ట్రాన్ని క్రీడారంగంలో అత్యున్నతంగా తీర్చిదిద్దేందుకు సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పక్కా వ్యూహంతో ముందుకు సాగుతున్నదని పేర్కొన్నారు. ఈ మధ్యే యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీ బిల్లు చట్టసభల్లో ఆమోదం పొందిన విషయాన్ని గుర్తు చేశారు. సీఎం కప్ పేరుతో పోటీలు నిర్వహించి గ్రామీణుల్లో దాగిన ప్రతిభను వెలికితీస్తున్నామని తెలిపారు. త్వరలోనే అత్యుత్తమ క్రీడాపాలసీని తీసుకొచ్చి తెలంగాణను క్రీడారాజధానిగా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు.

కోర్టు ఆదేశాలూ బేఖాతర్!

కౌంటర్ అఫిడవిట్ల దాఖలులో కేంద్ర, రాష్ట్రాల అలసత్వం | కాలపరిమితి లేకపోవడంతో తీవ్ర జాప్యం

- న్యాయస్థానాల్లో పేరుకుపోతున్న కేసులు
- జరిమానాలు విధించినా లెక్కచేయని వైనం



న్యూఢిల్లీ : దేశంలోని న్యాయస్థానాలలో పెండింగ్ కేసుల సంఖ్య కొండలా పెరిగిపోతోంది. దీనికి అనేక కారణాలు ఉన్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టులోనూ, వివిధ రాష్ట్రాల హైకోర్టుల లోనూ అనేక కేసులు నమోదవు తుంటాయి. వీటిపై ఆయా న్యాయ స్థానాలు ప్రభుత్వాల నుంచి సమా ధానాలు కోరడం పరిపాటి. అయితే వాటిని సమర్పించడంలో అటు కేంద్రం, ఇటు రాష్ట్రాలు అలసత్వం ప్రదర్శిస్తూ జాప్యం చేస్తుండడం కూడా న్యాయస్థానాలలో కేసులు పేరుకుపోవడానికి ఓ కారణమని చెప్పవచ్చు. ముఖ్యంగా పెండింగ్ కేసులలో సగానికి పైగా కేంద్రానికి వ్యతిరేకంగా దాఖలైనవే ఉంటు న్నాయి. ప్రభుత్వానికి లేదా ప్రభుత్వ సంస్థకు వ్యతిరేకంగా ఏదైనా కేసు వస్తే న్యాయస్థానాలు ముందుగా వాటి విచార ణార్హతను నిర్ణయిస్తాయి. పిటిషన్‌ను విచారణకు స్వీకరిస్తే ప్రభుత్వానికి నోటీసు జారీ చేస్తారు. ప్రతివాదిగా ఉండే ప్రభుత్వం కానీ, ప్రభుత్వ సంస్థ కానీ ఆ పిటిషన్‌పై స్పందించి కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాల్సి ఉంటుంది. అందులో తన వాదనలను బలంగా వినిపించి, కేసును తిప్పికొట్టేందుకు ప్రయత్నించాలి. అయితే ఇక్కడ గమనించాల్సిన ముఖ్యమైన విషయమేమంటే కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయడానికి ప్రభుత్వానికి చట్టంలో ఎలాంటి కాలపరిమితిని నిర్ణయించలేదు. ఈ వెసులుబాటునే కేంద్రం, రాష్ట్రాలు తమకు అనుకూలంగా మార్చుకుంటూ అఫిడవిట్ సమర్పించకుండా జాప్యం చేస్తున్నాయి.

ప్రార్థనా స్థలాల చట్టంపై...

ఉదాహరణకు ప్రార్థనా స్థలాల చట్టాన్ని సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో దాఖలైన కేసునే చూద్దాం. ఈ వ్యవహారంపై రెండు వారాలలో వైఖరిని అఫిడవిట్ రూపంలో తెలియజేయాలంటూ 2022 సెప్టెంబరులో కేంద్రాన్ని అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది. అప్పటి నుండీ 2022 అక్టోబర్, నవంబర్, 2023 జనవరి, ఏప్రిల్, జూలై...ఇలా అఫిడవిట్ దాఖలు చేసేందుకు సుప్రీంకోర్టు పలు పర్యాయాలు గడువు పెంచుకుంటూ పోయింది. అయినప్పటికీ అఫిడవిట్ దాఖలు చేయడంలో కేంద్రం విఫలమైంది. గత డిసెంబర్ 12న కేసు విచారణకు వచ్చినప్పుడు ప్రభుత్వానికి న్యాయస్థానం మరో నాలుగు వారాల సమయం ఇచ్చింది.

పరిపాటిగా మారిన ఉల్లంఘనలు

కేసును బట్టి సమాధానాన్ని దాఖలు చేసేందుకు కోర్టులు సహజంగా ప్రభుత్వానికి నాలుగు నుంచి ఎనిమిది వారాల సమయం ఇస్తుంటాయి. ఆ రోజుకు కేసుపై తదుపరి విచారణ జరుగుతుంది. అయితే వివిధ న్యాయస్థానాలు, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ కాలపరిమితిపై సొంతగా నిబంధనలు రూపొందించుకున్నాయి. కౌంటర్ అఫిడవిట్ సమర్పించేందుకు అదనపు సమయం కూడా కోరే అవకాశం ఉంది. దానికీ నిర్దిష్ట గడువు అంటూ ఏదీ లేదు. విచారణ తేదీకి కనీసం మూడు రోజుల ముందు సమాధానాలు సమర్పించాలని సుప్రీంకోర్టు 2013లో రాష్ట్ర ప్రభుత్వాలను, ప్రభుత్వ సంస్థలను ఆదేశించింది.

అయితే కేంద్ర ప్రభుత్వం కానీ, రాష్ట్ర ప్రభుత్వాలు కానీ న్యాయస్థానం విధించిన గడువును ఉల్లంఘించడం పరిపాటిగా మారింది. ఫలితంగా న్యాయస్థానాలు కేసు విచారణను ప్రారంభించడంలో అసాధారణ జాప్యం ఎదురవుతోంది. కొన్ని సందర్భాలలో కోర్టులు రాష్ట్ర ప్రభుత్వాలపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ జరిమానాలు కూడా విధిస్తున్నాయి. కానీ లోపం ఎక్కడ జరుగుతోందో, ఉల్లంఘనకు కారణమేమిటో తెలుసుకొని దిద్దుబాటు చర్యలు చేపట్టేందుకు న్యాయస్థానాలు కానీ, ప్రభుత్వాలు కానీ ప్రయత్నించడం లేదు. అఫిడవిట్లు సమర్పించడంలో సంవత్సరాల తరబడి జాప్యం జరుగుతుండడంతో రాజకీయంగా సున్నితమైన, ముఖ్యమైన కేసులు సుప్రీంకోర్టులో పెద్ద సంఖ్యలో పెండింగులో ఉన్నాయి.

సీరియల్ తరహాలో సెబీ దర్యాప్తు

అదానీ గ్రూపుపై హిండెన్‌బర్గ్ చేసిన ఆరోపణలను 2023 మేలోగా విచారించాలంటూ సెబీని సుప్రీంకోర్టు ఆదేశించింది. దీనిపై మరో ఆరు వారాల సమయం ఇవ్వాలని గత ఏప్రిల్‌లో సెబీ కోరింది. దీనిపై మేలో స్పందించిన సుప్రీంకోర్టు ఆగస్ట్ 14వ తేదీ వరకూ సమయం ఇచ్చింది. అప్పుడు కూడా సెబీ మరో పదిహేను రోజుల గడువు అడిగింది. అయినా ఎంతకీ సెబీ తన నివేదికను సమర్పించకపోవడంతో గత సంవత్సరం జనవరి 3న తుది తీర్పు ఇచ్చింది. మూడు నెలల్లో దర్యాప్తు ముగించాలని సెబీని అందులో ఆదేశించింది. అయితే ఆ నివేదిక నేటికీ బహిర్గతం కాలేదు. అసలు విచారణ ముగుస్తుందా లేదా అనేది కూడా తెలియడం లేదు.

సహనం నశిస్తోందన్న సుప్రీం

అదే విధంగా సామాజిక భద్రతా ప్రయోజనాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ యాప్ ఆధారిత రవాణా కార్మికుల భారతీయ సమాఖ్య దాఖలు చేసిన పిటిషన్‌పై 2022 ఫిబ్రవరిలో సమాధానాల కోసం వివిధ కేంద్ర ప్రభుత్వ శాఖలకు సుప్రీంకోర్టు నాలుగు వారాల సమయం ఇచ్చింది. అయినా ఆయా శాఖల నుండి నవంబర్ వరకూ సమాధానాలు అందకపోవడంతో సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేస్తూ 2023 జనవరి వరకూ గడువు ఇచ్చింది. వాస్తవానికి వలస కార్మికుల సమస్యలకు సంబంధించిన ఈ కేసు విచారణ 2020లోనే ప్రారంభమైంది. వారికి రాష్ట్ర ప్రభుత్వాలు రేషన్ కార్డులు ఇవ్వాలంటూ 2021లో సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. అయితే కేంద్రం కానీ, రాష్ట్రాలు కానీ నేటి వరకూ అఫిడవిట్లు సమర్పించలేదు. దీనిపై గత అక్టోబరులో 'మాలో సహనం నశిస్తోంది' అని సుప్రీంకోర్టు ఘాటుగా వ్యాఖ్యానించింది.

కోర్టు ధిక్కరణ చర్యలేవి?

2021 ఐటీ నిబంధనలను సవాలు చేస్తూ మద్రాస్ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. దీనిపై 2021 జూలై నాటికి కౌంటర్ అఫిడవిట్ సమర్పించాలని కేంద్రాన్ని కోర్టు ఆదేశించింది. కానీ ప్రభుత్వం 2022 ఫిబ్రవరి 24న కానీ దానిని దాఖలు చేయలేదు. తన ఆదేశాలను ధిక్కరించినందుకు రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రభుత్వ సంస్థలపై చ్య తీసుకునే అధికారం న్యాయస్థానానికి ఉంటుంది.

కానీ ప్రభుత్వ సంస్థలకు వ్యతిరేకంగా కోర్టులు అలాంటి చర్యలు తీసుకున్న సందర్భాలు దాదాపు లేవనే చెప్పాలి. అదే సమయంలో సకాలంలో స్పందించని ప్రైవేటు సంస్థలు, వ్యక్తులపై న్యాయస్థానాలు చర్యలు తీసుకున్న ఉదంతాలు కోకొల్లలు. దీనిని అలుసుగా తీసుకోవడం వల్లనే ప్రభుత్వాలు సంవత్సరాల తరబడి సమాధానాలు ఇవ్వకుండా దాటవేస్తున్నాయి.

జరిమానాలతో సరి

ప్రాథమిక విధులు అమలయ్యేలా చూడాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై కౌంటర్ అఫిడవిట్లు సమర్పించడానికి 2022 నవంబరులో కేంద్ర, రాష్ట్రాలకు సుప్రీంకోర్టు తుది అవకాశం ఇచ్చింది. కానీ నేటికీ అతీగతీ లేదు. రెండున్నర సంవత్సరాలు గడిచినప్పటికీ కొన్ని రాష్ట్రాలు ఇప్పటికీ అఫిడవిట్లు ఇవ్వలేదు. కోర్టు ధిక్కరణ చర్యలు తీసుకోవడానికి బదులు న్యాయస్థానాలు స్వల్ప మొత్తంలో జరిమానాలు విధించి వదిలేయడాన్ని కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు అలుసుగా తీసుకుంటున్నాయి. 2022 నవంబరులో ఓ కేసులో కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు పాతిక వేల రూపాయల జరిమానా విధించింది. అదే ఏడాది జనవరిలో మరో కేసులో ఏడున్నర వేల రూపాయల ఫైన్ వేసింది. 2017 జనవరిలో ఓ కేసుకు సంబంధించి ప్రధాని కార్యాలయం, కేంద్ర హోం శాఖకు అలహాబాద్ హైకోర్టు ఐదు వేల రూపాయల జరిమానా విధించింది. 2016 అక్టోబరులో ఢిల్లీ ఆరోగ్య మంత్రికి సుప్రీంకోర్టు పాతిక వేల రూపాయల జరిమానా వేసింది. ఇవన్నీ సకాలంలో సమాధానాలు ఇవ్వనందుకు, అఫిడవిట్లు సమర్పించనందుకు వేసిన శిక్షలే. వీటిని కేంద్రం కానీ, రాష్ట్రాలు కానీ ఏ మాత్రం ఖాతరు చేయడం లేదు. జరిమానాలు చెల్లించి చేతులు దులుపుకుంటున్నాయి. న్యాయ స్థానాలు తీవ్రంగా అభిశంసించినా, చీవాట్లు పెట్టినా, ఆగ్రహం వ్యక్తం చేసినా అటు కేంద్రానికి కానీ, ఇటు రాష్ట్ర ప్రభుత్వాలకు కానీ కనీసం చీమ కుట్టినట్లు అయినా లేదు.

టీజీయూఈఈయూ రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలి

రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ గుంటుపల్లి సుధాకర్



నవతెలంగాణ-ములుగు

సిద్దిపేట జిల్లా కేంద్రంలోని విపంచి ఆడిటోరియంలో జనవరి 4, 5 తేదీల్లో టీజీ యూఈఈయూ రాష్ట్ర 4వ మహా సభలు నిర్వహించనున్నట్టు ఆ యూనియన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ గుంటుపల్లి సుధాకర్ తెలిపారు. ఈ సభల్లో కార్మికుల సమస్యలపై సుదీర్ఘంగా చర్చించి, 2022 విద్యుత్ అమెండ్ మెంట్ బిల్లు, విద్యుత్ ప్రయివేటీకరణపై చర్చించనున్నట్టు తెలిపారు. భవిష్యత్తులో వాటి పరిష్కారానికి పోరాటాల రూపకల్పన చేయనున్నట్టు చెప్పారు. ఈ సభలో ఈఈఎఫ్ఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సుదీప్‌దత్ పాల్గొం టున్నారని తెలిపారు. రాష్ట్ర మహాసభల ప్రారంభోత్సవంలో ప్రతి ఒక్క విద్యుత్ కార్మికుడు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

దొడ్డిదారిన ఆ చట్టాల అమలుకు యత్నం

కేంద్రంపై కేజ్రీవాల్ మండిపాటు



న్యూఢిల్లీ : రద్దు చేసిన వ్యవసాయ చట్టాలను దొడ్డిదారిన అమలు చేయాలని కేంద్రం ప్రయత్నిస్తోందని ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ విమర్శించారు. నూతన 'విధానం' పేరుతో దాని ప్రతులను అన్ని రాష్ట్రాలకూ పంపుతోందని, అభిప్రాయాలు కోరుతోందని ఆయన తెలిపారు. కనీస మద్దతు ధరలకు చట్టబద్ధత సహా డిమాండ్ల సాధన కోసం పంజాబ్‌లో ఆందోళన చేస్తున్న అన్నదాతలకు ఏమైనా జరిగితే అందుకు బీజేపీయే బాధ్యత వహించాలని ఆయన అన్నారు. ఈ మేరకు ఆయన గురువారం సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ఓ పోస్ట్ పెట్టారు. పంజాబ్‌లో రైతులు ఆమరణ నిరాహార దీక్ష చేస్తుంటే కేంద్రం కనీసం వారితో సంప్రదింపులు కూడా జరపడం లేదని కేజ్రీవాల్ మండిపడ్డారు. మూడు సంవత్సరాల క్రితం రైతుల డిమాండ్లను అంగీకరించిన కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు మాట మారుస్తోందని ఆరోపించారు. నిరసన వ్యక్తం చేస్తున్న రైతులతో మాట్లాడకపోవడం బీజేపీ అహంకారం కాక మరేమిటని కేజ్రీవాల్ ప్రశ్నించారు.



పేదల పక్షపాతి 'నవతెలంగాణ'

మానవీయ కోణంలో కథనాలు రాసే ఏకైక పత్రిక : మంత్రి సీతక్క

నవతెలంగాణ - ములుగు

పేదల పక్షపాతి నవతెలంగాణ దినపత్రిక అని, మానవీయ కోణంలో కథనాలు రాసే ఏకైక పత్రిక అని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ-శిశు సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క అన్నారు. గురువారం ములుగు జిల్లా కేంద్రంలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో జిల్లా స్టాఫ్ రిపోర్టర్ పట్టణ మధుసూదన్, జిల్లా ఏడివిటి ఇన్‌చార్జి ఎండీ గౌస్, ప్రజాప్రతినిధులు, పాఠకులతో కలిసి నవతెలంగాణ-2025 నూతన క్యాలెండర్‌ను మంత్రి ఆవిష్కరించారు.

అనంతరం సీతక్క మాట్లాడుతూ.. పత్రికలు ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా పనిచేస్తూ ప్రజల సమస్యలను పరిష్కరించే దిశగా ఉండాలన్నారు. నవతెలంగాణ దినపత్రిక ఎప్పుడూ పేద ప్రజల పక్షాన ప్రభుత్వాల ను ప్రశ్నిస్తూ ప్రజల సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించడంలో ముందుంటుందని గుర్తు చేశారు. భవిష్యత్‌లో కూడా పేదల పక్షపాతిగా నవతెలంగాణ పత్రిక పనిచేయాలని తెలిపారు. ఈ సందర్భంగా నవతెలంగాణ యాజమాన్యానికి రాష్ట్ర, జిల్లా స్థాయి, మండల స్థాయి విలేకరులకు, పాఠకులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్య క్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్య క్షులు పైడాకుల అశోక్, జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మెన్ బానోత్ రవిచందర్, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు గొల్లపల్లి రాజేందర్‌గౌడ్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు వంగ రవి యాదవ్, యూత్ కాంగ్రెస్ నియోజక వర్గ అధ్యక్షులు సుమన్ రెడ్డి, రేవంత్‌యాదవ్ పాల్గొన్నారు.

సింగరేణి కార్మికులకు సొంతింటి పథకం అమలు చేయాలి : జూలకంటి

డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి పొంగులేటికి సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ వినతి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సింగరేణి కార్మికులకు సొంతింటి పథకాన్ని అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి కోరారు. గురువారం హైదరాబాద్‌లోని సచివాలయంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిలకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్, సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.రాజారెడ్డి, మంద నర్సింహారావు, తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) రాష్ట్ర నాలుగో మహాసభల సందర్భంగా రేపు సంగారెడ్డిలో జనకవనం



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సీపీఐ(ఎం) రాష్ట్ర నాలుగో మహాసభలను పురస్కరించుకుని సంగారెడ్డిలోని కేవల్ కిషన్ భవన్‌లో శనివారం జనకవనం నిర్వహించను న్నట్టు ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి ఎ.నాగభూషణం తెలిపారు. గురువారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జనకవనం మధ్యాహ్నం రెండు గంటల నుంచి ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఆ కార్యక్ర మానికి ముఖ్య అతిథులుగా ప్రజాకవి, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, హైదరాబాద్ బుక్‌ఫెయిర్ అధ్యక్షులు, కవి యాకూబ్, సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్.వీరయ్య, తెలంగాణ సాహితీ ప్రధాన కార్యదర్శి ఆనందాచారి, అతిథులుగా తెలంగాణ సాహితీ అధ్యక్షులు వల్లభపురం జనార్దన, ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కట్ట నర్సింహ, తెలంగాణ సాహితీ ఉపాధ్యక్షులు ఎస్కే.సలీమ, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి జి.జయరాజు హాజరవుతారని తెలిపారు. జనకవనంలో కవులు, రచయితలు, కళాకారులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

నీట్-యూజీ పరీక్షపై నిపుణుల కమిటీ సిఫారసులు అమలు

- సుప్రీంకు తెలిపిన కేంద్రం

న్యూఢిల్లీ : గతేడాది నీట్-యూజీ నిర్వహణలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ పనితీరును సమీక్షించిన తర్వాత పరీక్షల సంస్కరణలపై ఏడుగురు సభ్యుల నిపుణుల మండలి సూచించిన దిద్దుబాటు చర్యలన్నింటినీ అమలు చేస్తామని కేంద్రప్రభుత్వం గురువారం సుప్రీంకోర్టుకు తెలియజేసింది. వివాదాలతో కూడిన నీట్ - యూజీ 2024 పరీక్షను రద్దు చేయడానికి సుప్రీంకోర్టు గతేడాది ఆగస్టు 2న తిరస్కరించింది.

పీఎం కిసాన్.. పరేషాన్..!

కొత్తగా పట్టాలు పొందిన వారికి దక్కని సాయం

వారసత్వం..ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు పొందిన వారే అర్హులు

- స్పష్టం చేస్తున్న కేంద్ర ప్రభుత్వ నిబంధనలు
- ఐదేండ్లుగా ఎదురుచూస్తున్న అనేక మంది రైతులు



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

పీఎం కిసాన్ సమ్మాన్ నిధి సహాయం రైతులందరికీ అందడం లేదు. వ్యవసాయంలో రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకాన్ని తీసుకొచ్చింది. 2019లో ప్రారంభమైన ఈ పథకం కింద కొందరు రైతులకు మాత్రమే సాయం అందుతోంది. 2019 జనవరి 31నాటి కంటే ముందు పట్టాలు ఉన్నవారికే ఈ పథకం వర్తిస్తుందని అధికారులు చెబుతున్నారు. దీంతో ఆ తర్వాత భూములు కొనుగోలు చేసిన వారికి పెట్టుబడి సాయం అందడం లేదు. కేంద్రం నిబంధనల కారణంగా భూములు ఉండి.. వ్యవసాయం చేస్తున్న వారికి కూడా ఈ సాయం దక్కడం లేదు. కేవలం వారసత్వంతోపాటు ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు పొందిన వారినే ఈ పథకం కింద పరిగణనలోకి తీసుకుంటున్నారు.

రాష్ట్రంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయం కింద ఆర్థిక సాయం అందజేసింది. ఎకరానికి రూ.5వేల చొప్పున ఏటా రెండు సార్లు ఈ సాయం కింద రూ.10వేలు అందజేసింది. ఈ ఆర్థిక సాయం కారణంగా అనేక మంది రైతులు పంట పెట్టుబడి కోసం అప్పులు చేయకుండా ప్రభుత్వం మీద ఆధారపడి పంటలు సాగు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకొచ్చినా ఇంకా రైతు సాయంపై నిర్ణయం తీసుకోలేదు. ఇప్పుడు అదే పథకాన్ని కొత్త పేరుతో అమలు చేసేందుకు సిద్ధమైంది. కాగా, రాష్ట్ర ప్రభుత్వం మాదిరిగానే కేంద్రం కూడా పెట్టుబడి సాయం అందించాలని నిర్ణయించి ఐదు ఎకరాల్లోపు భూమి కలిగిన రైతులకు రూ.2వేల చొప్పున మూడు విడతల్లో రూ.6వేలు అందిస్తోంది. ఈ పథకం ప్రారంభంలో భూమి కలిగిన అనేక మంది రైతులకు సాయం వర్తింపజేయడంతో పెట్టుబడికి ఇబ్బందులు లేకుండా ఉండేది. క్రమక్రమంగా ప్రభుత్వం నిబంధనలు పెడుతూ ప్రభుత్వ ఉద్యోగం కలిగిన వారితోపాటు ఒకే ఇంటిలో ఎక్కువ మందికి వస్తుంటే వాటిని తొలగించింది. దీంతో అనేక మంది రైతులకు ఈ సాయం నిలిచి పోయింది. కొత్తగా భూములు కొను గోలు చేసిన వారికి, పట్టాలు మారిన వారికి పథకం వర్తించడం లేదు.

ప్రస్తుతం ఆదిలాబాద్ జిల్లాలో 90,803 కుటుంబాలకు ఈ పథకం వర్తిస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా 34 లక్షల మందికి లబ్ది చేకూరుతోందని కేంద్ర ప్రభుత్వం చెబుతోంది. రాష్ట్రంలో కంటే తామే ఎక్కువ మందికి సాయం అందిస్తున్నామని కేంద్ర మంత్రులు చెబుతున్నారు.

నిబంధనలతో పరేషాన్..

కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని వర్తింపజేయడానికి కొన్ని నిబంధనలు రూపొందించింది. 2019 జనవరి 31 కంటే ముందు పట్టాలు కలిగిన రైతులకు మాత్రమే వర్తింపజేయాలని నిర్ణయించింది. దీంతో ఆ తర్వాత పట్టాలు పొందిన వారు ఈ పథకం కోసం దరఖాస్తులు చేసుకున్నా ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోలేదు. 2019 నుంచి ఇప్పటి వరకు ఆదిలాబాద్ జిల్లాలో 13,779మంది కొత్త పట్టాలు కలిగిన రైతులు దరఖాస్తులు చేసుకోగా.. ఇందులో 5518మందిని మాత్రమే అర్హులుగా గుర్తించి సాయం అందజేస్తోంది. మిగతా 8261 మంది దరఖాస్తులను వివిధ కారణాలతో తిరస్కరించింది. అయితే, వారసత్వం కింద పొందే పట్టాదారులతోపాటు ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు కలిగిన వారి పరిగణనలోకి తీసుకోవాలని.. ఇతరత్రా క్రయ విక్రయాల ద్వారా భూములు పొందిన పట్టాలు కలిగిన వారికి ఈ సాయం అందించకూడదని నిర్ణయించింది. భూములు ఉన్నప్పటికీ కేంద్రం నుంచి ఆర్థిక సాయం అందని రైతులు ఎంతో మంది ఉన్నారు. కేంద్రం షరతులతో సాయం అందనివారి సంఖ్య పెరిగే అవకాశముంది.

అర్హులైన వారికి సాయం అందుతోంది..

కేంద్ర ప్రభుత్వం నిబంధనల ప్రకారం అర్హులైన అన్నదాతలందరికీ పీఎం కిసాన్ కింద పెట్టుబడి సాయం అందుతోంది. 2019 నుంచి వారసత్వ పట్టాలతోపాటు ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు కలిగిన రైతులను మాత్రమే ఈ సాయం కింద పరిగణనలోకి తీసుకొని అందజేస్తోంది.

- విశ్వామిత్ర, ఏఓ, వ్యవసాయశాఖ, ఆదిలాబాద్

నవతెలంగాణ
రాజకీయపరమైన స్వతంత్రం ఎంత ఉన్నా
అది ఆకలితో అలమటించే వారిని సంతోషపెట్టలేదు - విఐ లెనిన్
శుక్రవారం 03 డిసెంబరు 2025
www.navatelangana.com

రష్యా గ్యాస్ రవాణా నిలిపివేత!



మరి కొద్ది వారాల్లో ఉక్రెయిన్-రష్యా సంక్షోభం నాలుగో ఏడాదిలోకి ప్రవేశించనుంది. ఒప్పంద గడువు ముగియటంతో తూర్పు ఐరోపా దేశాలకు సరఫరా అవుతున్న రష్యా సహజవాయువును తమ భూభాగంలోని పైప్‌లైన్ నుంచి జనవరి ఒకటి నుంచి నిలిపివేస్తున్నట్లు ఉక్రెయిన్ ప్రకటించింది. ఒప్పంద పునరుద్ధరణ సంప్రదింపులకు ససేమిరా అంది. ఈ నిర్ణయాన్ని చారిత్రాత్మకమైనదిగా వర్ణించింది. ఈ చర్య ద్వారా రష్యాను ఆర్థికంగా దెబ్బతీసి పోరు నిలిపివేసేందుకు ఒత్తిడికి పూనుకున్నట్లు స్పష్టంగా కనిపిస్తోంది. అయితే ఇప్పటికే అనేక ఐరోపా దేశాలు ఆంక్షల అమల్లో భాగంగా రష్యా నుంచి గ్యాస్ కొనుగోళ్లు నిలిపివేసిన సంగతి తెలిసిందే. చట్టపరంగా లేదా సాంకేతికంగా చేయగలిగిందేమీ లేదని రష్యా పేర్కొన్నది ఈ పరిణామంతో ఇప్పటికే గణనీయంగా పడిపోయిన ఎగుమతులు మరింతగా తగ్గనున్నాయి. దీనివలన రష్యాకు జరిగే నష్టం కంటే గ్యాస్ దిగుమతి చేసుకొనే దేశాల మీద ఆర్థిక భారం పడనుందని విశ్లేషణలు వెలువడ్డాయి.

> ఉక్రెయిన్ పోరులో ఆ దేశం ఓడిపోతే ఐరోపా దేశాలకు రష్యా నుంచి ముప్పు పెరుగుతుందని అమెరికా భయపెడుతోంది. అయితే అవగాహనకు విరుద్ధంగా ఉక్రెయిన్‌కు నాటో తీర్థమిచ్చి తమ ముంగిట్లోకి ముప్పు తెస్తున్నారనే కారణంతోనే అడ్డుకొనేందుకు పుతిన్ సర్కార్ మిలిటరీ చర్యకు పూనుకున్న సంగతి తెలిసిందే. ట్రంప్ పైకి ఏమి చెప్పినప్పటికీ నాటో రంగం నుంచి అమెరికా తగ్గి ఐరోపాను స్వతంత్రంగా పనిచేయనివ్వటం కలలో మాట.

మూడేండ్లుగా పశ్చిమ దేశాలు అమలు జరుపుతున్న ఆంక్షల వలన తనదైన తీరులో పుతిన్ పరిస్థితికి తగినట్లుగా కొత్త మార్కెట్లను వెతుకుతున్నాడు. ఈ పైప్‌లైన్ ద్వారా రష్యాకు ఏటా ఐదు బిలియన్ డాలర్లు, ఉక్రెయిన్‌కు ఒక బిలియన్ డాలర్ల ఆదాయం వచ్చేది. టర్కీ ద్వారా మరోపైప్ లైన్ ద్వారా సరఫరా అవుతున్న రష్యన్ గ్యాస్‌కు ఎలాంటి అంతరాయం లేదు. ఐరోపాకు రష్యా నుంచి జరుగుతున్న 35శాతం సరఫరాలకు ఇప్పుడు పదికి పడిపోయాయి. తమ రెండు దేశాల మధ్య సాగుతున్న పోరుకు త్వరలో ముగింపు పలకనున్నట్లు రష్యా అధినేత పుతిన్, ఉక్రెయిన్ నేత జెలెన్‌స్కీ 2024 సంవత్సర ముగింపులో ప్రకటించారు తప్ప ఎలా అన్నది చెప్పలేదు. తాను అధికారానికి వచ్చిన 24 గంటల్లోనే ఉక్రెయిన్ పోరుకు స్వస్తి పలుకుతానని అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన డోనాల్డ్ ట్రంప్ ప్రకటించాడు. మరోవైపు పదవి నుంచి దిగిపోతున్న తరుణంలో జో బైడెన్ ఉక్రెయిన్‌కు పెద్ద మొత్తంలో ఆయుధాలతో పాటు ఆరు బిలియన్ డాలర్ల గ్రాంట్ అందజేయనున్నట్లు ప్రకటించాడు.


మూడేండ్ల సైనిక చర్యను చూసినపుడు పశ్చిమ దేశాల మీడియా ఎన్నిక కట్టుకథలు చెప్పినప్పటికీ ప్రారంభదినాలతో పోలిస్తే రష్యా ఆధీనంలోకి వచ్చిన ఉక్రెయిన్ ప్రాంతాలు పెరిగాయి. జనం నమ్మకపో వటంతో ఇప్పుడు తగ్గించాయి. రష్యా 2023లో స్వాధీనం చేసుకున్న విస్తీర్ణంతో పోల్చితే 2024లో ఏడు రెట్లు అదనంగా నాలుగువేల చదరపు కిలో మీటర్లలో చొచ్చుకుపోయింది. ప్రారంభంలో చేసిన పొరపాట్లను పునరావృతం కానివ్వకుండా వేగాన్ని తగ్గించి మెల్లమెల్లగా ముందుకు పోతున్నది. ఉక్రెయిన్ మౌలిక సదుపాయాలను ధ్వంసం చేస్తున్నది. గతేడాది ఎదురుదాడులకు దిగిన ఉక్రెయిన్ తన సరిహద్దు సమీపంలోని రష్యాలో కొంత ప్రాంతాన్ని ఆక్రమించి అక్కడే తిష్టవేసింది. మూడేండ్ల రష్యా దాడులకు కొత్త సంవత్సరంలో స్వస్తి పలుకుతామని, ఈ ఏడాది తమదే అని జెలెన్‌స్కీ నూతన సంవత్సర సందేశంలో పేర్కొన్నాడు. ఈ పోరులో అమెరికా తమవెంటే ఉందన్నాడు. తమ భూభాగం నుంచి గ్యాస్ రవాణా నిలిపివేత రష్యాకు అతి పెద్ద ఓటమి అన్నాడు.

నూతన సంవత్సరంలో పరిస్థితి నాటకీయంగా మారిపోతుందని పుతిన్ వార్షిక విలేకర్ల సమావేశంలో చెప్పాడు. మూడేండ్ల పోరులో పది లక్షల మంది మరణించటం లేదా గాయపడినట్లు, ఉక్రెయిన్ ఓటమి బాటలో ఉన్నట్లు బిబిసి పేర్కొన్నది. ప్రమాణ స్వీకారం చేసిన 24గంటల్లోనే యుద్ధాన్ని ముగిస్తానని ట్రంప్ చేసిన ప్రకటన మీద సందేహాలు తలెత్తుతున్నాయి. అయితే పైకి ఏం మాట్లాడినప్పటికీ విశ్వసనీయత లేని ట్రంప్ మాటలను ఎవరూ పెద్దగా పట్టించుకోవటం లేదు. తొలి విడత అధికారానికి వచ్చినపుడు నాటో ఏర్పాటుతో లబ్ధిపొందుతున్నది ఐరోపా కాగా దాని కోసం తామెందుకు ఖర్చు పెట్టాలంటూ ట్రంప్ మాట్లాడిన సంగతి తెలిసిందే. ట్రంప్ తీరుతో గడచిన నాలుగేండ్లుగా అనేక దేశాలు నాటో కూటమితో పాటు తమ మిలిటరీ బడ్జెట్‌లను కూడా గణనీయంగా పెంచాయి.

సంపాదకీయం

ఉక్రెయిన్ పోరులో ఆ దేశం ఓడిపోతే ఐరోపా దేశాలకు రష్యా నుంచి ముప్పు పెరుగుతుందని అమెరికా భయపెడుతోంది. అయితే అవగాహనకు విరుద్ధంగా ఉక్రెయిన్‌కు నాటో తీర్థమిచ్చి తమ ముంగిట్లోకి ముప్పు తెస్తున్నారనే కారణంతోనే అడ్డుకొనేందుకు పుతిన్ సర్కార్ మిలిటరీ చర్యకు పూనుకున్న సంగతి తెలిసిందే. ట్రంప్ పైకి ఏమి చెప్పినప్పటికీ నాటో రంగం నుంచి అమెరికా తగ్గి ఐరోపాను స్వతంత్రంగా పనిచేయనివ్వటం కలలో మాట. పశ్చిమ దేశాలను ఎదుర్కొనేందుకు రష్యా-చైనా మరింత సన్నిహితం అవుతున్నాయి. ఈ పూర్వరంగంలో ట్రంప్ యంత్రాంగం అదిరించి బెదిరించి ఐరోపాను తమ పరిధిలో ఉంచుకుంటుంది తప్ప వదలేసే అవకాశమే లేదు.

భవిష్యత్తరాల కోసం కలత చెందిన దార్శనికులు



డాక్టర్ దేవరాజు మహారాజు

భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్‌గా ప్రసిద్ధుడయిన భీంరావ్ రాంజీ అంబేద్కర్, మన భారత రాజ్యాంగ రూపశిల్పి. తొలి కేంద్ర న్యాయ శాఖా మంత్రి, ఆర్థిక వేత్త, సంఘ సంస్కర్త. ముఖ్యంగా అంటరానితనం, కుల నిర్మూలన కోసం సంఘర్షించిన రాజకీయవేత్త. దేశంలో నవయాన బౌద్ధానికి దారులు వేసిన ఆధునిక నవబౌద్ధుడు. కాలం గడుస్తున్నకొద్దీ ప్రజలు అంబేద్కర్‌ని బాగా అర్థం చేసు కుంటున్నారు. దళితులు బహుజనులు మాత్రమే కాదు, అన్ని వర్గాల వారు, అన్ని మతాల వారూ అంబే ద్కర్ చూపిన మార్గాన్ని ఎంచుకుంటున్నారు. అయితే 1956 మార్చి 18న ఆగ్రా నగరంలో ఒక సంఘటన జరిగింది. అక్కడ ఆరోజు డా.బి.ఆర్. అంబేద్కర్ (1891 ఏప్రిల్ 14 - 1956 డిసెంబర్ 6) తన అనుచరులతో మాట్లాడుతూ భావోద్వేగానికి గురై, ఉన్న ఫళాన కంటతడిపెట్టారు. 'ఏమిటీ? ఏమైంది?' అని అనుచరులు కంగారు పడి అడిగినప్పుడు ఆయన కొన్ని విషయాలు చెప్పారు. అవి ఇలా ఉన్నాయి. తన జాతి వాసుల్ని తను ఎలా చూడాలనుకున్నారు? వాళ్లు ఎలా తయారయ్యారు? అన్న విషయం బేరీజు వేసి చూపారు. తనవాళ్లను ఉద్దేశించి ఇలా అన్నారు -

నేనేమో మిమ్మల్ని రాజులను చేయాలనుకున్నాను. మీరేమో లాభసాటి నౌకర్లలా మిగిలి పోవాలని అనుకుంటున్నారు.

నేనేమో మిమ్మల్ని రత్నాలుగా చూడాలనుకున్నాను. మీరేమో మట్టి పెళ్లలుగా మిగిలిపోవాలని అనుకుంటున్నారు.

నేనేమో మీరు సంఘటిత శక్తిగా ఎదగాలనుకున్నాను. మీరేమో ఎవరికి వారు వ్యక్తులుగా ఎదగాలని అనుకుంటున్నారు.

నేనేమో రాజ్యాంగమనే ఆయుధంతో గౌతమబుద్ధుడు, జ్యోతీరావుపూలే మొదలు పెట్టిన యుద్ధం గెలవాలని అనుకున్నాను. మీరేమో రిజర్వేషన్ ఫలాలు అనుభవిస్తూ నిద్రపోవాలని అనుకుంటున్నారు.

నేనేమో పూర్వికుల చరిత్ర చదివి, ఆచరించి, పీడిత తాడిత మూల వాసుల తరపున మీరంతా నిలబడాలని అనుకున్నాను. మీరేమో మన పూర్వీకుల చరిత్రే చదవకూడదని అనుకుంటున్నారు.

నేనేమో వచ్చిన స్వాతంత్ర్యం నుంచి వేరే ఇంకో స్వతంత్రం కోరుకోవడం లేదు. - వెట్టిచాకిరి, బానిసత్వం, కులం, మతం, దోపిడీ, దౌర్జన్యం - సంకెళ్ల నుంచి మిమ్మల్ని విముక్తుల్ని చేయాలని అనుకున్నాను. మీరేమో ముందు చూపులేకుండా, రాబోయే పెనుముప్పును చూసుకోకుండా కండ్లు మూసుకుని కాలక్షేపం చేయాలని అనుకుంటున్నారు.

స్పృహ లేని ఉద్యోగాల కోసం, స్ఫూర్తి లేని రాజకీయ నాయకుల కోసం, సంఘటితం కాని సంస్కర్తల కోసమేనా నా ఈ కన్నీళ్లు?

"మీరంతా నా అనుచరులు గనుక, నా జాతివాసుల కోసం, నాదేశ ప్రజల కోసం నేను పడు తున్న ఆవేదనను మీరు సరిగా అర్థం చేసుకుంటారని భావిస్తాను. నా కన్నీళ్లు వథాపోవనీ, వాటి విలువను మీరు వారికి తెలియజెప్తూ ఉంటారని ఆశిస్తాను!" అని అన్నారు అంబేద్కర్. భవిష్యత్తరాల అభ్యున్నతి కోసం డా. బి.ఆర్. అంబేద్కర్ పడిన ఆవేదన వథా కాకూడదు. మనం మనముందు తరాల్ని చైతన్యవంతులుగా తీర్చిదిద్దడం - ఒక బాధ్యతగా స్వకరించాలి!

***

నేటి బాల బాలికలే రేపటి పౌరులు గనక, వారి విద్యాభ్యాసం ఎలా జరగాలి? వారు ఉన్నతమైన ఆశయాలతో ఎలా పెరగాలి? - అన్న విషయం అబ్రహం లింకన్ (12 ఫిబ్రవరి 1809- 15 ఏప్రిల్ 1865) ఒక ఉత్తరంలో నమోదు చేశారు. అమెరికాకు పదహారవ అధ్యక్షుడయిన లింకన్, తన చిన్న కుమారుడైన ట్యాడ్ లింకన్‌కు పాఠాలు చెప్పే ఉపాధ్యాయుడికి ఒకలేఖ రాశారు. అందులో అనేక విషయాలున్నాయి. ఇది కేవలం తన కుమారుడి కోసం రాసిందే అయినా, ఆయన దృష్టిలో ప్రపంచ యువత ఎలా ఎదగాలి - అన్న విషయం చర్చించారు. ఆ ఉత్తరం ఇలా సాగుతుంది - ప్రతి ఉపాధ్యాయుడూ ఈ ఉత్తరం తనకు వచ్చినట్టుగానే భావించుకోవాలి !

గౌరవనీయ ఉపాధ్యాయుడా!

ఈ భూమి మీది మనుషులందరూ న్యాయమైన వాళ్లుకాదు, నిజమైన వాళ్లూ కాదు. ఈ విషయాలు మా అబ్బాయి కచ్చితంగా తెలుసుకోవాలి! మీరు మా వాడికి ఇవి నేర్పించాలి!



ప్రతి ఉత్తముడికి ఒక నీచుడున్నాడు. ప్రతి స్వార్థ రాజకీయ నాయకుడికీ అంకిత భావంతో పని చేసే ఒక నాయకుడున్నాడు. ప్రతి శత్రువుకీ మనకు ఒక మిత్రుడున్నాడు. లేనిదాని గురించి దిగులు పడే గుణాన్ని మా వాడిలోంచి పారద్రోలండి. వీలయితే నిశ్శబ్దంగా నవ్వుకోగల రహస్యాన్ని వాడి గుప్పిట్లో పెట్టండి.

తనకు కొన్ని విషయాలు చిన్న తనంలోనే తెలియాలి. అల్లరి చిల్లర కబుర్లు ఆసక్తి కలిగిస్తాయి. కానీ, వాడికి పుస్తకాల మత్తు, మహత్తూ ఏమిటన్నది అర్థం చేయించండి! అలాగే ఆకాశంలోని పక్షులు, తేనెటీగలు, పచ్చటి కొండల అనంత రహస్యాలను అన్వేషించడానికి వీలయినంత ఎక్కువ సమయం కేటాయించాలని చెప్పండి.

మోసం చేయడం కంటే, ఫెయిల్ కావడమే గౌరవప్రదమైన అంశమని, పాఠశాలలో పిల్లలకు మీరు తప్పక బోధించాలి. ఇతరులు తప్పు పడుతున్నారని కాకుండా తన ఆలోచనలపై తనకు ధృఢమైనా విశ్వాసం ఉంచుకోవడం మంచిదని చెప్పండి. మర్యాదస్తులతో మర్యాదగా, మొండివాళ్లతో మొండిగా మసలు కోవాలన్నది నేర్పించండి! వీలయితే మా అబ్బాయికి ఈ జ్ఞానాన్ని పంచండి - అందరూ వెళుతున్నారు కాబట్టి, మనమూ ఆ దారిలోనే పరిగెత్తుదామన్న గొర్రెదాటు పద్ధతిని అనుసరించకుండా - నిగ్రహించుకునేట్లు చేయండి! ఎవరేది చెప్పినా, వినగలిగే ఓపికను మా కుర్రవాడిలో పెంపొందించండి.

అయితే, సత్యాసత్యాల నిగ్గుతేల్చుకుని, అసలైనదాన్ని మాత్రమే స్వీకరించాలన్నది- నేర్పించండి!

మీకు సాధ్యమైతే ఈ కింది మెళకువలు కూడా నేర్పించండి -

దుఃఖంలో నవ్వాలని, కన్నీళ్లు వస్తే సిగ్గు పడాల్సింది ఏమీలేదని, ప్రతి దానికీ రంధ్రాన్వేషణ చేసేవాడిని పరిహసించాలని - అలాగే ప్రతి చిన్నపనినీ పొగిడేవాడి గూర్చి జాగ్రత్తగా మసలు కోవాలన్నది బోధించండి!

తన కండను, మెదడును అత్యంత ఎక్కువ ధర చెల్లించేవాడికి అవసరమైతే అమ్ముకోవచ్చు. కానీ, తన మనసుకు, అంతరాత్మకూ ఎప్పుడూ ఎక్కడా, ఎన్నడూ వెల నిర్ణయించకూడదనీ, ఆ పరిస్థితి అసలు తెచ్చుకొనే తెచ్చుకోగూడదనీ బాగా అర్థమయేట్టు చెప్పండి!' పనికి మాలిన అరుపులకు చెవి ఒగ్గ గూడదని, తను సత్యమని బలీయంగా నమ్మిన దాని కోసం ఎదురొడ్డి పోరాడాలనీ చెప్పండి!

మా అబ్బాయితో కాస్త సున్నితంగానే వ్యవహరించండి. కానీ, మరీ ముద్దు చేయకండి. ఎందు కంటే ఉక్కు ధృఢత్వం తెలిసేది అగ్ని పరీక్షకు గురైనప్పుడే కదా?

ధైర్యంగా ఉండగలిగే సహనం తనకు కావాలి! అయితే, అవసరమైనప్పుడు తన అసహనాన్ని ప్రదర్శించే ధైర్యం కూడా తనకు ఉండాలి!

ఎల్లవేళలా తనమీద తనకు అచంచలమైన విశ్వాసం ఉండేలా తీర్చిదిద్దండి. అప్పుడే ఆవయసు పిల్లలకు మానవ జాతి మీద ఎనలేని విశ్వాసం ఏర్పడుతుంది.

ఇవన్నీ చిన్న కోరికలేమీ కావు - చాలా పెద్దకోరికలే. కానీ, ప్రయత్నించి చూడండి. ముద్దులొలికే నా బంగారు తండ్రికోసం - ఇందులో మీరు ఏమేమి చేయగలరో ప్రయత్నించి చూడండి. మీ ప్రయత్నం సఫలమైతే, ఆ ఫలితం నా కుమారుడొక్కడికే కాదు-మొత్తం కొన్నితరాలకు అందించిన వారవు తారు. దయచేసి ఆలోచించండి-

- అబ్రహం లింకన్; ఫాదర్ ఆఫ్ ట్యాడ్ లింకన్ (పేరెంట్)

***

19 అక్టోబర్ 1952 షిల్లాంగ్-మేఘాలయలో జరిగిన పెద్ద బహిరంగసభలో భారత తొలి ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ ఉపన్యాసం ఈ విధంగా సాగింది. దేశమంటే ఏమిటీ? అంకిత భావంతో పని చేసే దేశ నాయకులు చేయాల్సింది ఏమిటి? అన్నది ఆయన చెప్పకనే చెప్పారు.

"దేశమంటే కొన్ని పర్వతాలు, కొన్ని నదులు, మైదానాలు, పొలాలూ మాత్రమే కాదు. పెద్దవీ చిన్నవీ అయిన నగరాలు, పట్టణాలు గ్రామాలు మాత్రమే కాదు. దేశమంటే ఇవన్నీ ఉంటాయి కానీ, దేశ మంటే ఇవి మాత్రమే కాదు. దేశమంటే, దేశంలో నివసిస్తున్న ప్రజలు- అందువల్ల, నా భారత దేశంలో ఉన్న ప్రజలను నేను అర్థం చేసుక వడానికి ప్రయత్నించాను. గతంలో ఉన్న ప్రజలను, ప్రస్తుతం ఉన్న ప్రజలను వారి జీవితాలను చాలా లోతుగా అధ్యయనం చేస్తూ వచ్చాను. దేశమంతా విస్తృతంగా పర్య టిస్తూ వచ్చాను. ఉత్తరాన హిమాలయాల నుండి దక్షిణపు అంచు కన్యాకుమారి దాకా - అలాగే పశ్చి మాన ఉన్న మన సరిహద్దుల నుండి ఇటు తూర్పున ఉన్న సముద్రతీరం దాకా లక్షలాది ప్రజలను కలిశాను. వారి కండ్లలోకి సూటిగా చూస్తూ వారి మనోభావాల్ని పసిగట్టాను. వారి ఆశలేమిటి ?

ఆకాంక్షలేమిటీ? తెలుసుకున్నాను. వారు చెప్పేదేమిటో విన్నాను. వారు చెప్పలేక పోయిందే మిటో కూడా అంచనా వేసుకున్నాను. మొత్తానికి మొత్తంగా, నా దేశ ప్రజల్ని కొంతలో కొంత అర్థం చేసుకోవడం ప్రారంభించాను. ఇది నాకు సంతోషాన్ని, సంతృప్తిని ఇచ్చే విషయం!"

ఆనాటి పండిట్ నెహ్రూ ఉపన్యాసం పూర్తిపాఠం-జవహర్‌లాల్ నెహ్రూ - సెలెక్టెడ్ వర్క్స్ -సెకెండ్ సీరిస్ - వాల్యూమ్ - 20;పేజి. నెం.3లో ఉంది.

"జవహర్‌లాల్ నెహ్రూ పట్ల పార్టీలో ఆరాధనా భావం పెరిగిపోతూ ఉంది. దీన్ని అరికట్టకపోతే ఆయన మరో సీజర్‌లా తయారయ్యే అవకాశం ఉంది - ఇది పార్టీ మనుగడకు ఎంత మాత్రం సరైంది కాదు" చాణక్య. నెహ్రూ అంటే గిట్టని వారెవరో ఇలా రాస్తున్నారని అందరూ అనుకునేవారు. ఇంతకూ ఎవరా చాణక్య- అని కొందరు ఆరా తీసేవారు. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే- చాణక్య ఎవరో కాదు. పండిట్ నెహ్రూయే! అది ఆయన కలం పేరు. ఆరోజుల్లో కలకత్తా నుండి వెలువడే ఒక పత్రికలో పండిట్ నెహ్రూయే స్వయంగా 'చాణక్య' అనే పేరుతో విరివిగా రాస్తుండేవారు. ఈ కాలంలో అలాంటి నిజాయితీ పరుల్ని చూడగలమా? ఆయన దార్శనికతను అర్థం చేసుకోలేని వారు మాత్రమే, ఆయనను తక్కువ చేసి మాట్లాడగలరు. వివేకవంతుడికి, మూర్ఖుడికీ పోలికలు ఉండవు కదా!

- సుప్రసిద్ధ సాహితీవేత్త, జీవశాస్త్రవేత్త.

> మోసం చేయడం కంటే, ఫెయిల్ కావడమే గౌరవప్రదమైన అంశమని, పాఠశాలలో పిల్లలకు మీరు తప్పక బోధించాలి. ఇతరులు తప్పు పడుతున్నారని కాకుండా తన ఆలోచనలపై తనకు ధృఢమైనా విశ్వాసం ఉంచుకోవడం మంచిదని చెప్పండి. మర్యాదస్తులతో మర్యాదగా, మొండివాళ్లతో మొండిగా మసలు కోవాలన్నది నేర్పించండి! వీలయితే మా అబ్బాయికి ఈ జ్ఞానాన్ని పంచండి - అందరూ వెళుతున్నారు కాబట్టి, మనమూ ఆ దారిలోనే పరిగెత్తుదామన్న గొర్రెదాటు పద్ధతిని అనుసరించకుండా - నిగ్రహించుకునేట్లు చేయండి! ఎవరేది చెప్పినా, వినగలిగే ఓపికను మా కుర్రవాడిలో పెంపొందించండి.

యాంటీ బయోటిక్స్‌ను నిరోధించలేమా?

మనిషికి ఔషధాలు ప్రాణావసరం. తయారీదారులకు ఇవి కామధేనువులు. వైద్యులకు కల్పతరువులు. ప్రజారోగ్య పరిరక్షణలో ఔషధ తయారీ పరిశ్రమలు, వైద్య, ఆరోగ్య సిబ్బంది కీలకపాత్ర పోషించాలి. ఔషధ నియంత్రణలో ప్రమాణాలన్నింటినీ నిర్దిష్టంగా పాటించాలి. అప్పుడే ప్రజారోగ్యానికి భద్రత. ఈ మూడింటి మధ్య అనుసంధానంలో ఎక్కడ లింకు తెగినా, అంతరాయాలేర్పడినా, వారు కట్టుదాటినా అది ప్రజారోగ్య వ్యవస్థనే కుప్పకూలుస్తుంది. అలాంటి పరిస్థితులిప్పుడు ఫార్మా రంగ ప్రమాదకర పోకడల వల్ల ఏర్పడుతోంది. ఇండియా, ఖతార్, యూకేలకు చెందిన నూతన అధ్యయన బృందం ప్రచురించిన ఒక నివేదికలోని అంశాలు భారత్ ఫార్మా రంగంలోని ప్రమాదకర పోకడలను తేటతెల్లం చేసింది. భారత్‌లో అనుమతులు లేని, నిషేధించిన 'స్థిర మోతాదు మిశ్రమం' (ఫిక్స్ డోస్ కాంబినేషన్-ఎఫ్‌ఎసీ)తో కూడిన యాంటీబయోటిక్స్ అమ్మకాలు అపరిమితంగా ఉన్నాయని ఆ పరిశోధనా బృందం ఆందోళన వ్యక్తం చేసింది. ఫార్మా ఎస్టీసీ డేటా ప్రకారం 2020లో 60.5 శాతం ఎఫ్‌ఎసీ బయోటిక్స్ (239 ఫార్ములేషన్) అనుమతులు లేనివి. మరో 9.9 శాతం (39 ఫార్ములేషన్) నిషేధించినప్పటికీ.. అమ్మకాలు జరుగుతూనే ఉన్నాయి. వీటిలో అతి ప్రమాదకరమైన యాంటీ బయాటిక్స్, వీటిలో అధిక మోతాదులో యాంటీ బ్యాక్టీరియల్ మైక్రో బయోలైన్ నిరోధకాలు (ఏఎంఆర్) ఉన్నాయి. ఈ ఎఫ్‌ఎసీ అనేది ఒకటికి మించిన స్థిర మోతాదు మిశ్రమం. ఇలాంటి సమ్మిళిత ఔష ధాలవల్ల సైడ్ ఎఫెక్ట్స్ ఎక్కువగా ఉంటున్నాయి. ఈ కారణంగా ఎఫ్‌ఎసీల ఉత్పత్తికి శాస్త్రీయ, నిర్దేశిత అనుమతుల ప్రక్రియ సంక్లిష్టం అవుతున్నది. అయితే, మనదేశంలో ఈ పరిశ్రమకు ఈ ఎఫ్‌ఎసీ ఎంతో ఇష్టమైంది. కాసులు కురిపించే కల్పతరువు. ప్రజారోగ్యాన్ని ఆ పరిశ్రమలు పెద్దగా పట్టించుకోవు. ఔషధాల ఉత్పత్తి ధరల నియంత్రణలో విధానాలు, లోపాలు పరిశ్రమల యాజమాన్యాలకు తెలుసు. మనదేశంలో డ్రగ్ ప్రైస్ కంట్రోల్ ఆర్డర్ అనే చట్టం మందుల ధరలను నిర్దేశిస్తుంది. డీపీసీఓ పరిధిలో ఈ 'స్థిర డోస్ కాంబినేషన్' లేదు. ఈ అవకాశాన్ని ఈ రంగం ఉపయోగించుకుంటోంది. తమకు తోచిన కాంబినేషన్లలో ఎఫ్టీసీలను ఉత్పత్తి చేసి మార్కెట్ లోకి జొప్పిస్తోంది. ఎంత ముప్పు ఏర్పడినా విచారణకు ఆస్కారం ఉండదు. డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ యాక్ట్ 1940 ఉన్నప్పటికీ, మహా అయితే మార్కెట్లో శాంపిల్స్ తీస్తే వాటిని నాణ్యత పరీక్షల కోసం తిరిగి తయారీదారులకే పరీక్ష నిమిత్తం పంపుతారు. ఏతావాతా వారి ఉత్పత్తులకు వాళ్లే తయారీ, పంపిణీ, శాంపిల్స్ తనిఖీ ప్రమాణాలన్నిటికి వారే సర్వాధికారులు. ఈ ఎఫ్‌ఎసీల ఉత్పత్తివల్ల ఆయా పరిశ్రమలకు మరో ప్రయోజనం ఉంది. వాటి ధరలను ఆయా సంస్థలు తమ ఇష్టానుసారం నిర్ణయించుకోవచ్చు. దండుకోవచ్చు. ఇలా రోగులను ఆరోగ్యపరంగానూ, ఆర్థికంగానూ పీల్చిపిప్పి చేస్తున్నారు.

దీనిపై 1978లోనే మొదటి ప్రభుత్వ అధ్యయన కమిటీ అధ్యయనం చేసి సమస్య ఉన్నట్లు అంగీకరించింది. డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ యాక్ట్ 1940 ప్రకారం కేంద్ర ప్రభుత్వానికి డ్రగ్స్ భద్రత, నాణ్యతకు సంబంధించి ఇండియాలో అమ్మకాలపై 1982 వరకూ ఎలాంటి నియంత్రణా లేదు. స్టేట్ డ్రగ్ కంట్రోలర్స్ ఆధీనంలో ఆయా రాష్ట్రాల్లో డ్రగ్స్ తయారీ లైసెన్స్, నాణ్యత ప్రమాణాలు వగైరాలు ఉండేవి. అయితే 1982లో మన పార్లమెంటు చట్టం చేసింది. దీంతో కేంద్ర ప్రభుత్వానికి అధికారాలు సంక్రమించాయి. అవి రోగ నివారణలో (థెరపీయూటిక్ వాల్యూ) న్యాయబద్ధంగా లేకుంటే వాటి తయారీని బహిష్కరించాలనేది. అనంతరం 1988లో కేంద్ర ప్రభుత్వం నిబంధనలను సవరించింది. నూతన డ్రగ్స్ తయారీలో కావలసిన, ఉండాల్సిన అవసరమైన షరతులు విధించింది. దీని పరిధిలోకి ఎఫ్‌ఎసీలను తెచ్చింది. భద్రతకు సంబంధించిన ఆధారాలు, డ్రగ్స్ లోని మూలకాల పనితీరులాంటి వివరాలను 'డ్రగ్స్ కంట్రోల్ జనరల్ ఆఫ్ ఇండియా' (డీజీసీఐ)కి సమర్పించాలి. దీని ప్రకారం స్టేట్ డ్రగ్ కంట్రోలర్స్ కొత్త డ్రగ్స్ తయారీ లైసెన్సు ఇవ్వరాదు. అవి డ్రగ్ కంట్రోల్ జనరల్ ఆఫ్ ఇండియా వారి భద్రత, నిర్దేశిత ప్రయోగాల అనంతరం సత్ఫలితాల్ని బట్టి డ్రగ్ కంట్రోల్ జనరల్ ఆఫ్ ఇండియా ప్రమాణాల అనుమతి మేరకే ఉత్పత్తి చేయాలి. చట్టం ఇంత స్పష్టంగా ఉన్నప్పటికీ డ్రగ్ కంట్రోలర్ జనరల్ ఆఫ్ ఇండియా తయారీ లైసెన్సులివ్వనప్పటికీ, స్టేట్ డ్రగ్స్ కంట్రోలర్స్ లైసెన్సులు ఇవ్వడం ఆశ్చర్యకరం.. వాస్తవానికి ఆయా చట్టాలను, నియమాలను ఉల్లంఘించినప్పుడు. డీసీజీఐ అనుమతి పొందకుండా ఉత్పత్తి చేసిన పరిశ్రమలను సాంకేతికంగా విచారించవచ్చు. ఈ క్రిమినల్ నేరాలన్నింటినీ. విచారించడానికి, తగు రీతిలో శిక్షించడానికి బదులు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతోంది.. పైపెచ్చు చట్టంలోని సెక్షన్ 26వ సెక్షన్ అడ్డం పెట్టుకుని వీటి తయారీ బహిష్కరణకు అడ్డు తగులుతున్నది. వాస్తవానికి 2020లో 239 ఎఫ్జీసీ ఔషధాలకు అనుమతి లేకుండానే ఉత్పత్తి చేసినట్లు ఈ అధ్యయనం పేర్కొంది. ఈ సమస్య ఆరంభమైన 42 సంవత్సరాల తర్వాత కూడా డ్రగ్ నియంత్రణ చట్టం నిరుపయోగంగా ఉండటం బాధాకరం. ఇప్పటికైనా ఆరోగ్య మంత్రిత్వ శాఖ తక్షణ చర్యలు తీసుకోవాలి, ఆంక్షలు, నిబంధనల బంధనాలు వేయాలి. ప్రజారోగ్యం రక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలి. అందుకు తగినట్టుగా చట్టాలను కఠినతరం చేయాలి.

-ఫీచర్స్ అండ్ పాలిటిక్స్

సావిత్రిభాయి ఆశయాలు - పాలకుల పన్నాగాలు



టి. స్కైలాబ్‌బాబు
9177549646


'తత్వవేత్తలు ప్రపంచాన్ని పరిపరి విధాలుగా విశ్లేషించారు, వ్యాఖ్యానించారు. కానీ ఇప్పుడు చేయాల్సింది దాన్ని మార్చడమే' అంటారు కార్ల్‌మార్క్స్. ఆ మహనీయుడు ప్రబోధించిన ప్రకారం ఆ కృషిని ఆకాలంలోనే ఆచరించిన చదువుల తల్లి సావిత్రిబాయి పూలే.త్యాగం, సేవ, క్రమశిక్షణ, పట్టుదలకు మారుపేరుగా నిలిచిన భారతీయ మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయిని. 'శూద్రులు, అస్పృశ్యులు చదివితే నాలుకలు కోయాలి. పాఠాలు వింటే చెవుల్లో సీసం పోయాలి' అనే మానసిక చట్టాలను మట్టిలో పాతిపెట్టిన సామాజిక విప్లవ మాతృ మూర్తి. మనువాద సిద్ధాంతం ప్రకారం కేవలం బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య వర్ణాలకు మాత్రమే నాడు చదువుంది. ఆ మను వాదుల విషమ షరతులను తన కాలిగోటికి కట్టేసి అనేక అవమానాలను, ఛీత్కారాలను భరించి చదువు నేర్పిన ధీరవనిత.శూద్రులు విద్య నేర్చుకోవడం సహజమైన హక్కని, అందరూ చదవాలి.. అందరూ అసమానతలు లేకుండా బతకాలని పరితపించిన స్ఫూర్తిప్రదాత. ఆమె ఓ గొప్ప ఉద్యమకారిణి, రచయిత్రి, మంచివక్త, కులంపై కలంతో యుద్ధం నడిపిన కవయిత్రి.

1831 జనవరి 3న మహారాష్ట్రలోని సతారా జిల్లా నయగామ్ అనే గ్రామంలో పేద రైతు కుటుంబంలో జన్మించిన ఆమె పరిస్థితుల ప్రభావం రీత్యా తొమ్మిదేళ్ల వయసులోని జ్యోతిబాపూలేని వివాహమాడింది. నిరక్షరాస్యులైన సావిత్రికి తన భర్తనే మొదటి గురువుగా విద్యా జ్ఞానం నేర్పి సామాజిక ఉద్యమకారిణిగా తీర్చిదిద్దాడు.1847 నాటికి ఆమె భర్తతో కలిసి శుద్ర కులాల బాలికల కోసం మొట్టమొదటి పాఠశాలను నెలకొల్పారు. న్యాయం, ప్రజాస్వామ్యం, సమానత్వం అనే ఆదర్శాలు సావిత్రిబాయి జీవితంలో సహజ గుణాలుగా నిలిచిపోయాయి. స్త్రీ, పురుష సమానత్వం కోసం సాగిన ఉద్యమాల్లో ఆమె ప్రత్యక్షంగా పాల్గొన్నారు. కులం, పురుషాధిక్య, సామాజిక ఉద్యమాల్లో పాల్గొన్న ఏకైక మహిళ ఉద్యమకారిణి ఆమె. బ్రాహ్మణీయ ఆధిపత్య వర్గాల చేతుల్లోనే ఉన్న ఉద్యమాలకు ప్రత్యామ్నాయంగా సాగిన పోరాటాల్లో ఆమె పీడితుల పక్షాల అగ్రగామిగా నిలిచారు. 1852లో మహిళా సేవ మండలి పేరిట మహిళా సంఘాన్ని స్థాపించారు.వితంతువుల పట్ల వివక్ష, అక్రమ సంతానం పేరిట శిశువుల హత్యలకు వ్యతిరేకంగా పోరాటాలు నడిపారు. అనాథ బాలలు, శూద్ర బాలికలందరూ తన బిడ్డలని అక్కున చేర్చుకున్నారు.1874లో ఒక బ్రాహ్మణ వితంతువుకు పుట్టిన బిడ్డను పూలే దంపతులు దత్తత తీసుకుని యశ్వంత్ అని పేరుపెట్టి పెంచి పెద్దచేసి డాక్టర్ చదివించారు.

1873లో సత్యశోధక్ సమాజ్ మహిళా విభాగం పేరిట కులాంతర వివాహాలు చేపట్టారు. భార్యను కోల్పోయిన యువకుడిని చేరదీసి తన స్నేహితురాలి బిడ్డతో మాట్లాడి పురోహితులు, పైసా ఖర్చు లేకుండా దండలు మార్చి పెండ్లి చేశారు. ఇది దేశ చరిత్రలోనే మొట్టమొదటి ఆదర్శ వివాహం. అదేవిధంగా ఒక పేద వ్యక్తి ఇంట్లో పూలే బాలికల పాఠశాలను ప్రారంభించగా సావిత్రిబాయి తన స్నేహితురాలు ఫాతిమా షేక్‌తో కలిసి ఆ పాఠశాలను చాలా సమర్థవంతంగా నడిపారు. కానీ, బ్రాహ్మణీయ ఆధిపత్య శక్తులు కక్ష గట్టి శూద్రులు అందులో మహిళలు చదవడం అపచారం..అపచారం అంటూ అనేక ఆటంకాలు సృష్టించారు. ఆమె పాఠశాలకు వెళ్లే దారిలో అటకాయించి రాళ్లు విసిరేవాళ్లు. వేధింపులకు గురి చేయడమే కాక నానా బూతులు తిట్టేవారు. బురదను చల్లేవారు. అయినప్పటికీ తన లక్ష్యం కోసం ఓ పాత చీర పెట్టుకునిపోయి చదువు నేర్పారు సావిత్రిభాయి. 1890 నవంబర్ 28న జ్యోతిబాపూలే మరణించారు.సావిత్రిబాయి తన భర్త చితికి నిప్పంటించారు. అనంతరం సత్య శోధక్ సమాజం బాధ్యతలను ఆమె స్వయంగా నిర్వహించారు. 1896లో మహారాష్ట్రలో సంభవించిన తీవ్ర కరువు ప్లేగువ్యాధి అక్కడి జన జీవనాన్ని అతలాకుతలం చేసింది. ఆ సమయంలో ఆమె దళితులు, పేదల కోసం జోలపట్టి విరాళాలు సేకరించి వారికి అందించారు. ప్రభుత్వంతో పోరాడి బాధితుల కోసం నిధులు మంజూరు చేయించారు. ప్లేగువ్యాధి ప్రబలిన బాధితులకు ప్రత్యక్షంగా సేవలందిస్తూ ఆ సమయంలో ఆమె కూడా అదే వ్యాధికి గురై చివరకు 1897 మార్చి 10న కన్నుమూశారు.

సావిత్రిబాయి బతికినంతకాలం అందరికీ విద్యా వైద్యం, సమాన అవకాశాల కోసం తన జీవితాన్ని ధారబోశారు. ప్రకృతి వనరులు ప్రజలందరికీ అందాలని కోరుకున్నారు. కానీ, నేడు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ పాలకులు ఆమె ఆశయాలకు విరుద్ధంగా విద్యను సంతలో సరుకుల్లా అమ్ముకుం టున్నారు. అందుకు మోడీ తీసుకొచ్చిన నూతన జాతీయ విద్యావిధానమే సజీవ సాక్ష్యం. ఎలాంటి రిజర్వేషన్లు లేకుండా డబ్బున్న కొందరికి ఉన్నత విద్యను కట్టబెట్టడం, ఇందులో అణగారిన పేదలకు చదువులు అందకుండా చేసే కుట్ర దాగుంది. యూనివర్సిటీలను కూడా ప్రయివేటుపరం చేయడం, పాఠ్యాంశాల్లోనూ మూఢాచారాలను జొప్పించడం, విద్యార్థులపై అశాస్త్రీయ భావజాలన్ని రుద్దడం శరవేగంగా అమలు చేస్తున్నారు. అలాగే దేశ సమైక్యత, సమగ్రతలకు భంగం కలిగిస్తూ ప్రజల మధ్య చిచ్చుపెడుతున్నారు. ఆర్థిక సంక్షోభం వల్ల ప్రజల్లో పెరుగుతున్న అసంతృప్తిని ఒక క్రమపద్ధతిలో పక్కదోవ పట్టిస్తూ పబ్బం గడుపుకుంటున్నారు. నిరుద్యోగం, ఉపాధి, వ్యవసాయ సంక్షోభం, కార్మికులకు కనీస వేతనాలు, పెద్దనోట్ల రద్దు, జీఎస్టీ, ఎస్సీ ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టం వంటి అనేక సమస్యల నుండి ప్రజల దృష్టిని మరల్చుతున్నారు. ఇప్పుడు 'ఒకే దేశం ఒకే ఎన్నిక' పేరు తో ఫెడరల్ స్ఫూర్తికి తూట్లు పొడుస్తూ రాజ్యాంగ పునా దులను దెబ్బతీస్తున్నారు. కార్పొరేట్ శక్తులకు రాయితీ లిస్తూ పేద ప్రజలపై పన్నుల భారం మోపు తున్నారు.

డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విద్యా, వైద్యం ప్రభుత్వ సంక్షేమ రంగంలోనే ఉండాలని చెప్పారు. భారతీయు లందరికీ సమాన ఉన్నత విద్య అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. కానీ నేడు దేశాన్ని కార్పొరేట్ శక్తులు ఏలుతున్నాయి. ప్రజలెన్నుకున్న పాలకులే వారికి మేలు చేసే చట్టాలు తీసుకొస్తున్నాయి. అందుకే సావిత్రిభాయి పూలే స్ఫూర్తితో ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాల్ని ప్రతిఘటిం చాలి. ప్రజల్ని చైతన్యపరచాలి. సావిత్రిబాయి పూలే జయంతి, వర్ధంతి సందర్భంగా ఆమె ఫొటోకు దండ వేసి ఆమె ఆశయాలను అంతం చేసే ఏలికలున్న సమాజం మనది. కాషాయపు కుట్రల్ని తిప్పికొట్టాలి. అందుకుగాను సావిత్రిభాయిని ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలి.



(నేడు సావిత్రిభాయి పూలే జయంతి)

6న విద్యుత్ బస్సులపై ఎస్‌డబ్ల్యూఎఫ్ సదస్సు

- ఆర్టీసీ కార్మిక సంఘాలన్నీ పాల్గొనాలని విజ్ఞప్తి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

"విద్యుత్ బస్సులు-ప్రజలు, ఆర్టీసీలపై ప్రభావం" అంశంపై ఈనెల 6వ తేదీ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సదస్సు నిర్వహిస్తున్నట్టు టీజీఎస్‌ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వీరాంజనేయులు, వీఎస్ రావు తెలిపారు. ఈ మేరకు ఆర్టీసీలోని అన్ని కార్మిక సంఘాలకు ఆహ్వానాలు పంపామని గురువారంనాడొక పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు. దేశంలో డీజిల్ బస్సుల స్థానంలో విద్యుత్ బస్సులు తెచ్చేందుకు బీజేపీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలను తెచ్చిందనీ, దీనితో రాష్ట్రానికి వేలాది విద్యుత్ బస్సులు తెస్తామని రాష్ట్ర ప్రభుత్వం విధాన ప్రకటన చేసిందని గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో ఆర్టీసీ మనుగడ, కార్మికులు, ప్రజలు ఎదుర్కొనే సమస్యలను చర్చించేందుకు ఈ సదస్సును నిర్వహిస్తున్నామన్నారు. అన్ని కార్మిక సంఘాల నాయకులు ఈ సదస్సులో పాల్గొని తమ అభిప్రాయాలు చెప్పాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే రాష్ట్రంలో 190 విద్యుత్ బస్సులు తిరుగుతున్నాయనీ, హైదరాబాద్‌లోనే 115 బస్సులు ఉన్నాయని చెప్పారు. ఈ ఏడాదిలో హైదరాబాద్‌లో వెయ్యి విద్యుత్ బస్సులు, 2026 నాటికి మొత్తం 2,800 బస్సుల్ని తెస్తామనీ, 2030 నాటికి రాష్ట్రంలో మొత్తం విద్యుత్ బస్సులు తెస్తామని రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిందని వివరించారు. దీనివల్ల ఆర్టీసీ ప్రయివేటీకరణ పూర్తవుతుందనీ, అదే జరిగితే ప్రజలు, కార్మికులు తీవ్రమైన భారాలు మోయాల్సి ఉంటుందని హెచ్చరించారు. అందువల్ల అన్ని కార్మిక సంఘాల ప్రతినిధులు ఈ సదస్సులో పాల్గొని తమ అభిప్రాయాలు వెల్లడించాలని కోరారు.

షరతులతో 'భరోసా'!

(మొదటిపేజీ తరువాయి)

కట్టుబడి ఉందని పునరుద్ఘాటించారు.

గత తప్పొప్పులను, లొసుగులను బయట పెట్టాలి : దొంతి నర్సింహారెడ్డి ,. వ్యవసాయ విధాన విశ్లేషకులు

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇచ్చిన రైతు బంధు పథకం అమలులో జరిగిన తప్పొప్పులను, లొసుగులను కాంగ్రెస్ ప్రభుత్వం బయట పెట్టాలని దొంతి నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. జరిగిన అవినీతిని సరిదిద్దుతూ ఈ ప్రభుత్వం ఏం నిర్ణయం తీసుకున్నదో చెప్పాలన్నారు. రైతు భరోసా పారదర్శకంగా అమలు జరగాలంటే మేధావులు, రైతు సంఘాల నేతలతో ఓ కమిటీ నియమించాలని సూచించారు. సాగు భూమి లెక్కల్లో కచ్చితత్వం లేదని అభిప్రాయపడ్డారు. దానిపై అనేక సర్వేలు ఉన్నాయనీ, కొత్తగా అవసరం లేదని స్పష్టం చేశారు.

పెట్టుబడి సాయం అర్హులందరికీ దక్కాలి : సాగర్

(మొదటిపేజీ తరువాయి)

ఏర్పడిన కొత్తలో ఎకరాకు ఐదువేల చొప్పున రైతు ఖాతాల్లో జమ చేసిందని గుర్తు చేశారు.అయితే ఆ తర్వాత నుంచి ఇప్పటివరకు రైతు భరోసా జమ చేయకుండా కాలయాపన చేస్తున్నారని ప్రశ్నించారు. పెట్టుబడి సాయాన్ని ఎగ్గొట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు. కౌలు రైతులకు కూడా రైతు భరోసా ఇస్తామన్న ప్రభుత్వం...కనీసం వారిని గుర్తించేందుకు సిద్ధపడటం లేదన్నారు.

సీఎం రేవంత్ రైతు వ్యతిరేకి

- షరతులు లేకుండా రైతు భరోసా ఇవ్వాలి : బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవిత డిమాండ్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రైతు భరోసా పథకానికి షరతులు, నిబంధనలు విధిస్తూ సీఎం రేవంత్ రెడ్డి అన్నదాతకు సున్నం పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం హైదరాబాద్‌లోని తన నివాసంలో నిర్వహించిన బోధన్ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడుతూ రైతు భరోసా పథకం అమలుకు నిబంధనలను పెట్టడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. నిబంధనలను విధించకుండా బేషరతుగా రైతులందరికీ రైతు భరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎప్పుడూ లేని విధంగా ఈ పథకానికి దరఖాస్తులను స్వీకరించాలని ప్రభుత్వం నిర్ణయించడం కాలయాపనకేనని విమర్శిం చారు.. ఇప్పటికే ప్రజా పాలన పేరిట ప్రభుత్వం స్వీకరించిన దరఖాస్తులు ఏమయ్యాయని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఏర్పడిందనీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరడం ఖాయమని కవిత ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు తెలంగాణ ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయలేక సీఎం రాజకీయాలను పక్కదారి పట్టిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లో ఎండగట్టాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు కలసికట్టుగా పని చేసి పార్టీ విజయానికి కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ సతీమణి ఆయేషా ఫాతిమా, నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే గణేష్ గుప్తా, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లక్ష్మాపూర్ కస్టోడియం భూములపై పోరాటం

- సీపీఐ జిల్లా కార్యదర్శి టీఎం ఖాలిక్ అరెస్ట్
- నిరసనగా భూమి లేని నిరుపేదల శాంతియుత ర్యాలీ
- పేదలకు భూమిని కేటాయించాలి : సీపీఐ నాయకుల డిమాండ్



నవతెలంగాణ-గుమ్మడిదల

సంగారెడ్డి జిల్లా లక్ష్మాపూర్ కస్టోడియం భూములను స్థానిక నిరుపేదలకు ఇవ్వాలని వారం రోజులుగా సీపీఐ ఆధ్వర్యంలో భూ పోరాటం నిర్వహిస్తున్న సంగారెడ్డి జిల్లా కార్యదర్శి టీఎం ఖాలిక్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఆయన అరెస్టును నిరసిస్తూ సుమారు 400 మంది భూమిలేని చుట్టుపక్కల గ్రామాలైన నర్సాపూర్, శివంపేట తదితర ప్రాంతాల నుంచి తరలివచ్చిన నిరుపేదలు బొంతపల్లి మల్లన్న దేవాలయం నుంచి పోలీస్ స్టేషన్ వరకు సామరస్యంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి టీఎం ఖాలిక్ మాట్లాడుతూ.. స్థానికంగా ఉన్న నిరుపేదలకు కస్టోడియం భూములను కేటాయించాలని డిమాండ్ చేశారు. స్థానికేతరులు అక్రమంగా భూములను కబ్జా చేసుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే వారిని అక్రమ కబ్జాల నుంచి తరలిస్తూ స్థానికంగా ఉన్న భూమిలేని ప్రజలకు భూమిని కేటాయించాలని డిమాండ్ చేశారు. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం చిట్టచివరి గ్రామం కొత్తపల్లి పంచాయతీ పరిధిలోని లక్ష్మాపూర్ గ్రామంలో కస్టోడియం భూములు ఉన్నాయని తెలుసుకున్న సీపీఐ నాయకులు ఆయా చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు వాస్తవాలను తెలియజేయడంతో భూమిలేని నిరుపేదలు తమకు భూమి కావాలని పోరాటం చేస్తున్నారు.

అప్పుల ఊబిలో సిరిసిల్ల సెస్

- గత ప్రభుత్వం నిర్లక్ష్యం.. ప్రస్తుతమూ అదే పరిస్థితి
- సెస్‌కు రావాల్సింది రూ.127 కోట్లు.. మిగతా ప్రాంతాలకు రూ.110కోట్లు

రాష్టంలో మరమగ్గాల విద్యుత్ సబ్సిడీ బకాయి రూ.237కోట్లు



14ఏండ్లుగా పేరుకుపోయిన బకాయిలు

నవతెలంగాణ - సిరిసిల్ల

సహకార విద్యుత్ సరఫరా సంఘం (కో ఆపరేటివ్ ఎలక్ట్రిక్ సప్లయ్ సొసైటీ సెస్) అప్పుల ఊబిలోకి నెట్టివేయబడుతోంది. దానికి ఇవ్వాల్సిన బకాయిలను అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు చెల్లించకపోవడంతో ఏండ్ల తరబడి బకాయిలు పేరుకుపోతున్నాయి. 2010 నుంచి ఆ బకాయిలు విడుదల కాలేదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరమగ్గాలకు విద్యుత్ సబ్సిడీ 50శాతం ప్రకటించారు. అయితే, ఆ 50శాతం సబ్సిడీకి సంబంధించిన డబ్బులను ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వాలు సకాలంలో చెల్లించడం లేదు. దీని వల్ల ముఖ్యంగా రూ.237కోట్లు ప్రభుత్వం నుంచి ట్రాన్స్‌కోతోపాటు రాజన్న సిరిసిల్ల జిల్లా పరిధిలోని సహకార విద్యుత్ సరఫరా సంఘానికి రావాల్సి ఉంది.

గ్రామీణ విద్యుద్దీకరణలో అంతర్జాతీయ గుర్తింపు పొందిన సిరిసిల్ల సహకార విద్యుత్ సరఫరా సంఘం (కో ఆపరేటివ్ ఎలక్ట్రిక్ సప్లయ్ సొసైటీ సెస్)ను 1970 నవంబర్ 1న అప్పటి ఎమ్మెల్యే చెన్నమనేని రాజేశ్వరరావు ప్రారంభించారు. సభ్యుల వాటాధనంతో ఏర్పాటు చేసిన ఈ సంస్థను కలుపుకుని ఉమ్మడి రాష్ట్రంలో మొత్తం తొమ్మిది సహకార విద్యుత్ సరఫరా సంఘాలుండేవి. కాలక్రమేణా అవన్నీ బోర్డులో విలీనమయ్యాయి. జిల్లా ప్రజల కోరిక మేరకు 'సెస్'ను కాపాడుతూ వస్తున్నారు. పలుసార్లు అవార్డులు కూడా అందుకున్నది. సిరిసిల్ల సెస్ ట్రాన్స్‌కో నుంచి ఏటా దాదాపు 926మిలియన్ యూనిట్ల విద్యుత్ కొనుగోలు చేస్తోంది. ప్రారంభమైన కొత్తలో సిరిసిల్ల సెస్ ఆ ప్రాంతంలోని 46గ్రామాలకు 4720మంది వినియోగదారులకు విద్యుత్ సరఫరా చేసేది. ఇప్పుడు 2.72లక్షల మంది వినియోగదారులు సిరిసిల్ల సెస్ పరిధిలో ఉన్నారు. ప్రస్తుతం సెస్ పరిధిలో సిరిసిల్ల, వేములవాడ, చొప్పదండి, మానకొండూర్ నియోజకవర్గాలు ఉన్నాయి. 13 మండలాల్లోని 255 గ్రామ పంచాయతీల్లో సేవలందుతున్నాయి. 2014కు ముందు 2,32,5501 కనెక్షన్లు ఉండగా, ప్రస్తుతం 2,72,5501 ఉన్నాయి.

తెలంగాణ రాష్ట్రానికి రూ.237కోట్ల మరమగ్గాల సబ్సిడీ భారం

తెలంగాణ రాష్ట్రంలో మరమగ్గాల విద్యుత్ సబ్సిడీ భారం పెరిగిపోయింది. ఇప్పటివరకు రూ.237కోట్ల సబ్సిడీ డబ్బులు ప్రభుత్వం నుంచి రావాల్సి ఉంది. రాష్ట్రంలోనే అత్యధిక మరమగ్గాలు సిరిసిల్లలో ఉండగా.. అత్యధిక భారం కూడా సిరిసిల్ల సెస్‌పైనే పడింది. 2004 నుంచి 2009వరకు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మాత్రమే మరమగ్గాలకు 50శాతం విద్యుత్ సబ్సిడీ డబ్బులను కొంతమేర విడుదల చేసినట్టు తెలిసింది.ఆ తరువాత రోశయ్య ముఖ్యమంత్రి, కిరణ్ కుమార్‌రెడ్డి ముఖ్యమంత్రులుగా ఉన్న సమయంలో విద్యుత్ సబ్సిడీ డబ్బులు రాలేదన్న ఆరోపణలున్నాయి. 2014 నుంచి 2023 వరకు తెలంగాణ రాష్ట్ర సమితి ప్రభుత్వం పరిపాలన సాగించింది. అప్పటి ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు రాష్ట్రంలోని మరమగ్గాలకు సంబంధించిన 50శాతం విద్యుత్ సబ్సిడీ డబ్బులను ఇవ్వలేదు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా మరమగ్గాల 50శాతం విద్యుత్ సబ్సిడీ డబ్బులను మాత్రం ఇవ్వడం లేదు. 2010నుంచి ఇప్పటివరకు రాష్ట్రంలోని రూ.237కోట్ల మరమగ్గాల విద్యుత్ సబ్సిడీ డబ్బులు ప్రభుత్వం నుంచి రావాల్సి ఉంది. రాష్ట్రవ్యాప్తంగా 40,000మరమగ్గాలు ఉండగా, ఒక సిరిసిల్ల జిల్లాలోనే 30వేల మరమగ్గాలు ఉన్నాయి. సిరిసిల్ల ప్రాంతంలో ట్రాన్స్‌కో కాకుండా సెస్ ఉండటంతో దానికి రూ.97కోట్లు మరమగ్గాల విద్యుత్ సబ్సిడీ డబ్బులు రావాల్సి ఉండగా.. ఆ బకాయిలపై రూ.30కోట్ల వరకు సర్ చార్జీలు రావాల్సి ఉంది. అంటే ఒక్క సేస్ పరిధిలోనే రూ.127కోట్లు రావాల్సి ఉంది. సెస్ ట్రాన్స్‌కో నుంచి విద్యుత్ కొనుగోలు చేసి డబ్బులు చెల్లిస్తోంది.

అంతేకాకుండా విద్యుత్ బిల్లులు బకాయి పడితే సర్ చార్జీలు కూడా చెల్లిస్తున్నది. ప్రభుత్వాలు మాత్రం సెస్‌కు మరమగ్గాల 50శాతం విద్యుత్ సబ్సిడీ బకాయిలు చెల్లించడంలో వెనకడుగు వేస్తున్నాయి. దీంతో జిల్లాకు సంబంధించిన వినియోగదారుల డబ్బులతో నడుస్తున్న సెస్ అప్పుల ఊబిలో కూరుకుపోతున్నది. అలాగే, రూ.110కోట్లు రాష్ట్రంలోని మిగతా ప్రాంతాలకు మరమగ్గాల 50శాతం విద్యుత్ సబ్సిడీ బకాయిలు రావాల్సి ఉంది. గత ప్రభుత్వం చేసిన నిర్లక్ష్యంతోనే సెస్ అప్పుల ఊబిలో కూరుకుపోయిందని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వమైనా బకాయి ఉన్న మరమగ్గాల 50శాతం విద్యుత్ సబ్సిడీ డబ్బులను చెల్లించాలని కోరుతున్నారు.

సీతారాం ఏచూరిది విశిష్టమైన వ్యక్తిత్వం

ఆయన భావజాలాన్ని ముందుకు తీసుకెళ్లడమే నిజమైన నివాళి : సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు ఎండి సలీం



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

సీతారాం ఏచూరిది విశిష్టమైన వ్యక్తిత్వమని, ఏచూరి భావజాలాన్ని ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు మనమిచ్చే నిజమైన నివాళి అని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు ఎండి సలీం అన్నారు. పంజాబీ దినపత్రిక దేశ్ సేవక్ 29 ఏండ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా గురువారం భక్నా భవన్ ఆడిటోరియంలో సీపీఐ(ఎం) మాజీ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరికి అంకితం చేస్తూ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు ఎండి సలీం మాట్లాడుతూ సీతారాం ఏచూరి బహుముఖ వ్యక్తి అని అన్నారు. ఏచూరి ఒక రాజకీయ నాయకుడు మాత్రమే కాదని, కళ, సంస్కృతిపై అపారమైన జ్ఞానం కలిగి ఉన్నారని, సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలపై అద్భుతమైన రచనలు చేశారని అన్నారు. ఆయనొక ఆర్థికవేత్తని తెలిపారు. ఫాసిస్ట్ ఆర్‌ఎస్‌ఎస్ మార్గనిర్దేశం చేసిన మతోన్మాద బీజేపీకి వ్యతిరేకంగా ఐక్య ఫ్రంట్ అవసరమని అన్ని లౌకిక, ప్రజాస్వామ్య పార్టీలను ఒప్పించడంతో ఇండియా బ్లాక్‌ను నిర్మించడంలో ఆయన కీలకపాత్ర పోషించారని పేర్కొన్నారు. ఏచూరి అసాధారణమైన లక్షణాలతో కూడిన పార్లమెంటేరియన్ అని, ఆయనకు ఉత్తమ పార్లమెంటేరియన్ అవార్డు కూడా వచ్చిందని గుర్తు చేశారు. ఏచూరి తన ప్రత్యర్థితో కూడా సుదీర్ఘ చర్చలు జరిపే కళ, సామర్థ్యం కలిగిన నేతని, ఆయన మాట్లాడుతున్నప్పుడు ప్రతిపక్ష నేతలు కూడా శ్రద్ధగా వినేవారని తెలిపారు. సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు నీలోత్పల్ బసు ప్రసంగిస్తూ ఏచూరి గొప్ప మార్క్సిస్ట్ సిద్ధాంతకర్త, ఆలోచనాపరుడని అన్నారు. 1992లో ఆర్‌ఎస్‌ఎస్ సంస్థలు బాబ్రీ మసీదును కూల్చివేసిన నాటి పరిస్థితిని ఆయన ముందే ఊహించగలిగారని తెలిపారు. ఇది ఆర్‌ఎస్‌ఎస్ నుంచి పెద్ద సవాలు అని, ప్రజాస్వామ్యాన్ని, లౌకికవాదాన్ని కాపాడటం దేశ ప్రజల ముందున్న కర్తవ్యమని అన్నారు. అనంతరం కామ్రేడ్ సీతారాం ఏచూరికి అంకితం చేస్తూ క్యాలెండర్‌ను కూడా విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) పంజాబ్ రాష్ట్ర కార్యదర్శి సుఖ్విందర్ సింగ్ సెఖోన్, రాష్ట్ర మంత్రి లాల్‌చంద్ కటరుచక్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి బంట్ బ్రార్, ఎం.డి.దేశ్ సేవక్, శిరోమణి అకాలీదళ్ తాత్కాలిక అధ్యక్షుడు సర్దార్ బల్వీందర్ సింగ్ భుందర్, మాజీ పంజాబీ ట్రిబ్యూన్ ఎడిటర్ స్వరాజ్‌బీర్ సింగ్, జేఎన్‌యూటీఏ మాజీ అధ్యక్షుడు ప్రొఫెసర్ చమన్ లాల్, ఎఐపీఎస్ఓ ప్రధాన కార్యదర్శి హర్‌చంద్ సింగ్ బాత్ సభను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి సీపీఐ(ఎం) నేతలు మేజర్ సింగ్ బిఖివింద్, గురుదర్శన్ సింగ్ ఖాస్పూర్ అధ్యక్షత వహించారు. సీపీఐ(ఎం) నేత భూప్ చంద్ చన్నో ఈ కార్యక్రమాలను నిర్వహించారు.

ప్రయివేటు కాలేజీల సమస్యలు పరిష్కరించండి

- సీఎం రేవంత్‌రెడ్డికి టీపీజేఎంఏ అధ్యక్షులు గౌరి సతీశ్ విజ్ఞప్తి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని ప్రయివేటు జూనియర్ కాలేజీల్లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ ప్రయివేటు జూనియర్ కాలేజీ యాజమాన్యాల సంఘం (టీపీజేఎంఏ) ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని గురువారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు గౌరి సతీశ్, ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రయివేటు జూనియర్ కాలేజీ యాజమాన్యాలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. సీఎం కార్యదర్శి మాణిక్‌రాజ్, హోంశాఖ ముఖ్యకార్యదర్శి రవి గుప్తా, ఫైర్ సర్వీసెస్ డైరెక్టర్ జనరల్ నాగిరెడ్డితో పలు అంశాలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అడిగి తెలుసుకున్నారు. ఇంటర్ విద్యను బలోపేతం చేసేందుకు చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశించారనిగౌరి సతీశ్ తెలిపారు. ఈనెల ఆరున ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్యతో ప్రయివేటు జూనియర్ కాలేజీ యాజమాన్యాల సమావేశాన్ని ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. సమస్యలపై సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించారని తెలిపారు.

నేడు చేపల విక్రయ సంచార వాహనాలు ప్రారంభం

మంత్రి సీతక్క చేతుల మీదుగా మహిళా సంఘాల సభ్యులకు అందజేత

- తొలి విడతతో అందుబాటులోకి 25 వాహనాలు
- లబ్దిదారులకు లభించనున్న 60 శాతం సబ్సిడీ



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క చేతుల మీదుగా చేపల విక్రయ సంచార వాహనాలను శుక్రవారం ప్రజాభవన్ వేదికగా ప్రారంభించనున్నారు. సెర్ప్ సంస్థ ఆధ్వర్యంలో ఇందిరా మహిళా శక్తి పథకం కింద మహిళా సంఘాల సభ్యులకు ఆమె వీటిని అందజేయనున్నారు. తొలివిడతలో 25 వాహనాలు అందుబాటులోకి రానున్నాయి. ఇప్పటికే చేపల విక్రయంలో ఉన్న ఆసక్తి గల స్వయం సహాయక బృందాలను ఆయా జిల్లాల మత్స్య అధికారులు, డీఆర్‌డీఓలు, కలెక్టర్లు ఎంపిక చేశారు. పచ్చి చేపలతో పాటు చేపల వంటకాలను విక్రయించేలా చేపల విక్రయ సంచార వాహనాలను తయారు చేశారు. వాహనాల్లో చేపలు, వంటకాలు తయారీ చేసి మార్కెట్లు, రద్దీ ప్రాంతాల్లో విక్రయించే సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పించనున్నది. మొదటి దశలో జిల్లాకు ఒక వాహనం చొప్పున 32 వాహనాలు మంజూరు చేశారు. అందులో శుక్రవారం 25 వాహనాలను మంత్రి సీతక్క ప్రారంభించ నున్నారు. ఒక్కోవాహనం ఖరీదు రూ.10 లక్షలు. ఫ్యాబ్రి కేషన్‌తో కలిపితే రూ.10.38 లక్షలు. ప్రధానమంత్రి మత్స్య సమృద్ధి యోజన పథకంతో అనుసంధానం చేసిన ఈ పథకం ద్వారా లబ్దిదారులకు 60 శాతం సబ్సిడీ లభించనున్నది. మిగిలిన మొత్తాన్ని బ్యాంకుల ద్వారా వడ్డీ లేని రుణాల రూపంలో సెర్ప్ సమకూర్చనున్నది. మహిళా స్వయం సహాయక సంఘాల ఆర్థిక పురోగాభివృద్ధికి మొబైల్ ఫిష్ రిటైయిల్ అవుట్ లెట్స్ దోహదపడనున్నాయి.

నేడు జిల్లా సంక్షేమ అధికారులతో మంత్రి సీతక్క సమీక్ష

స్త్రీ,శిశుసంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ(సీతక్క) శుక్రవారం హైదరాబాద్‌లోని వెంగళరావునగర్‌లో గల మహిళా శిశు సంక్షేమ కమిషనరేట్‌లో జిల్లా సంక్షేమ అధికారులతో సమీక్ష నిర్వహించనున్నారు.అంగన్వాడీ కేంద్రాల పరిస్థితి, నూతన భవనాల నిర్మాణం, చిన్నారుల సంరక్షణ, విద్య, అంగన్‌వాడీ చిన్నారులకు యూనిఫాం పంపిణీ, అంగన్వాడీ కేంద్రాల్లో ఫర్నీచర్ సరఫరా, లబ్దిదారుల హాజరు, టేక్ హెూం రేషన్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చిన్నారుల ఎదుగుదల పర్యవేక్షణ, సరుకులు, వస్తువుల సరఫరా, మిషన్ శక్తి, మిషన్ వాత్సల్య తదితర అంశాలపై చర్చించే అవకాశముంది.

టెట్ పరీక్షలు ప్రారంభం

- తొలిరోజు ఉదయం 72.25 శాతం, మధ్యాహ్నం 75.68 శాతం హాజరు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) రాతపరీక్షలు గురువారం నుంచి ప్రశాంతంగా ప్రారంభమయ్యాయని పాఠశాల విద్యాశాఖ సంచాలకులు, టెట్ చైర్మెన్ ఈవి నరసింహారెడ్డి తెలిపారు. గురువారం ఉదయం మొదటి విడత సోషల్ స్టడీస్ తెలుగు మాధ్యమం పేపర్-2ను 49 కేంద్రాల్లో 12,815 మంది దరఖాస్తు చేయగా, 9,259 (72.25 శాతం) మంది అభ్యర్థులు హాజరయ్యారని పేర్కొన్నారు. 3,556 (27.75 శాతం) మంది గైర్హాజరయ్యారని తెలిపారు. మధ్యాహ్నం రెండో విడత సోషల్ స్టడీస్ తెలుగు మాధ్యమం పేపర్-2ను 52 కేంద్రాల్లో 12,734 మంది దరఖాస్తు చేస్తే, 9,637 (75.68 శాతం) మంది అభ్యర్థులు పరీక్ష రాశారని వివరించారు. 3,097 (24.32 శాతం) మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. ఈనెల 20 వరకు ఆన్‌లైన్‌లో కంప్యూటర్ ఆధారిత పరీక్ష విధానం (సీబీఆర్టీ)లో టెట్ రాతపరీక్షలు జరుగుతాయి.

వారు స్ఫూర్తిదాతలు

- గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అవసరంలో ఉన్న వారికి సాయం చేసేందుకు ముందుకొచ్చిన దాతలు స్ఫూర్తిదాతలని రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ అభినందించారు. గురువారం హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో ఆయన గవర్నర్ దత్తత గ్రామాల్లో శీతాకాల ఉపశమన సామాగ్రిని మోసుకెళ్తున్న నాలుగు వాహనాలను జెండా ఊపి ప్రారంభించారు.భగవాన్ బిర్సా ముండా (జనజాతీయ గౌరవ్ దివస్) 150వ జయంతిని పురస్కరించుకుని ఏడాది కాలం పాటు ఈ కార్యక్రమాలను కొనసాగించాలని నిర్ణయించారు. గిరిజన తెగల కోసం ది ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, అభయ్ ఫౌండేషన్, స్మైల్ ఫౌండేషన్ ఈ కార్యక్రమాన్ని సంయుక్తంగా చేపట్టాయి. ఈ సందర్భంగా గవర్నర్ స్వీకరించిన విరాళాలను పంపిణీ కోసం ఐఆర్సీఎస్ ప్రతినిధులకు అందజేశారు.

దీప్తి జీవాంజీకి అర్జున అవార్డు వికలాంగుల శక్తికి నిదర్శనం

- ముత్తినేని వీరయ్య

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

విశిష్ట క్రీడా పురస్కారం అర్జున అవార్డు 2024కు దీప్తి జీవాంజీ ఎంపిక కావటం వికలాంగుల శక్తికి నిదర్శనమని వికలాంగుల కో-ఆపరేటీవ్ కార్పొరేషన్ చైర్మెన్ ముత్తినేని వీరయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా దీప్తికి అభినందనలు తెలిపారు. పారాలింపిక్స్‌లో భారత్ తరఫున కాంస్య పతకం సాధించిన తెలంగాణ యువ అథ్లెట్, వరంగల్ జిల్లా ముద్దుబిడ్డ దీప్తి దేశ వ్యాప్తంగా ఉన్న వికలాంగులందరికీ గర్వకారణమని పేర్కొన్నారు. త్వరలోనే ఆమెకు ఘన సన్మానం చేస్తామని ప్రకటించారు. దీప్తిని పారా క్రీడాకారులు, క్రీడా లోకమంతా ఆదర్శంగా తీసుకుని భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించాలని సూచించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి ఆమెకు రూ. కోటి నగదు, 500 గజాల స్థలం, గ్రూప్ 2 ఉద్యోగం ప్రకటించారనీ, ఇందుకు రాష్ట్ర వికలాంగుల తరుపున ధన్యవాదాలు తెలిపారు.

కాంగ్రెస్ మోసపూరిత విధానాలపై పోరాడాలి

పార్టీ శ్రేణులకు కేటీఆర్ పిలుపు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



కాంగ్రెస్ మోసపూరిత విధానాలపైన, నిరంకుశ పాలనపై పోరాటం కొనసాగించాలని పార్టీ శ్రేణులకు బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. కొత్త సంవత్సరం సందర్భంగా గురువారం పార్టీ శ్రేణులకు ఆయన ప్రత్యేక సందేశమిచ్చారు. గతేడాది చేసిన పోరాటాలను నిరసనలను ప్రస్తావించారు. పార్టీ శ్రేణుల నిరంతర అలుపులేని పోరాటం వల్లనే కాంగ్రెస్ అవినీతిని, అరాచకాన్ని అడ్డుకోగలిగినట్టు చెప్పారు. గల్లీ నుంచి ఢిల్లీ వరకు కాంగ్రెస్ అరాచకాలను, అన్యాయాలను అవినీతిని ఎండగట్టామని తెలిపారు. ఏడాది పాటు ప్రజల పక్షాన నిలిచినట్టే అవినీతి, అరాచక కాంగ్రెస్‌ను గద్దె దింపేదాక పోరాటం సాగిద్దామన్నారు. బీఆర్‌ఎస్ తోబుట్టువుల్లారా.. అంటూ సందేశమిచ్చిన కేటీఆర్, గత ఏడాది కాలంగా ఈ కాంగ్రెస్ నిరంకుశ పాలనపై గులాబీ సైనికులందరూ కనబరిచిన పోరాట స్ఫూర్తికి పేరుపేరునా ప్రతి ఒక్కరికి శిరస్సువంచి సలాం చేస్తున్నా అన్నారు. గెలుపోటములతో నిమిత్తం లేకుండా.. క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణులు కనబరిచిన కదనోత్సాహం.. రాష్ట్ర స్థాయిలో పని చేసే నాయకత్వంలో కూడా మాటలకందని స్థాయిలో కొండంత స్ఫూర్తి నింపిందని తెలిపారు. అబద్ధాల పునాదులపై అధికారంలోకి వచ్చిన ఈ తుగ్లక్ పాలన వల్ల కష్టకాలంలో ఉన్న అన్ని వర్గాల పక్షాన అలుపులేని పోరాటం చేశారని అభినందించారు. రైతుల పక్షాన పోరాడి, నేతన్నల గొంతుకై నిలిచి, మహిళా సమస్యలపై గర్జించి, బడుగు బలహీనవర్గాల ప్రజల గళమయ్యారని గుర్తుచేశారు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల పక్షాన సమరభేరి మోగించి, నిరుద్యోగుల హక్కుల కోసం కాంగ్రెస్ సర్కారును నిలదీసి, ఎన్నికల్లో ఇచ్చిన గ్యారెంటీల గారడీని ప్రజాక్షేత్రంలో ఎండగట్టారని అభినందించారు.

"మూసీలో మూటలవేట" నుంచి లగచర్ల లడాయి" వరకూ.. అన్యాయం జరిగిన ప్రతిచోటా బాధితుల పక్షాన పోరాడి, రాష్ట్ర ప్రజల గుండెచప్పుడును అడుగుడుగునా ప్రతిధ్వనింపజేశారని ప్రశంసించారు. తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలు కాపాడేందుకు పార్టీ చేసిన పోరాటాలు.. చరిత్రపై చెరగని సంతకాలుగా నిలుస్తాయన్నారు.

బీఆర్‌ఎస్ చేసిన అలుపెరగని పోరాటాల వల్లే..అదానీ ఆశ జూపిన రూ.100 కోట్లను ప్రభుత్వం వెనక్కి ఇవ్వాల్సి వచ్చిందని గుర్తుచేశారు. లగచర్ల లడాయి.. యావత్ దేశం ముందు కాంగ్రెస్‌ను దోషిగా నిలబెట్టిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో అక్రమ కేసులు పెట్టినా.. ప్రభుత్వం ఎంత వేధించాలని చూసినా..మొక్కవోని ధైర్యంతో పార్టీ శ్రేణులు నిలబడ్డ తీరు అపూర్వం, అసాధారణం, చారిత్రాత్మకం అని కొనియాడారు.దశాబ్దాలపాటు కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణను, కుక్కలు చింపిన విస్తరిలా మార్చే కాంగ్రెస్ కుట్రలను,అడుగడుగునా ప్రశ్నిద్దాం, నిలదీద్దామని పిలుపునిచ్చారు. పార్టీకి పునాది రాళ్లు, బీఆర్‌ఎస్‌కు మూలస్తంభాలు పార్టీ శ్రేణులు అనీ, గులాబీ జెండాకు.. వెన్నుముక అన్నారు. పార్టీ తరపున నిలబడి.. కలబడే.. నేటి అలుపెరగని పోరాట యోధులే.. రేపటి తెలంగాణ రాజకీయ ముఖచిత్రంపై బీఆర్‌ఎస్ పక్షాన మెరిసే.. వజ్రాయుధాలు మారుతారని ఆకాంక్షించారు. ఏడాదిపాటు పోరాడిన వారందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

మున్నేరు దరి దాటకుండా..

ఖమ్మం, పాలేరుకు వరదల నుంచి విముక్తి

- కొనసాగుతున్న ఆర్‌సీసీ వాల్స్ నిర్మాణం
- పాత డిజైన్ ప్రకారమే మొదలైన పనులు
- నదికి ఇరువైపులా 17 కి.మీ గోడ
- 40 ఫీట్ల ఎత్తుతో కాంక్రీట్ వాల్స్
- నేడు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమీక్ష



నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

మున్నేరు ముంపు నుంచి ఖమ్మం, పాలేరు నియోజకవర్గాలను కాపాడేందుకు నదికి ఇరువైపులా ఆర్‌సీసీ వాల్స్ నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే.



గత రెండేండ్లుగా మున్నేరు ఉప్పొంగుతుండటంతో రెండు నియోజకవర్గాల్లో తీరని నష్టం జరుగుతుంది. 2023 జులైలో వచ్చిన వరదల కంటే గతేడాది సెప్టెంబర్ 1వ తేదీన సంభవించిన వరదలు తీవ్ర నష్టం చేశాయి. ఈ నేపథ్యంలో 1969 నుంచి 2024 సెప్టెంబర్‌లో వచ్చిన వరదలను దృష్టిలో ఉంచుకుని వాల్స్ నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. మున్నేరు ముంపునకు అవకాశం లేకుండా సరైన మార్గంలో ప్రవాహాన్ని నడిపించేందుకు అనుగుణమైన డిజైన్‌పై అధికారులు కసరత్తు చేశారు. గతేడాది వరదలకు మున్నేరు సామర్థ్యానికి మించి 3.12 లక్షల క్యూసెక్కుల నీరు రావడంతో ఖమ్మం నగరంతో పాటు ఖమ్మం రూరల్ మండలంలో పలు ఇండ్లు, నిర్మాణాలు, ఆస్తులు నీటమునిగాయి. జిల్లాకు చెందిన ఇరువురు మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న ఖమ్మం, పాలేరు నియోజకవర్గాల్లోనే ఎక్కువ నష్టం చోటుచేసుకుంది. కాబట్టి ఇద్దరు మంత్రులు ప్రతిష్టాత్మకంగా తీసుకొని గోడ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. అయితే డిజైన్ విషయంలో చోటుచేసుకున్న సందిగ్ధత కారణంగా ఆర్‌సీసీ వాల్స్ నిర్మాణ పనుల్లో కొంత ఆలస్యం చోటుచేసుకుంది. నెలకు రెండుసార్లు మున్నేరు గోడల నిర్మాణంపై సమీక్ష చేస్తామని రెవెన్యూ, విపత్తు నిర్వహణల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. దీనిలో భాగంగా శుక్రవారం ఖమ్మం కలెక్టరేట్‌లో సమీక్ష చేయనున్నారు.

పాత డిజైన్ ప్రకారమే మొదలైన పనులు..

పాత డిజైన్ ప్రకారమే పనులు మొదలయ్యాయి. గతేడాది సెప్టెంబర్ 1వ తేదీన మున్నేరు వరదలు 30 అడుగుల ఎత్తుకు పైగా వచ్చాయి. దాన్ని దృష్టిలో ఉంచుకొని గోడలను 40 ఫీట్ల ఎత్తుతో నిర్మించాలని నిర్ణయించారు. ఈ మేరకు నదికి ఇరువైపులా 8.500 కి.మీ మేర వాల్స్ నిర్మించనున్నారు. ఏటి మధ్య నుంచి గోడ నుంచి గోడకు 150 మీటర్లు ఉండేలా గతంలో డిజైన్ చేశారు. అయితే మొన్నటి వరదలను దృష్టిలో ఉంచుకొని దాన్ని 230 మీటర్లకు పైగా విస్తరించాలని భావించారు. కానీ అధిక మొత్తంలో ఇండ్లను కోల్పోతుండటంతో డిజైన్‌లో కొద్దిపాటి మార్పులు చేశారు.

ఏట్లో భారీగా రాళ్లుబోళ్లు ఉన్నాయి. వాటిని పూర్తిగా తొలగించి, రివర్ బెడ్ మొత్తాన్ని శుభ్రం చేసి ప్రవాహానికి అడ్డు తొలగించనున్నారు. ఏటిపై నిర్మించిన చెక్‌డ్యాంలను సైతం తొలగించనున్నారు. నదిపై ఉన్న బ్రిడ్జీలకు సైతం ఎలాంటి ఇబ్బంది లేకుండా ఉండేలా డిజైన్ రూపొందించారు. గోడల పొడవునా ఫ్లడ్ డ్రెయినేజీ, దాని పక్కన రోడ్డు వచ్చేలా డిజైన్ చేశారు. ఇప్పటికీ దాదాపు నెలరోజులుగా పనులు కొనసాగుతున్నాయి. పోలేపల్లి రెవెన్యూలో ఇప్పటికే 400 మీటర్ల వాల్ ఫౌండేషన్ పూర్తయింది. మిగిలిన చోట కూడా గోడ నిర్మాణానికి కావాల్సిన పునాదులు తీస్తున్నారు.

మంత్రి పొంగులేటితో కలెక్టర్ ఆర్‌సీసీ వాల్ నిర్మాణంపై చర్చ

డిసెంబర్ 24వ తేదీన మంత్రి పొంగులేటి హైదరాబాద్‌లో ఇరిగేషన్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. నెలకు రెండుసార్లు మున్నేరు ఆర్‌సీసీ వాల్ నిర్మాణంపై సమీక్షలు నిర్వహిస్తానని కూడా తెలిపారు. దీనిలో భాగంగా శుక్రవారం ఖమ్మం కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహిస్తారు. దీనికి ముందు గురువారం రాత్రి కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్‌తో మంత్రి ఈ అంశంపై చర్చించారు.

అధికారులతో కలెక్టర్ సమీక్ష

మంత్రితో భేటీకి ముందే ఆర్‌సీసీ వాల్ నిర్మాణంపై కలెక్టర్ అధికారులతో గురువారం సమీక్ష నిర్వహించారు. మున్నేరుకు ఇరువైపులా బఫర్‌జోన్, ఎఫ్‌టీఎల్, డిజైన్, గత రికార్డుల ప్రకారం అత్యధిక నీటి ప్రవాహ స్థాయి, ఎంత ప్రవాహానికి ఎంత ఎత్తులో ఆర్‌సీసీ వాల్ నిర్మించాలో చర్చించారు. రాబోయే వర్షాకాలం నాటికి నిర్మాణం పూర్తి చేయడానికి వీలవుతుందా? వచ్చే వర్షాకాలం నాటికి నిర్మాణం పూర్తికాకపోతే వరదల నియంత్రణకు ముందస్తు చర్యలు ఏం తీసుకోవాలి? అనే అంశాలపై చర్చించారు. బఫర్‌జోన్‌లో ఆక్రమణకు గురైన భూమి ఎంత? ఇంకా వాల్ నిర్మాణానికి ఎంత భూమి సేకరించాలో తెలుసుకున్నారు. అత్యధికంగా వరద ప్రవాహం ఉన్న సమయంలో మున్నేరు నదిలో 3.50 లక్షల క్యూసెక్కుల నీరు ప్రవహించింది. కాబట్టి వాల్స్ ఆ ఉధృతిని తట్టుకునేలా రూపొందించాలని నిర్ధారించారు. రికార్డుల ప్రకారం మున్నేరు నది 36 అడుగుల ఎత్తులో ప్రవహించింది కాబట్టి 40 ఫీట్ల ఎత్తుతో గోడల నిర్మాణం చేపడుతామని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. నేడు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులతో నిర్వహించే సమావేశంలో ఆర్‌సీసీ వాల్ పూర్తి డిజైన్‌పై స్పష్టత రానుంది.

సమగ్ర శిక్షా ఉద్యోగుల మహా ర్యాలీ

- తెలంగాణ సంస్కృతి ఉట్టిపడేలా వేషధారణలతో ప్రదర్శన
- కొనసాగుతున్న సమ్మె



నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా

సమగ్ర శిక్షా కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె చేస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా హనుమకొండ జిల్లా కేంద్రంలోని ఏకశిలా పార్క్ ధర్నా చౌక్ వద్ద 28 రోజులుగా సమగ్ర శిక్ష ఉద్యోగులు దీక్షలు చేస్తుండగా.. గురువారం కలెక్టరేట్ వద్దనున్న అమరవీరుల స్థూపానికి పూలమాలలు వేసి ఉద్యోగులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ఉద్యోగులు తెలంగాణ సంస్కృతి ఉట్టిపడేలా పోతురాజు, శివుడు, రాణి రుద్రమదేవి, గణపతి, భరతమాత, సమ్మక్క, సారలమ్మ తదితర వేషధారణలు ధరించి పాల్గొన్నారు.

అక్కడ నుంచి సాగిన ఈ ర్యాలీ.. డీఈవో కార్యాలయం వద్దకు రాగానే దాని ముందున్న ప్రజాకవి కాళోజీ విగ్రహానికి, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు టీపీసీసీ అధ్యక్షుని హోదాలో రేవంత్‌రెడ్డి హనుమకొండలో సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగాల క్రమబద్ధీకరణకు హామీ ఇచ్చారని, దాన్ని నిలబెట్టుకొని ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించేవరకూ సమ్మె విరమించేది లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ, వరంగల్ జిల్లాల అధ్యక్షులు ఎండీ షఫీ, డి.శ్రీధర్ ఆధ్వర్యంలో రెండు జిల్లాల ఉద్యోగులు 927 మందికి పైగా పాల్గొన్నారు.

ఉద్యమం కొనసాగడానికి కేంద్రం వైఖరే కారణం



- స్పష్టం చేసిన రైతులు
- కేంద్రం తీరుపై సుప్రీం ప్రశ్నల వర్షం...నోటీసులు జారీ

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

తమ ఆందోళన ఎంతకాలం కొనసాగుతుందనేది కేంద్రంపై ఆధారపడి ఉంటుందని రైతులు స్పష్టం చేశారు. రైతు నాయకుడు జగ్జీత్ సింగ్ దల్లేవాల్ నిరవధిక నిరాహార దీక్ష గురువారం 38వ రోజుకు చేరుకుంది. ఆయన ఆరోగ్యం రోజురోజుకు క్షీణిస్తోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైతుల కోసం తన జీవితాన్ని పణంగా పెట్టారని రైతు నేత అభిమన్యు కోహర్ పేర్కొన్నారు. ఖానౌరీ, శంభు సరిహద్దులో తమ ఆందోళన ఎంతకాలం కొనసాగించాలనేది కేంద్రం చేతుల్లో ఉందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం తమ సమస్యలను నెరవేరిస్తే, ఆందోళన నిలిపివేస్తారని తెలిపారు. పార్లమెంటరీ ప్యానెల్ ఎంఎస్‌పికి చట్టపరమైన హామీని సిఫారసు చేసినందున తమ డిమాండ్‌లను ఆమోదించడంలో ఎటువంటి అవాంతరాలు ఉండవని ఆయన నొక్కి చెప్పారు. కేంద్రం రైతులతో ఎందుకు చర్చించడటం లేదని సుప్రీంకోర్టు ప్రశ్నించిందని గుర్తు చేశారు. రాజ్యాంగ సంస్థలను ఎల్లప్పుడూ గౌరవిస్తామని అన్నారు. దల్లేవాల్ ఆరోగ్యం విషమంగా ఉందని, కొన్ని నిమిషాలపాటు స్పృహ తప్పి పడిపోయారని, అయినప్పటికీ ఉన్నత న్యాయస్థానంలో విచారణకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కనెక్ట్ అవ్వడానికి ముందుకొచ్చారని తెలిపారు.

"ఎంఎస్పీకి చట్టపరమైన హామీని పార్లమెంటరీ ప్యానెల్ కూడా సిఫారసు చేసింది. దానిని అమలు చేయాలని సుప్రీంకోర్టు కేంద్రానికి ఆదేశాలు ఇవ్వాలని మాత్రమే మేము చెప్పాం" అని ఆయన అన్నారు. రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరుతున్నామని తెలిపారు. ఈ నెల 4న ఖనౌరీలో రైతుల దర్శనం పేరుతో భారీ సభను నిర్వహించనున్నట్టు తెలిపారు. ఆ సభలో దల్లేవాల్ ఒక ముఖ్యమైన సందేశాన్ని ఇస్తారని కోహర్ తెలిపారు. ఎస్కేఎం, కిసాన్ మజ్దూర్ మోర్చా ఆధ్వర్యంలో ఉన్న రైతులు ఢిల్లీలో చేపట్టే మార్చ్‌ను భద్రతా దళాలు అడ్డుకున్న తరువాత, పంజాబ్, హర్యానా మధ్య శంభు, ఖనౌరీ సరిహద్దు పాయింట్ల వద్ద క్యాంప్ చేస్తున్నారు.

దల్లేవాల్ దీక్షను భగ్నం చేయాలని ఎప్పుడూ ఆదేశించలేదు : సుప్రీం కోర్టు

పంజాబ్ ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు నిలదీసింది. దల్లేవాల్ నిరాహార దీక్షను భగ్నం చేయడానికి ప్రయత్నిస్తున్నామని పంజాబ్ అధికారులు, కొంతమంది రైతు నాయకులు మీడియాలో తప్పుడు అభిప్రాయాన్ని ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేసింది. దల్లేవాల్ నిరసనను విచ్ఛిన్నం చేయమని కోర్టు ఎప్పుడూ ఆదేశించలేదని, ఆయన ఆరోగ్యం గురించి మాత్రమే ఆందోళన చెందుతుందని సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సూర్య కాంత్, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ధర్మాసనం గురువారం పేర్కొంది. ఆయనకి అత్యవసరంగా వైద్య సహాయం అందించాలని కోరుకుంటున్నట్టు తెలిపింది.

కేంద్ర ప్రభుత్వానికి సుప్రీం నోటీసులు

పంటలపై కనీస మద్దతు ధర (ఎంఎస్పీ)కు చట్టపరమైన హామీతో సహా వాగ్దానాలను పాటించేలా కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ దల్లెవాల్ తరపున దాఖలైన తాజా పిటిషన్‌పై సుప్రీంకోర్టు కేంద్రానికి నోటీసులు జారీ చేసింది.

కేంద్రానికి ప్రశ్నల వర్షం

"రైతుల నిజమైన మనోవేదనలను పరిగణనలోకి తీసుకుంటామని ప్రభుత్వం ఎందుకు ప్రకటన చేయలేకపోతుంది. మీ తలుపులు తెరిచి ఉన్నాయని ఎందుకు ప్రకటన చేయలేకపోయింది?" అని ఈ కేసులో హర్యానా ప్రభుత్వం తరపున వాదనలు వినిపిస్తున్న సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాను న్యాయమూర్తి జస్టిస్ భుయాన్ ప్రశ్నించారు. దల్లేవాల్ ఆరోగ్య పరిస్థితి రోజురోజుకు ప్రమాదకరంగా మారుతున్నదని, ఈ సమస్య మరింత సున్నితంగా మారుతోందని జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. సమయం మించిపోతోందని పేర్కొన్నారు. మెహతా సమాధానం ఇస్తూ కేంద్రానికి అనేక అంశాలు ఉన్నాయని, ప్రస్తుతం కోర్టులో ఉన్న సమస్య దల్లేవాల్ ఆరోగ్యం అని, కేంద్రం "ప్రతి రైతు పట్ల శ్రద్ధ వహిస్తుందని చెప్పుకొచ్చారు. దల్లేవాల్ "విలువైన నాయకుడని" జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. ఆయన ఏ రాజకీయ భావజాలానికి పొంతన లేకుండా రైతుల ప్రయోజనాలకు అంకితమయ్యారన్నారు. పంజాబ్ అడ్వకేట్ జనరల్ గుర్మీందర్ సింగ్ వాదనలు వినిపిస్తూ రాష్ట్రప్రభుత్వం నిర్లక్ష్యంగా లేదని, వైద్య సహాయాన్ని అంగీకరించేలా దల్లేవాల్‌ను ఒప్పించేందుకు తమ వంతు కృషి చేస్తోందని చెప్పారు. దల్లేవాల్‌ను ఆస్పత్రిలో చేర్పేందుకు పంజాబ్ ప్రభుత్వానికి మరో మూడు రోజుల గడువిచ్చింది. తదుపరి విచారణ జనవరి 6కు వాయిదా వేసింది.

దల్లేవాల్‌కు ఇతర రాష్ట్రాల నుంచి మద్దతు

దల్లేవాల్‌కు మద్దతుగా ఇతర రాష్ట్రాల నుంచి రైతు నాయకులు ఖనౌరీకి చేరుకున్నారు. రైతు నాయకుడు లఖ్వీందర్ సింగ్ ఔలాఖ్ మాట్లాడుతూ దల్లేవాల్‌కు మద్దతు ఇవ్వడానికి ఇతర రాష్ట్రాల నుంచి రైతు నేతలు వస్తున్నారని తెలిపారు. దల్లేవాల్ నిరాహార దీక్షకు రైతులంతా మద్దతు తెలుపుతున్నారని తమిళనాడు రైతు సంఘాలకు చెందిన పి.ఆర్.పాండియన్ అన్నారు.

చర్చలు జరిపి రైతుల డిమాండ్లను నెరవేర్చేందుకు కేంద్రం నిరాకరించడం తమిళనాడు రైతులను వేదనకు గురిచేస్తోందని పేర్కొన్నారు. కర్ణాటకకు చెందిన మరో నాయకుడు శాంతకుమార్ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య ఉద్యమం తరహాలో పంజాబ్ రైతులు తమ ఆందోళనలు చేపడుతున్నారని అన్నారు. వెంటనే సమస్యను పరిష్కరించాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు.

భూభారతితో రెవెన్యూ సేవలు మెరుగు

- రెవెన్యూ సంఘాలతో సీఎం రేవంత్ టీజీటీఏ, టీజీఆర్ఎస్ఏ డైరీల ఆవిష్కరణ
- తహసీల్దార్ల బదిలీలు చేపట్టాలని సీఎంకు లచ్చిరెడ్డి విజ్ఞప్తి

చట్టం అమలు బాధ్యత అధికారులదే



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

కొత్త ఆర్వోఆర్ చట్టంగా భూభారతి త్వరలోనే అమల్లోకి రానుందని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ప్రకటించారు. భూభారతి రాకతో రాష్ట్రంలోని రైతులకు మెరుగైన రెవెన్యూ సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. కొత్త చట్టంతోనే భూ సమస్యలకు సైతం పరిష్కారం లభిస్తుందని చెప్పారు. బుధవారం తెలంగాణ తహసీల్దార్స్ అసోసియేషన్(టీజీటీఏ), తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్(టీజీఆర్ఎస్ఏ) నూతన సంవత్సర డైరీల ఆవిష్కరణ సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా సచివాలయంలో జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ ఛైర్మెన్ డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వి.లచ్చిరెడ్డితో సీఎం రేవంత్‌రెడ్డి కొత్త ఆర్వోఆర్ చట్టం, దానిలోని ప్రధాన అంశాల గురించి చర్చించారు. ధరణితో రాష్ట్రంలో భూ సమస్యలు పెరిగాయని సీఎం అభిప్రాయపడ్డారు. రైతులు, ప్రజలకు రెవెన్యూ సేవలను వేగంగా, సులభంగా అందించే లక్ష్యంతోనే భూభారతిని తీసుకొచ్చినట్టు వివరించారు. జిల్లా స్థాయిలోనే అన్ని రకాల భూ సమస్యలకు పరిష్కారం లభించేలా కొత్త చట్టం ఉందన్నారు. ఇదే కాకుండా రెవెన్యూ అధికారులకు సైతం వివిధ స్థాయిల్లో అధికారాలను కల్పించిన విషయాన్ని గుర్తు చేశారు. కొత్త రెవెన్యూ చట్టాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడమే కాకుండా సమర్థవంతంగా అమలు చేయాల్సిన బాధ్యత కూడా రెవెన్యూ అధికారులు, ఉద్యోగులదేనని వ్యాఖ్యానించారు. భూభారతిలో కల్పించిన అధికారాల వికేంద్రీకరణతో క్షేత్రస్థాయిలోనే రైతులకు కావాల్సిన రెవెన్యూ సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. ఇదే కాకుండా ప్రతి రెవెన్యూ గ్రామంలోనూ ఒక రెవెన్యూ అధికారి ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నట్టు చెప్పారు.

తహసీల్దార్ల బదిలీలను చేపట్టండి:వి.లచ్చిరెడ్డి

రాష్ట్రంలో ఎన్నికల సమయంలో తహసీల్దార్లను వివిధ జిల్లాలకు బదిలీ చేశారని వి.లచ్చిరెడ్డి సీఎం రేవంత్‌రెడ్డికి దృష్టికి తెచ్చారు. అప్పుడు బదిలీ అయిన తహసీల్దార్లను ఇప్పటి వరకు కూడా సొంత జిల్లాలకు మళ్లీ తీసుకురాలేదని గుర్తు చేశారు. దీంతో వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులను సీఎంకు వివరించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన సీఎం సాధ్యమైనంత త్వరలోనే బదిలీల ప్రక్రియ జరిగేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ, తెలంగాణ తహసీల్దార్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.రాములు, రమేష్ పాక, సెక్రెటరీ జనరల్ పూల్‌సింగ్ చౌహాన్, శ్రీనివాసులు, తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు బాణాల రాంరెడ్డి, వి.భిక్షం, మహిళా అధ్యక్షురాలు సుజాత చౌహాన్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

ఫోన్ ట్యాపింగ్ కేసులో దర్యాప్తును అడ్డుకోలేం సుప్రీంకోర్టు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

తెలంగాణ రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణను అడ్డుకోలేమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అయితే దర్యాప్తు సుదీర్ఘకాలం కొనసాగడం సరికాదని, దర్యాప్తు కొనసాగింపు పేరుతో పిటిషనర్‌కు ఉన్న స్వేచ్ఛను తాము అడ్డుకోలేమని వ్యాఖ్యానించింది. ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక నిందితుడిగా అభియోగాలు ఉన్న మేకల తిరుపతన్న(అప్పటి అడిషనల్ ఎస్పీ)కు బెయిల్ మంజూరు చేయాలని రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించగా తిరస్కరించింది. దీంతో హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ గతేడాది అక్టోబర్ 20న ఆయన సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. సుదీర్ఘకాలంగా జైలులో ఉంటున్నానని, తనకు బెయిల్ మంజూరు చేయాలని పిటిషన్‌లో పొందుపరిచారు. గతంలో ఈ పిటిషన్ పై విచారణ చేపట్టిన సుప్రీం ధర్మాసనం రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణలోపు కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. మరోసారి ఈ పిటిషన్ జస్టిస్ బివి నాగరత్నం, జస్టిస్ ఎస్ కోటీశ్వర్ సింగ్‌ల ధర్మాసనం ముందుకు వచ్చింది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ దవే, మోహిత్ రావు, రాష్ట్ర ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా హాజరయ్యారు. ఈ సందర్భంగా సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కౌంటర్ పిటిషన్ దాఖలు చేసినట్టు ప్రభుత్వ తరపు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. ఈ కేసులో తిరుపతన్న ప్రధాన నిందితుడిగా ఉన్నారని వాదించారు. ఫోన్ ట్యాపింగ్‌తో పాటు ఆధారాలు చెరిపి వేయడంలోనూ తిరుపతన్న కీలకంగా వ్యవహరించారని, 2023 డిసెంబర్ 3న ఎన్నికల ఫలితాలు రాగానే ఆధారాలు ధ్వంసం చేశారని ధర్మాసనానికి లూథ్రా వివరించారు. అప్పుడు అధికారంలో ఉన్న రాజకీయ నేతల ఆదేశాల మేరకు అందరి ఫోన్లను ట్యాప్ చేశారని, హైకోర్టు జడ్జిల ఫోన్లు కూడా ఇందులో ఉన్నాయని అన్నారు. ఈ వాదనలపై పిటిషనర్ తరపు న్యాయవాది దుష్యంత్ దవే అభ్యంతరం తెలిపారు. తిరుపతన్న గత 9 నెలలుగా జైలులో ఉన్నారని, ఆయన పాత్రపై ఇప్పటికే చార్జిషీట్ దాఖలైందని దవే ధర్మాసనానికి నివేదించారు. అయినప్పటికీ తిరుపతన్నను జైల్‌లో ఉంచడం సరికాదని, బెయిల్ పొందడం ఆయన హక్కు అని వాదించారు. తప్పనిసరైతేనే జైలులో ఉంచాలని సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన తీర్పులను ప్రస్తావించారు. ఈ సందర్భంగా ద్విసభ్య ధర్మాసనం పలు కీలక వ్యాఖ్యలు చేసింది. 'ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో తిరుపతన్న పాత్రపై దర్యాప్తు సుదీర్ఘకాలం కొనసాగడం సరికాదు. దర్యాప్తు పేరుతో పిటిషనర్ స్వేచ్ఛను అడ్డుకోలేరు. విచారణకు ఇంకా ఎంత సమయం పడుతుందో రాతపూర్వకంగా తమకు ఇవ్వండి' అని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. అలాగే తిరుపతన్న పాత్రపై ఇప్పటి వరకు చేసిన దర్యాప్తు సుప్రీంకోర్టుకు సమర్పించాలని స్పష్టం చేసింది. దీనిపై లూథ్రా స్పందిస్తూ... విచారణ పూర్తయ్యేందుకు మరో నాలుగు నెలల సమయం పడుతుందని, అఫిడవిట్ దాఖలుకు సమయం కావాలని కోరారు. ఈ వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం తదుపరి విచారణను 27 కు వాయిదా వేస్తున్నట్టు వెల్లడించింది.

'కుడా' పరిధిలో ఐదు మండలాలు

- ఆమోదముద్రకు ఎదురుచూపులు



సర్కార్‌కు చేరిన ప్రతిపాదనలు

నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(కుడా) ప్రస్తుతం వరంగల్, హన్మకొండ, జనగామ జిల్లాల్లోని 19 మండలాల పరిధిలో 181 గ్రామాలకు విస్తరించి ఉంది. కాగా, మరో 5మండలాలను విలీనం చేసుకోవడానికి సర్కార్‌కు ప్రతిపాదనలను సమర్పించి రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం కోసం ఎదురుచూస్తోంది. ఆమోదముద్ర లభిస్తే పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడానికి ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతున్నామని అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే పలు మండలాల్లో రియల్ ఎస్టేట్ వెంచర్‌లను ఏర్పాటు చేసి కుడా బహిరంగవేలం నిర్వహిస్తోంది.

1981లో ఏర్పడిన 'కుడా' పరిధిని పెంచడానికి అధికారయంత్రాంగం రంగం సిద్ధం చేసింది. పరకాల, వర్ధన్నపేట, నర్సంపేట, పర్వతగిరి, జఫర్‌గఢ్ మండలాలను పూర్తిగా విలీనం చేయడానికి 'కుడా' అధికారులు ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించారు. ప్రస్తుతం 'కుడా' పరిధిలో 19 మండలాలు ఉన్నాయి.

అవి, హన్మకొండ జిల్లాలో 11 మండలాలు, వరంగల్ జిల్లాలో 5, జనగామ జిల్లాలో 3 మండలాలున్నాయి. హన్మకొండ జిల్లాకు చెందిన భీమదేవరపల్లి, ధర్మసాగర్, ఎల్కతుర్తి, హన్మకొండ, హసన్‌పర్తి, ఆత్మకూరు, ఐనవోలు, దామెర, కమలాపూర్, కాజీపేట, వేలేర్ మండలాలున్నాయి. వరంగల్ జిల్లాకు చెందిన వరంగల్, ఖిలావరంగల్, గీసుగొండ, సంగెం, వర్ధన్నపేట మండలాలున్నాయి. జనగామ జిల్లాకు చెందిన చిల్పూర్, స్టేషన్‌ఘన్‌పూర్, జఫర్‌గఢ్ మండలాలున్నాయి. 181 గ్రామాలు 1,805 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం ప్రస్తుతం 'కుడా' పరిధిలో ఉంది.

వర్ధన్నపేట, జఫర్‌గఢ్ మండలాల్లో ప్రస్తుతం కొన్ని గ్రామాలు మాత్రమే ఉన్నాయి. ఈ మండలాలను పూర్తిగా విలీనం చేయడానికి ప్రతిపాదనలను సమర్పిం చారు. కొత్తగా పరకాల, నర్సంపేట, పర్వతగిరి మండలాలను విలీనం చేయాలని ప్రతిపాదించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం 'కుడా' మాస్టర్‌ప్లాన్ 2041లో భాగంగా కొత్తగా మండలాల విలీనానికి ప్రతిపాదనలు పంపినట్టు అధికారులు తెలిపారు. తాజా ప్రతిపాదనలకు ఆమోదముద్ర పడితే.. పరకాల, వర్ధన్నపేట, నర్సంపేట మండలాల్లోనూ రియల్‌ఎస్టేట్ నిర్వహించేందుకు 'కుడా' సమాయత్తమవుతోంది.

రాష్ట్రంలో 1.66 కోట్ల మందికి స్క్రీనింగ్

- వీరంతా 30 ఏండ్లు దాటిన వారే
- 22.94 లక్షల మందికి బీపీ
- 11.9 లక్షల మందికి దయాబెటిక్
- ఆస్పత్రులకు ఎన్సీడీ క్లినిక్‌ల అనుసంధానం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నాన్ కమ్యూనికేబుల్ డిసీజెస్ (ఎన్సీడీ)కి సంబంధించి రాష్ట్ర వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వేలో 30 ఏండ్లు దాటిన 1.66 కోట్ల మందికి స్క్రీనింగ్ నిర్వహించారు. ఈ నేపథ్యంలో గురువారం వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆ శాఖ ఉన్నతాధికారులతో హైదరాబాద్ కోఠిలోని టీజీఎంఐడీసీ కార్యాలయంలో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సర్వే పూర్తయిన వారిలో 22.94 లక్షల మందికి బీపీ, 11.9 లక్షల మందికి మధుమేహం ఉన్నట్టు బయటపడిందని తెలిపారు. ఎన్సీడీ వ్యాధిగ్రస్తుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో వారికి అందుబాటు లో ఉచిత వైద్యం అందించేందుకు జిల్లాల్లో ఇది వరకే ఎన్సీడీ క్లినిక్‌లను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. గ్రామాలు, మండలాల వారీగా రోగుల జాబితాను తయారు చేసి, ఆస్పత్రులకు, ఎన్‌సీడీ క్లినిక్కులకు అనుసంధానం చేయాలని మంత్రి ఆదేశించారు. రోగులు రెగ్యులర్‌గా మందులు తీసుకునేలా ఫాలోఅప్ చేయాలని సూచించారు. బీపీ, షుగర్ వంటి దీర్ఘకాలిక రోగాల బారిన పడ్డ ప్రజలకు జాగ్రత్తలు సూచించడంతో పాటు, జీవనశైలిలో చేసుకోవాల్సిన మార్పులపై వివరించాలని కోరారు. జాగ్రత్తలు తీసుకోకపోతే ఎదురయ్యే పరిణామాల పట్ల వారిని అప్రమత్తం చేయాలన్నారు. అవగాహన కల్పించేందుకు మొబైల్‌ను ఉపయోగించుకోవాలనీ, సమాచారం కూడా ఇవ్వాలని చెప్పారు.

గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకూ పేషెంట్ల జాబితాను రూపొందించాలన్నారు. ఎన్‌సీడీ క్లినిక్‌లలో అందే వైద్యసేవల వివరాలను పేషెంట్లకు తెలియజేయాలని కోరారు. బీపీ, షుగర్ పేషెంట్లు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రెగ్యులర్‌గా అవేర్‌నెస్ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. మొబైల్ ద్వారా పేషెంట్లకు అవేర్‌నెస్ కల్పించడానికి, సమాచారం ఇవ్వడం కోసం చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్‌సీడీ సర్వేను కొనసాగించాలని సూచించారు. కొత్తగా నమోదైన పేషెంట్ల వివరాలను, ఎప్పటికప్పుడు లిస్ట్‌లో అప్‌డేట్ చేయాలని మంత్రి కోరారు. ప్రభుత్వ దవాఖాన్లలో ఎక్విప్‌మెంట్, మెడిసిన్, డాక్టర్లు, సిబ్బంది హాజరు, తదితర అంశాలపై మంత్రి ఆరా తీశారు. ఈ సమావేశంలో హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్, టీజీఎంఎస్ఐడీసీ ఎండీ హేమంత్, డీఎంఈ వాణి, టీవీవీపీ కమిషనర్ అజయ్ కుమార్, డీహెచ్ రవీందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో వేల కోట్ల కుంభకోణాలు

- మంత్రుల హస్తాన్ని ఆధారాలతో సహా చూపిస్తా
- రెండ్రోజుల్లో ప్రభుత్వ అవినీతిని బయటపెడుతా
- రూ. 1,38,117 కోట్ల అప్పు తెచ్చి ఎవరికిచ్చారు? : బీజేపీ ఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన ఏడాది కాలంలో వేల కోట్ల రూపాయల అవినీతి చోటుచేసుకున్నదనీ, దాంట్లో మంత్రుల హస్తాన్ని ఆధారాలతో సహా చూపిస్తానని బీజేపీ ఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. రెండు రోజుల్లో ప్రభుత్వ అవినీతిని బయటపెడుతానని ప్రకటించారు. ఏడాది కాలంలో రూ.1,38,117 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం అప్పుగా తెచ్చిందనీ, అందులో రుణమాఫీకి కేటాయించింది రూ.20 వేల కోట్లు మాత్రమేననీ, మిగతా 1,18,000 కోట్ల రూపాయలను ప్రభుత్వం ఏం చేసిందని ప్రశ్నించారు. గుత్తేదారులకు లబ్ది చేకూర్చేందుకు పేదలను ఇబ్బందులకు గురిచేస్తారా? అని అడిగారు. గురువారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రోజు రూ.354 కోట్లు, గంటకు రూ.14.70 కోట్ల అప్పు చేస్తున్నదని వివరించారు. ఎఫ్ఆర్‌బీఎమ్ పరిధి దాటి అప్పులు చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తోందని విమర్శించారు. రూ.30 వేల కోట్ల కోసం 400 ఎకరాల భూమిని అప్పు తనఖా పెట్టిందని విమర్శించారు.

మరో రూ. 30 వేల కోట్ల కోసం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నదనీ, బాండ్ల రూపంలో మరో రూ.30 వేల కోట్ల అప్పులు తేవాలని చూస్తోందని వివరించారు. ఇందిరమ్మ ఇండ్ల కోసం 80 లక్షల దరఖాస్తులు అందాయనీ, వాటికి సంబంధించి విధివిధానాలు ఏమైనా రూపొందించారా? అని ప్రశ్నించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సంక్రాంతి వరకు 4 లక్షల మందికి ఇండ్లు ఇస్తామనటం ఎంత వరకు సాధ్యమని నిలదీశారు. రుణమాఫీ కాని రైతులకు మాఫీ చేయడంపై క్యాబినెట్‌లో నిర్ణయం తీసుకోవాలని కోరారు. రైతు భరోసాకు సంబంధించి మూడు రోజులపాటు దరఖాస్తులు తీసుకుంటామని కాంగ్రెస్ చెప్పడం మోసం చేయడమేనని విమర్శించారు. రబీసీజన్‌లోనైనా రైతు భరోసా ఇస్తారా? అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రైతు కూలీలకు రూ.12 వేలు ఇస్తామని ఎందుకివ్వడం లేదని అడిగారు. రైతు భరోసాపై కమిటీ ఏర్పాటు చేసి 15 రోజుల్లో నివేదిక ఇస్తామన్నారనీ, కమిటీ వేసి ఐదు నెలలు దాటినా ఉలుకూపలుకూ లేదని విమర్శించారు. క్యాబినెట్‌లో రైతు భరోసాపై నిర్ణయం తీసుకోవాలని కోరారు. కౌలు రైతులకు రూ.12 వేలు ఇవ్వకుండా ఎగ్గొట్టాలనే ఆలోచనలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని విమర్శించారు. రాష్ట్రంలోని కౌలు రైతులను గుర్తించి వారికి ప్రభుత్వం ఐడీ కార్డులివ్వాలని డిమాండ్ చేశారు.

సీఎంను కలిసిన చిగిరింత దంపతులు



నవతెలంగాణ-బడంగ్ పేట్

సీఎం రేవంత్ రెడ్డిని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ చిగిరింత పారిజాత నరసింహా రెడ్డి దంపతులు గురువారం జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. తర్వాత శాలువాతో ఘనంగా సత్కరించి.. పుష్పగుచ్ఛం అందజేశారు. మహేశ్వరం నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు బోయపల్లి రాఘవేందర్ రెడ్డిలతో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి పుట్టినరోజు సందర్భంగా సీఎం ఆశీర్వాదం తీసుకున్నారు.

అండర్ 19లో జాతీయ స్థాయికి అర్హత సాధించిన సుధీర్ ఫౌండేషన్ విద్యార్థి

నవతెలంగాణ-హయత్‌నగర్



అండర్ 19 లాంగ్ జంప్‌లో జాతీయ స్థాయికి అర్హత సాధించిన సుధీర్ ఫౌండేషన్ విద్యార్థి అని కోచ్ వినోద్ తెలిపారు. గత నెలలో జింఖానా గ్రౌండ్‌లో నిర్వహించిన 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అథ్లెటిక్స్ అండర్19 రాష్ట్ర స్థాయిలో హయత్ నగర్‌లో ఉన్న సుధీర్ ఫౌండేషన్‌లో ఉంటూ అకాడమీ స్పోర్ట్స్‌లో శిక్షణ పొంది లాంగ్ జంప్ విభాగంలో రజతం సాధించినట్లు తెలిపారు.

స్ట్రోమ్ వాటర్ డ్రెయిన్ పనులకు శంకుస్థాపన



కార్పొరేటర్ అరుణాసురేంద్రనాథ్ యాదవ్

నవతెలంగాణ -నాగోల్

నాగోల్ డివిజన్ పరిధిలోని శ్రీ ఇంద్రప్రస్థ కాలనీ రోడ్ నెంబర్-7 నుండి బృందావన్ కాలనీ వరకు రూ.30లక్షల వ్యయంతో చేపట్టిన ఆర్‌సిసి పైప్ లైన్ 900 ఎంఎండయా స్ట్రోమ్ వాటర్ డ్రెయిన్ పనులకు గురువారం నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణా సురేందర్ నాథ్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ స్టోమ్ వాటర్ డ్రెన్ లైన్లు లెవెల్స్ అన్ని చూసుకుని వేయాలని సూచించారు. కాలనీ వాసులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, వర్షాకాలం రాకముందే తొందరగా పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇంద్రప్రస్థ కాలనీ ప్రెసిడెంట్ గాయత్రి, జనరల్ సెక్రటరీ కాలం శెట్టి హరిబాబు, కాలంశెట్టి లయ, బృందావన్ కాలనీ ప్రెసిడెంట్ సాయిబాబా, గోపాల్, నారాయణ రెడ్డి, రాజేశ్వరి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు చీరలు పంపిణీ

మాజీ ఎమ్మెల్యే కిచ్చేన్నగారి లక్ష్మారెడ్డి



నవతెలంగాణ-ఎల్బీనగర్

మహేశ్వరం నియోజకవర్గం సరూర్‌నగర్ డివిజన్ డాక్టర్స్ కాలనీ కమ్యూనిటీ హాల్లో రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి వక్కలంక శ్రీనివాస్ రావు, యువజన నాయకులు స్వరూప్ రాజ్ ఆధ్వర్యంలో గురువారం పారిశుద్ధ్య కార్మికులకు మాజీ ఎమ్మెల్యే కిచ్చేన్నగారి లక్ష్మారెడ్డి చీరలను పంపిణీ చేశారు. సరూర్‌నగర్ డివిజన్‌లోని డాక్టర్స్ కాలనీ, జింకలాభావి కాలనీ, వికాస్ నగర్, క్రాంతి నగర్, సాయి కృష్ణ నగర్, నరసింహపురి కాలనీలో పనిచేసే జీహెచ్ఎంసీ పారిశుద్ధ కార్మికులకు చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్స్ కాలనీ అభివృద్ధి గురించి కాలనీ అధ్యక్షులు డాక్టర్ లింగారెడ్డి, జిగిని రామమూర్తి, వన్నాడీ శ్రీనివాస్, జనార్దన్ రెడ్డి, సురబోయిన వెంకటేష్ యాదవ్‌లు కాలనీలోని సమస్యల గురించి లక్ష్మారెడ్డికి వివరించారు. అందుకు ఆయన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, టీపీసీసీ సభ్యులు దేప భాస్కర్ రెడ్డి, మాజీ మార్కెటింగ్ వైస్ చైర్మన్ బోయిన మహేందర్ యాదవ్, మాజీ కార్పొరేటర్ అనిత దయాకర్ రెడ్డి, సరూర్‌నగర్ కాంగ్రెస్ అధ్యక్షులు బోయిన శంకర్ యాదవ్, బేరా బాలకృష్ణ, ధనరాజ్, చిక్కుల శివ ప్రసాద్, గులషన్, మార్కెట్ డైరెక్టర్ గోవర్ధన్‌రెడ్డి, యాదగిరి, సైదులు, భాస్కర్, కాలనీవాసులు దయాకర్, ఆంజనేయులు, నరేష్, సూర్యనారాయణ, ఆచార్యులు, కృష్ణమూర్తి, రవీందర్ రెడ్డి, మాధవరెడ్డి, డాక్టర్స్ కాలనీ మహిళా మండలి అధ్యక్షులు మమతా, సరితా నిత్య, సంధ్య, వాణి, రమ, రాధికా, రేణుక, సౌమ్య ప్రశాంతి, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ అరెస్టు పేరుతో మోసం

- నిందితులు అరెస్ట్
- బాధితురాలికి తిరిగి డబ్బు ఇప్పించిన రాచకొండ సైబర్ క్రైమ్ పోలీసులు
- కమిషనర్ అభినందన

నవతెలంగాణ-సిటీబ్యూరో

ఇటీవల పెరుగుతున్న రకరకాల అంతర్జాల నేరాల్లో ప్రముఖంగా వినిపిస్తున్న డిజిటల్ అరెస్టు తరహా కేసు ఒకటి ఇటీవల రాచకొండ కమిషనరేట్ పరిధిలో నమోదయింది. రాచకొండ సైబర్ క్రైం పోలీస్ స్టేషన్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం 08-12-2024న, ఉప్పల్ ప్రాంతానికి చెందిన గీతా ఉపాధ్యాయ అనే 65 ఏండ్ల మహిళకు తెలియని వాట్సాప్ నెంబర్ నుంచి కాల్ రాగా ఆ కాల్‌లో ఉన్న వ్యక్తి తనను తాను సైబర్ క్రైమ్ ముంబై అధికారి మోహిత్ శర్మగా పరిచయం చేసుకున్నాడు. సదరు బాధితురాలి ఐడి ప్రూఫ్‌తో ఒక మొబైల్ నెంబర్‌తో ఒక సిమ్ కార్డు జారీ అయ్యిందని, అది ప్రజలను వేధించడానికి, అసభ్యకరమైన కంటెంట్‌ను ప్రచారం చేయడానికి ఉపయోగించినట్టు ఆ వ్యక్తి చెప్పాడు. అంతేకాకుండా ఎంహెచ్ 1045/2024 ఎఫ్ఐఆర్‌లో నమోదైన 24 ఫిర్యాదులలో ఆ సిమ్ కార్డు చట్టవిరుద్ధ కార్యకలాపాలలో ఉపయోగించారని భయపెట్టాడు. నరేష్ గోయల్ అనే మోసగాడు బాధితురాలి పేరు చెప్పి ఆమెను చట్టవిరుద్ధ కార్యకలాపాలలో చేర్చాడని ఆ నకిలీ అధికారి (సునీల్ దత్ దూబే) చెప్పాడు. ఆ నకిలీ అధికారి తమ ఆఫీసు అడ్రస్ అంటూ ఒక నకిలీ అడ్రస్ చెప్పడంతో పాటు బాధితురాలి వ్యక్తిగత వివరాలను కూడా భయపెట్టి ఆమె చేత చెప్పించి నమోదు చేసుకున్నాడు. అంతేకాకుండా ఆమె వ్యక్తిగత బ్యాంకు ఖాతా వివరాలను తెలుసుకొని ఈ కేసు నుంచి బయట పడాలంటే వారు చెప్పినట్టుగా చేయాలని, పలు దఫాలుగా ఎఫ్‌డీలు మరియు పీపీఎఫ్‌లు సహా దాదాపు ఒక కోటి 58 లక్షల 70 వేల రూపాయలను వారు చెప్పిన అకౌంట్‌కు బదిలీ చేయించుకున్నాడు. దానితో పాటు ఈ డిజిటల్ అరెస్టుకు సంబంధించిన విషయాలను, విచారణకు సంబంధించిన అంశాలను ఎవరితోనూ పంచుకోకూడదని ఎక్కడా ఫిర్యాదు చేయకూడదని ఆమెను హెచ్చరించారు. అయితే తదనంతరం తాను మోసపోయానని గ్రహించిన బాధితురాలు ఎల్బీనగర్‌లోని రాచకొండ సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు చేయగా తక్షణమే స్పందించిన ఏసీపీ ఎస్.శివశంకర్ కేసు నమోదు చేసి పర్యవేక్షణ చేపట్టారు. ప్రత్యేక టీములను ఏర్పాటు చేసి నిందితులను పట్టుకోవడమే కాక బాధితురాలు కోల్పోయిన మొత్తం రూ.70,01,788 తిరిగి ఆమెకు ఐసీఐసీఐ బ్యాంకు మురదాబాద్ ఉత్తర ప్రదేశ్ నుంచి ఇప్పించారు. ఈ కేసులో వేగంగా స్పందించి నిందితులను పట్టుకొని బాధితురాలికి న్యాయం చేసిన ఇన్‌స్పెక్టర్ మక్బూల్ జానీ, వారి టీంను డీసీపీ సైబర్ క్రైం నాగలక్ష్మి, రాచకొండ కమిషనర్ అభినందించారు. ప్రజలు అంతర్జాలంలో వచ్చే మోసపూరిత కాల్స్ మరియు లింకుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అనుమానం కలిగించే వ్యక్తులకు స్పందించకూడదని, ఎటువంటి సందర్భంలో అయినా సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకుని మోసపోతే తక్షణమే నేషనల్ సైబర్ క్రైమ్ టోల్ ఫ్రీ నంబర్ 1930కు సమాచారం అందించి ఫిర్యాదు చేయాలని కమిషనర్ సూచించారు.

ఆర్థిక సాయం చేసిన దయాసాగర్



నవతెలంగాణ-బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ వైస్ చైర్మెన్ చిగిరింత నరసింహారెడ్డి జన్మదినోత్సవం సందర్భంగా.. ఆర్థిక ఇబ్బందులో ఉన్న ఓ పేద కుటుంబానికి చెందిన నాయి బ్రాహ్మణునికి గురువారం సీపీఎన్ఆర్ ఫౌండేషన్ చైర్మెన్ చిగురింత దయాసాగర్ రెడ్డి ఆధ్వర్యంలో రూ.50 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా దయాసాగర్ రెడ్డి మాట్లాడుతూ.. మాజీ చైర్మెన్ చిగురింత నరసింహారెడ్డి జన్మదినోత్సవం సందర్భంగా పేద నాయి బ్రాహ్మణుడు సుశాంత్‌కు రూ.50వేల ఆర్థిక సహాయాన్ని సీపీఎన్ఆర్ ఫౌండేషన్ ద్వారా అందజేయడం జరిగిందన్నారు. సుశాంత్ ఎయిర్ సెలూన్ ఏర్పాటు చేసుకొని ఆర్థికాభివృద్ధి సాధించి.. కుటుంబ సభ్యులతో కలిసి సుఖంగా జీవనం కొనసాగించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. మానవ సేవే మాధవ సేవగా భావించి తమ ఫౌండేషన్ ద్వారా ఎంతో మంది పేద ప్రజలకు ఆర్థిక సహాయం చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ క్రీడాకారిణికి ఉపేందర్ రెడ్డి ఆర్థిక సాయం



నవతెలంగాణ - దిల్‌సుఖ్‌నగర్

అండర్ 23 క్రికెట్ క్రీడాకారిణికి యువజన కాంగ్రెస్ నేత చిలుక ఉపేందర్ రెడ్డి గురువారం రూ.25 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఆర్కేపురం డివిజన్ ఎన్టీఆర్ నగర్‌కు చెందిన చందన అండర్ 23 క్రికెట్‌కు ఎంపికయ్యారు. అయితే ఆర్థికంగా వెనుకబడిన చందనకు డివిజన్‌కు చెందిన తెలంగాణ యువజన కాంగ్రెస్ నేత చిలుక ఉపేందర్ రెడ్డి ముందుకు వచ్చి ఆర్థిక భరోసా ఇచ్చారు. ప్రతిభకు పేదరికం అడ్డు కాకుడదు అనే ఉద్దేశంతో ఆమెను ప్రోత్సహించాలని ఈ ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్నట్టు ఉపేందర్ రెడ్డి తెలిపారు. ఆర్థిక సమస్యలను ఎదుర్కొంటున్న చందన ఒకవైపు ఉన్నత విద్యను కొనసాగిస్తూ.. మరోవైపు క్రికెట్ క్రీడాకారిణిగా రాణిస్తున్నారని కొనియాడారు. మాజీ క్రికెటర్ మిథాలీ రాజ్‌ను తలపిస్తున్న చందన డివిజన్ పరిధిలోని ఒక డిగ్రీ కళాశాలలో బీఏ చివరి సంవత్సరం చదువుతోందన్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లా చౌటుప్పల్‌కి చెందిన కిషన్, పుష్పల కూతురు చందన కుటుంబం ఎన్టీఆర్ నగర్‌లో స్థిరపడింది. చిన్న తనం నుంచే తన సోదరుడు భవానీప్రసాద్ తో కలిసి మైదానంలో క్రికెట్ ఆడటం ప్రారంభించిన చందనను కోచ్ రాజశేఖర్ ప్రోత్సహించారని తెలిపారు. వివిధ రాష్ట్రాల్లో జరిగిన పోటీల్లో పాల్గొన్న చందన తన ప్రతిభను కనబర్చిన ఇటీవలనే అండర్ 23 క్రికెట్ కు ఎంపికైనట్టు తెలిపారు. ఒకవైపు చదువుకుంటూనే మరో వైపు ప్రాక్టీస్ చేసి 2017 లో స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో అండర్ 16 విభాగాల్లో వివిధ రాష్ట్రాల్లో పాల్గొందని గుర్తుచేశారు. హైదరాబాద్, బెంగళూరు, తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో జరిగిన పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభను కనబర్చిందని వెల్లడించారు. జమ్మూ కాశ్మీర్‌లో 2018లో అండర్ 17 పోటీల్లో పాల్గొని సిల్వర్ సాధించిందని కొనియాడారు. అదే విధంగా అదే ఏడాది మధ్యప్రదేశ్‌లో జరిగిన క్రికెట్ (టెన్నిస్ బాల్) పోటీల్లో చందన గోల్డ్ మెడల్ సాధించిందని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు లింగుస్వామి గౌడ్, జగిని రమేష్, శ్యామ్, విప్లవ, శ్రీకాంత్, కిషన్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేట నివాసి జానారెడ్డికి డాక్టరేట్



నవతెలంగాణ- నాగోల్

గణిత శాస్త్రంలో 'నాన్-న్యూటోనియన్ ఫ్లూయిడ్ ఫ్లో ప్రాబ్లమ్స్ ఓవర్ ఎ స్ట్రెచింగ్ షీట్ ఇన్ ప్రజెన్స్ ఆఫ్ మాగ్నటిక్ ఫీల్డ్' అను అంశంలో చేసిన పరిశోధనకు గాను కొత్తపేట కు చెందిన సుంకిరెడ్డి మాధవరెడ్డి, వెంకటమ్మల కుమారుడు జానారెడ్డికి తమిళనాడులోని అన్నామలై యూనివర్సిటీ డాక్టరేట్ పట్టాను ప్రదానం చేసింది. అన్నామలై యూనివర్సిటీ గణిత శాస్త్ర ఆచార్యుడు డాక్టర్ పి. వలసమీ, వర్ధమాన్ ఇంజనీరింగ్ కళాశాల గణిత శాస్త్ర ఆచార్యుడు డాక్టర్ డి. శ్రీనివాస్ రెడ్డిల పర్యవేక్షణలో చేసిన పరిశోధనలను గుర్తించి అన్నామలై యూనివర్సిటీ జానారెడ్డికి ఈ డాక్టరేట్ పట్టాను ప్రదానం చేసింది. సామాన్య రైతు కుటుంబం నుండి వచ్చిన జానారెడ్డి డాక్టరేట్ పట్టా పొందడంపై కుటుంబ సభ్యులు, పట్టణవాసులు, స్నేహితులు, సహ అధ్యాపకులు అభినందనలు తెలిపారు. జానారెడ్డి ప్రస్తుతం హైదరాబాద్‌లోని కేజీరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు.

నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ -నాగోల్

జియోలాజికల్ సర్వే అఫ్ ఇండియా బండ్లగూడ సౌతేర్న్ రీజియన్ అల్ ఇండియా జీఎస్ఐఎస్‌సిఎస్‌టి ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ చైర్మెన్ ఆదర్ల మహేష్, రీజినల్ కార్యదర్శి మధిర సత్యనారాయణల ఆధ్వర్యంలో జియోలాజికల్ సర్వే అఫ్ ఇండియా కార్యాలయంలో యూనిటీ పార్క్, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహ ప్రాంగణంలో ఆలిండియా ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి జీఎస్ఐ అడిషనల్ డైరెక్టర్ జనరల్ అండ్ హెడ్ అఫ్ ది డిపార్ట్మెంట్ శ్రీ సూరజ్ దామోజీ పటభజే ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం స్వర్గీయ మన్మోహన్ సింగ్ మరణించినందున సంతాప దినాలు ఉన్నందున, న్యూ ఇయర్ సెలెబ్రేషన్ ఒకటవ తేదిన చేయలేదని తెలిపారు. అందుకే ఈరోజు న్యూ ఇయర్ వేడుకలను నిర్వహించుకున్నట్టు తెలిపారు. అధికారులు, ఉద్యోగులు, కార్మికులు జీఎస్ఐ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జీఎస్ఐఎస్‌సి ఎస్‌టి ఎంప్లాయస్ అసోసియేషన్ చైర్మెన్ ఆదర్ల మహేష్, రీజినల్ కార్యదర్శి మధిర సత్య నారాయణ, ఏడిజి అండ్ ఎచ్‌ఓడి సూరజ్ దామోజీ ఫటభాజే, డిడిజిలు ఎల్ పి సింగ్, ఎస్ ఎన్ పాత్ర, అన్నుమన్ ఆచార్య, డైరెక్టర్ అండ్ హెడ్ అఫ్ ఆఫీస్ హార్మోహన్ మిషరా, జాయింట్ డైరెక్టర్ ఎస్. తారకేశ్వర్ రావు వైస్ చైర్మెన్ బి. శ్రీనివాస రావు, బి. ఆనంద్ కుమార్, ఎ. మేఘరాజ్, బి. ప్రభాకర్, జి. ప్రకాష్ రావు, జె. రాజశేఖర్, ఎం. చెక్రెశ్వర్, ఈ చంద్రయ్య, జి. యాదగిరి, బి. విజయలక్ష్మి, జె. సత్యనారాయణ, బి. నరేష్ పాల్గొన్నారు.

ఒక్కడిగా మరణించి.. ఇద్దరిలో సజీవంగా..



నవతెలంగాణ- నాగోల్

మృతిచెంది కూడా మరో ఇద్దరి జీవితంలో వెలుగులు నింపిన మహనీయుడు సీకోటీ నాగేశ్వరరావు అని ఖమ్మం జిల్లా మణుగూరు నేత్ర వైద్యాధికారి సంజీవరావు కొనియాడారు. నాగోల్ డివిజన్ పరిధిలోని బండ్ల గూడకు చెందిన రిటైర్డ్ బ్యాంక్ ఉద్యోగి సీకోలి నాగేశ్వరరావు డిసెంబర్ 31న సాయంత్రం గుండె పోటుతో మృతి చెందారు. దీంతో పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా జనరల్ హాస్పిటల్‌కు తరలించారు. నాగేశ్వరరావు వియ్యంకుడైన మణుగూరు ఏరియా హాస్పిటల్ నేత్ర వైద్యాధికారి సంజీవరావు సలహా మేరకు మృతుడి భార్య, సుజాత, కుమారులు అభిలాష్, అవినాష్, కోడలు భావనలు పోస్ట్ మార్టం జరుగుతున్నప్పుడే నాగేశ్వరరావు నేత్రాలను ఎల్వీప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ వారికి దానం చేశారు. తాను ఒక్కడిగా మరణించి మరో ఇద్దరి రూపంలో జీవిస్తారనే మంచి ఉద్దేశ్యంతో నాగేశ్వరరావు నేత్రాలు అందించామని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.

రైతుల సంక్షేమమే కేంద్ర సర్కార్ ధ్యేయం



బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యులు బోసుపల్లి ప్రతాప్

నవతెలంగాణ-తుర్కయంజాల్

రైతు సంక్షేమమే ధ్యేయంగా కేంద్ర సర్కార్ పనిచేస్తోందని బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యులు బోసుపల్లి ప్రతాప్ అన్నారు. రైతు సంక్షేమం కోసం మోదీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను హర్షిస్తూ తుర్కయంజాల్‌లో గురువారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బోసుపల్లి ప్రతాప్ మాట్లాడుతూ రైతులను అభివృద్ధి పథంలో తీసుకెళ్లడమే లక్ష్యంగా పీఎం కిసాన్ యోజన పథకం నిధులను రూ.6వేల నుంచి రూ.10వేలకు పెంచారని అన్నారు. అదేవిధంగా సేంద్రియ ఎరువులపై సబ్సిడీని పెంచడం హర్షనీయమన్నారు. గతంలో ఇచ్చే సబ్సిడీ కంటే నూతన సంవత్సరంలో రూ.3,850కోట్లను పెంచారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను, మోదీ చేస్తున్న అభివృద్ధి ఫలాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు చేరువచేసేందుకు బీజేపీ కార్యకర్తలు, నాయకులు విశేషంగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. దీంతో పాటు తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలో పార్టీ సంస్థాగత నిర్మాణానికి సభ్యత్వ నమోదు, బూత్ కమిటీల ఎంపిక పూర్తయినట్లు తెలిపారు. మొత్తం 52 బూత్‌లకు గాను 29 బూత్ కమిటీలు పూర్తిచేశారని, మొత్తం 5,900 సభ్యత్వం పూర్తయినట్లు వెల్లడించారు. 42మంది క్రియాశీల సభ్యులను నమోదు చేశామన్నారు. మిగతా బూత్ కమిటీలను వారం రోజుల్లో పూర్తిచేసి రాష్ట్ర కార్యాలయానికి పంపుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా కోశాధికారి బచ్చిగళ్ల రమేష్, బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు తూళ్ల నర్సింహాగౌడ్, ఎఫ్ఎస్‌సీఎస్ వైస్ చైర్మెన్ కొత్త రాంరెడ్డి, కందాల బలదేవ్‌రెడ్డి, ఎలిమినేటి నర్సింహారెడ్డి, యూసుఫ్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు కొమిరిశెట్టి భిక్షపతి, గజ్జెల నర్సింహారెడ్డి, సింగిరెడ్డి రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కుటుంబమే భవితకు బాసట : శ్రీదేవి

నవతెలంగాణ-సిటీబ్యూరో

కుటుంబమే భవితకు బాసటని అడ్వకేట్, అభిజ్ఞా భారత్ సంస్థ వ్యవస్థాపక చైర్మెన్ డా. డి. శ్రీదేవి అన్నారు. డా.హిప్నో కమలాకర్స్ మైండ్ అండ్ పర్సనాలిటీ కేర్, నవభారత లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జనవరి 1న ప్రపంచ కుటుంబ దినోత్సవం సందర్భంగా బాలికల ఎస్సీ వసతి గృహంలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు గెలిచిన వారికి గురువారం బహుమతులను, డా.శ్రీదేవి, ఐనంపూడి శ్రీలక్ష్మి, కె.ప్రభావతి, జయశ్రీ, జి.కృష్ణ వేణి, డా.హిప్నో పద్మా కమలాకర్ అందజేశారు. వసతి గృహానికి రిఫ్రిజిరేటర్‌ను అందజేశారు. ఆమె మాట్లాడుతూ కుటుంబం ప్రతి వ్యక్తి జీవితానికి ప్రధాన ఆధారస్తంభమన్నారు. ఇది వ్యక్తుల మనోభావాలు, విలువలు, వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దే మూలాధారంగా నిలుస్తుందని తెలిపారు. కుటుంబ సభ్యుల మధ్య ఉన్న అవగాహన, వ్యక్తిగత అభివృద్ధితో పాటు సమాజ నిర్మాణంలోనూ కీలక పాత్ర పోషిస్తాయన్నారు. జి.కృష్ణ వేణి మాట్లాడుతూ కుటుంబం ప్రగతికి ప్రేరణగానూ, సమాజం మెరుగైన భవిష్యత్తుకు పునాది పాత్ర పోషిస్తుందన్నారు. ఐనంపూడి శ్రీలక్ష్మి మాట్లాడుతూ ఒకే ప్రపంచం, ఒకే కుటుంబం" అనే థీమ్‌తో, ఈ దినం ప్రపంచ శాంతి, సామరస్యాన్ని పెంపొందించేందుకు పిలుపునిచ్చారు. డా హిప్నో పద్మా కమలాకర్ మాట్లాడుతూ గ్లోబల్ ఫ్యామిలీ డే ప్రపంచ శ్రేయస్సును, ఐక్యతను, సౌభ్రాతృత్వాన్ని ప్రోత్సహించే రోజని తెలిపారు. భవిష్యత్ తరాల కోసం కలిసి పని చేయాలని తెలిపే ఒక రిమైండర్‌గా పనిచేస్తుందన్నారు. ప్రపంచాన్ని ఒకే కుటుంబంగా గుర్తించి, మతాలు, సంస్కృతులు, జాతీయతల మధ్య ఉన్న భేదాలను అధిగమించేలా చేయాలని కోరారు. పిల్లలు మీరంతా వసుధైక కుటుంబం లా ఉండాలని ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.



వీఆర్పీఎస్ క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-చంపాపేట్

వడ్డెర రిజర్వేషన్ పోరాట సమితి (వీఆర్పీఎస్)2025 క్యాలెండర్‌ను తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ, లీగల్ సెల్ చైర్మెన్ పొన్నం అశోక్ కుమార్‌గౌడ్ గురువారం బంజారాహిల్స్ మినిస్టర్స్ క్వాటర్లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన వీఆర్పీఎస్ నాయకులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అశోక్ కుమార్ గౌడ్‌ను వీఆర్పీఎస్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు గుంజి సంతోష్ కుమార్ శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వీఆర్పీఎస్ మహబూబ్ నగర్ జిల్లా ఇంచార్జి వల్లేపు శేఖర్, గ్రేటర్ హైద్రాబాద్ కన్వీనర్ హనుమంతు, గుంజి శ్రీను, యూత్ లీడర్ గండికోట భరత్, వల్లెపుశివ, వెంకటేష్, రకమయ్య పాల్గొన్నారు.

'సావిత్రిబాయి పూలే జయంతిని అన్ని జిల్లాల్లో ఘనంగా నిర్వహించాలి'

నవతెలంగాణ -నాగోల్

చదువుల తల్లి సావిత్రిబాయి పూలే 194వ జయంతి కార్యక్రమాలను నేడు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలలో ఘనంగా నిర్వహించాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు తాటిపాముల వెంకట్ రాములు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ్ల ధనుంజ నాయుడులు గురువారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కస్తూర్బా పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయిలను మన సంఘం ద్వారా ఘనంగా సన్మానించి.. అట్టి కార్యక్రమాన్ని పత్రికా ప్రకటనల ద్వారా ప్రసారం చేయాలని నిర్ణయించినట్టు పేర్కొన్నారు.

ముఖ్యమంత్రికి ఉప్పల్ కాంగ్రెస్ నాయకుల శుభాకాంక్షలు



నవతెలంగాణ-ఉప్పల్

సీఎం రేవంత్ రెడ్డిని గురువారం ఉప్పల్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు గడ్డం రవికుమార్, కాంగ్రెస్ రామంతాపూర్ ఇన్‌చార్జి తవిడబోయిన గిరిబాబు, పావని రెడ్డిలు జూబ్లీహిల్స్ లోని వారి నివాసంలో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

సీఎంను కలిసిన సింగిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి



నవతెలంగాణ - పోచారం

కాంగ్రెస్ పోచారం మున్సిపాలిటీ అధ్యక్షులు సింగిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన సంవత్సరం రోజు రాష్ట్ర ముఖ్యమంత్రిని కలిసి శుభాకాంక్షలు తెలియజేయడం చాలా సంతోషంగా ఉందన్నారు

ప్రమాద రహిత డ్రైవింగ్ లక్ష్యంగా కృషి చేయాలి

- చెంగిచెర్ల డిపో మేనేజర్ కే కవిత



నవతెలంగాణ-బోడుప్పల్

పరధ్యానం లేకుండా విధులు నిర్వర్తించినప్పుడే ప్రమాద రహిత డ్రైవింగ్ సాధ్యమవుతుందని ఆర్టీసీ చెంగిచెర్ల డిపో మేనేజర్ కే కవిత తెలిపారు. ఆర్టీసీ చెంగిచెర్ల డిపోలో జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల కార్యక్రమాన్ని ఘట్ కేసర్ ట్రాఫిక్ ఎస్ఐ మల్లయ్యతో కలిసి గురువారం ఆమె ప్రారంభించారు. డ్రైవర్‌లు ట్రాఫిక్ నిబంధనలను పాటించకుండా నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడం ద్వారానే ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నట్టు చెప్పారు. ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ డ్రైవింగ్ చేస్తే ప్రమాదాలను పూర్తిగా నివారించవ చ్చని తెలిపారు. ట్రాఫిక్ ఎస్ఐ మల్లయ్య మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం ద్వారా ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోయే అవకాశం ఉంటుందని తెలిపారు. డ్రైవింగ్ చేసే ముందు అలసటకు గురి కాకుండా మానసిక ప్రశాంతతతో విధులు నిర్వర్తిస్తే ప్రమాదాలను నివరించవచ్చన్నారు. డ్రైవింగ్ చేసే పనిపై పూర్తి శ్రద్ధ ఉంటే ప్రమాద రహిత డ్రైవర్లుగా గుర్తింపును పొందుతారన్నారు. బస్సును నిలిపేటప్పుడు బస్సు బే లోనే ఆపాలన్నారు. ట్రాఫిక్ సిగ్నల్స్ ను దాటేయాలని ఆత్రుతతో చాలామంది ప్రమాదాలకు గురవుతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ (మెకానికల్) సాయి సుబ్రహ్మణ్యం, సూపరిండెంట్ ట్రాఫిక్ వెంకటేశ్వర్లు డిప్యూటీ సూపరిండెంట్ అరుణ లక్ష్మి, సేఫ్టీ డ్రైవింగ్ ఇన్స్పెక్టర్ అక్బర్, లైసెనింగ్ ఆఫీసర్ కృష్ణ, డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్ లు పాల్గొన్నారు.

58 ఏండ్ల వ్యక్తికి మైక్రో వాస్క్యులర్ సర్జరీ

- దుర్గాబాయి దేశ్‌ముఖ్ రెనోవా క్యాన్సర్ సెంటర్‌లో విజయవంతం



నవతెలంగాణ-సిటీబ్యూరో

నిజామాబాద్ జిల్లా, గుత్ప గ్రామానికి చెందిన 58 ఏండ్ల గుమ్మల సాయన్న ఏడాదిగా ముఖంలో వాపు, కుడి దవడ దగ్గర పెద్ద కణితి, కంట్లో నుంచి నీరు కారడం, మింగడానికి కూడా ఇబ్బంది వంటి తదితర సమస్యలతో బాధపడుతున్నారు. తగిన చికిత్స కోసం సాయన్న కుటుంబ సభ్యులు వైద్యులను సంప్రదించగా "మాక్సిల్లరీ సైనస్ కార్సినోమా" అనే వ్యాధితో బాధపడుతున్నారని, తప్పనిసరిగా శస్త్రచికిత్స చేయాల్సిందేనని స్పష్టం చేశారు. దీంతో చికిత్స కోసం నిజామాబాద్, హైదరాబాద్ లోని పలు హాస్పిటల్స్‌ను సంప్రదించిన సాయన్న కు తగిన పరీక్షలు నిర్వహించిన తర్వాత ఏడాది కాలంగా సరైన చికిత్స తీసుకోకుండా నిర్లక్ష్యం చేయడం వల్ల వ్యాధి బాగా ముదురడంతో చికిత్సకు రూ. లక్షలలో అవుతుందని తేల్చారు. దీంతో దిక్కు తోచని స్థితిలో హైదరాబాద్‌లోని దుర్గాబాయి దేశ్‌ముఖ్ రెనోవా క్యాన్సర్ సెంటర్, విద్యానగర్ గురించి తెలుసుకొన్న సాయన్న కుటుంబ సభ్యులు నేరుగా సంప్రదించారు. వారి కేసును పరిశీలించిన ప్రముఖ సర్జికల్ ఆంకాలజీ చికిత్స నిపుణులైన డా.యు.ఆజాద్ చంద్రశేఖర్, మెడికల్ డైరెక్టర్ అండ్ సీనియర్ సర్జికల్ అంకాలజిస్టు, దుర్గాబాయి దేశ్‌ముఖ్ రెనోవా కేన్సర్ సెంటర్ వారు ఈ కేసును ఛాలెంజ్ గా పరిగణించి చికిత్స ను ప్రారంభించారు. ట్రూ కట్ బయాప్సీ, సిటీ హెడ్ అండ్ నెక్ స్కాన్, హెూల్ బాడీ పెట్-సీటీ స్కాన్ ల ద్వారా నిర్ధారణకు వచ్చి మైక్రో వాస్క్యులర్ సర్జరీ ని విజయవంతంగా పూర్తి చేశారు. వారు అందించిన శస్త్ర చికిత్సానంతర సేవలతో సాయన్న పూర్తి ఆరోగ్యంతో కేవలం వారం రోజుల్లోనే హాస్పిటల్ నుండి డిశ్చార్జ్ అయ్యారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేసు వివరాలను డా.యు.ఆజాద్ చంద్రశేఖర్ వెల్లడించారు. ఈ శస్త్ర చికిత్సను 10 నుంచి 12 గంటల పాటు శ్రమించి తమ బృందం విజయవంతంగా పూర్తి చేయడం పట్ల సంతోషంగా ఉందని చెప్పారు. చాలా తక్కువ మందిలో వచ్చే ఈ వ్యాధికి శస్త్ర చికిత్సని విజయవంతంగా పూర్తిచేయడానికి రాడికల్ మాక్సిల్లెక్టమీం ఫ్రీ అంటిరోలటరల్ థై ఫ్లాప్, ఫ్రీ ఫ్లాప్ రికన్స్ట్రక్షన్ లాంటి అనేక రకాల సర్జరీలు చేయవలసి వచ్చిందని తెలిపారు. అందులోనూ పేషెంట్ కుటుంబ సభ్యుల ఆర్థిక స్థితిని పరిగణలోనికి తీసుకోని సాధ్యమైనంతవరకు తక్కువ ఖర్చుతో ఎక్కడా రాజీ లేకుండా చికిత్స అందించడం జరిగిందని చెప్పారు. ఈ సర్జరీ ని విజయవం తంగా పూర్తి చేయడం చాలా గర్వంగా ఉందని ఈ సర్జరీ లో పాల్గొన్న డాక్టర్లు డా.యు.ఆజాద్ చంద్రశేఖర్, మెడికల్ డైరెక్టర్ అండ్ సీనియర్ సర్జికల్ అంకాలజిస్టు, డా.రాకేష్ శంకర్ గౌడ్, క్లినికల్ డైరెక్టర్, డా.రవికుమార్ రెడ్డి, కన్సల్టెంట్ సర్జికల్ ఆంకాలజిస్ట్, డా.రాకేష్ కుమార్, కన్సల్టెంట్ సర్జికల్ ఆంకాలజిస్ట్, డా.ఉల్లాస్, కన్సల్టెంట్ సర్జికల్ ఆంకాలజిస్ట్, డా.శ్రీనాథ్, కన్సల్టెంట్ ప్లాస్టిక్ సర్జన్, డా.సమంత్, కన్సల్టెంట్ అనస్థీషియాలజిస్ట్ అండ్ డాక్టర్.మధుసూదన్ రావు, మెడికల్ సూపరింటెండెంట్, శ్రీవల్లి, సెంటర్ హెడ్ తెలిపారు. పూర్తి ఆరోగ్యంతో కేవలం వారం రోజుల్లో నే డిశ్చార్జ్ కూడా చేసినట్టు చెప్పారు.

స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో సప్దర్ హష్మి వర్ధంతి

నవతెలంగాణ-కాప్రా

తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో ప్రముఖ కళాకారుడు సాంస్కతోద్యమ నాయకులు సప్దర్ హస్మి 36వ వర్ధంతి సందర్భంగా నివాళి కార్యక్రమం కమలానగర్ ఆఫీసులో జరిగింది. స్ఫూర్తి గ్రూప్ బాధ్యులు గొడుగు యాదగిరిరావు అధ్యక్ష వహించారు. ప్రారంభ సూచికగా సామాజిక ఉద్యమ నాయ కులు కోమటి రవి, అధ్యక్షులు గొడుగు యాదగిరిరావు.. సప్దర్ హస్మీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కోమటి రవి మాట్లాడుతూ సప్దర్ హస్మి గొప్ప కళాకారుడు, ఉన్నత చదువులు చదివి కళారూపాల ద్వారా ప్రజలను చైతన్యం చేసిన గొప్ప యోధుడన్నారు. అనేక వీధి నాటకాలు రాసి, ప్రదర్శనలు చేసిన ఘణులని చెప్పారు. ఎమర్జెన్సీ కాలంలో చీకటి రోజులను ప్రజలకు అర్థమయ్యే రీతిలో అనేక ప్రదర్శనలు చేశారని చెప్పారు. మలయశ్రీని వివాహం చేసుకొని ఆమెతో కలిసి అనేక ప్రదర్శన నిర్వహించారని తెలిపారు. ఢిల్లీ మహానగరంలో కనీస వేతనాలు అమలు చేయాలని "హల్లా బోల్" వీధి నాటకం విస్తృతంగా కార్మికులలో ప్రదర్శన చేసి ఆకట్టుకున్నారన్నారు. దానితో అనాటి ప్రభుత్వం, యాజమాన్యాల గుండాలు ప్రదర్శన జరుగుతున్న సమయంలోనే 1989 జనవరి 1 తేదీన మారణా యుధాలతో పాశవికంగా దాడులు చేశారని తెలిపారు. జనవరి 2వ తేదీన ఆయన మరణించారని చెప్పారు. దానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున కళాకారులు ప్రదర్శనలు నిర్వహించారని... జనవరి 4వ తేదీన అంటే రెండు రోజుల తర్వాత ఆయన భార్య మలయశ్రీ హాస్మీ నాయకత్వంలో అదే స్థానంలో ప్రదర్శనలు చేసి పాలకులకు హెచ్చరిక చేశారన్నారు. ఆ తర్వాత కాలంలో దేశవ్యాప్తంగా వీధి నాటకం విస్తతంగా ప్రజల్లోకి వెళ్లిందని తెలిపారు. ఆయన పోరాట స్ఫూర్తితో అనేక సంఘాలు దేశ విదేశాలలో ప్రజా ఉద్యమాలకు అనుకూలంగా ప్రదర్శనలు జరుపుతున్నారని అన్నారు. అధ్యక్షులు గొడుగు యాదగిరిరావు మాట్లాడుతూ సప్దర్ హష్మి అటు కళా రంగం, ఇటు ప్రజా ఉద్యమాలను ప్రభావితం చేసిన గొప్ప నాయకుడు అని చెప్పారు. అనంతరం సబికులందరూ చిత్రపటానికి పూలను వేసి నివాళులర్పించారు. లక్ష్మయ్య శ్రీనివాసరావు, ఎన్ శ్రీనివాస్, శోభ, గౌసియా, జి శివరామకష్ణ, ఆర్ ఎస్ ఆర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మెట్రో విస్తరిస్తున్నందుకు ముఖ్యమంత్రికి ధన్యవాదాలు

- టీపీసీసీ ఉపాధ్యక్షుడు వజ్రేష్ యాదవ్



నవతెలంగాణ-బోడుప్పల్

అనేక సంవత్సరాల నుండి అందని ద్రాక్షగా ఉన్న ప్యారడైజ్-మేడ్చల్, జేబీఎస్ -శామీర్ పేట్ వరకు మెట్రో విస్తరణకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నూతన సంవత్సర కానుకగా అందించడం పట్ల మేడ్చల్ జిల్లా ప్రజల తరుపున టీ.పీసీసీ ఉపాధ్యక్షుడు, మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గం ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ కతజ్ఞతలు తెలిపారు. గురువారం బంజారా హిల్స్ లోని ముఖ్యమంత్రి నివాసంలో సీఎంను వారు మర్యాద పూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ మెట్రో రైలు ఫేజ్ -2 లో భాగంగా ప్యారడైజ్-మేడ్చల్ (23 కిలోమీటర్లు), జెబీఎస్-శామీర్ పేట్ (22 కిలోమీటర్లు) మెట్రో కారిడార్లకు డీటైల్డ్ ప్రాజెక్టు రిపోర్ట్ (డీపీఆర్) చేసేలా అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేయడం పట్ల మేడ్చల్ జిల్లా, మేడ్చల్ నియోజకవర్గం ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. ఈ మెట్రో విస్తరణతో నార్త్ సిటీ అభివృద్ధితో పాటు, ఉత్తర తెలంగాణ ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు తొలగను న్నాయని అన్నారు.గతంలో మల్కాజిగిరి ఎంపీగా ప్రాతినిధ్యం వహించిన ముఖ్యమంత్రి ఈ ప్రాజెక్టు పై గతంలోనే హామీ ఇచ్చారని తెలిపారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున ప్రజలకు ఇచ్చిన హామిల్లో మెట్రో విస్తరణ ఉందని దానిని అమలు చేసినందుకు ముఖ్యమంత్రి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నట్టు తెలిపారు.

రాజకీయాలకతీతంగా నిజాలను నిర్భయంగా రాస్తున్న నవతెలంగాణ

- ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి



నవతెలంగాణ-నేరేడ్ మెట్

రాజకీయాలకతీతంగా నిజాలను నిర్భయంగా, ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు కథనాలు రాస్తూ, ప్రభుత్వం దష్టికి తీసుకుపోతున్న పత్రిక నవతెలంగాణ దినపత్రిక అని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. బోయిన్‌పల్లిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం లో నవతెలంగాణ 2025 క్యాలెండర్‌ను గురువారం ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారులకు, పాలకులకు వారధిగా పనిచేసి ప్రజా సమస్యలను తీర్చేందుకు కషి చేయాలన్నారు. మల్కాజిగిరి నియోజకవర్గం ప్రజలకు, నవతెలంగాణ దినపత్రిక యాజమాన్యానికి, సిబ్బందికి, రిపోర్టర్ లకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నవతెలంగాణ రిపోర్టర్ జె సుధాకర్, డివిజన్ ఇన్‌చార్జి జహంగీర్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు జె కె సాయి గౌడ్, రెగటి శివకుమార్ గౌడ్, చిన్న యాదవ్, నవీన్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

కార్మిక కర్షక పక్షపాతిగా నిలుస్తున్న 'నవతెలంగాణ'

- సీపీఐ(ఎం) మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కమిటీ సభ్యులు, మల్కాజిగిరి మండల కార్యదర్శి లక్ష్మణ్



నవతెలంగాణ-నేరేడ్ మెట్

బడుగు బలహీన వర్గాల కార్మిక కర్షక పక్షపాతిగా నిలిస్తూ వారి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పాటు పడే ఒకే ఒక్క పత్రిక నవ తెలంగాణ దినపత్రిక అని సీపీఐ(ఎం) మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కమిటీ సభ్యులు, మల్కాజిగిరి మండల కార్యదర్శి గుంటి లక్ష్మణ్ అన్నారు. మల్కాజిగిరిలోని సీపీఐ(ఎం) కార్యాలయంలో నవతెలంగాణ 2025 క్యాలెండర్‌ను పార్టీ మల్కాజిగిరి మండల కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ నిత్యం ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు వెలికి తీస్తూ, ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతున్న పత్రిక నవ తెలంగాణ అని అన్నారు. గతంలో ప్రజాశక్తిగా ఉన్న పత్రిక రాష్ట్ర విభజన తర్వాత నవతెలంగాణ పత్రికగా ఆవిష్కృతమై, అదే ఒరవడితో ప్రజా సమస్యలను వెలికి తీస్తూ, పేద ప్రజలకు అండగా ఉంటున్నదన్నారు. ఈ పత్రిక అదే విధంగా ముందుకు సాగాలని, ప్రజా సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించే దిశగా తన పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. ప్రజల ఆధారామానాలు పొందుతున్న నవతెలంగాణ మరింత మందికి చేరువ కావాలని కోరుకున్నారు. దినపత్రికలో పనిచేస్తున్న సిబ్బందికి, విలేకరులకు, మల్కాజిగిరి ప్రజలకు, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నవతెలంగాణ రిపోర్టర్ జె సుధాకర్, పార్టీ మల్కాజిగిరి మండల కమిటీ సభ్యులు కొండలరావు, శ్రీనివాస్, పార్టీ సానుభూతి పరులు సూర్య కుమార్, ప్రదీప్ దాస్ గుప్తా, తదితరులు పాల్గొన్నారు.

'కమ్యూనిస్ట్ సైద్ధాంతిక తత్వవేత్త ఏబి.బర్ధన్'



నవతెలంగాణ-కాప్రా

కమ్యూనిస్ట్ సైద్ధాంతిక తత్వవేత్త ఏబి.బర్ధన్ అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఎస్.బోస్ అన్నారు. ఏబి.బర్ధన్ 9వ వర్ధంతిని ఈసీఐఎల్ లోని నీలం రాజశేఖర్ రెడ్డి భవన్‌లో నిర్వహించగా ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏబీ. బర్ధన్ తన చివరి శ్వాస వరకు కమ్యూనిస్టు సిద్ధాంతాలను అనుసరించి ప్రజలతో, కార్యకర్తలతో నిరాడంబరమైన జీవితాన్ని గడిపారన్నారు. బర్ధన్ విద్యార్థి దశ నుంచి ప్రజా సమస్యలపై అలుపెరగని పోరాటం చేశారని, 80,90 దశకంలో అప్పటి కేంద్ర ప్రభుత్వం ఉపరాష్ట్రపతి పదవి ఇచ్చినా తీసుకోకుండా సున్నితంగా తిరస్కరించారన్నారు. తన జీవితం ప్రజలు, పార్టీ కార్యకర్తలతోనే అని చెప్పడం బర్ధన్ నిస్వార్థతకు అద్దం పడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మేడ్చల్ జిల్లా సహాయ కార్యదర్శి జీ. దామోదర్ రెడ్డి, సీపీఐ మేడ్చల్ జిల్లా కార్యవర్గ సభ్యులు శంకర్ రావు, ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర,ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి టి. సత్య ప్రసాద్,సీపీఐ మండల కార్యవర్గ సభ్యులు నారా నర్సింహా,సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌యూజే (ఐ) జాతీయ కార్యదర్శిగా మెరుగు చంద్ర మోహన్



నవతెలంగాణ-కాప్రా

నేషనల్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (ఇండియా) జాతీయ కార్యదర్శిగా, సీనియర్ జర్నలిస్ట్ మెరుగు చంద్ర మోహన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన జాతీయ అధ్యక్ష కార్యదర్శులు సురేష్ శర్మ త్రియుగ్ నారాయణ తివారి, టీఎస్‌జేయూ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు పురుషోత్తం నారగౌని, అనిల్ కుమార్ తోకలకు కృతజ్ఞతలు తెలిపారు. జర్నలిస్టు సమస్యల పరిష్కారం కోసం జాతీయ స్థాయిలో పోరాటం చేస్తామని తెలిపారు. ఆయన ఏకగ్రీవంగా ఎన్నిక కావడం పట్ల టీఎస్ జేయూ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

సీపీఐ శత జయంతి ఉత్సవాలను జయప్రదం చేయండి

పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు తోటపల్లి శంకర్



నవతెలంగాణ-జవహర్ నగర్.

జనవరి 19 న జరిగే సీపీఐ శతజయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు తోటపల్లి శంకర్ పిలుపునిచ్చారు. బుధవారం సీపీఐ జవహర్ నగర్ అధ్యక్షులు దర్శనం యాదగిరి అధ్యక్షతన బాలాజీ నగర్‌లోని దళిత భవన్‌లో కాప్రా మండల సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా ఆయన హాజరై ఇటీవల మరణించిన రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాల మల్లేష్, మేడ్చల్ జిల్లా కార్యవర్గ సభ్యులు రొయ్యల కష్ణమూర్తిల చిత్రపటాలకు నివాళులర్పించి మాట్లాడారు. బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి బాల మల్లేష్, కష్ణ మూర్తి, అకాల మతి సీపీఐకి తీవ్ర లోటని, వారి స్ఫూర్తితో పార్టీ నూతన సభ్యత్వం జనవరి 25 నాటికి పూర్తి చేయాలని, శత జయంతి వారోత్సవాలను జయప్రదం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నిమ్మల నర్సింహా, మండల సహాయ కార్యదర్శులు లక్ష్మీనారాయణ, మోతే రాజేశ్వరి, గిరిజన సమైక్య అధ్యక్ష కార్యదర్శులు శ్యామలత, స్వరూప నాయక్, దళిత హక్కుల సమితి జిల్లా నాయకులు సీహెచ్ మహేష్, మండల అధ్యక్షులు ఎల్లయ్య, బీసీ సంఘం జిల్లా నాయకులు సూర వెంకటయ్య, కీసర మండల సహాయ కార్యదర్శి రవి నాయక్ పాల్గొన్నారు.

పేదింటి అమ్మాయికి 'మానవసేవే మాధవసేవ' చేయూత



నవతెలంగాణ-నేరేడ్ మెట్

మల్కాజిగిరి సర్కిల్ గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని ఇందిరా నెహ్రూ నగర్ బస్తీలో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్న పార్వతికి ఐదుగురు సంతానం, వారిలో 9 సంవత్సరాల దీపాలి అనే అమ్మాయి ఇటీవల అనారోగ్యం బారిన పడడంతో గాంధీ ఆస్పత్రికి వైద్యం కోసం వెళ్లగా, అమ్మాయికి కాలేయంకి సంబంధించిన సమస్య ఉందని వైద్యులు నిర్ధారించారు. వైద్యులు సూచించిన టెస్టులు, మందులు కూడా కొనలేని దుస్థితి వారిది. పార్వతి ఇండ్లలో పాచి పని చేస్తూ తన ఐదుగురిని సాకుతున్నది. తన కూతురు వైద్యం కోసం సహాయం కోరుతూ మానవసేవే మాధవసేవ ప్రతినిధి కుమ్మరి రాజుని ఆశ్రయించడంతో సదరు విషయాన్ని తమ వాట్సాప్ గ్రూప్ సభ్యులకు తెలియజేశారు. గ్రూప్ సభ్యులు కుమ్మరి రాజు, మహమ్మద్ రషీద్, ఉదారి సత్యనారాయణ యాదవ్, సతీష్ కుమార్, రవికుమార్, లక్ష్మణ్, జంగాల శ్రీరామ్, అహమ్మద్ అలీ ఖాన్, డాక్టర్ సుధాకర్, మురళి, చిరంజీవి, ప్రవీణ్ ల సహకారంతో గురువారం బాధిత కుటుంబానికి రూ. 10 వేల చెక్కును వైద్య ఖర్చులకోసం సహాయంగా అందించారు. పార్వతి కూతురు దీపాలి వైద్యం కోసం సహాయమందించిన మానవసేవే మాధవసేవ గ్రూప్ ప్రతినిధులను స్థానికులు అభినందించారు.

ఈసీ నగర్ లయన్స్ హాస్పిటల్‌లో ఉచిత వైద్య శిబిరం

నవతెలంగాణ-కాప్రా

కాప్రా ఏఎస్ రావు నగర్ లయన్స్ క్లబ్ అండ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యం లో ఈసీ నగర్ లయన్స్ హాస్పిటల్ లో ఉచిత వైద్య శిబిరం గురువారం నిర్వహించారు. క్యాంప్‌ను పీడీజీ లయణ కే ఎస్ రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. అవసరమైన వారికి లయన్స్ హాస్పిటల్ ద్వారా సేవలు అందిస్తామన్నారు .కాంప్ లో లయన్స్ హాస్పిటల్ డాక్టర్ అనిల్ కళ్ళ పరీక్షలు, డాక్టర్ దినేష్ దంతాల పరీక్షలు ,డాక్టర్ చాముండేశ్వరి ఫిజియో థెరపీ పరీక్షలు, హియర్ జాప్ డాక్టర్లు చెవి పరీక్షలు ,సియాన్ క్లినిక్స్ డాక్టర్లు స్త్రీలకు కాన్సర్ స్క్రీనింగ్ చేశారు. 145 మంది కాన్సర్ పరీక్షలతో పాటు అన్ని రకాల వైద్య పరీక్షలు చెయించుకున్నారు. కాంప్ లో క్లబ్ అధ్యక్షురాలు ఎం శ్రీదేవి , కార్యదర్శి చనమోలు వరప్రసాద్ ,ట్రస్ట్ చైర్మెన్ కే .విజయకుమార్ ,వైస్ చైర్మెన్ సురేష్, జాయింట్ సెక్రటరీ చందన్ రాజు , ట్రస్టీ శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.



'ఉప్పల్ డిప్యూటీ కమిషనర్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలి'



నవతెలంగాణ-ఉప్పల్

ఉప్పల్ జీహెచ్ఎంసీ మైదానంలో గత నెల 31న జరిగిన మద్యంతో కూడిన ప్రయివేటు ఈవెంట్ ఆర్గనైజర్‌కు, ఉప్పల్ డిప్యూటీ కమిషనర్‌పై వెంటనే చర్యలు చేపట్టాలని చిల్కానగర్ డివిజన్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ కోరారు. గురువారం వారి ఆధ్వర్యంలో జీహెచ్ఎంసీ కమిషనర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఉప్పల్ మున్సిపల్ మైదానంలో ఎప్పుడూ మద్యంతో కూడిన కార్యక్రమాలకు అనుమతులు ఇవ్వలేదని, ఈసారి ఉప్పల్ డిప్యూటీ కమిషనర్ మద్యంతో కూడిన ప్రయివేటు ఈవెంట్ ఆర్గనైజర్‌కు అనుమతి ఇవ్వడాన్ని తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేస్తున్నట్టు తెలిపారు. ప్రభుత్వ స్థలాల్లో ప్రయివేటు వ్యక్తులకు ఈవెంట్ల పేరుతో మద్యం అమ్మకాలకు కేటాయించొద్దని కోరారు. ఉప్పల్ డిప్యూటీ కమిషనర్ అంజనేయులుపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని, సస్పెండ్ చేయాలని కోరారు. గతంలోఉప్పల్ మున్సిపల్ మైదానంలో స్పోర్ట్స్ స్కూల్ కల్చరల్ ఆక్టివిటీస్, ధార్మిక కార్యక్రమాలకు తప్ప ఎన్నడూ కూడా మద్యంతో కూడిన ఈవెంట్లకు అనుమతి ఇవ్వలేదని చెప్పారు.

ఎండీ హైదర్‌కు శుభాకాంక్షలు వెల్లువ..



- నాచారంలోని చాంద్ పాషా దర్గా దగ్గర ప్రత్యేక ప్రార్థనలు..
- మదర్సా పాఠశాల విద్యార్థులకు అన్నదానం

నవతెలంగాణ - చర్లపల్లి

మల్లాపూర్ యువదళ్ ప్రతినిధి ఎండీ హైదర్ జన్మదినం సందర్భంగా గురువారం నాచారంలోని చాంద్ పాషా దర్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం పుట్టినరోజు వేడుక లను ఘనంగా నిర్వహించారు. అనంతరం మదర్సా పాఠ శాల విద్యార్థులకు అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశా రు. హైదర్ జన్మదిన వేడుకలకు ముఖ్య అతిథిగా మల్లా పూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి హాజరై పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. భవిష్యత్తులో మరింత రాణించి, ఉన్నంత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. టీం యువదళ్ సభ్యులు శాలువాతో సన్మానించి, కేక్ కట్ చేయించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, మల్లాపూర్ యువదల అధ్యక్షుడు ఎండీ ఉస్మాన్, స్థానిక నాయకులు, వివిధ కాలనీవాసులు యువకులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను పరిశీలించిన కార్పొరేటర్

నవతెలంగాణ-అల్వాల్

కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్‌రెడ్డి గురువారం శ్రీనివాస్‌నగర్‌లో జరుగుతున్న అభివద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులతో మాట్లాడుతూ అంతర్గత రోడ్ల నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలను పాటించాలని అధికారులను ఆదేశించారు. గీత స్కూల్ పక్కన ఉన్న 665 గజాల పార్కు స్థలాన్ని అన్యాక్రాంతం కాకుండా చర్యలు చేపడతామని హామినిచ్చారు.కాగా కాలనీ వాసులు కార్పొరేటర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమం లో అధికారులు డీఈ ప్రశాంతి, ఏఈ అభిషేక్, రామారావు, గీత హై స్కూల్ ప్రిన్సిపాల్ హరినాథ్ రావు, కాలనీవాసులు సునీల్, రఘురాం రెడ్డి ,సతీష్, రాజేశ్వర్ రెడ్డి ,వరలక్ష్మి, నాయకులు ప్రేమ్ కుమార్ యాదగిరి గౌడ్, సాజిత్ పాల్గొన్నారు.

సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం



నవతెలంగాణ- మేడ్చల్

నగరం నుంచి మేడ్చల్, శామీర్ పేట్ వరకు మెట్రో రైల్ ను పొడిగించినందుకు సీఎం రేవంత్ రెడ్డి చిత్ర పటానికి మేడ్చల్ పట్టణంలోని వివేకానంద విగ్రహం వద్ద పాలభిషేకం చేశారు. మేడ్చల్ ప్రజానికానికి నూతన సంవత్సర కానుకగా ప్యారడైజ్ నుంచి మేడ్చల్ వరకు, జేబీఎస్ నుండి శామీర్ పేట్ వరకు మెట్రో రైలు పొడిగిస్తూ తీసుకున్న నిర్ణయం చాలా గొప్ప చారిత్రాత్మక విషయమన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మెన్ నర్సింహులు యాదవ్,చైర్ పర్సన్ మర్రి దీపికా నర్సింహ రెడ్డి,వైస్ చైర్మెన్‌లు చీర్ల రమేష్,దామన్నగారి ప్రభాకర్, కౌన్సిలర్లు జాకట దేవ,కౌడే మహేష్,బత్తుల శివ కుమార్ యాదవ్,మర్రి శ్రీనివాస్ రెడ్డి,ఎడ్ల శ్రీనివాస్ రెడ్డి,సాయిపేట శ్రీనివాస్ కురుమ,రొయ్యపల్లి మల్లేష్ గౌడ్,బత్తుల మధుకర్ యాదవ్,పాలకుర్తి రాఘవేందర్ గౌడ్,సాటే నరేందర్,శ్రీనివాస్ రెడ్డి,గోమారం బాల్ రెడ్డి, పార్టీ మేడ్చల్ మండల అధ్యక్షులు గోమారం రమణా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూ బాధితులకు అండగా ఉంటా



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారం గ్రామ చౌరస్తాలో చౌరస్తా విస్తరణ సందర్భం గా.. వారి భూమిని కోల్పోయేవారికి అండగా ఉంటానని స్థానిక కార్పొరేటర్, గ్రేటర్ స్టాండింగ్ కమిటీ సభ్యులు రావుల శేషగిరి భరోసా ఇచ్చారు. ఈ మేరకు గురువారం డీప్యూటీ కమిషనర్ మల్లారెడ్డితో కలిసి ప్రాంతంలో పర్యటించి బాధితులతో చర్చించారు. భూమి కోల్పోతున్న బాధితులకు తప్పక నష్ట పరిహారం అందేవిధంగా చేస్తానని ఆయన ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు



నవతెలంగాన-సిటీబ్యూరో

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, డీఆర్‌ఓ హరిప్రియ, లా ఆఫీసర్ చంద్రావతి గురువారం జిల్లా కలెక్టర్ గౌతమ్ ను మర్యాద పూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

వృద్ధుడు అదృశ్యం..



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

వృద్ధుడు అదృశ్యమైన సంఘటన జగద్గిరి గుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. కుటుంబసభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జగద్గిరిగుట్ట భూదేవి హిల్స్ డి బ్లాక్ ప్రాంతంలో గుండా రామా రావు కుటుంబం నివాసముంటున్నారు. ఇదిలా ఉండగా ఈయన తండ్రి గుండా మొగిలి, గోవిందరావుపేట గ్రామం, ములుగు జిల్లా నుంచి గత రెండు రోజుల క్రితం కొడుకు రామారావు ఇంటికి వచ్చాడు. గురువారం 11 గంటల ప్రాంతంలో బయట కూర్చుంటానని చెప్పి వెళ్లి.. సాయంత్రం వరకు రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు ఇరుగు పొరుగు, బంధువులను వద్ద వెతికిన ఆచూకీ లభించలేదు. పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. వృద్ధుడికి మతిస్థిమితం సరిగా లేదని ఫోన్ నెంబర్ కూడా లేదని వారు తెలిపారు. ఆచూకీ తెలిసినవారు. 8712568311, 8309817571 నెంబర్లకు సంప్రదించాలని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బబ్బుగూడ నాలాను పరిశీలించిన మాజీ కార్పొరేటర్



నవతెలంగాణ-కూకట్‌పల్లి

మూసాపేట్ డివిజన్ బబ్బుగూడ నాలాను మూసాపేట్ మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్ కుమార్ పరిశీలించారు. నాళా పూడికతీత తీయక పోవడంతో.. నాళాలో చెత్తా చెదారం పేరుకుపోయి, దోమల సమస్య విపరీతంగా పెరిగిందన్నారు. స్థానికులు ఆయన దృష్టికి తీసుకెళ్ళడంతో.. ఆయన ఆ ప్రాంతంలో పర్యటించారు. నాళా మొత్తం చెత్తా చెదారంతో పేరుకుపోయి.. ఉండటాన్ని చూసి ఆయన విచారం వ్యక్తం చేశారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో పూడిక తీసి చుట్టూ ప్రక్కల నివాసం ఉండే ప్రజలకు ఇబ్బంది లేకుండా చేసామన్నారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేకుండా పోయిందని అన్నారు. ప్రజా పాలన అంటూ ఊదర గొట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం, ప్రజా సమస్యలను గాలికి వదిలేసిందని దుయ్యబట్టారు. వెంటనే సమస్యను ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు దృష్టికి తీసుకెళ్లి.. పూడికతీత తీసేలా చర్యలు తీసుకుంటామని స్థానికులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ సి.హెచ్ సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి తిరుపతి, బబ్బుగూడ అధ్యక్షులు బోడ శ్రీనివాస్, మాజీద్, సుందర్, శ్రావణ్, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

11 ఏండ్ల బాలుడికి ఆటో ఇమ్యూన్ ఎన్‌సెఫలైటిస్



- కింగ్ కోఠి కామినేని ఆస్పత్రిలో విజయవంతంగా చికిత్స

నవతెలంగాన-సిటీబ్యూరో

నగరంలో 11 ఏండ్ల బాలుడికి వచ్చిన ఆటో ఇమ్యూన్ ఎన్‌సెఫలైటిస్ సమస్యకు కింగ్ కోఠిలోని కామినేని ఆస్పత్రికి చెందిన కన్సల్టెంట్ న్యూరో ఫిజిషియన్ డాక్టర్ అవినాష్ కుమార్ అడ్డోజు విజయవంతంగా చికిత్స చేసి, బాలుడికి నయం చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఆయన మీడియాకు తెలిపారు. " కర్మన్ ఘాట్ ప్రాంతానికి చెందిన ఆర్యన్ అనే 11 ఏండ్ల బాలుడికి సుమారు నెల రోజుల నుంచి తీవ్రమైన జ్వరం, దానికితోడు ఫిట్స్ వస్తున్నాయి. తొలుత సమీపంలోని ఆస్పత్రులలో చూపించారు. ఫిట్స్ తగ్గకపోవడం, జ్వరం కూడా పదే పదే రావడంతో ఆందోళన చెంది.. కింగ్ కోఠిలోని కామినేని ఆస్పత్రికి వచ్చారు. ఇక్కడకు వచ్చేసరికి బాబు ఆరోగ్య పరిస్థితి ఏమాత్రం బాగోకపోవడంతో ముందుగా అతడిని వెంటిలేటర్ మీద పెట్టి చికిత్స ప్రారంభించాం. తొలుత మెదడుకు ఎంఆర్ఐ తీసి బ్రెయిన్ టీబీ ఉందేమోనని చూశాం. అదేమీ లేదు. అప్పటికి మందులు ఇస్తున్నా బాలుడి శరీరం పెద్దగా ఏమీ స్పందించడం లేదు. దాంతో అనుమానం వచ్చి, మెదడుతో సహా శరీరం అంతటికీ పెట్ సీటీ స్కాన్ చేయించాం. అప్పుడు మేం అనుమానించినట్లు గానే ఆటో ఇమ్యూన్ ఎన్‌సెఫలైటిస్ అని తేలింది. ఇది అత్యంత అరుదైన వ్యాధి. దీనికి మూడు రకాలుగా చికిత్స చేయాల్సి వచ్చింది. ముందుగా ప్లాస్మా మార్పిడి చేయడం జరిగింది. అందువలన శరీరంలో ఏర్పడిన ఆటో యాంటీబాడీస్ ఫిల్టర్ చేయడం జరిగింది. ఈ విధముగా ప్లాస్మా ఎక్స్చేంజితో 5 దశల్లో రోజు తప్పించి రోజు స్టెరాయిడ్లతో చికిత్స (Pluse Theraphy) చేయడము జరిగింది. రోగికి కొంచెము మార్పు వచ్చాక , ఇమ్యునో గ్లోబులిన్ మందులు ఐవీ ద్వారా ఇచ్చాము. 2 గ్రామ్స్ పర్ కేజీ చొప్పున రోగి శరీర బరువును బట్టి లెక్కించి, ఎంత డోసులో ఇవ్వాలన్నది నిర్ణయించి, రోగికి సరిగ్గా సరిపోయేలాంటి మందుల డోసులు నిర్ధారించి వాటినే ఇచ్చాము. ఈ చికిత్సలు చేయడం వల్ల బాలుడికి పూర్తిగా నయ మైంది. మొత్తం చికిత్సకు, ఆర్యన్ పూర్తిగా కోలుకోవడానికి దాదాపు నెల రోజులు పట్టింది. ఇప్పుడు వెంటిలేటర్ తీసేసి, అన్నిరకాల మందులు కూడా ఆపి వేసి,అతడిని సాధారణ స్థితికి తీసుకొచ్చాము " వివరించారు. పిల్లలకు ఎప్పుడైనా రెండు వారాలకు మించి జ్వరం వస్తున్నా, ఫిట్స్ లాంటి ఇతర లక్షణాలు ఉన్నా వెంటనే తల్లిదండ్రులు అప్రమత్తం కావాల ని, బ్రెయిన్ టీబీ లాంటి సమస్యలు ఉన్నాయేమో పరీక్షించుకోవాలని డాక్టర్ అవినాష్ కుమార్ అడ్డోజు సూచించారు.

సెక్యూరిటీ గార్డుపై కర్రలతో దాడి

నవతెలంగాణ-శామీర్ పేట

ఓ కళాశాలలో పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డును గుర్తు తెలియని వ్యక్తులు తాళంతో కడుపులో పొడిచి కర్రలతో దాడి చేసిన ఘటన శామీర్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన కథనం ప్రకారం తుముకుంట మున్సిపల్ కేంద్రంలోని విశ్వ విశ్వాని కళాశాలలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న షేక్ షరీక్ (32) ఈ నెల 1న కళాశాల గేటు 2 వద్ద విధులు నిర్వహిస్తుండగా గేటు వద్దకు ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు నలుపు రంగు కారులోంచి దిగి కాలేజీ గేటు తెరవాలని డిమాండ్ చేశారు. సెక్యూరిటీ గార్డు కాలేజీ సమయం ముగియడంతో కాలేజీ గేటు మూసేశారని.. గేటు తెరవలేమని తెలపడంతో ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు సెక్యూరిటీ గార్డుని కర్రలతో కొట్టి, కారు తాళంతో కడుపులో పొడిచారు. దాడికి పాల్పడిన అనంతరం వారు అక్కడి నుంచి పరారయ్యారు. గాయ పడిన సెక్యూరిటీ గార్డును 108 అంబులెన్స్‌లో తూంకుంటలోని ఆర్ఎక్స్ ఆస్పత్రికి తరలించారని ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని శామీర్ పేట పోలీసులు తెలిపారు.

మేడ్చల్, శామీర్‌పేట్‌కు మెట్రో విస్తరణ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం..

- సీపీఐ(ఎం) మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి పి.సత్యం



నవతెలంగాన-సిటీబ్యూరో

మెట్రో రెండోదశ - బి భాగంలో మేడ్చల్, షామీర్పేట్‌లకు మెట్రో విస్తరణ చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయించడాన్ని సీపీఐ(ఎం) మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కమిటీ స్వాగతిస్తున్నట్టు ప్రకటించింది. ఈ మేరకు పార్టీ జిల్లా కార్యదర్శి పి.సత్యం గురువారం ఒక ప్రకటన విడుదల చేసారు. ప్యారడైజ్ నుంచి మేడ్చల్‌కు 23 కిలో మీటర్లు, జేబీఎస్ నుంచి షామీర్పేట్ కి 22 కిలోమీటర్ల మేరకు మెట్రోను విస్తరిస్తున్నట్టు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించినట్టు తెలిపారు. ఇందుకు మూడు నెలల్లో డిపిఆర్ ను తయారు చేయాలని ఆదేశించినట్టు తెలిపారు. ఈ ప్రభుత్వ ఈ నిర్ణయం వల్ల మేడ్చల్, షామీర్పేట్ ప్రజలకు, కార్మికులకు, ఉద్యోగులకు, విద్యార్థులకు ప్రయాణ సమయం బాగా తగ్గి మేలు జరుగుతుందని సీపీ(ఐ) భావిస్తున్నట్టు తెలిపారు. చాలా కాలం నుంచి ఈ ప్రాంతాలకు మెట్రో విస్తరించాలని ప్రజా ఆందోళనలు జరుగుతున్నాయని గుర్తు చేశారు.

మేడ్చల్, శామీర్పేట్ రెండూ పారిశ్రామిక కేంద్రాలని, భవిష్యత్తులో ఈ ప్రాంత అభివృద్ధికి ప్రభుత్వ ఈ నిర్ణయం తోడ్పడుతుందని పార్టీ జిల్లా కమిటీ ప్రభుత్వ నిర్ణయం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నట్టు తెలిపారు. హైదరాబాదు తూర్పు భాగమైన తార్నాక నుంచి ఈసీఐఎల్ (చర్లపల్లి) కీసరకు, ఉప్పల్ నుండి ఘట్కేసర్‌కు మెట్రో విస్తరణ రెండో దశలోనే చేపట్టాలని కోరారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ రద్దీ రీత్యా చర్లపల్లి రైల్వే స్టేషన్‌ను ఆధునికరించి రైల్వే టెర్మినల్‌గా రూపుదిద్దుకున్న విషయం తెలిసిందే అని, ఈ రైల్వే స్టేషన్‌కి కనెక్టివిటీ ఉండే విధంగా మెట్రో రైలును తార్నాక నుంచి కీసరకు విస్తరించాలని, ఇది ప్రజలకి, తూర్పు ప్రాంత అభివృద్ధికి అత్యంత ఉపయోగ కరంగా ఉంటుంది అని తెలిపారు. తెలంగాణకు రహదారుల్లో వరంగల్ రహదారి అత్యంత ముఖ్యమైనది అని, హైదరాబాద్ తర్వాత రాష్ట్రంలో అతిపెద్ద నగరం వరంగల్‌కు జాతీయ రహదారి ఉన్న ప్రాంతం అని, ఈ ప్రాంత అభివృద్ధికి, హైదరాబాద్‌కి రోజువారి రాకపోకల కు ఘట్కేసర్ నుంచి తీవ్రమైన రద్దీ ఉంటున్న నేపథ్యంలో మెట్రోను ఉప్పల్ నుంచి ఘట్కేసర్‌కు విస్తరణ ఈ రెండో దశలోనే చేపట్టాలని సీపీఐ(ఎం) మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కమిటీ కోరుతున్నట్టు తెలిపారు.

నిరుద్యోగులకు 4 నెలలు శిక్షణ



- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఉపాధి కల్పన అధికారి రాధిక

నవతెలంగాణ-సిటీబ్యూరో

జిల్లాలోని నిరుద్యోగ విద్యార్థులకు సేవాభారతి హెల్త్ కేర్ స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్స్టిట్యూట్ ద్వారా ఒక గొప్ప అవ కాశం అందుబాటులోకి వచ్చింది. పదో తరగతి లేదా ఇంట ర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థినులకు ప్రముఖ హాస్పిటల్స్ లో ఉద్యోగ అవకాశాలను కల్పించేందుకు నాలుగు నెలల ప్రత్యేక శిక్షణను అందించనున్నట్లు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారిణి యం.రాధిక ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

అందించే శిక్షణలు :

- కమ్యూనికేషన్, సాఫ్ట్ స్కిల్, బేసిక్‌కంప్యూటర్, యోగా, ధ్యానం.
- అడ్మిషన్ ఫీజు రూ.2,500.
- వయసు పరిమితి : 18-35 సంవత్సరాలు.

ఈ శిక్షణ ద్వారా విద్యార్థినులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే కాకుండా, వ్యక్తిత్వ వికాసానికి అవసరమైన నైపుణ్యాలు నేర్పబడతాయని రాధిక తెలిపారు. అర్హత గల విద్యార్థినూలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నిజాలను నిర్భయంగా వెలికితీస్తున్న నవతెలంగాణ



- కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాస్ రావు

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

నిజాలను నిర్భయంగా వెలుగులోకి తీసుకురావడంలో నవతెలంగాణ పాత్ర ప్రత్యేకమైనదని కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాస్ రావు అన్నారు. 2025 ఆంగ్ల నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని నవతెలంగాణ దిన పత్రిక రూపొందించిన 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను గురువారం కూకట్‌పల్లిలోని ఏసీపీ కార్యాలయంలో ఏసీపీ శ్రీనివాసరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన సంవత్సరంలో నవతెలంగాణ పత్రికకు మంచి ఆదరణ లభించాలన్నారు. నేటి పోటీ ప్రపంచంలో మిగతా పత్రికల కంటే దీటుగా ఎదగాలని ఆకాంక్షించారు. ప్రజల కష్టాలను, కార్మికుల సమస్యలను తెలుసు కుంటూ.. అధికారులకు, పాలకులకు వారధిగా పని చేసి ప్రజా సమస్యలు తీర్చేందుకు కృషి చేయాలన్నారు. ఎలాంటి అవరోధాలు, ఇబ్బందులు రాకుండా ప్రజలందరూ నూతన సంవత్సరములో సుఖ సంతోషాలతో ఉండాలన్నారు. నాయకులకు, అధికారులకు, ప్రజలకు, పత్రిక యజమాన్యానికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ రిపోర్టర్ ఆర్. శ్రీనివాస్ యాదవ్, నార్త్ వెస్ట్ మేనేజర్ జె.ఉపేందర్, కూకట్‌పల్లి డివిజన్ ఇన్‌చార్జి సి. శ్రీను, సర్కులేషన్ ఇన్‌చార్జి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- మాజీ ఎమ్మెల్యే , కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడంతో పాటు వారి సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే , కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. బుధవారం నియోజవర్గానికి చెందిన పలువురు పార్టీ నాయకులు, అభిమానులు, ప్రజలు మాజీ ఎమ్మెల్యేను కలిశారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ... కొత్త సంవత్సరంలో మీ అందరి జీవితాల్లో వెలుగులు నిండాలని.. అలాగే ఉన్నత శిఖరాలకు చేరాలని వారు ఆకాంక్షించారు.

కొత్త సంవత్సర కానుకగా కొత్త మెట్రో కారిడార్ల నిర్మించడం మన అదృష్టం..

గ్రేటర్ హైదరాబాద్ నగరానికి అనుసంధానిస్తూ రెండు కీలక మెట్రో కారిడార్లు నిర్మించడం పట్ల కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అభివృద్ధికి చాలా తోడ్పడుతుందని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. మెట్రో రైల్ ఫేస్-2 బీలో భాగంగా ప్యార డైజ్ మెట్రో స్టేషన్ నుంచి తాడ్ బండ్, బోయిన్‌పల్లి, సుచిత్ర సర్కిల్, కొంపల్లి, గుండ్లపోచంపల్లి, కండ్లకోయా, ఓఆర్ఆర్ మీదిగా 23 కిలోమీటర్ల వరకు అదే విధంగా జెబియస్ నుంచి శామీర్‌పేట్ వరకు 22 కిలోమీటర్ల వరకు నిర్మాణం పొడగించే ప్రతిపాదనపై సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. మెరుగైన కనెక్టివిటీని కోరుకునే నివాసితులకు ఈ పొడిగింపు కల సాకారమైందన్నారు. గత ప్రభుత్వంతో ఈ అంశాన్ని ఎన్నిసార్లు లేవనెత్తినా పట్టించుకోలేదన్నారు. ఈ ప్రాంతాలకు మెట్రో సేవలను విస్తరిస్తున్నందుకు ముఖ్యమంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజల సమస్యలు పరిష్కరించాలి



- కాంగ్రెస్ కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండి రమేష్

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ/కూకట్‌పల్లి

కూకట్‌పల్లి నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కోంటున్న సమస్యలను పరిష్కరించాలని కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ అన్నారు. గురువారం నియోజక వర్గం పరిధిలోని పలు ప్రాంతాల్లో స్థానిక నాయకులతో కలిసి ఆయన పాద యాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా మూసాపేట్ చౌరస్తా నుంచి హౌసింగ్ బోర్డ్ రోడ్డు, జేఎన్‌టీయూ రోడ్‌లో ట్రాఫిక్ సమస్య, రోడ్ల ఆక్రమణల కారణంగా ఉదయం, సాయంత్రం వేళ ట్రాఫిక్ జామ్, దోమల బెడద పై స్థానికులు పెద్ద ఎత్తున బండి రమేష్ దృష్టికి తీసుకవచ్చారు. అనంతరం కూకట్ పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్‌ను కలిసి వినతి పత్రం అందజే శారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మార్కెటింగ్ కమిటీ మెంబెర్స్, టెంపుల్ కమిటీ మెంబర్స్, బ్లాక్ అధ్యక్షులు, బ్లాక్ మహిళా అధ్యక్షురాలు, డివిజన్ అధ్యక్షులు, మహిళా అధ్యక్షులు, యూత్ కాంగ్రెస్, తదితరులు పాల్గొన్నారు.

మేడ్చల్‌కు మెట్రో సాధనలో ఎమ్మెల్యే కృషి

- ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్‌ని సన్మానించిన మెట్రో సాధన సమితి సభ్యులు



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్‌లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద మేడ్చల్ మెట్రో సాధన సమితి సభ్యులు ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్‌ని గురువారం కలిశారు. మేడ్చల్ ప్రాంతానికి మెట్రో సాధనలో కీలకంగా వ్యవహరించినందుకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ఉత్తర తెలంగాణ ప్రాంతానికి కీలకమైన కుత్బుల్లాపూర్ ప్రాంతం నుంచి నిత్యం నగరానికి లక్షలాదిమంది ప్రయాణిస్తుంటారని తెలిపారు. ప్రజల మనోభావాలను ప్రభుత్వానికి గుర్తుచేసి మెట్రోను సాధించినందుకు సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సూరారం డివిజన్ ప్రెసిడెంట్ పుప్పాల భాస్కర్, నాయకులు కుంట సిద్ధిరాములు, మెట్రో సాధన సమితి కమిటీ సభ్యులు సంపత్ రెడ్డి, జార్జ్, మహేందర్ రెడ్డి, గోరుగంటి వెంకటేశ్వర్లు యాదవ్, పుప్పాల నాగరాజు, అనిల్ సామినేని తదితరులు పాల్గొన్నారు.

నూతన సంవత్సర శుభాకాంక్షలు..



నవతెలంగాణ-కూకట్‌పల్లి

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని టీపీసీసీ లేబర్ సెల్ రాష్ట్ర కో ఆర్డినేటర్ - సోషల్ మీడియా ప్రెసిడెంట్ సప్పిడి భాస్కర్ కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే తెలంగాణ రాష్ట్రంలో, కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వ సంక్షేమ పథకాలు, కర పత్రాల ద్వారా లేబర్ సెల్ నాయకులు చేపట్టిన ప్రచారం గురించి సప్పిడి భాస్కర్ వివరించారు.

ముఖ్యమంత్రి కి శుభాకాంక్షలు తెలిపిన కృష్ణ రాజ్ పుత్

ఆంగ్ల నూతన సంవత్సరం సందర్భంగా.. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, ఆయన నివాసంలో టీపీసీసీ స్పోక్ పర్సన్ సత్యం శ్రీరంగంతో కలిసి కాంగ్రెస్ నాయకులు కృష్ణ రాజ్ పుత్ వెళ్ళి.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.



ముఖ్యమంత్రి ని కలిసిన కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్..

నూతన సంవత్సరం సందర్భంగా.. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని, ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.



పొన్నం ప్రభాకర్‌కు శుభాకాంక్షలు తెలిపిన దొడ్ల వెంకటేష్

నూతన సంవత్సరం సందర్భంగా.. తెలంగాణ బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్‌ను, ఆల్విన్ కాలనీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ కలిశారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సమ్మారెడ్డి, షౌకత్ అలీ మున్నా, పోశెట్టి గౌడ్, రాజు గౌడ్, రవీందర్ తదితరులు ఉన్నారు.



కేపీహెచ్‌బీ : 2025 నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని గురువారం బంజారాహిల్స్‌లోని మంత్రుల సముదాయం నందు గల తెలంగాణ రాష్ట్ర ఐటీ పరిశ్రమల, శాసనసభ వ్యవహారాల శాఖ, రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబుని కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు శేరి సతీష్ రెడ్డి కలిశారు. శాలువాతో ఘనంగా సత్కరించి పూల మొక్కను అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.



బీఆర్ఎస్ నేత శంభీపూర్ క్రిష్ణ కి నూతన సంవత్సర శుభాకాంక్షల వెల్లువ..

దుండిగల్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ శంభీపూర్‌లోని కార్యాలయంలో వద్ద కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, మహిళా ప్రజాప్రతినిధులు, నాయకులు, సంక్షేమ సంఘాల సభ్యులు, కార్యకర్తలు, అభిమానులు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత శంభీపూర్ క్రిష్ణని మర్యాదపూర్వకంగా కలిసి ఆంగ్ల నామ సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.


ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఈ నూతన ఆంగ్లనామ సంవత్సరంలో ప్రజలంతా నూతన ఉత్తేజంతో ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో తులతూగాలన్నారు. అనంతరం దుండిగల్ మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ జనరల్ సెక్రెటరీ కొల్తూర్ మల్లేష్ ముదిరాజ్ జన్మదిన సందర్భంగా పులే బొకె ఇచ్చి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.



దుండిగల్: నూతన సంవత్సర సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని కొంపల్లి మున్సిపాలిటీ కాంగ్రెస్ సీనియర్ నాయకులు జెమ్మీ దేవేందర్ నేతృత్వంలో... కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డికి గురువారం కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



దుండిగల్: నూతన సంవత్సర సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డికి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, యువజన నాయకులు, మహిళ నాయకురాళ్లు, ఐఎన్‌టీయూసీ నాయకులు, మైనారిటీ నాయకులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.



ఎమ్మెల్యే కేపీ.వివేకానందని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన డీప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్..

కుత్బుల్లాపూర్: ఎమ్మెల్యే కేపీ.వివేకానందని కొంపల్లి కార్యాలయంలో డీఆప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, కలిసి శాలువాతో సత్కరించి.. పూల పూల మొక్కను బహుకరించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు ఆనంద్ రెడ్డి, నాయకులు శ్రీకర్ గుప్త, వైయస్, యువకులు రామ్ చరణ్ తదితరులున్నారు.



జగద్గిరిగుట్ట: మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్‌ను గురువారం ఆయన నివాస కార్యాలయంలో, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఓబీసీ మోర్చా కో కన్వీనర్ ఆదిత్య కోడి, చింతల్ డివిజన్ ఉపాధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి కలిసి పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
సికింద్రాబాద్ - సనత్‌నగర్ - జూబ్లీహిల్స్
శుక్రవారం | జనవరి 03, 2025 | www.navatelangana.com

నవతెలంగాణ క్యాలెండర్ విడుదల చేసిన ప్రొ.పూస



నవతెలంగాణ-ఓయూ

ఉస్మానియా ఇంజనీరింగ్ కళాశాల మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం మాజీ హెడ్, బీఓఎస్ ప్రొ.పూస.రమేష్ బాబు గురువారం ఓయూలో తన ఛాంబర్‌లో నవతెలంగాణ సీనియర్ రిపోర్టర్, ఓయూ పీహెచ్డీ స్టూడెంట్ తలారి.శ్రీనివాసరావుతో కలిసి నవతెలంగాణ క్యాలెండర్ విడుదల చేశారు. నవతెలంగాణ కుటుంబ సభ్యులకు, రాష్ట్ర ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

నవతెలంగాణ క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

నవతెలంగాణ 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ తన కార్యాలయంలో సీనియర్ రిపోర్టర్ ప్రసాదరావు, యూసుఫ్‌గూడా కార్పొరేటర్ రాజ్ కుమార్ పటేల్, కాసాల అరుణ్ కుమార్, కే నరసింహారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు నర్సింగ్ దాస్, సంతోష్ ముదిరాజ్‌తో కలిసి క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాజకీయ పార్టీలకు అతీతంగా వాస్తవాలు రాసే పత్రిక నవతెలంగాణ అని అభినందించారు.

కంటోన్మెంట్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి



- కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్

నవతెలంగాణ-కంటోన్మెంట్

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పాటైనాక కంటోన్మెంట్ నియోజకవర్గం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టిందని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ తెలిపారు. నార్త్‌జోన్ ప్రజలకు నూతన సంవత్సర కానుకగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మెట్రో రైల్ కారిడార్‌ను నార్త్‌జోన్‌కు విస్తరించే నిర్ణయం తీసుకోవడం పట్ల కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం తన క్యాంపు కార్యాలయంలో కార్యకర్తలు మిఠాయిలు పంచిపెడుతూ సంబురాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్యారడైజ్ నుంచి మేడ్చల్‌కు, జెబీఎస్ నుంచి శామీర్‌పేటకు మెట్రో లైన్ ఏర్పాటుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకోవడం తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేండ్లు అధికారంలో ఉన్నా నార్త్‌జోన్ మీద దృష్టి పెట్టలేదని విమర్శించారు. గతంలో కాంగ్రెస్ హయాంలోనే హైదరాబాద్ మెట్రో రైల్‌కు బీజం పడిందని, ఇప్పుడు మళ్లీ కాంగ్రెస్ హయాంలోనే హైదరాబాద్‌లో మెట్రో విస్తరణ అవుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. నార్త్‌జోన్ ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు లేకుండా ఎలివేటెడ్ కారిడార్ ఏర్పాటు, రాజీవ్ రహదారి విస్తరింణ, ఇప్పుడు తాజాగా నార్త్‌జోన్‌లో 45 కిలోమీటర్ల మెట్రో లైన్ ఏర్పాటు దిశగా చర్యలు చేపట్టడం హర్షనీయం అన్నారు. కంటోన్మెంట్ వాసుల తరపున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ధన్యవాదాలు తెలుపుతున్నానని ఎమ్మెల్యే శ్రీగణేష్ తెలిపారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



నవతెలంగాణ-కంటోన్మెంట్

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మెట్రో రైల్ కారిడార్‌ను నార్త్‌జోన్‌లో కూడా విస్తరించే నిర్ణయం తీసుకోవడం పట్ల కంటోన్మెంట్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం ఉదయం జూబ్లీ బస్టాండ్ చౌరస్తా వద్ద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మధుకర్, బలవంత రెడ్డి నరేష్, సామ్సన్ రాజు, శివతో పాటు పలువురు సీనియర్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మధుకర్ మాట్లాడుతూ.. ప్యారడైజ్ నుంచి మేడ్చల్‌కు, జెబీఎస్ నుంచి శామీర్‌పేటకు మెట్రో లైన్ ఏర్పాటుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకోవడం కంటోన్మెంట్ ప్రజలకు శుభ దాయకమని అన్నారు. ఎమ్మెల్యే శ్రీగణేష్ సారాధ్యంలో కంటోన్మెంట్ అభివృద్ధితోందని చెప్పారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పాటైనాక కంటోన్మెంట్ నియోజకవర్గం ప్రతి సమస్య ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుపోయి ఎమ్మెల్యే శ్రీ గణేష్ పరిష్కార దిశగా పనిచేస్తున్నారని చెప్పారు. ఎమ్మెల్యే చొరువాతో కాంగ్రెస్ ప్రభుత్వం కంటోన్మెంట్ అభివృద్ధి మీద ప్రత్యేక దృష్టి పెట్టిందని చెప్పారు.

నేడు ఓయూ పాలక మండలి సమావేశం

- ఓయూ వీసీ తొలి ఈసీ సమావేశం

నవతెలంగాణ-ఓయూ

నేడు ఉస్మానియా విశ్వవిద్యాలయం పాలక మండలి (ఈసీ) సమావేశాన్ని సచివాలయంలో కాన్ఫిరెన్స్ హాల్లో నిర్వహించనున్నారు. ఈ మేరకు ఉస్మానియా విశ్వవిద్యాలయంకు పూర్తిస్థాయిలో పాలక మండలి సభ్యులు లేక పోవడంతో ఉన్న మూడు ఎక్స్ అఫిషియో సభ్యులు హైయ్యర్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపాల్ సెక్రెటరి, ప్రిన్సిపాల్ సెక్రెటరి ఫైనాన్స్ సెక్రెటరీలు, కాలేజియేట్ ఎడ్యుకేషన్‌తో పాటుగా ఓయూ వీసీ చైర్మెన్ హొదాలో, ఓయూ రిజిస్ట్రార్ సెక్రటరీగా మొత్తం ఐదుగురు సభ్యులతో ఈ పాలక మండలి సమావేశం నిర్వహించనున్నారు. ఓయూ వీసీ ప్రొ. కుమార్ వీసీగా బాధ్యతలు స్వీకరించక తొలి పాలక మండలి సమావేశం కావడంతో అధికారులు పలు అంశాలపై ప్రత్యేకంగా చర్చించి ఎజెండాను రూపకల్పన చేసినట్టు తెలుస్తోంది. ఇక యూనివర్సిటీలో జరగాల్సిన సమావేశం ఈ మారు రాష్ట్ర సచివాలయంలో అవ్వనున్నాయి.



జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌ను కాసాల అరుణ్ కుమార్ గురువారం కలిసి బొకే ఇచ్చి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. ఆయనతోపాటు బీఆర్ఎస్ నాయకు రాలు సుజాత, కార్యకర్తలు కూడా ఎమ్మెల్యేకి శుభాకాంక్షలు తెలిపారు. నవతెలంగాణ-జూబ్లీహిల్స్

బ్రాండ్‌కు తగ్గట్టుగా ఓయూ క్యాలెండర్



నవతెలంగాణ-ఓయూ

ఉస్మానియా విశ్వవిద్యాలయం 2025 క్యాలెండర్స్‌ను బుధవారం ఓయూ వీసీ ప్రొ. కుమార్ విడుదల చేసిన విషయం తెలిసిందే. ఇక క్యాలెండర్‌లో పొందుపరిన ఫొటోస్ ప్రత్యేక ఆకర్షణగా ఉన్నయని, క్యాలెండర్ కోసం ఎంపిక చేసిన ఫొటోలు ఓయూ బ్రాండ్‌కు తగ్గట్లుగా ఉందనంటూ సర్వత్ర ఓయూ, మేధావి వర్గాలు హర్షం వ్యక్తం చేశాయి. గత కొన్ని ఏండ్లుగా ఓయూ క్యాలెండర్స్, డైరీలు, ఇన్ఫ్రమ్యాటికలు, అత్యంత జాప్యంతో వచ్చేవి కానీ ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఓయూ వీసీ ప్రత్యేక చొరవతో జనవరి-01 నాడే క్యాలెండర్ మార్కెట్‌లోకి అందుబాటులోకి తెప్పించటం విశేషం. ఇతరులకు గత ఏడాది క్యాలెండర్‌ను రూ.130కి విక్రయాలు చేశారు. ఈ మారు కేవలం 100 రూపాయలకె క్యాలెండర్స్ ఇతరులకు విక్రయిస్తున్నారు. ఓయూ ప్రెస్ కౌంటర్స్ వద్దకు క్యాలెండర్ కోసం విద్యార్థులు, విద్యావేత్తలు, విద్యా సంస్థల ప్రతినిధులు వస్తున్నారు.

త్వరలో బసవతారకం ఆస్పత్రి విస్తరణ

- ఏపీలోని తుళ్లూర్లులోనూ హాస్పిటల్ నిర్మాణం
- ఏదో శక్తి నన్ను నడిపిస్తోంది..
- ఎమ్మెల్యే, బసవతారకం ఆస్పత్రి చైర్మెన్ నందమూరి బాలకృష్ణ...
- బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్‌లో నూతన సంవత్సర వేడుకలు



నవతెలంగాణ-బంజారాహిల్స్

త్వరలోనే హైదరాబాదులోని బసవతారకం హాస్పిటల్‌ను విస్తరిస్తూ ఆంధ్రప్రదేశ్‌లోని తుళ్లూరు ప్రాంతంలోనూ హాస్పిటల్ నిర్మాణాన్ని ప్రారంభించి పూర్తి చేస్తామని ఎమ్మెల్యే, బసవతారకం ఆస్పత్రి చైర్మెన్ నందమూరి బాలకష్ణ ప్రకటించారు. బంజారాహిల్స్ బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్‌లో 2025 నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై చిన్నారులతో కలసి సిబ్బంది ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను కట్ చేసి వేడుకలను ప్రారంభించారు. అనంతరం చిన్నారులకు ప్రత్యేకమైన బహుమతులు అందజేసి మాట్లాడారు. సినిమాలలో కాని, అన్‌స్టాపబుల్ కార్యక్రమాలలో వినోదాన్ని పంచుతూ హాస్పిటల్ వ్యవహారాలను విజయవంతంగా ముందుకు తీసుకొని వెళ్లడానికి ఏదో శక్తి తనను నడిపిస్తోందని తెలిపారు. సంస్థ 25 వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఘనంగా వజ్రోత్సవాలను నిర్వహించుకోబోతున్నామని వెల్లడించారు. సంస్థ పురోగతికి దోహదపడిన దాతలు, గత పాలకమండలి సభ్యులు, పని చేసిన వైద్యులు, సిబ్బంది కి కృతజ్ఞతలు తెలియజేస్తూ వజ్రోత్సవాల సందర్భంగా ఇప్పటి వరకూ పని చేసిన తీరును పునశ్చరణ చేసుకొని మరింత ముందుకు తీసుకొని వెళ్లడానికి కట్టుబడి ఉన్నామని అన్నారు. ప్రజలకు వైద్యం చేయాలి, సేవ చేయాలన్ని ధృక్పథంతోనే హాస్పిటల్ నడుస్తుందని చెప్పారు. చివరగా తెలుగు ప్రజలకు, అభిమానులకు, హాస్పిటల్ సిబ్బందికి మరో మారు ఆంగ్ల నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు వేడుకలలో సీఈఓ డా.కె కృష్ణయ్య, ఎండి డా.టి ఎస్‌రావు, ఎంఎస్ డా.ఫణి కోటేశ్వర రావు, ఆసోసి యేట్ డైరెక్టర్, అకడమిక్స్,డా కల్పనా రఘునాధ్‌లతో పాటూ పలువురు వైద్య విభాగాధి పతులు, వైద్యులు, వైద్యేతర సిబ్బంది, నర్సింగ్, పారా మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

బీడీ కార్మికుల కోసం ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలి

- కొన్ని బీడీ కంపెనీలను జీఎస్టీ పరిధిలోకి తీసుకోవాలి
- భారతీయ మజ్దూర్ సంఘ్

నవతెలంగాణ-బంజారాహిల్స్



దేశంలోని బీడీ కార్మికుల కోసం ప్రభుత్వాలు ప్రత్యేక చట్టాలు తీసుకురావాలని భారతీయ మద్దూర్ సంఘ్ డిమాండ్ చేసింది. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అఖిలభారత సంఘటన కార్యదర్శి సురేంద్రన్, ప్రధాన కార్యదర్శులు కే, శ్రీనివాస్, టి.రామ్ రెడ్డిలు మాట్లాడారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తప్పుడు విధానాల వల్ల బీడీ కార్మికులు, బీడీ కర్మాగారాలు ఎన్నో రకాల కష్టాలు ఎదుర్కొంటున్నయని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో సుమారు నాలుగు కోట్ల మందికి బీడీ పరిశ్రమ ఉపాధి కల్పిస్తుందని అందులోనూ అత్యధికంగా పేద వర్గాలకు చెందిన ప్రజలే ఎక్కువగా ఉన్నారని అన్నారు. కోట్లాదిమందికి ఉపాధి కల్పిస్తున్న పరిశ్రమను రక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని పేర్కొన్నారు. అనధికారికంగా కొనసాగుతున్న బీడీ పరిశ్రమలకు గుర్తింపునిచ్చి ఆయా పరిశ్రమలలో పనిచేస్తున్న కార్మికుల హక్కులను రక్షించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. ముఖ్యంగా ప్రతి ఒక్క కార్మికునికి ఈఎస్‌ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని కోరారు. పాత పద్ధతిలో పదిఏండ్లు పూర్తి చేసిన కార్మికులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఆరోగ్యానికి హానికరం అనే పేరుతో బీడీ కార్మికులకు ప్రత్యాన్యం చూపకుండా బీడీ పరిశ్రమలను మూసివేసే ఆలోచన విరమించుకోవాలని సూచించారు. పరిశ్రమకు సంబంధించిన అనుబంధ మంత్రిత్వ శాఖలో ప్రత్యేక చర్చలు జరిపి కార్మికులకు ప్రత్యామ్నాయ ఉపాధిని రూపొందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా ఆర్గనైజింగ్ సెక్రెటరీ, బి.సురేంద్రనాథ్, ఉపాధ్యక్షులు ఎస్ మల్లేశం, తెలంగాణ ఆర్గనైజింగ్ సెక్రటరీ, రామ్మోహన్, ఆల్ ఇండియా బీడీ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి సుధీర్, తెలంగాణ కార్యదర్శి కొండల్ రెడ్డి పాల్గొన్నారు.

నగర ప్రజలకు మరిన్ని సేవలందించాలి

- జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి

నవతెలంగాణ-సిటీబ్యూరో

నూతన సంవత్సరంలో నగర ప్రజలకు మరిన్ని సేవలందించాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి అన్నారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో గురువారం జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తిని జోనల్ కమిషనర్లు, విభాగాధిపతులు, కార్పొరేటర్లు, ఇతర అధికారులు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ... 2024 సంవత్సరం నగర అభివద్ధి, ప్రజలకు మెరుగైన సేవలందించడానికి విజయవంతమైన సంవత్సరం కాగా, కొత్త సంవత్సరం 2025 లో మరింత అభివద్ధి పథంలో ముందుకు సాగాలని సంకల్పంతో పని చేయాలన్నారు. కార్పొరేటర్లు ప్రజల సమస్యలను పరిష్కరించడానికి అధికారులతో సమన్వయం చేసుకుంటూ పని చేయాలని కోరారు. కమిషనర్‌ను కలిసిన వారిలో జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు, ఇతర అధికారులు, సిబ్బంది, కార్పొరేటర్లు ఉన్నారు. ఈ సందర్భంగా అందరూ ఒకరికి ఒకరు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

అన్ని అర్హతలు సాధించాం.. విధుల్లోకి తీసుకోండి

- ఉద్యోగ తేదీ ప్రకటించి మా సేవలు సద్వినియోగం చేసుకోండి
- ఉద్యోగ అర్హత సాధించిన అభ్యర్థులు

నవతెలంగాణ-బంజారాహిల్స్



అర్హత సాధించిన తమకు ఉద్యోగ నియామక పత్రాలను అందించి తమ సేవలను ప్రభుత్వం సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్ ఉద్యోగులు కోరుతున్నారు. ఇంకెన్నాళ్లు నిరీక్షించాలంటూ శాంతియుతంగా గురువారం సోమాజిగూడ విద్యుత్ సౌధా కార్యాలయాలం వద్ద ఉద్యోగ అర్హత సాధించిన అభ్యర్థులు 400 మంది ప్లకార్డులను ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. శాంతి యుతంగా గేటు లోపలికి వెళ్లేందుకు యత్నించారు. వారిని సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకోవడం తోపాటు ఖైరతాబాద్ పోలీసులు జోక్యం చేసుకొని ప్రభుత్వం స్పందించే వరకు వేచి ఉండాలని ముందస్తుగా అనుమతులు తీసుకొని కార్యాలయానికి రావాలని సూచించారు. దీంతో నిరాశకు గురైన వారందరూ రోడ్డుపైనే నిలుచుని పోలీసులతో వారి ఆవేదన వ్యక్తపరచుకున్నారు. వారు పోలీసులతో మాట్లాడుతూ.. గత ఏడాది నోటిఫికేషన్ డేట్ 4/10/2023,న పరీక్షలు నిర్వహించగా 14/7/ 2024,న ఫలితాలు వచ్చాయని తెలిపారు. అనంతరం 18/ 9/2024, డాక్యుమెంట్ వెరిఫికేషన్ కూడా పూర్తి చేశారని కానీ ఇన్ని నెలలు గడిచినా విధుల్లో తీసుకునే తేదీ ధ్రువీకరణ పత్రాలు ఎప్పుడో ఇస్తారో తెలియడం లేదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం, విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్కను అలాగే విద్యుత్ శాఖల ఉన్నత అధికారులు తమతో చర్చించాలని కోరారు.ఇప్పటికే ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజావాణిలో పలుమార్లు వినతి పత్రాలు ఇవ్వడంతో పాటు గాంధీ భవన్ సైతం చేరుకొని టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్‌ను కలిసి తమ గోడు వెళ్ళబుచ్చామని తెలిపారు. ఖైరతాబాద్ పోలీసులు మాట్లాడుతూ.. మీరందరూ అర్హత సాధించిన ప్రభుత్వ ఉద్యోగులు కనుక ఏదైనా చర్చలతో లేదా ప్రభుత్వంలోని అధికారులతో సమావేశమై సమస్యను పరిష్కరించుకోవాలని రహదారులపై వచ్చి ట్రాఫిక్ అంతరాయం కలిగించవద్దని వారికి సూచించారు. ఈ విషయాన్ని గమనించిన వారందరూ శుక్రవారం మరో మారు ప్రజావాణిలో దరఖాస్తు ఇవ్వనున్నట్టు తెలిపారు.

ఇందిరమ్మ ఇండ్లకు మొదలైన సర్వే



- అర్హులైన పేదలకు ఇండ్లు ఇవ్వాలి
- మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్

నవతెలంగాణ-కంటోన్మెంట్

కంటోన్మెంట్ బోర్డు చిన్నతోకట్ట సంజీవయ్యనగర్‌లో ఇందిరమ్మ ఇండ్ల కోసం గురువారం ఇండ్ల రెవిన్యూ అధికారులు ఇంటింటి సర్వే మొదలుపెట్టారు. ఈ సందర్భంగా మాజీ ఉపాధ్యక్షుడు జంపన్న ప్రతాప్ సర్వే చేస్తున్న ప్రాంతానికి వెళ్లి బృందాన్ని కలిశారు. ఈ సందర్భంగా ఆయన సర్వే బృందంతో మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరికి పార్టీల కతీతంగా న్యాయం చేయాలనీ సూచించారు. సర్వే సక్రమంగా పూర్తిచేయాలని సర్వే చేస్తున్న అధికారులు దళారుల మాటలు నమ్మొద్దని కోరారు. అదేవిధంగా ఎలివేటెడ్ నిర్మాణంలో భాగంగా అధికారులు కృష్ణారెడ్డి కాలనిలో చేస్తున్న మార్కింగ్‌ను పరిశీలించారు. ఇండ్లు కోల్పోయే ప్రతి ఒక్కరి వివరాలు పూర్తిస్థాయిలో నమోదుచేసుకుని వారికి ప్రభుత్వం నుండి నష్టపరిహారం అందేలా చూడాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో చిన్నతోకట్ట, సంజీవయ్య వీకర్ సెక్షన్ స్థానికులు పాల్గొన్నారు.

ప్రాణాపాయ స్థితిలో ఉన్న వ్యక్తికి ప్రాణం పోసిన 'కేర్'

నవతెలంగాణ-బంజారాహిల్స్



పలుమార్లు గుండెపోటుకు గురై ప్రాణాపాయ స్థితిలో ఆసుపత్రిలో చేరిన వృద్ధురాలికి కేర్ ఆస్పత్రి వైద్యులు చికిత్సను అందించి బ్రతికించారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వృద్ధురాలు నగరంలోని ప్రయివేట్ ఆస్పత్రిలో వైద్య చికిత్స పొందుతూ.. ఒక్కసారిగా తీవ్రమైన హృద్రోగానికి గురయ్యారు. దీంతో అమె కుటుంబీకులు మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం అమెను బంజారాహిల్స్‌లోని కేర్ ఆస్పత్రికి తరలించారు. ఈ నేపథ్యంలో కేర్ ఆస్పత్రి వైద్యులు డా.వి. సూర్యప్రకాశరావు, వైద్య బృందం రోగి గుండె పనితీరు మెరుగు పరచడానికి వైద్య పరీక్షల ద్వారా ఆరోగ్య స్థితిని అంచనా వేశారు. రోగి గుండె కేవలం 25% మాత్రమే రక్తాన్ని సరఫరా చేస్తుందనే విషయాన్ని గుర్తించారు. అమె అనారోగ్య సమస్యలు, గుండెపోటు, మధుమేహానికి సంబంధించిన కార్డియోమయోపతి వంటి కారణాలతో ఈ దుస్థితి నెలకొని ఉండొచ్చని అంచనా వేశారు. ఈ క్రమంలో వైద్యులు రోగికి వైద్య చికిత్స ప్రారంభించారు. రోగి ఆరోగ్య పరిస్థితిని స్థిరీకరించడానికి తొలుత రోగిని ఇంట్రా-అయోర్టిక్ బెలూన్ పంప్ (ఐఏబిపి) పరికరంలో.. వెంటిలేటర్ సాయంతో ఉంచారు. అయినప్పటికీ ఆమె హృదయ స్పందనలు అసాధారణంగానే కొనసాగాయి. దీంతో క్రమ రహిత హృదయ స్పందనలను క్రమబద్ధం చేసేందుకు 'స్టెలేట్ గ్యాంగ్లియన్ బ్లాక్' వైద్య చికిత్సను అందించారు. కేర్ ఆస్పత్రి క్లినికల్ డైరెక్టర్, కార్డియాలజీ విభాగాధిపతి డా.వి.సూర్యప్రకాశరావు ఈ క్రమంలో పలుమార్లు కార్డియోవెర్షన్, అధునాతన ఫార్మాకోథెరపీ అందించడం ద్వారా రోగి ఆరోగ్య స్థితిని సాధారణ స్థాయికి తెచ్చారు. ఆరోగ్యం మెరుగైన తర్వాత రోగికి 'స్టేట్ ఆఫ్ ది ఆర్ట్ కార్డియాక్ రీ సింక్రోనైజేషన్ థెరపీ డిఫిబ్రిలేటర్' (సీఆర్‌టీ-డీ) అమర్చారు. ఈ అధునాతన పరికరం ఆమె హృదయ స్పందన నియంత్రించడంలో సహాయ పడటమే గాక గుండె నుంచి రక్త సరఫరా పనితీరును మెరుగుపరచడంలో సైతం సాయం అందిస్తుంది. తదనుగుణంగా రోగి ఆరోగ్య స్థితి సాధారణ స్థాయికి చేరింది. అనంతరం డా.వి.సూర్యప్రకాశరావు మాట్లాడుతూ... రోగి గుండె స్థితిని స్థిరీకరించడంలో అమె కోలుకునేలా చేయడంలో ఆస్పత్రికి చెందిన వివిధ విభాగాల వైద్య బృందం సమన్వయంతో కృషి చేసిందని చెప్పారు. సంక్లిష్టమైన, ప్రాణాలను రక్షించే గుండె సంరక్షణను అందించడంలో కేర్ ఆస్పత్రి నిబద్ధతకు ఈ కేసు ఒక ఉదాహరణ అని తెలిపారు. కేర్ ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డా. అజిత్ సింగ్, జోనల్ చీఫ్ ఆపరేటింగ్ అధికారి బిజు నాయర్ మాట్లాడుతూ.. ప్రాణాపాయ స్థితిలోని రోగికి విజయవంతంగా వైద్య చికిత్స అందించడంలో వైద్యుల నైపుణ్యం ఉందన్నారు. రోగికి వైద్య సేవలు అందించిన వైద్య బృందంలో డా. వి. సూర్యప్రకాశరావు, డా. ఎస్. రాహుల్ అగర్వాల్, డా. టీవీఎస్ గోపాల్, డా. ఎస్ వి కే రామకృష్ణ, వైద్య సిబ్బంది ఉన్నారు.

పలువురికి జంపన నూతన సంవత్సర శుభాకాంక్షలు





నవతెలంగాణ-కంటోన్మెంట్

కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జంపన ప్రతాప్ గురువారం ఎమ్మెల్యే శ్రీ గణేష్‌ను కలిసి శుభాకాంక్షలు చెప్పారు. అనంతరం జూబ్లీహిల్స్‌లోని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ. బీసీ మైనారిటీ శాఖల ప్రభుత్వ సలహాదారు మహ్మద్ షబ్బీర్ అలీని అయన నివాసానికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కంటోన్మెంట్‌లోని కొన్ని అంశాలను జంపన ప్రతాప్ షబ్బీర్ అలీకి తెలిపారు. అనంతరం కంటోన్మెంట్ సీఈఓ మధుకర్ నాయక్. జాయింట్ సీఈఓ పల్లవి విజయ్ వంశీని కలిసి పుష్పగుచ్ఛము ఇచ్చి శుభకాంక్షలు తెలిపారు. కార్యక్రమాల్లో హ్యూమన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ప్రకాష్ భాంటియా, మైనారిటీ నాయకులూ షకీబ్ హుస్సేన్, సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఏడేండ్ల తర్వాత పీసీ.సర్కార్ మ్యాజిక్ షో

నవతెలంగాణ-బేగంపేట్



ప్రపంచ ప్రఖ్యాత మెజీషియన్ పీసీ.సర్కార్ తన మెగా మ్యాజిక్ షో "ఇంద్రజాల్" ద్వారా మంత్రముగ్ధులను చేసే ప్రదర్శన హైదరాబాద్‌లో ఇవ్వనున్నారు. పీసీ.సర్కార్ (సీనియర్) భారతీయ మ్యాజిక్‌ను ప్రపంచ వేదికకు తీసుకెళ్లడంలో బాధ్యత వహిస్తే, అతని కుమారులు ప్రపంచ వేదికపై ఇంద్రజాల్‌కు ఒక ముఖ్యమైన పేరును సృష్టించడంలో చాలా అడుగులు ముందుకు వేశారు. ప్రపంచవ్యాప్తంగా అనేక ప్రతిష్టాత్మక అవార్డులను గెలుచుకున్న సర్కార్‌లు ఇండియన్ మ్యాజిక్‌కు గొప్ప రాయబారులుగా ఉన్నారు. ఈ వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లడం ద్వారా, భారతదేశపు లియోనార్డో-డా-విన్సీ అని పిలువబడే పీసీ.సర్కార్ (యంగ్) తనంతట తానుగా ఒక లెజెండ్. అతని కుమారుడు పీసీ.సర్కార్ (పోరుష్) కుటుంబంలో అతి పిన్న వయస్కుడైన మాంత్రికుడు. చిత్రకారుడు, డ్రమ్మర్ అయిన ఆయన తన తాత చేసిన కొన్ని గొప్ప ఉపాయాలపై పనిచేయడానికి ఇప్పటికే ఒక ప్రత్యేకమైన మార్గాన్ని సృష్టించారు. ఈసారి పీసీ.సర్కార్ (పోరుష్) ఏడేండ్ల తర్వాత హైదరాబాద్‌లో సికింద్రాబాద్‌లోని హరిహర కళా భవన్‌లో ప్రదర్శన ఇస్తున్నారు. జనవరి4 నుంచి జనవరి19 వరకు శనివారాలు, ఆదివారం సాయంత్రం నాలుగు గంటలకి ఉంటుంది. వివరాల కోరకు 8523038257 ఆన్‌లైన్ బుకింగ్ కోరాకు www.insider.in సంప్రదించాలి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పీసీ.సర్కార్ తెలిపారు.

రుచి, శుభ్రత, నాణ్యతలో రాజీపడం

- సుప్రభాత్ హోటల్ ఎండీ ఎం.కృష్ణమూర్తి

నవతెలంగాణ-ఓయూ



రుచి, పరిశుభ్రత, నాణ్యత విషయంలో రాజీపడేది లేదని సుప్రభాత్ హోటల్ ఎండీ యం.కృష్ణమూర్తి అన్నారు. గురువారం సుప్రబాత్ హోటల్‌లో నవతెలంగాణ సీనియర్ రిపోర్టర్, ఓయూ పీహెచ్డీ స్టూడెంట్ తలారి.శ్రీనివాసరావుతో కలిసి నవతెలంగాణ క్యాలెండర్స్ విడుదల చేశారు. గత కొన్ని సంవత్సరాలుగా నగరంలో సుప్రభాత్ హొటళ్లు సాధారణ ధర లకే ఎంతో రుచికరమైన, ఆరోగ్యకరమైన శాకాహార ఆహారాన్ని ఇస్తున్నట్టు, భోజన ప్రియుల మన్నలు పొందామని చెప్పారు. తమ వినియోగదారులకు, కష్టమర్స్‌కు, హోటల్ ఉద్యోగులకు, సిబ్బందికి, నవతెలంగాణ కుటుంబ సభ్యులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి అదృశ్యం



నవతెలంగాణ - చర్లపల్లి

ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక వ్యక్తి ఇంటి నుంచి వెళ్లిపోయిన ఘటన చర్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై శేఖర్ చెప్పిన వివరాల్లో ప్రకారం చర్లపల్లి లక్ష్మి నగర్ కాలనీ వాసి బుక్య శివ కుమార్ మూడేండ్ల నుంచి బెట్టింగ్ ఆడుతూ, దాదాపు ఒక రూ. 50 లక్షల వరకు అప్పు చేశాడు. అందులో సగం వరకు కట్టివేశాడు. ఈ అప్పు విషయమై తాను ఇంట్లో నుండి వెళ్లిపోతాను, అని తరచూ తన భార్య కుటుంబ సభ్యులతో చెప్పేవాడు. ఆర్థిక ఇబ్బందులు ఎదురు కావడంతో కొంతకాలంగా బాధపడుతున్నాడు. గురువారం ఉదయం తాను ఊరికి వెళ్లి వస్తానని, తన పిల్లలకు చెప్పి, ఇంట్లో నుంచి వెళ్ళి పోయి, మరలా రాలేదు. ఇంట్లో ఉత్తర ం రాసి వెళ్లిన విషయం తెలిసిన కుటుంబ సభ్యులు బంధువుల ద్వారా ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఎవరికైనా ఆచూకీ తెలిస్తే ఎస్ఐ శేఖర్ 871266 2784, పోలీస్ స్టేషన్ నెంబర్ 8712662788 కి తెలియజేయాలని వారు ఒక ప్రకటనలో కోరారు.

అథ్లెటిక్స్‌లో మైనారిటీ గురుకుల విద్యార్థికి ద్వితీయ స్థానం



నవతెలంగాణ-శామీర్‌పేట

తెలంగాణ మైనారిటీ గురుకుల బాలుర పాఠశాల, కళాశాలలో ఎంపీసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న భాస్కర్ రెడ్డి రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ అండర్ 19 విభాగంలో 5 కి.మీ లో ద్వితీయ స్థానం సాధించారని పాఠశాల ప్రిన్సిపాల్ ఎం కృష్ణ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జార్ఖండ్ రాష్ట్రంలోని రాంచీలో ఈ నెల 5నుంచి 8వరకు జరిగే జాతీయ స్థాయి అథ్లెటిక్స్ 5 కిలోమీటర్ల విభాగం పోటీలలో తెలంగాణ రాష్ట్రం తరపున పాల్గొంటారని చెప్పారు. ఉపాధ్యాయ బృందం, పి డి సురేందర్, పీఈటీ వెంకటేష్ తో కలిసి విద్యార్థిని అభినందించామని తెలిపారు.

బహిరంగ ప్రదేశాలలో వ్యర్థాలను, చెత్తను కాల్చవద్దు

- హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి వాల్ పోస్టర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-సిటీబ్యూరో

పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో బహిరంగ ప్రదేశాలలో చెత్తను, వ్యర్థాలను కాల్చవద్దని ప్రజలను హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి కోరారు. గురువారం కలెక్టర్ ఛాంబర్‌లో తెలంగాణ కాలుష్య నియంత్ర మండలి వాల్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చెత్తను బహిరంగ ప్రదేశాలలో కాల్చడం వాయు కాలుష్యానికి ముఖ్యమైన కారకమనీ తద్వారా వచ్చే హానికరమైన ఉద్గారాలు గాలి నాణ్యతను దిగజార్చడమే కాకుండా గుండె జబ్బులు, ఇతర తీవ్రమైన ఆరోగ్య సమస్యలు ప్రజలకు కలిగిస్తాయన్నారు. చెత్తను కాల్చటం చట్టరీత్యా నేరమనీ, ఆరోగ్యానికి ప్రమాదకరమని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ పి.సురేష్, అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ కె.సాయి దివ్య, మీడియా కోఆర్డినేటర్ ఎ. సోమేష్ కుమార్, పి.నాగరాణి, జి.వెంకటేష్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపిన మెట్రో రైల్ సాధన సమితి సభ్యులు



నవతెలంగాణ-నేరేడ్ మెట్

మేడ్చల్ జిల్లా మెట్రో రైల్ సాధన సమితి సభ్యులు మంగళవారం బోయిన్పల్లిలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల జరిగిన శాసనసభ సమావేశాల్లో ఉత్తర హైదరాబాద్ కు మెట్రో రైల్ ఆవశ్యకతను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, మెట్రో రైల్ యం.డి. ఎన్వీఎస్. రెడ్డి కి వివరిస్తూ వినతిపత్రాన్ని ఎమ్మెల్యే అందజేశారని, దాని ఫలితమే ముఖ్యమంత్రి ప్రతిపాదనలు సిద్ధం చేసి కేంద్రానికి పంపాలని అధికారులను ఆదేశించినట్టు తెలిపారు. మెట్రో రైలు ప్రాజెక్టు ఏర్పాటుకు మార్గం సులభమైనందున కృషి చేసిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేసి, నూతన సంవత్సరాల శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంపత్ రెడ్డి, మహేందర్ రెడ్డి, మోహన్ రెడ్డి, దేవేందర్ రెడ్డి, అనిల్, గిరిధర్, తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు

నవతెలంగాణ-సిటీబ్యూరో

నూతన సంవత్సరం-2025 పురస్కరించుకుని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని గురువారం డీఈవో ఆర్.రోహిణీ ఆధ్వర్యంలో మండల విద్యాధికారులు విశ్వనాథ్ గుప్తా, రాధాకృష్ణ, సామ్యూల్ రాజ్, ఆదిత్య వర్ధన్, కస్తూరి, పరమేశ్వమ్మ, రమణారాజు, శ్రవణ్ కుమార్, గుండప్ప, యాదయ్య, సుజాత, నరసరాజు, మెర్సీ, జయలక్ష్మి, ఖలీల్, బాలు నాయక్, వెంకటేశ్వర్లు, శ్రీధర్, నిజాముద్దీన్ కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు కలెక్టర్‌కు కొత్త సంవత్సరం క్యాలెండర్ అందజేశారు.

పీఆర్‌టీయూటీఎస్ క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-సిటీబ్యూరో

పీఆర్‌టీయూటీఎస్ హైదరాబాద్ జిల్లా టేబుల్, వాల్ క్యాలెండర్-2025ను గురువారం నారాయణగూడలోని ఆ సంఘం కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షులు, నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పింగిలి శ్రీపాల్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుల్గం దామోదర్ రెడ్డి, మాజీ శాసనమండలి సభ్యులు బి. మోహన్ రెడ్డి, కరీంనగర్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి మహేందర్ రెడ్డి, మాజీ రాష్ట్ర అధ్యక్షులు వెంకట రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బి. మధుసూదన్ రెడ్డి, వారి కార్యవర్గం ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అన్ని మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, రాష్ట్ర, జిల్లా, మండల కార్యవర్గ సభ్యులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ముదిరాజులు ఆర్థిక సామాజిక రాజకీయాల్లో ఎదగాలి

- ఎంపీ ఈటల రాజేందర్
- కుషాయిగూడ ముదిరాజుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ - చర్లపల్లి

ముదిరాజుల అందరూ ఐక్యంగా ఉండి, ఆర్థిక సామాజిక రాజకీయాల్లో ఎదగాలని మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ ఆకాంక్షించారు. గురువారం కుషాయిగూడ ముదిరాజ్ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుషాయిగూడ ముదిరాజ్ సంఘం ఐకమత్యంగా గత మూడు సంవత్సరాల నుంచి ముదిరాజ్ బంధు మిత్రులందరి సహకారంతో అనేక కార్యక్రమాలు చేపడుతూ, మనందరినీ భాగస్వామ్యం చేయడం హర్షించదగ్గ విషయమని కుషాయిగూడ ముదిరాజ్ సంఘం భవిష్యత్తులో ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించిన తన సంపూర్ణ సహకారం ఉంటుందని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కుషాయిగూడ ముదిరాజ్ సంఘం అధ్యక్ష,కార్యదర్శులు పిట్టల నాగరాజు ముదిరాజ్, గడ్డల పాండు ముదిరాజ్, కోశాధికారి సార ప్రశాంత్ ముదిరాజ్, కొలిపాక కనకయ్య ముదిరాజ్, చింతల వెంకటేష్ ముదిరాజ్, పిట్టల భరత్ ముదిరాజ్, జక్కుల ప్రేమ్ ముదిరాజ్, కూర యాదగిరి ముదిరాజ్, దొంతి రమేష్ ముదిరాజ్ తదితర నాయకులు పాల్గొన్నారు.



టీజీవోస్ క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-సిటీబ్యూరో

తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్(టీజీవో) అసోసియేషన్ హైదరాబాద్ జిల్లా నూతన సంవత్సరం క్యాలెండర్- 2025ను జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి గురువారం తన ఛాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీజీవో జిల్లా అధ్యక్షులు, కె.బి.కృష్ణ యాదవ్, ఉపాధ్యక్షులు డాక్టర్ సురేందర్, రాజేందర్, ఆర్. కోటజి, శ్రీరామ్, సునీత జోషి, ఎంజుల రెడ్డి, నర్సింగ రావు, బి. కుమార్, శ్రవణ్ కుమార్ రెడ్డి, ఎమ్.డి గౌస్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ జాగతి అధ్యక్షురాలు ఎమ్మెల్సీ కవితను బీఆర్ఎస్ సీనియర్ నాయకుల శేఖర్ నాయక్ గురువారం కలిసి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలియజేశారు. నవతెలంగాణ-కాప్రా

డీఈవోకి నూతన సంవత్సర శుభాకాంక్షలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

నూతన సంవత్సరం-2025 పురస్కరించుకుని హైదరాబాద్ జిల్లా విద్యాశాఖాధికారిణి ఆర్.రోహిణిని గురువారం మండల విద్యాధికారులు విశ్వనాథ్ గుప్తా, రాధాకృష్ణ, సామ్యూల్ రాజ్, ఆదిత్య వర్ధన్, కస్తూరి, పరమేశ్వరమ్మ, రమణారాజు, శ్రవణ్ కుమార్, గుండప్ప, యాదయ్య సుజాత, నరసరాజు, మెర్సీ, జయలక్ష్మి, ఖలీల్, బాలు నాయక్, వెంకటేశ్వర్లు, శ్రీధర్, నిజాముద్దీన్ కలిసి బోకే అందించి శాలువాతో సన్మానించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

టీజీవో క్యాలెండర్ ఆవిష్కరణ

తెలంగాణ ఆఫీసర్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ హైదరాబాద్ జిల్లా నూతన సంవత్సర క్యాలెండర్‌ను గురువారం డీఈవో ఆర్.రోహిణీ తన ఛాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ఎంబీ కృష్ణ యాదవ్, జిల్లా పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ నర్సింగరావు, కార్యాలయ ఈడీ శ్రీనివాస్ రెడ్డి, డీఎస్‌వో ధర్మేందర్ రావు, ఎస్టీయూ జిల్లా ఉపాధ్యక్షులు రామ సుబ్బారావు, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.





మేరు సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-ఆల్వాల్

మేరు సంఘం 2025 సంవత్సర క్యాలెండర్‌ను ఆదివారం లోతుకుంటలోని వారి కార్యాలయంలో ఆవిష్కరించింది. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు రాపర్తి చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి దీకొండ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ, కుట్టు కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ప్రభుత్వ స్కూల్‌లు, కాలేజీలు, ఆస్పత్రులకు అవసరమైన దుస్తులను కుట్టే అవకాశాలు మేరు సంఘ సభ్యులకు కల్పించాలని కోరారు. అలాగే, కుట్టు కార్మికుల ఆరోగ్య బీమా, పెన్షన్, ఉచిత విద్యుత్, కొత్త షాపులకు రుణాలు వంటి సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.



మల్లాపూర్ ఆటో యూనియన్ నాయకులు సాయికుమార్ గురువారం ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నవతెలంగాణ - చర్లపల్లి

అనురాగ్ యూనివర్సిటీలో రీసెర్చ్ మెథడాలజీ వర్క్‌షాప్



నవతెలంగాణ-పోచారం

హైదరాబాద్ అనురాగ్ యూనివర్సిటీలో రీసెర్చ్ మెథడాలజీ వర్క్‌షాప్ 2024 డిసెంబర్ 27 నుంచి 30 వరకు ఘనంగా నిర్వహించారు. ఇ బ్లాక్ ఆడిటోరియంలో ఈ కార్యక్రమం జరిగింది. రీసెర్చ్ మెథడాలజీలో నిపుణుడు, రీసెర్చ్ శిక్ష వ్యవస్థాపకుడు, ఐఐఎం ఇండోర్‌లోని విజిటింగ్ ఫ్యాకల్టీ, ప్రొఫెసర్ అజయ్ కుమార్ చౌహాన్ సెషన్‌లకు నాయకత్వం వహించారు. మొదటి రోజు సెషన్ "రీసెర్చ్ చేయడం కోసం హేతుబద్ధత, టాపిక్ ఎంపిక, పరిశోధనలో పరికల్పన, పరిశోధన విశ్వసనీయత"పై దష్టి సారించింది. రెండవ రోజు, "పరిశోధన ప్రణాళిక, కాలక్రమాన్ని అభివద్ధి చేయడం, పరిశోధన రూపకల్పన" చుట్టూ చర్చలు జరిగాయి. మూడవ రోజు "లిటరేచర్ రివ్యూ రాయడం, డేటా కలెక్షన్, రీసెర్చ్ రిపోర్ట్ రైటింగ్", ఆఖరి రోజు, "పరిశోధన కోసం ఏఐ సాధనాలను ఉపయోగించడం" గురించి పరిచయం చేశారు. అన్ని సెషన్‌లు పీహెచ్‌డీ కోసం అత్యంత ప్రయోజనకరంగా మరియు వనరులను కలిగి ఉన్నాయి.

శబరిమలైకు బయలుదేరిన అయ్యప్ప స్వాములు..



నవతెలంగాణ - చర్లపల్లి

మల్లాపూర్ డివిజన్ చెందిన పలువురు అయ్యప్ప స్వాములు గురువారం శబరిమలైకు బయలు దేరారు. దీక్షల అనంతరం స్థానిక అశోక్ నగర్ లోని హనుమాన్ దేవాలయం నుంచి వేద పండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వాములకు ఇరుముడి కట్టారు. ఈ సందర్భంగా అయ్యప్పస్వామికి ముడుపులు చెల్లించేందుకు పలువురు భక్తులు స్వాములకు కానుకలు ఇచ్చారు. అనంతరం ప్రత్యేక వాహనాలలో తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో నరసింహస్వామి, కుమార్ స్వామి, ఆనంద్ స్వామి, శ్రీనుస్వామి, అనిల్ స్వామి, షకిల్ స్వామి, అంజి స్వామి, శంకర్ స్వామి, రాముస్వామి, శీనుస్వామి, వెంకటేష్ స్వామి తదితరులు పాల్గొన్నారు.



టీఎన్జీవోస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు

నవతెలంగాణ-సిటీబ్యూరో

నూతన సంవత్సరం-2025 పురస్కరించుకుని టీఎన్జీవోస్ సెంట్రల్ యూనియన్ అధ్యక్షులు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.ఎం.హుస్సేని(ముజీబ్) వారి కార్యవర్గాన్ని ఆ సంఘం హైదరాబాద్ జిల్లా కార్యవర్గం ఆధ్వర్యంలో గురువారం కలిసి బోకే అందించి శాలువాతో సన్మానించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు విక్రమ్ కుమార్, అసోసియేట్ ప్రెసిడెంట్ కె.ఆర్.రాజ్‌కుమార్, కోశాధికారి బాలరాజ్, ఉపాధ్యక్షులు ఒమర్ ఖాన్, కుర్రాడి శ్రీనివాస్, సెంట్రల్ యూనియన్ ఉపాధ్యక్షులు కొండల్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, ఉమా రెడ్డి, టీఎన్జీవోస్ జిల్లా జాయింట్ సెక్రటరీ ఖాలీద్ అహ్మద్, పబ్లిక్ సెక్రటరీ వైదిక్ శాస్త్ర, ఈసీ మెంబర్లు ముఖీమ్, మాజీ కార్యదర్శి ప్రభాకర్, సుదర్శన్, ఇస్మాయిల్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరానగర్‌లో ఇందిరమ్మ ఇండ్ల సర్వే..

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

గోషామహల్ నియోజకవర్గంలోని మంగళ్ హాట్ డివిజన్ ఇందిరా నగర్ ఇందిరమ్మ ఇండ్ల సర్వే నిర్వహిస్తున్న జీహెచ్ఎంసీ అధికారులు, గోషామహల్ నియోజకవర్గం కాంగ్రెస్ క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ కో-ఆర్డినేటర్ బి.రాబర్ట్ తదితరులు



ఉద్యోగుల హక్కుల సాధనాలకు టీజీవో నిరంతర కృషి

- సెంట్రల్ అసోసియేషన్ అధ్యక్షులు ఏ. శ్రీనివాస్, కార్యదర్శి, ఏ.సత్యనారాయణ

నవతెలంగాణ-అంబర్‌పేట



టీజీవో హైదరాబాద్ జిల్లా కార్యవర్గం నూతన సంవత్సర క్యాలండర్‌ను సెంట్రల్ అసోసియేషన్ అధ్యక్షులు ఏలూరి శ్రీనివాస్, కార్యదర్శి ఏ.సత్యనారాయణ ముఖ్యఅతిథిగా హాజరై హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు కృష్ణా యాదవ్, కార్యదర్శి ఎంఎ ఖాదర్ టీజీవో భవన్ లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగుల సమిష్టి కృషితో ప్రజలకు ప్రభుత్వ పథకాలు అందే విధంగా ఉద్యోగుల హక్కుల కోసం సమిష్టి కృషితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డా.ఎన్ సురేందర్, ఏ.రాజేందర్, డా.సునీత జోషి, ఎంజులరెడ్డి, మహమ్మ ద్ గౌస్, వి.శ్రీరామ్, డాజె రవికుమార్, జి.వెంకట రమణరెడ్డి, డా బి కుమార్, జి.శ్రవణ్ కుమార్ రెడ్డి, జె.నర్సింగ్‌రావు, డాకె రమేష్, డాడి నాగరాజు పాల్గొన్నారు.

'వడ్డెర్లను ఎస్టీ జాబితాలో చేర్చాలి'

- అఖిల భారత వడ్డెర సంక్షేమ సంఘం రాష్ట్ర సదస్సులో పలువురు వక్తల డిమాండ్



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

సంచార శ్రమ జీవులైన వడ్డెర్లను దేశంలోని కొన్ని రాష్ట్రాల్లో ఎస్సీలుగా, ఎస్టీలుగా పరిగణిస్తున్నట్టుగానే తెలంగాణ రాష్ట్రంలో కూడా వడ్డెర జాతిని గిరిజన తెగల (ఎస్టీ)లో చేర్చాలని, వడ్డెర్లకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని అఖిల భారత వడ్డెర, వోడ్, బోవి, బేల్దార్ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. గురువారం హైదరాబాద్, బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో వడ్డెర సంక్షేమ సంఘం రాష్ట్ర సదస్సును నిర్వహించారు. ఈ సదస్సులో తెలంగాణ రాష్ట్ర ఎంబీసీ చైర్మెన్ జెరిపాటి జైపాల్, అఖిల భారత వడ్డెర, వోడ్, బోవి, బేల్దార్ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు వేముల లక్ష్మణ్, సంఘం ప్రధాన కార్యదర్శి, ఐఎన్‌టీయుసీ రాష్ట్ర అధ్యక్షులు గుంజ శ్రీనివాస్, మహిళా విభాగం జాతీయ అధ్యక్షురాలు వేముల తిరుమల దేవి, ప్రధాన కార్యదర్శి గుంజ రేణుక, యువజన విభాగం జాతీయ అధ్యక్షులు మంజల రమేష్, మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు మంచపు రమ తదితరులు మాట్లాడారు. ఎంబీసీ చైర్మెన్ జెరిపాటి జైపాల్ మాట్లాడుతూ గత ప్రభుత్వాలలో వడ్డెర్లకు అన్యాయం జరిగిందని, ప్రస్తుతం వడ్డెరులంతా ఐక్యతతో పోరాడి సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. సంఘం జాతీయ అధ్యక్షులు వేముల లక్ష్మణ్ మాట్లాడుతూ గత 40 ఏండ్లుగా వడ్డెర జాతికి అన్యాయం జరుగుతుందని, వడ్డెర్లను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు పార్టీలకు అతీతంగా ఐక్యంగా ఉద్యమించాలని కోరారు. వడ్డెర సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి, ఐఎన్‌టీయుసీ రాష్ట్ర అధ్యక్షులు గుంజ శ్రీనివాస్ మాట్లాడుతూ వడ్డెర్లు, ఎరుకుల, యానాది, లంబాడీలు, డీఎన్టీ సంచార జాబితాలో ఉన్నారని, 1970లో అనంతరం ఏర్పడిన కమిషన్ ఎరుకుల, యానాది, లంబాడీలను ఎస్టీ (గిరిజన తెగలు)లో చేర్చి, లిపి లేని కారణంగా వడ్డెర్లను బీసీ-ఎలో చేర్చి వడ్డెర్లకు తీరని అన్యాయం చేశారని విమర్శించారు. 50 ఏండ్లు నిండిన వడ్డెర్లకు నెలకు రూ.4 వేల ఫించన్ ఇవ్వాలని, మైనింగ్ లో వడ్డెర కో-ఆపరేటివ్ సొసైటీల కు 30 శాతం రిజర్వేషన్ కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వడ్డెర సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మంజల హనుమయ్య, కార్మిక విభాగం అధ్యక్షులు సాతల గోపాల్, ప్రధాన కార్యదర్శి ఇడ గోటి నగేష్, మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి ఇడగోటి పార్వతి, యువజన అధ్యక్షులు బొంత చిరంజీవి, యువజన వర్కింగ్ ప్రెసిడెంట్ బోదాసు శ్రీనివాస్, సంఘం అధ్యక్షులు రేపన్ గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాలు పెంచేలా కృషి చేయాలి

ప్రైమరీ పిల్లల రీడింగ్, బేసిక్స్‌పై ఎక్కువగా శ్రద్ధ పెట్టండి : జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి





నవతెలంగాణ-సిటీబ్యూరో

విద్యార్థుల విద్యా ప్రమాణాలు పెంచేలా ఉపాధ్యాయులు నిబద్ధతతో ప్రత్యేక కృషి చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. గురువారం అమీర్‌పేట్ డీకే రోడ్ లోని ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల ఆవరణను పరిశీలించి తాగునీటి వనరులపై ఆరా తీశారు. 3,5వ తరగతి విద్యార్థులతో మాట్లాడారు. ఎఫ్ఎల్ఎన్ సామర్థ్యాలను, విద్యార్థుల పఠన నైపుణ్యాలను, ఎఫ్ఆర్ఎస్ హాజరును పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత కల్పిస్తుందనీ, ఆ దిశగా ఉపాధ్యాయులు విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన చేయాలని సూచించారు. బడిబాట కార్యక్రమం ద్వారా పిల్లల హాజరు శాతం పెంచాలనీ, నూతన మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని కలెక్టర్ ఆదేశించారు. ఇంగ్లీష్, మేథమేటిక్స్‌పై పట్టు ఉండేలా ప్రత్యేక కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా దీపక్, వైష్ణవి, మహేందర్ అనే విద్యార్థులతో ఇంగ్లీష్, తెలుగు పాఠాలు చదివించి చదువుతోనే మంచి భవిష్యత్ ఉంటుందనీ, విద్యార్థులు ఇష్టంగా చదవాలని తద్వారా భయం, ఆందోళన పోతుందన్నారు. పిల్లలు బాగా చదివి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలన్నారు. ఉపాధ్యాయులు ప్రైమరీ పిల్లల బేసిక్స్, రీడింగ్‌పై ఎక్కువ శ్రద్ధ కల్పించాలన్నారు. అనంతరం కలెక్టర్ మధ్యాహ్నం భోజనాలను పరిశీలించి సమయానికి అందించాలని సూచించారు. పరీక్షల సమయం దగ్గర పడుతున్న తరుణంలో విద్యా శాఖ అధికారులు పాఠశాలను ఎప్పడికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఈవో ఆర్.రోహిణీ, తహసీల్దార్ పద్మ సుందరి, డిప్యూటీ ఈవో యాదయ్య, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలి



- సీఐటీయూ నాయకులు సి.మల్లేష్

నవతెలంగాణ-ధూల్‌పేట్

మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని సీఐటీయూ నాయకులు సి.మల్లేష్ డిమాండ్ చేశారు. సీఐటీయూ మున్సిపల్ కార్మికుల యూనియన్ ఆధ్వర్యంలో నూతన ఏడాది కేక్ కటింగ్ టోలిచౌకి చౌరస్తా లో మున్సిపల్ కార్మికులతో కలిసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికుల కనీస వేతనాలు పెరిగిన ధరలనుకులంగా పెంచాలన్నారు. సంవత్సరాలు గడుస్తున్నా కార్మికుల జీవితాలు మారడం లేదన్నారు. కార్మికుల వేతనాలు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ హైదరాబాద్ సౌత్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు మీనా, శ్రావణ్ కుమార్, సీఐటీయూ నాయకులు విఠల్ కళ్యాణ్, యాదమ్మ, హంసమ్మ, మొగులమ్మా రాజేశ్వరి, జ్యోతి, కవిత తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కల్చర్ నైట్ వేడుకలు

నవతెలంగాణ-ధూల్‌పేట్



కార్వాన్ నియోజకవర్గం కార్వాన్‌లో పీఎస్ఎం ఆధ్వ ర్యంలో కల్చర్ నైటు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పీఎస్ఎం కల్చర్ నాయకులు కళ్యాణ్ మాట్లాడుతూ.. కొత్త ఏడాదిలో అందరు సుఖ సంతోషాలతో ఉండాలని, ఈ కొత్త ఏడాది 2025లో అందరికీ మంచి జరగాలన్నారు. చిన్నారులు ఆటపాటల తోటి కార్యక్రమంలో ఆకట్టుకున్నారు. పాస్టర్ తిమోతి పాస్టరమ్మ విజయ సంఘం పెద్దలు నాగరాజు, మస్తాన్, శ్రీను, సుధాకర్, లక్ష్మీనారాయణ, రామంజిని, బస్తీ యూత్ జగదీష్ ఎల్లేష్, హరి, మణికంఠ, చరణ్, టోనీ, యశ్వంత్ తదితరులు న్నారు.

ప్రజా కళాకారుడు సర్దరు హస్మికు ఘన నివాళి



నవతెలంగాణ-ముషీరాబాద్

ఆధునిక వీధి నాటక పితామహుడు జననాట్ మంచ్ నాయకుడు ప్రజా కళాకారుడు సర్దరు హస్మికి ఘనంగా ప్రజానాట్యమండలి గ్రేటర్ హైదరాబాద్ సెంట్ర ల్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఈ సంద ర్భంగా సర్దరు హస్మి చిత్రపటానికి ప్రజానాట్య మండలి రాష్ట్ర కమిటీ సభ్యులు పూలదండ వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కల ద్వారా ప్రజల్ని చైతన్యవంతం చేయడం కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన గొప్ప కళాకారుడు ప్రజా కళాకారుడు సర్దరు హస్మి అని అన్నారు. ముప్పైమూడేండ్ల క్రితం 1989 జనవరి 1న దేశ రాజధాని ఢిల్లీ నగరం సమీపాన ఘజయాబాద్‌లో 'హల్లా బోల్' వీధినాటిక ప్రదర్శిస్తుండగా పట్టపగలు కిరాయి గుండాలు, హంతకులు మారణాయుధాలతో ఆ 'జనమ్' కళాబృందంపై ఘాతుక దాడి చేయడం, ఆ దాడిలో నేల కొరిగిన హష్మి మరుసటి దినం రెండవ తేదీన ప్రాణాలు విడవడం, ఆ మరుసటి దినం మూడవ తేదీన అంత్య క్రియల అనంతరం అదే ప్రాంతంలో అదే 'హల్లా బోల్' నాటికను హష్మి సతీమణి మలయశ్రీ హష్మి సారథ్యాన వేలాదిమంది ప్రేక్షకుల సమక్షంలో ప్రదర్శించడం... ఖబడ్దార్! అంటూ కళాహంతక నైజాన్ని సవాలు చేసి మా నాటకం ఎప్పటికీ ఆగదనీ, సాగుతూనే ఉంటుందని ప్రకటించడం.. యావత్ ప్రపంచ కళా చరిత్రలోనే ప్రజా కళాకారులకు కనివిని ఎరుగని అపూర్వ దిశానిర్దేశం అని చెప్పుకోవచ్చునన్నారు. ప్రజల మధ్య కళారూపాలు ప్రదర్శి స్తూ ప్రజలను చైతన్యవంతం చేయాలని సర్దార్ లక్ష్మి ఇచ్చిన స్ఫూర్తితో ముందుకు వెళ్తున్నారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి నాయకులు ఎన్ మారన్న, మాజీ నాయకులు జి.నరేష్, పి.మల్లేష్, ఆర్.అశోక్, ఆర్. వెంకటేష్, ప్రజాసంఘాల నాయకులు ఆర్.మల్లేష్, అజయ్ బాబు, టి.మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

టీజీఓ హైదరాబాద్ జిల్లా క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-సిటీబ్యూరో



తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ హైదరా బాద్ జిల్లా క్యాలెండర్‌ను జీహెచ్ ఎంసీ కమిషనర్ ఇలంబర్తీ ఆవి ష్కరించారు. ప్రభుత్వ కార్యక్రమా లు ప్రజలకు చేరువయ్యేలా ఉద్యోగులు కృషి చేస్తున్నారని కమిషనర్ అభినందించారు. ఉద్యోగులందరూ మరింతగా కష్టపడి ప్రజలకు మెరుగైన సేవలు అందించే విధంగా చూడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీజీఓస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎం.బి కష్ణ యాదవ్, సెక్రటరీ ఎంఏ ఖాదర్, నర్సింగ్ రావు డాక్టర్ కుమార్, డాక్టర్ నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-అంబర్‌పేట



అంబర్‌పేట నియోజకవర్గ సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తు న్నానని నియోజకవర్గ సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నానని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. గురువారం కాచిగూడ డివిజన్ చెందిన సీనియర్ నాయకులు ధాత్రిక్ నాగేందర్ బాబ్జి, బబ్లు సింగ్, సునీల్, అంటో తదితరులున్నారు.

ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ ఏకసభ్య కమిషన్ చైర్మెన్ సిఫారసులపై స్టే ఇవ్వాలి

- హైకోర్టు న్యాయవాది వడ్లమూరి కృష్ణ స్వరూప్

నవతెలంగాణ-హిమాయత్‌నగర్



రాజ్యాంగ వ్యతిరేకమైన ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ ఏకసభ్య కమిషన్ చైర్మన్ సిఫారసులపై స్టే ఇవ్వాలని మాల మహా నాడు జాతీయ అధ్యక్షులు, ప్రొఫెసర్ డాక్టర్ వి. ఎల్.రాజు హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేయడం జరిగిందని హైకోర్టు న్యాయవాది వడ్లమూరి కృష్ణ స్వరూప్ గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏపీ రాష్ట్ర సీఎం చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్, ఎన్డీఏ బీజేపీ ప్రభుత్వం నియ మించిన వర్గీకరణ ఏకసభ్య కమిషన్ చైర్మెన్ రాజీవ్ రంజన్ మిశ్రా రాజ్యాంగ నిబంధనలు ఆర్టికల్-338 (9)కు విరుద్ధంగా ఉన్నాయని ఆరోపించారు. జాతీయ ఎస్సీ కమి షన్‌ను సంప్రదించకుండా నేరుగా రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణకు పూనుకోవడం సరైంది కాదన్నారు. వర్గీకరణ చేసే అధికారం కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలకు లేదన్నారు. దీనికి ఆర్టికల్-341 నిబంధనలు స్పష్టంగా చెబుతుంద న్నారు. ఈ రిట్ పిటిషన్ లో ఏపీ రాష్ట్ర ప్రభుత్వం తరుపున సాంఘిక సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, రాష్ట్ర డైరెక్టర్‌లతో పాటు ఏకసభ్య కమిషన్ చైర్మెన్, రిటైర్డ్ ఐఏఎస్ రాజీవ్ రంజన్ మిశ్రాను సైతం ప్రతివాదుల్లో పేర్కొనడం జరిగిందన్నారు. పార్లమెంట్ చేయవలసిన పనిని రాష్ట్ర ఎన్డీఏ సర్కార్ చేయడం రాజ్యాంగ ఉల్లంఘనే అవుతుందన్నారు. ఎస్సీ కుల జాబితాలోని 59 కులాల్లో మాలలు అత్యధిక జనాభా కలిగి ఉన్నారని, వీరిని తక్కువ జనాభాగా చూపించడం కోసం గ్రామాల్లో మాలలను క్రిస్టియన్లుగా మార్చి సోషల్ ఆడిట్ గా చేసి పంచాయతీ కార్యాలయం వద్ద రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయడం సరైంది కాదన్నారు.వర్గీకరణ అంశంపై ఆగస్టు 1న సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ చంద్రచూడ్ బెంచ్ ఇచ్చిన అస్పష్టత తీర్పుపై భారత పార్లమెంట్ లో చర్చించాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

హైదరాబాద్ సిటిజన్స్ ఫోరం, హైదరాబాద్ జిందాబాద్ సేవలు అభినందనీయం



- ఎలక్షన్ కమిషన్ రిటైర్డ్ ఆఫీసర్ రమేష్ నాయుడు

నవతెలంగాణ-అంబర్‌పేట

హెచ్‌సీఎఫ్ 2025 క్యాలెండర్‌ను హైదరాబాద్ సిటిజెన్స్ ఫోరం (హెచ్‌సీఎఫ్), హైదరాబాద్ జిందాబాద్ 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎలక్షన్ కమిషన్ రిటైర్డ్ ఆఫీసర్ రమేష్ నాయుడు నల్లకుంటలోని క్షత్రియ టవర్స్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రమేష్ నాయుడు మాట్లాడుతూ హైదరాబాద్ ఒక నివాసయోగ్యనగరంగా అభివృద్ధి చెందాలని, పర్యావరణం, పబ్లిక్ హెల్త్, ప్రజారవాణా పరిరక్షణకు హైదరాబాద్ సిటిజన్స్ ఫోరం కృషి చేస్తుందన్నారు. పర్యావరణ సమస్యలపై హెచ్‌సీఎఫ్, హైదరాబాద్ జిందాబాద్ చేస్తున్న కృషిని, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహిస్తున్న తీరును అభినందించారు. నగర అభివృద్ధి, అనేక వైభవాలతో కూడిన చిత్రాలతో కేలండర్ రూపొందిం చటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డిస్టిక్ గవర్నర్, నల్లకుంట సిటిజెన్స్ అసోసియేషన్ అధ్యక్షులు వి మోహన్‌రావు, హెచ్‌సీఎఫ్ ప్రధాన కార్యదర్శి వీరయ్య, సీనియర్ నాయకులు శ్రీనాథ్ రావు, డాక్టర్ జై సూర్య, కృష్ణ బాబు, భవాని శంకర్, మోహన్ నాయుడు, శ్రీనివాసరావు, సత్యనారాయణ, అశ్విన్, హర్ష, రితేష్, రమణ, జయచంద్ర, గోపాల్, సుశాంత్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కరెంటు స్తంభాలపై కేబుల్ సమస్యలు పరిష్కరించండి

- ఆవాజ్ నగర కార్యదర్శి అబ్దుల్ సత్తార్

నవతెలంగాణ-ధూల్‌పేట్



కరెంటు స్తంభాలపై కేబుల్ సమస్యలు పరిష్కరించాలని ఆవాజ్ నగర కార్యదర్శి అబ్దుల్ సత్తార్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేబుల్ ఆపరేటర్స్, ఇంట ర్నెట్ ప్రొవైడర్స్, సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఉష్రఫ్ ఫారుకి ఆగస్టుక్ 2024లో నగర వ్యాప్తంగా కేబుల్ వైర్లను కరెంటు స్తంభాల నుంచి తొలగించాలని ఆదేశాలు జారీ చేశారన్నారు. అయిన నేటి వరకు కేబుల్ ఇంటర్నెట్ వైర్లను, కరెంటు స్తంభాల నుంచి తొలగించలేదన్నారు. అపాయకరంగా ఉంటున్న ఈ వైర్లతో ఎప్పుడైనా కరెంట్ ప్రమాదం లేకపోలేదన్నారు. దీంతో ప్రాణహాని జరిగే ప్రమాదాలు పొంచి ఉన్నాయన్నారు. ఇప్పటికైనా అధికారులు గుర్తించి అనవసరమైన వైర్లను కరెంటు స్తంభాల నుంచి తొలగించాలని, ప్రజలను అపాయాల నుండి కాపాడాలని కోరారు.

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్



తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపు తున్న బీఆర్ఎస్ నాంపల్లి నియోజకవర్గం రెడ్‌హిల్స్ డివిజన్ మహిళా ప్రధాన కార్యదర్శి ఏ.అనిత తదితరులు

'కాంగ్రెస్ పాలనలో ప్రభుత్వ కార్యాలయాల్లో తగ్గిన అవినీతి'

- జాతీయ ఇంటలెక్చువల్ ఫోరం అధ్యక్షులు ఆళ్ల రామకృష్ణ



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి తగ్గిందని జాతీయ ఇంటలెక్చువల్ ఫోరం అధ్యక్షులు, విశ్రాంత చీఫ్ ఇంజనీర్ ఆళ్ల రామకృష్ణ గురు వారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో ఐదేండ్ల కాలంలో ఏసీబీ పట్టుకున్న కేసులు 306 అని, నూతన కాంగ్రెస్ ప్రభుత్వం ఏసీబీ 152 కేసులు పట్టుకుందని తెలిపారు. గత ప్రభుత్వాధి నేతలు అవినీతిలో కూరుకుపోవడంతో అధికారులు విచ్చలవిడిగా ప్రజల నుంచి దోచుకున్నారని ఆరోపించారు. సీఎం ఎ.రేవంత్ రెడ్డి పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతిపై ఉక్కు పాదం మోపి, అవినీతి అధికారుల గుండెల్లో రైళ్ళు పరిగెత్తిస్తుందన్నారు. ఏసీబీ అధికారులకు గత ప్రభుత్వం పూర్తి స్వేచ్ఛ ఇవ్వకపోవడంతో అధికారులు ఇష్టా రాజ్యంగా అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. నూతన కాంగ్రెస్ ప్రభుత్వం ఏసీబీకి పూర్తి స్వేచ్ఛ ఇవ్వడంతో ఎక్కువ కేసులు పట్టుకుందని పేర్కొన్నారు. రూ.100 కోట్లకు పడగలెత్తిన హెచ్ఎండీఏ అధికారి శివ బాలకృష్ణ దోపిడీకి బీఆర్ఎస్ ప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.

కష్టపడి పని చేసే వారికే డివిజన్ అధ్యక్ష పదవి

- కార్పొరేటర్ పావని వినయ్ కుమార్



నవతెలంగాణ-ముషీరాబాద్

ముషీరాబాద్ నియోజకవర్గం, గాంధీనగర్ డివిజన్ బీజేపీ అధ్యక్ష పదవి కష్టపడి పని చేసే వారిని వరిస్తుందని కార్పొరేటర్ పావని వినయ్ కుమార్ తెలిపారు. గురువారం అశోక్ నగర్ కల్చరర్, వెల్ఫేర్ అసోసియేషన్ హాల్‌లో నియామక కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ కార్య క్రమానికి కార్పొరేటర్ హాజరై మాట్లాడుతూ గాంధీనగర్ డివిజన్ నుండి అధ్యక్ష పదవికి ఐదుగురి పేర్లను పరిశీల నలోకి వచ్చాయని అందులో బీజేపీ ఓబీసీ మోర్చ అసెంబ్లీ కన్వీనర్ ఎం.ఉమేష్, డివిజన్ ఉపాధ్యక్షుడు నవీన్ కుమార్, ప్రధాన కార్యదర్శి నర్సింహ, ఓబీసీ మోర్చ సోషల్ మీడి యా నగర కార్యవర్గ సభ్యుడు దొనేటి సత్యం, యువమోర్చ నియోజకవర్గం కో-కన్వీనర్ ఆనంద్ రావుల పేర్లను బీజేపీ రాష్ట్ర కార్యవర్గానికి పంపడం జరుగుతుందని తెలిపారు. ఐదుగురి నుండి ఒక్కరినీ మాత్రమే డివిజన్ అధ్యక్షుడిగా పార్టీ నిర్ణయిస్తుందని, పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉండాలని కార్పొరేటర్ వివరించారు. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కలిసి కట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈసమావేశంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ శ్రీ ఎ.వినయ్ కుమార్, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ రమేష్ రామ్, సీనియర్ నాయకులు శ్రీకాంత్, దామోదర్ డివిజన్ లోని బూత్ అధ్యక్షులు, బూత్ కో ఆర్డినేటర్‌లు, వివిధ మోర్చ అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

పురానాపూల్ పేట్లబుర్జ్‌లో క్రిస్మస్ వేడుకలు

నవతెలంగాణ-ధూల్‌పేట్



చార్మినార్ పురానాపూల్ డివిజన్ పూల్ బాగ్ పేట్ల బుర్జ్ పత్మాస్ ప్రేయర్ హౌస్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించా రు. సంఘ హెల్డర్స్ బ్రదర్ డేవిడ్ నేతృత్వంలో బ్రదర్ టి.తిమ్మోతి, బ్రదర్ బి.శ్యామెల్‌లు క్రిస్మస్ సువార్త, క్రీస్తు పుట్టుక ప్రత్యేకతను ప్రకటించారు. సంఘం పరిచారకులు దానియేలు, ఇజ్రాయేల్, సోలమన్, శ్యామేల్‌లు, సంఘస్తులు పర్యవేక్షణలో క్రిస్టియన్ సహోదరులు, సహోదరీలు పాటలు పాడుతూ క్రీస్తును ఆరాధించి స్తుతించారు. ఈ వేడుకల్లో బహదూర్‌పుర, కిషన్‌బాగ్, చందూలాల్ బరాదరి, చార్మినార్ చౌక్, బెలా, పురాణ పూల్, పేట్లబుర్జ్, జుమెరత్ బజార్, ధూల్‌పేట్, రహీం పుర, జియాగుడ, జెల్‌పల్లి, కాటేదాన్ దుర్గ నగర్, అరామ్ ఘర్, నంది ముస్లాయి గూడ తదితర ప్రాంతాల నుండి సంఘస్తులు పాల్గొన్నారు.



మాజీమంత్రి ఖైరతాబాద్ ఎమ్మెల్యే దాన నాగేందర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి తోలుపునూరి కృష్ణగౌడ్, డివిజన్ అధ్యక్షులు గడ్డం శ్రీధర్ గౌడ్, గడ్డం లక్ష్మణ్ గౌడ్, తోలుపునూరి నరేష్, తదితరులున్నారు.

నవతెలంగాణ-అంబర్‌పేట



సీఎం రేవంత్ రెడ్డిని కలిసి నూతన సంవత్సరం పురస్కరించుకొని నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసిన మాజీ పీసీసీ అధ్యక్షులు మాజీ రాజ్యసభ సభ్యులు వీహెచ్ హనుమంతరావు, పీసీసీ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మణ్ యాదవ్ తదితరులున్నారు.

నవతెలంగాణ-అంబర్‌పేట

డా.శోభనా దేశ్ పాండేకు పూలే ఎక్సలెన్సీ అవార్డు

నవతెలంగాణ-సుల్తాన్ బజార్



ప్రముఖ విద్యావేత్త సరోజిని నాయుడు వనిత మహా విద్యాలయ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శోభన దేశ్ పాండేకు ఈ ఏడాది భారతదేశ మొదటి మహిళా ఉపాధ్యా యురాలు సావిత్రిబాయి జ్యోతిరావు పూలే ఎక్సలెన్సీ అవార్డు 2025ను ఎంపిక చేసినట్లు తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్ర శాఖ అధ్యక్షులు డాక్టర్ రాజ్ నారాయన్ ముదిరాజ్ నేడు ఒక పత్రికా ప్రకటనలో తెలిపారు. జనవరి 3న శ్రీమతి సావిత్రిబాయి జ్యోతిరావు పూలే జయంతిని పురస్కరించుకొని కళాశాలలో ఈ అవార్డును ప్రధానం చేస్తామని తెలిపారు. 36 సంవత్సరాలుగా విద్యారంగంలో అపారమైన సేవలు అందిస్తున్నారు. బెస్ట్ టీచర్‌గా 2017లో, మహాత్మా గాంధీ శాంతి పురస్కారం 2018లో నేషనల్ సాలిడారిటీ కమిటీ ద్వారా విద్యారంగంలో ఎన్నో అవార్డులు పొందారు. ఉస్మానియా యూనివర్సిటీ నుండి పొలిటికల్ సైన్స్‌లో పిహెచ్డి పట్టా పొందారు. సరోజినీ నాయుడు వనితా మహా విద్యాలయ లో 2018 నుంచి నేటి వరకు ప్రిన్సిపల్‌గా సేవలందిస్తున్నారు. జాతీయ అంతర్జాతీయ సదస్సుల్లో విద్యాభివృద్ధికై ఎన్నో సదస్సు నిర్వహించి అందరి ప్రశంసలు పొంది ఎన్నో అవార్డులు అందుకున్నారు .

పట్టుదలతో విద్యార్థులు తమ కలలను సాకారం చేసుకోవాలి



- ఎస్ఆర్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు

నవతెలంగాణ-హిమాయత్‌నగర్

ప్రస్తుత పోటీ ప్రపంచంలో తమ కలలను సాకారం చేసుకోవడానికి విద్యార్థులు పట్టుదలతో ప్రయత్నించాలని ఎస్ఆర్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు సూచించారు. గురువారం కళాశాల హిమాయత్ నగర్ (ఎన్జీ) బ్రాంచీలో విద్యార్థులు, అధ్యాపకులు కలిసి కేక్ కట్ చేసి నూతన సంవత్సరం-2025 వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, అధ్యాపకులు ఉత్సాహభరితంగా ఆడి, పాడారు. నృత్యాలతో అదరగొట్టారు. అనంతరం ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సానుకూల దృక్పథంతో ముందుకు సాగాలని, విద్యార్థులు తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా చక్కటి క్రమశిక్షణ, పట్టుదలతో చదువుతో రాణించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు.తరగతి గది నుంచే నీతి, నిజాయితీ వ్యక్తిత్వాన్ని అభివృద్ధి చేసుకుంటూ సమాజానికి జవాబుదారీగా ఎదగాలని కోరారు. అధ్యాపకులు, విద్యార్థుల సమిష్టి కృషితో కళాశాల అన్ని రంగాల్లో ప్రగతి సాధిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

'4, 5 తేదీల్లో మహావీర్ ఇంటర్నేషనల్ అపెక్స్ స్వర్ణోత్సవాలు'



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

మహావీర్ ఇంటర్నేషనల్ అపెక్స్ స్వర్ణోత్సవాలు "స్వర్ణోదయ" పేరుతో ఈ నెల 4, 5 తేదీల్లో హైదరాబాద్, శంషాబాద్ సిటాడెల్ కన్వెన్షన్ లో జరగనున్నాయని, 4న స్వర్ణోత్సవాలను తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ప్రారంభిస్తారని, అదే రోజు సాయంత్రం జరిగే కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఎమ్మెల్యే పి.సంజీవ్ రెడ్డి పాల్గొంటారని మహావీర్ ఇంటర్నేషనల్ అపెక్స్ స్వర్ణోత్సవాల నిర్వహణ కమిటీ చీఫ్ కన్వీనర్లు శీల్ జైన్, అజయ్ నహత, చైర్మన్ వినోద్ సంచేటి, వైస్ చైర్ పర్సన్ అర్చన నహత, కన్వీనర్ సీమ షీల్ కుమార్ జైన్ తెలిపారు. ఈ మేరకు గురువారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో స్వర్ణోత్సవాలకు సంబంధించిన వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వర్ణోత్సవాలతో పాటు మహావీర్ ఇంటర్నేషనల్ హైదరాబాద్ చాప్టర్ రజతోత్సవాలను నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమంలో దేశవ్యాప్తంగా 800 మంది ప్రతినిధులు పాల్గొంటారని వారు తెలిపారు. విద్య, ఆరోగ్య, మహిళా శిశు సంక్షేమం, నైపుణ్యాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ తదితర రంగాల్లో ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం మహావీర్ ఇంటర్నేషనల్ దేశంలో 350 కేంద్రాలు, 150 నగరాలు, పట్టణాలలో అనేక సంక్షేమ, సేవా కార్యక్రమాలను నిర్వహిస్తుందని వివరించారు. ఇప్పటికే కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద మహావీర్ ఇంటర్నేషనల్ సంస్థ ఆధ్వర్యంలో రెండు ఆసుపత్రులను నిర్వహిస్తున్నామని, మహిళా సాధికారత కోసం అనేక పలు పథకాలను కొనసాగిస్తున్నామని వారు వెల్లడించారు.

మహిళా సాధికారతకు ప్రతీక

సావిత్రి బాయి పూలే

సావిత్రిబాయి పూలే భారతదేశ చరిత్రలో ఎప్పటికీ మరచిపోలేని పేరు. ఓ ఉద్యమకారిణి, ఉపాధ్యాయురాలు, రచయిత్రి, సంఘ సంస్కర్త. అణగదొక్క బడిన వర్గాలు, ముఖ్యంగా మహిళల సాధికారత కొరకు దళితుల అభ్యున్నతికి తన జీవితాన్ని అంకితం చేసిన త్యాగశీలి. ఈ రోజు ఆమె జయంతి.



సావిత్రిబాయి పూలే 1831 జనవరి 3న మహారాష్ట్రలోని సతారా జిల్లా నమ్‌గావ్‌లో జన్మించారు. చిన్న వయసులోనే సంఘ సంస్కర్త అయిన జ్యోతి రావ్‌పూలేతో వివాహం జరిగింది. పెండ్లి తర్వాత భర్త ప్రోత్సాహంతో చదువు కొనసాగించారు. చదువుకునేందుకు ముందు ఆమె ఆసక్తి చూపకపోయినా 'నువ్వు చదువుకుంటే ఇతర అమ్మాయిలకు చదువు చెప్పవచ్చు' అని ఆమెను ఒప్పించి చదువుకునేలా చేసిన గొప్ప వ్యక్తి జ్యోతిరావ్ పూలే. తర్వాత కాలంలో ఈ జంట భారతదేశంలోని కుల వ్యవస్థ, స్త్రీల అణచివేతకు వ్యతిరేకంగా ఉద్యమించింది.

1847నాటికీ సావిత్రిబాయి భర్తతో కలిసి పూణేలో మొట్టమొదటి బాలికల పాఠశాలను స్థాపించారు. ఆ కాలంలో బాలికలకు విద్య అందించడం అంటే చాలా పెద్ద విప్లవం. వారు ఆ పాఠశాల నడపడం కొన్ని వర్గాల ప్రజలకు నచ్చలేదు. దీంతో సావిత్రి బాయిపై వేధింపులకు, భౌతిక దాడులకు పూనుకునే వారు. అయినా ఆమె పట్టు వీడక సాగించిన విద్యా ఉద్యమానికి తక్కువ కాలంలోనే సహకారం, గుర్తింపు లభించాయి. ఈ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తూ అనేక మంది బాలికల జీవితాల్లో మార్పు తెచ్చారు.

సావిత్రిబాయి కేవలం విద్యా రంగంలోనే కాకుండా, సమాజంలోని అనేక సమస్యలపై పోరాటం చేశారు. వితంతువుల సమస్యలు, బాల్య వివాహాలు, అంటరానితనం వంటి సామాజిక సమస్యలపై గళం ఎత్తారు. తన రచనల ద్వారా సమాజంలోని మూఢనమ్మకాలను బద్దలు కొట్టారు. 1896-97లో సంభవించిన తీవ్ర కరువు, ప్లేగు వ్యాధి మహారాష్ట్ర జనజీవనాన్ని అతలాకుతలం చేసాయి. ఈ పరిస్థితుల్లో కరువు ప్రాంతంల్లోని పేదలకు సావిత్రి బాయి జోలెపట్టి విరాళాలు సేకరించి బాధితులకు అందించారు. ప్లేగు వ్యాధి సోకిన పేదలకు దగ్గరుండి సేవలు అందించారు. ప్లేగు వ్యాధి సోకిన పిల్లల కోసం వైద్య శిబిరాలు నిర్వహించారు. దుర్భరమైన కరువు పరిస్థితులలో కూడ రోజుకు రెండు వేల మంది పిల్లలకు భోజనాలు పెట్టించారు. 1897లో, మార్చి10న ఒక పిల్లవాడికి సేవ చేస్తుండగా ఆమెకు ఆ వ్యాధే సోకి మరణించారు.

సావిత్రిబాయి తన జీవితకాలంలో అనేక అవమానాలు, అణచివేతలు ఎదుర్కొన్నప్పటికీ తన లక్ష్యం నుండి వెనక్కి తగ్గలేదు. అలాంటి మహోన్నతమైన వ్యక్తిత్వం కలిగిన ఆమె భారతీయ మహిళలకు స్ఫూర్తిగా నిలిచారు. ఆమె చేసిన కృషి ఫలితంగానే ఈ రోజు భారతీయ మహిళలు అనేక రంగాల్లో ముందుకు వస్తున్నారు. అంతేకాదు ఆమె జయంతిని మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకుంటున్నాం. ఆమె జీవితం మనందరికీ స్ఫూర్తిదాయకం.

- పల్లె నాగరాజు, 8500431793

మనం నిత్యం సమస్యల మధ్యలోనే బతుకుతుంటాం. అప్పటికప్పుడు వాటిని ఏదోలా దాటేస్తాం. కానీ శాశ్వత పరిష్కారానికి మాత్రం పెద్దగా ఆలోచించం. ఒక్కసారి మనసు పెట్టి గమనిస్తే... కచ్చితంగా శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానం సాయంతో ఎన్నో సామాజిక ఆవిష్కరణలు చేపట్టొచ్చు. ఇదే నమ్మకంతో ముందడుగు వేస్తున్నారు డాక్టర్ ముద్రికా ఖండేల్‌వాల్. తన జ్ఞానాన్ని రైతుల కోసం ఉపయోగించాలని కూరగాయలు ఎక్కువకాలం నిల్వ ఉంచే సాంకేతికతో మొదలుపెట్టి... మహిళల వ్యక్తిగత ఆరోగ్యానికి ప్యాంటీ లైనర్, యాంటీ ఫంగల్ హైజీన్ ఉత్పత్తులు వంటివెన్నో రూపొందించిన ఆమె పరిచయం నేటి మానవిలో...



సాంకేతికతతో కొత్త ఆవిష్కరణలు

కేంబ్రిడ్జి యూనివర్సిటీలో చదువుకున్నారు. కోరుకుంటే అక్కడే ఉద్యోగం చేసి కోట్లు సంపాదించే అవకాశం ఉంది. కానీ ఆమె మాత్రం తన జ్ఞానాన్ని దేశం కోసం ఉపయోగపడాలనుకున్నారు. ఆ ఉద్దేశంతోనే బోధనా వృత్తిలోకి అడుగుపెట్టి... సామాజిక పరిశోధనలు చేస్తున్నారు. ఆ దిశగా ముందడుగు వేసి అద్భుత ఆవిష్కరణలెన్నో చేశారు. ఆ ప్రయత్నమే... ఐఐటీ హైదరాబాద్‌లో అసోసియేట్ ప్రొఫెసర్ పనిచేస్తోన్న డాక్టర్ ముద్రికా ఖండేల్‌వాల్‌కు 'ఇండియన్ నేషనల్ అకాడెమీ ఆఫ్ ఇంజినీరింగ్' సంస్థ ఇచ్చే 'యంగ్ ఇంజినీర్' అవార్డు సైతం అందుకునేలా చేసింది.

అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా...

ముద్రిక తల్లిదండ్రులు ముఖేష్, సంగీత ఇద్దరూ వైద్యులు. ఇంటర్ తర్వాత ఆమె ఐఐటీ ముంబయిలో మెటలర్జికల్ ఇంజినీరింగ్, ఆపై అందులోనే ఎంటెక్ పూర్తి చేశారు. లండన్‌లోని కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ చేశారు ముద్రిక. చదువయ్యాక అక్కడే మంచి ఉద్యోగ అవకాశాలు వచ్చినా... తాను మాత్రం ఇండియాకే తిరిగి రావాలనుకున్నారు. అలా 2013లో భారతదేశానికి వచ్చి ఐఐటీ హైదరాబాద్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా తన కెరీర్ ప్రారంభించారు. ఆరేండ్ల తర్వాత అసోసియేట్ ప్రొఫెసర్‌గా పదోన్నతి పొందారు. మొదటి నుంచీ ముద్రికకు సైన్స్ అంటే మక్కువ. నానమ్మ తాతయ్యల దగ్గర పెరిగిన ఆమెకు సామాజిక సమస్యలపై అవగాహన కూడా ఎక్కువే.

నిల్వ ఉండేలా...

రైతులు సరైన ధరలేక పండించిన పంట నేల పాలు అవుతుండటం చాలా సార్లు ఆమె గమనించారు. రైతన్నల నష్టాలను పూడ్చడానికి వీలుగా డిమాండ్‌ని బట్టి అమ్ముకునేందుకు వ్యవసాయ ఉత్పత్తులు నిల్వ చేసే సామర్థ్యాన్ని పెంచాలనుకున్నారు. ఇందుకోసం రైతులూ, మార్కెటింగ్ అధికారులూ, గోడౌన్ యజమానులతో మాట్లాడి... వాస్తవ పరిస్థితుల్ని తెలుసుకునే ప్రయత్నం చేశారు. వివిధ ప్రయోగాల అనంతరం బ్యాక్టీరియల్ సెల్యూలోజ్‌కి సిల్వర్ నానో పార్టికల్స్ కలపడం ద్వారా టొమాటో వంటి కూరగాయలని ముప్పైరోజుల పాటు తాజాగా భద్రపరిచే ప్యాకేజింగ్ విధానాన్ని కనుగొన్నారు.



మహిళల కోసం...

మనదేశంలో మహిళలకు నెలసరి పెద్ద సమస్య. సురక్షిత విధానాలను పాటించకపోవడం ద్వారా అధిక సంఖ్యలో స్త్రీలు అనారోగ్యాలకు గురవుతున్నారు. దానికి పరిష్కారం కోసం రుతు రోజుల్లో వాడేందుకు యాంటీఫంగల్, బ్యాక్టీరియల్ ప్యాంటీలైనర్స్‌ని తయారు చేశారు. యాంటీ ఫంగల్ ఔషధాలకు లొంగని జగమొండి ఫంగల్ ఇన్ఫెక్షన్ల చికిత్సకు సరికొత్త ఆయుర్వేద ఔషధాన్ని కనుగొన్నారు. ఆయుర్వేద శక్తి కలిగిన ఒరెగానో నూనెలోని థైమల్, థైమ్ నూనెలోని కార్వకరోల్, లవంగ నూనెలోని యూజెనాల్ రసాయనాలతో కూడిన ఆయుర్వేద ఔషధాన్ని తయారు చేశారు. ఇవే కాదు భూమిలో కలవని థర్మాకోల్‌ను రీసైకిల్ చేసేందుకు దాన్ని ఫ్యాబ్రిక్‌గా మార్చారు. ఈ వస్త్రాన్ని పరిశ్రమల్లో నూనె, గ్రీజు వంటివాటిని శుభ్రపరచడానికి ఉపయోగపడేలా చేశారు.

కొత్త ఆవిష్కరణలు

పరిశ్రమల్లో వ్యర్థపదార్థమైన ఫ్లైయాష్‌తో నీరు అంటని ఓ పదార్థాన్ని తయారు చేశారు ముద్రిక. భవిష్యత్తులో దీనిద్వారా దుమ్మూధూళి చేరని గోడలు, టైల్స్ వంటి ఆవిష్కరణలెన్నో రావడానికి ఇది మూలం కాబోతోందని చెబుతారామె.

ఈ పరిశోధనలకు అయ్యే ఖర్చుని బయోటెక్నాలజీ ఇండస్ట్రీ రీసెర్చ్ అసిస్టెంట్ కౌన్సెల్ సమకూర్చింది. ఈ ప్రయోగాలకే ముద్రిక 2016లో 'ద గాంధియన్ యంగ్ టెక్నలాజికల్ ఇన్నోవేషన్' అవార్డును అందుకున్నారు. అలాగే అదే ఏడాది ఇండియన్ నేషనల్ యంగ్ అకాడెమీ ఆఫ్ సైన్సెస్ ఫెలోగా ఎంపికయ్యారు. ముద్రిక తన స్నేహితుడు కదమ్ అగర్వాల్‌ను పెండ్లి చేసుకున్నారు. ఈ దంపతులకు కూతురు ప్రిషా ఉంది.

హాస్టల్ బాత్‌రూమ్‌లో కెమెరాలు

(మొదటిపేజీ తరువాయి)



3 నెలల నుంచి కెమెరాలు పెట్టి వీడియోలు రికార్డ్ చేస్తుంటే యాజమాన్యం ఏం చేస్తుందని ప్రశ్నించారు. సౌకర్యాలు, ఫీజుల గురించి ప్రశ్నిస్తున్న విద్యార్థినుల వీడియోలు బయట పెడతామని బెదిరింపులకు పాల్పడుతోందని ఆరోపించారు. ప్రీతిరెడ్డి అనే వార్డెన్ 3 నెలలుగా 300 మందికి పైగా విద్యార్థినులను కెమెరాలతో చిత్రీకరించారని ఆరోపించారు. వాటిని దగ్గర పెట్టుకొని ప్రశ్నిస్తున్న విద్యార్థినులను బ్లాక్ మెయిల్ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విచారణ జరిపి వార్డెన్ ప్రీతిరెడ్డి, చైర్మెన్ గోపాల్ రెడ్డిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మేడ్చల్ మండల కార్యదర్శి కిరణ్, నాయకులు భగత్, అజయ్, కార్తీక్, కరుణాకర్, శివ, కుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కఠిన చర్యలు తీసుకుంటాం : ఏసీపీ శ్రీనివాస్ రెడ్డి

సీఎంఆర్ గర్ల్స్ హాస్టల్‌లోని బాత్‌రూమ్‌లో వీడియోలు తీసిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఏసీపీ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. హాస్టల్ బాత్‌రూములోని వెంటిలేటర్ కిటికీ వద్ద ఓ వ్యక్తి షాడో కనిపించిందని ఓ విద్యార్థిని ఫిర్యాదు చేసినట్టు చెప్పారు. హాస్టల్ మెస్‌లో పనిచేసే ఐదుగురిపై వారు అనుమానం వ్యక్తం చేయగా, అదుపులోకి తీసుకున్నట్టు తెలిపారు. వీరితోపాటు హాస్టల్ వార్డెన్ ప్రీతిరెడ్డి, మెస్ ఇన్‌చార్జి సెల్వంను కూడా అదుపులోకి తీసుకున్నట్టు చెప్పారు. వారి ఫోన్లను స్వాధీనం చేసుకున్నామని, వాటిలో ఇప్పటికైతే ఎలాంటి వీడియోలూ లభించలేదని అన్నారు. ఫోన్లలో డిలీటెడ్ వీడియోలు ఉన్నా వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

మహిళా కమిషన్ విచారణ

రాష్ట్ర మహిళా కమిషన్ కార్యదర్శి పద్మజారమణ గురువారం కాలేజీని సందర్శించి విచారణ చేపట్టారు. సదరు గర్ల్స్ హాస్టల్ బాత్ రూమ్‌లను పరిశీలించి తగిన సూచనలు చేశారు. కళాశాల యాజమాన్యానికి నోటీసు అందజేసినట్టు తెలిపారు. పూర్తి విచారణ చేపట్టి నివేదికను మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌కు అందజేస్తామని చెప్పారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థినుల నుంచి ఫిర్యాదులను స్వీకరించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

మహబూబాబాద్‌లో పేదలను ఆదుకోండి

(మొదటిపేజీ తరువాయి)

ప్లాట్లు చేసి అమ్ముకుంటున్నారని తెలిపారు. పైన పేర్కొన్న సర్వే నెంబర్‌లోనే సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో పేదలు గుడిసెలు వేసుకుని రెండేండ్లుగా నివసిస్తున్నారని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్, రియల్ ఎస్టేట్ వ్యాపారుల ప్రోద్భలంతో ఆనాటి అధికారులు పేదల గుడిసెలను తొలగించి, ఆ భూమిని ఆక్రమణదారులకు అప్పగించడం కోసం గుడిసెవాసులపై 18 సార్లు దాడులు చేశారని వివరించారు. గుడిసెలను కూల్చివేసి 200 మందిపై అక్రమ కేసులు పెట్టారని పేర్కొన్నారు. 20 మందిని జైలుకు పంపారని గుర్తు చేశారు. (అందులో ప్రధానంగా 10 మంది మహిళలను అర్ధరాత్రి చిత్రహింసలు పెట్టి 15 రోజులు జైలుకు పంపారు) ఇంత నిర్బంధం ప్రయోగించినా కూడా పేదలు గత్యంతరం లేక ఆ గుడిసెల్లోనే నేటికీ జీవిస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ప్రశాంతంగా ఉన్నా, ఈ మధ్య కాలంలో గుడిసెలు ఖాళీ చేయాలంటూ రెవెన్యూ అధికారులు పేదలపై ఒత్తిడి చేస్తున్నారని పేర్కొన్నారు. కావున సీఎం రేవంత్‌రెడ్డి జోక్యం చేసుకుని, గుడిసెలు వేసుకుని నివాసముంటున్న స్థలంలో పట్టాలిచ్చి, ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసి ఆ పేదలను ఆదుకోవాలని కోరారు. ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు.

సీఎంఆర్ కాలేజీ ఘటనపై విచారణ జరపాలి

వార్డెన్ ప్రీతిరెడ్డి, మల్లారెడ్డి, గోపాల్‌రెడ్డిలను అరెస్టు చేయాలి

విద్యార్థినుల వీడియోలు బయటికి రాకుండా చర్యలు చేపట్టాలి : ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



మేడ్చల్ కండ్లకోయలో ఉన్న సీఎంఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థినిల బాత్రూమ్‌లలో మూడు నెలల నుంచి కెమెరాలు పెట్టి ప్రయివేటు వీడియోలను రికార్డ్ చేసిన ఘటనపై విచారణ జరపాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఆ కాలేజీలో సౌకర్యాలు, ఫీజుల గురించి ప్రశ్నించిన విద్యార్థినుల వీడియోలను బయట పెడతామంటూ యాజమాన్యం బెదిరింపులకు పాల్పడటాన్ని తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి, కార్యదర్శి టి నాగరాజు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. వార్డెన్ ప్రీతిరెడ్డి మూడు నెలలుగా 300 మందికిపైగా విద్యార్థినులను కెమెరాలతో చిత్రీకరించారని వివరించారు. సమస్యలపై ప్రశ్నిస్తున్న విద్యార్థినులను బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని విమర్శించారు. ఈ అంశంపై పోలీసులు సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. కాలేజీ యజమాని మల్లారెడ్డి, అతని తమ్ముడు గోపాల్ రెడ్డి పాత్రపైనా విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. వార్డెన్ ప్రీతిరెడ్డి, మల్లారెడ్డి, గోపాల్ రెడ్డిలను తక్షణమే అరెస్టు చేయాలని కోరారు. గతంలో ఈ కళాశాలపై అనేక ఫిర్యాదులు న్నాయని తెలిపారు. విద్యార్థులు ఆత్మహత్యలు కూడా చేసుకున్నారని వివరించారు. అయినా పోలీసులు, ప్రభుత్వం చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు. లక్షలాది రూపాయల ఫీజులు పెంచి సౌకర్యాలు కల్పించకుండా, సరైన భోజనం. అందించకుండా అడిగిన విద్యార్థినులను బెదిరింపులకు గురి చేస్తున్న ఈ యాజమాన్యంపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహిళల భద్రత గురించి చర్చ జరుగుతున్న ఈ సమయంలో వారికి తెలియకుండా వీడియోలు తీసి బ్లాక్‌మెయిల్ చేయడాన్ని రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. ఆ కళాశాల గుర్తింపు రద్దు చేసి విద్యార్థులు నష్టపోకుండా వేరే కాలేజీలో చదువులు కొనసాగించేలా చర్యలు చేపట్టాలని సూచించారు.

పేదరికంపై తప్పుడు అంచనాలు



NITI Aayog

న్యూఢిల్లీ : అధికారిక గణాంకాల ప్రకారం దేశంలో నాలుగో వంతు మంది ప్రజలు...అంటే జనాభాలో 26.4 శాతం మంది దారిద్ర్యరేఖకు దిగువన జీవిస్తున్నారని అధ్యయనం తెలిపింది. ఇది 2022-23లో నిర్వహించిన కుటుంబ వినియోగ వ్యయ సర్వే (హెచ్‌సీఈఎస్) నుండి తీసుకున్న సమాచారమేనని చెప్పింది. దేశంలో పేదరిక నిష్పత్తి ఐదు శాతం కంటే తక్కువగానే ఉన్నదంటూ నిటి ఆయోగ్ సీఈఓ బీవీఆర్ సుబ్రమణ్యం గత సంవత్సరం చెప్పిన మాటలకు ఇది పూర్తి భిన్నంగా ఉండడం గమనార్హం. 'వ్యవసాయ అధ్యయనాల సమీక్ష' పేరిట వచ్చిన సంపాదకీయం ఓ పత్రికలో ప్రచురితమైంది. దేశంలో పేదరికం ఏ మేరకు ఉన్నదన్న విషయంపై గత దశాబ్ద కాలంగా ప్రభుత్వం పెదవి విప్పడం లేదని ఆ సంపాదకీయం గుర్తు చేసింది. అందుకు రెండు ప్రధాన కారణాలు ఉన్నాయి. ఒకటి...నాణ్యమైన సమాచారం అందుబాటులో లేకపోవడం. రెండోది...పేదరికాన్ని లెక్కించే విధానంలో ప్రభుత్వం మార్పులు చేయడం. జీవన ప్రమాణాలకు సంబంధించిన వివిధ కోణాల నుండి పేదరికాన్ని లెక్కించడానికి వినియోగ వ్యయాన్ని పరిగణనలోకి తీసుకుంటున్నారు. బెంగళూరులోని వ్యవసాయ అధ్యయనాల ఫౌండేషన్ ఆన్‌లైన్‌లో నిపుణులతో చర్చా గోష్టిని నిర్వహించింది. పేదరికానికి సంబంధించి గత డిసెంబర్ 18వ తేదీన దేశంలో అధికారిక అంచనాలేవీ లేకపోవడాన్ని వారు గుర్తించారు. పేదరికాన్ని ఏదో ఒక పద్ధతిలో లెక్కించాల్సిన అవసరం ఉన్నదని ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్ ప్రొఫెసర్ మధురా సామినాథన్ చెప్పారు. పేదరికానికి సంబంధించిన చిట్టచివరి అధికారిక అంచనాలు 2013లో ప్రణాళికా సంఘం నుండి వెలువడ్డాయి. ప్రొఫెసర్ సురేష్ టెండుల్కర్ నేతృత్వంలోని నిపుణుల బృందం సిఫార్సు చేసిన దారిద్ర్య రేఖ ఆధారంగా ఆ అంచనాలను రూపొందించారు. 2011-12 సంవత్సరపు వినియోగ వ్యయ సర్వేను కూడా ఈ బృందం పరిగణనలోకి తీసుకుంది. కాగా దేశ జనాభాలో పేదలు గ్రామీణ ప్రాంతాలలో 25.7 శాతం, పట్టణ ప్రాంతాలలో 13.7 శాతం ఉన్నారని సంపాదకీయం తెలిపింది. యూపీఏ ప్రభుత్వం సి.రంగరాజన్ నేతృత్వంలో మరో నిపుణుల బృందాన్ని ఏర్పాటు చేసింది. టెండూల్కర్ బృందం సూచించిన దారిద్ర్యరేఖ కంటే రంగరాజన్ బృందం సూచించింది కొంచెం ఎక్కువగా ఉంది. మనుగడ కోసం ఆహార వస్తువులపై పెట్టే ఖర్చుతో పాటు కొన్ని అత్యవసర ఆహారేతర వస్తువులపై పెట్టే వ్యయాన్ని కూడా అది పరిగణనలోకి తీసుకుంది. 2011-12లో దేశ జనాభాలో గ్రామీణ ప్రాంతాలలో 30.9 శాతం, పట్టణ ప్రాంతాలలో 26.4 శాతం ప్రజలు దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నారని నిపుణుల బృందం అంచనా వేసింది. అయితే ఈ అంచనాలను ప్రభుత్వం ఎన్నడూ అంగీకరించలేదు. 2011-12 నుండి 2024 ప్రారంభం వరకూ వినియోగ వ్యయంపై అధికారిక గణాంకాలేవీ విడుదల కాలేదు. 2022 ఆగస్ట్ నుండి 2023 జూలై వరకూ జరిపిన వినియోగ వ్యయ సర్వే వివరాలను గత సంవత్సరం విడుదల చేశారు.ఇటీవల నిర్వహించిన కుటుంబ వినియోగ వ్యయ సర్వే సమాచారాన్ని గతంలో జరిపిన సర్వేలు అందించిన సమాచారంతో పోల్చలేము. దీనికి అనేక కారణాలు ఉన్నాయి. నమూనాల రూపకల్పనలో, ప్రశ్నావళిలో, సమాచార సేకరణలో అనుసరించిన పద్ధతులలోనూ మార్పులు చోటుచేసుకోవడమే దీనికి కారణం. తమ అధ్యయనం కారణంగా వెలుగు చూసిన విషయాలను పరిశీలిస్తే సిగ్గుచేటుగా ఉన్నాయని 'వ్యవసాయ అధ్యయనాల సమీక్ష' వ్యాఖ్యానించింది. 'దేశ జనాభాలో గ్రామీణ ప్రాంతాలలో 27.4 శాతం, పట్టణ ప్రాంతాలలో 23.7 శాతం మంది పేదలు ఉన్నరన్న అంచనా ప్రకారం గ్రామాలలో 246.7 మిలియన్లు, పట్టణాలలో 114.4 మిలియన్ల మంది పేదలు ఉన్నారని అర్థమవుతోంది. మొత్తంగా చూస్తే 361 మిలియన్ల ప్రజలు రంగరాజన్ నేతృత్వంలోని నిపుణుల కమిటీ నిర్ధారించిన కనీస వ్యయాన్ని సైతం భరించే స్థితిలో లేరు. అమెరికా మొత్తం జనాభా కంటే మన దేశంలోని పేదలే ఎక్కువ సంఖ్యలో ఉన్నారు. జీడీపీ లేదా జాతీయాదాయాన్ని బట్టి చూస్తే ప్రపంచంలో భారత్ ఐదో స్థానంలో ఉంది. పేదరికంతో బాధపడుతున్న వారిని సంఖ్యాపరంగా చూస్తే ప్రపంచంలో మనదే మొదటి స్థానం. ఇది సిగ్గుచేటైన రికార్డు' అని ఆ అధ్యయనం వివరించిం ది. రంగరాజన్ కమిటీ ప్రతిపాదించిన పద్ధతిపై అధ్యయన రచయితలు దృష్టి సారించారు. దారిద్ర్యరేఖను లెక్కించడానికి దానినే ఉపయోగించా రు. దేశంలో పేదరికంతో బాధపడుతున్న వారు జనాభాలో 26.4 శాతం ఉన్నారని తేల్చారు.

రూపాయి చతికిల

ముంబయి : కొత్త ఏడాదిలోనూ రూపాయి పతనం ఆగడం లేదు. గురువారం ప్రపంచ మార్కెట్‌లో రూపాయి మారకం విలువ 9 పైసలు పతనమై 85.73 కనిష్ట స్థాయికి దిగజారింది. ఇంటర్ బ్యాంక్ ఫారిన్ ఎక్స్చేంజ్ మార్కెట్‌లో రూపాయి విలువ 85.79-85.68 మధ్య కదలాడింది. ఇంతక్రితం బుధవారం 85.64 వద్ద ముగిసింది. అంతర్జాతీయంగా చమురు ధరలు పెరగడం, దేశ ఆర్థిక వ్యవస్థలో చోటు చేసుకుంటున్న అత్యంత బలహీనమైన గణంకాలు, స్టాక్ మార్కెట్లలో ఒత్తిడి, విదేశీ సంస్థాగత పెట్టుబడులు తరలిపోవడం, పేలవ ఎగుమతుల తీరు, దిగుమతులు పెరగడం తదితర పరిణామాలు రూపాయికి ప్రతికూలంగా మారాయి.

బహుజన చైతన్య స్ఫూర్తి సావిత్రిబాయి పూలే : సీఎం రేవంత్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఎన్నో ఏండ్ల క్రితమే మహిళలకు విద్యనందించిన సావిత్రీభాయిపూలే బహుజనుల చైతన్య స్ఫూర్తి అనీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాళు లర్పించారు. ఆమె జయంతిని పురస్కరించుకుని మహిళా ఉపాధ్యాయులందరికీ ఆయన శుభాకాంక్షలు తెలిపారు.లింగవివక్ష, కుల అసమానతలపై ఆమె చేసిన పోరాటం అద్వితీయమని పేర్కొన్నారు. సావిత్రీభాయి పూలే స్ఫూర్తితో మహిళా సాధికారత కోసం తమ ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతుందనీ, అందులో భాగంగానే ఆమె జయంతిని మహిళా ఉపాధ్యాయదినోత్సవంగా నిర్వహించబోతున్నదని సీఎం తెలిపారు.

దీప్తి జీవాంజికి సీఎం అభినందనలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పారాలింపిక్స్‌లో భారత్ తరపున కాంస్య పతకం సాధించిన తెలంగాణ యువ అథ్లెట్, వరంగల్ జిల్లా ముద్దుబిడ్డ దీప్తి జీవాంజి విశిష్ట క్రీడా పురస్కారం అర్జున అవార్డు 2024 కు ఎంపిక కావడం పట్ల ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి అభినందనలు తెలియజేశారు. అంతర్జాతీయ, జాతీయ క్రీడల్లో సత్తా చాటే యువ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు స్పోర్ట్స్ పాలసీలో భాగంగా సీఎం రూ. కోటి, కోచ్ నాగపురి రమేష్‌కు రూ.10 లక్షల నగదు బహుమతిని గతంలోనే అందజేశారు. అదే సమయంలో దీప్తికి గ్రూప్-2 స్థాయి ప్రభుత్వ ఉద్యోగంతో పాటు వరంగల్‌లో 500 గజాల స్థలం కేటాయించాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. యువ క్రీడాకారులు మరింతగా రాణించాలని, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ, రాష్ట్ర వ్యాప్తంగా నిర్మితం కానున్న స్పోర్ట్స్ కాంప్లెక్సులు అందుకు దోహదపడతాయని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పేర్కొన్నారు. అలాగే క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ధ్యాన్ చంద్ ఖేల్ రత్న అవార్డుకు ఎంపికైన డిగుకేష్ (చెస్), హర్మన్ ప్రీత్ (హాకీ), ప్రవీణ్ కుమార్ (ప్యారా అథ్లెటిక్స్), రియల్ మనుబాకర్ (షుటింగ్)లకు ముఖ్యమంత్రి అభినందనలు తెలిపారు. 2024లో వివిధ క్రీడల్లో ప్రతిభ కనబరిచి అర్జున, ద్రోణాచార్య అవార్డులకు ఎంపికైన క్రీడాకారులు, కోచ్‌లకు సీఎం రేవంత్‌రెడ్డి అభినందనలు తెలియజేశారు.

మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించడం హర్షణీయం : ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సావిత్రిబాయి పూలే జయంతిని 'మహిళా ఉపాధ్యాయ దినోత్సవం'గా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడం హర్షణీయమని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆమె జయంతి జనవరి 3ను మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేయడాన్ని అభినందిస్తున్నానని పేర్కొన్నారు. ఇది సముచిత నిర్ణయమని తెలిపారు. దశాబ్దకాలంగా తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) ఈ డిమాండ్ చేస్తున్నదని గుర్తు చేశారు. భారతదేశంలో తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా బాలికల విద్య కోసం ఆమె కృషి చేశారని పేర్కొన్నారు. ఆనాటి పురుషాధిక్య సమాజంలో బాలికలకు విద్యనేర్పడమంటే, సమాజాన్ని ఎదిరించి నిలబడే తెగువ గల వారు మాత్రమే ముందుకు వెళ్లారని గుర్తు చేశారు. అలాంటి తెగువ, ధైర్యం గల సాహసి సావిత్రిబాయి పూలే అని తెలిపారు. భర్త జ్యోతిబా పూలే ఇతోధిక ప్రోత్సాహమున్నప్పటికీ ఆమె సాహసమే ఉపాధ్యాయురాలిగా నిలిపిందని పేర్కొన్నారు.

సమం చేస్తారా.. సమర్పిస్తారా!



- నేటి నుంచి సిడ్నీలో ఆఖరు టెస్టు పోరు
- 2-2తో సిరీస్ నిలుపుకోవాలని భారత్ తపన
- 3-1 విజయంపై కంగారూల గురి
- ఉదయం 5 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..

ప్రపంచ వన్డే చాంపియన్, ప్రపంచ టెస్టు చాంపియన్ ఆస్ట్రేలియా. కానీ పదేండ్లుగా ఆ జట్టుకు అందని ద్రాక్షగా మిగిలింది బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ. సిడ్నీలో కనీసం డ్రా ఆసీస్‌కు బోర్డర్ గవాస్కర్ ట్రోఫీతో పాటు ఈ ఫార్మాట్‌లో ఆధిపత్యం తిరిగి దక్కనుండగా.. భారత్ కచ్చితంగా నెగ్గితేనే ప్రతిష్టాత్మక ట్రోఫీని నిలుపుకోగలదు.

ప్రపంచ క్రికెట్‌ను ఉర్రూతలూగిస్తున్న భారత్, ఆసీస్ టెస్టు సమరం ఆఖరు అంకానికి చేరుకుంది. ఊహించని మలుపులు తిరుగుతూ, మైదానం వెలుపలా వాతావరణం వేడెక్కిస్తున్న బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో చివరి టెస్టు నేటి నుంచి సిడ్నీలో ఆరంభం కానుంది. ఓ వైపు భారత శిబిరంలో లుకలుకలు వినిపిస్తుండగా.. ఆసీస్ మాత్రం ఆత్మవిశ్వాసంతో కనిపిస్తోంది. భారత్, ఆస్ట్రేలియా సిడ్నీ సవాల్ నేటి నుంచి షురూ.

నవతెలంగాణ-సిడ్నీ

బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ అంతిమ ఘట్టానికి చేరుకుంది. పెర్త్‌లో టీమ్ ఇండియా సూపర్ విక్టరీ సాధించగా.. ఆడిలైడ్‌లో ఆసీస్ లెక్క సమం చేసింది. బ్రిస్బేన్‌లో వరుణుడు ఆట ఆడుకోగా.. బాక్సింగ్ డేలో కంగారూల పంచ్ విసిరారు. ఇప్పుడు సవాల్ సిడ్నీకి చేరుకుంది. పదేండ్లుగా ఊరిస్తున్న టెస్టు సిరీస్‌ను సొంతం చేసుకునేందుకు ఆతిథ్య ఆస్ట్రేలియా ఉత్సాహంగా కనిపిస్తోంది. మరోవైపు, 1-2తో సిరీస్‌లో వెనుకంజ వేసిన భారత్.. డ్రెస్సింగ్‌రూమ్‌లో అంతర్గత విభేదాల వార్తలతో నైరాశ్యంలో పడింది!. ఈ పరిస్థితి ఆసీస్‌కు మరింత మేలు చేయగలదు. గాయాలతో భారత్ నుంచి ఆకాశ్ దీప్, ఆసీస్ నుంచి మిచెల్ మార్ష్‌లు సిడ్నీ టెస్టుకు దూరమయ్యారు. ఆసీస్ జట్టులో ఒక్క మార్పు ఉండనుండగా.. భారత్ తుది జట్టులో కనీసం రెండు మార్పులతో బరిలోకి దిగే అవకాశం ఉంది.

తొలి ఇన్నింగ్స్ బలహీనత!

సిరీస్‌లో వెనుకంజ వేసిన టీమ్ ఇండియా సిడ్నీ టెస్టు ముంగిట తీవ్ర ఒత్తిడిలో పడింది. మెల్‌బోర్న్‌లో చివరి సెషన్లో ఏడు వికెట్లు కోల్పోయి చేజేతులా ఓటమిపాలైన భారత్.. సిడ్నీలో లెక్కలు సరి చేయటంపై దృష్టి సారించింది. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ నిలకడగా విఫలం అవుతుంది. ఈ సిరీస్‌లో భారత్ తొలి ఇన్నింగ్స్ సగటు 22.40. భారత్ నెగ్గిన పెర్త్ టెస్టులోనూ తొలి ఇన్నింగ్స్‌లో తేలిపోయింది. దీంతో, తొలుత భారత్ తొలి ఇన్నింగ్స్‌లో కనీసం 300-350 పరుగులు చేయటంపై ఫోకస్ పెట్టాలి. యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్, ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి మాత్రమే సిరీస్‌లో నిలకడగా పరుగులు సాధించారు. సిడ్నీ టెస్టులో ఈ ఇద్దరికి ఇతర బ్యాటర్లు జతకలిస్తే.. ఆసీస్‌ను ఓడించటం పెద్ద విషయం కాబోదు. కానీ, డ్రెస్సింగ్‌రూమ్‌లో విభేదాల వార్తలు అభిమానులకు ఆందోళన కలిగిస్తున్నాయి. చీఫ్ కోచ్ గంభీర్, కెప్టెన్ రోహిత్‌ల మధ్య విభేదాలు పొడచూపాయని వార్తలు వస్తున్నాయి. జట్టులోని సీనియర్ ఆటగాళ్ల మధ్య సఖ్యత లేదని తెలుస్తోంది. ఇది మరింత ఆందోళనకు కారణమవుతోంది. ఇక, యశస్వి జైస్వాల్, కెఎల్ రాహుల్ మళ్లీ ఓపెనింగ్ చేయనుండగా.. శుభ్‌మన్ గిల్ జట్టులోకి రానున్నాడు. సిడ్నీలో గిల్ ముమ్మరంగా ప్రాక్టీస్ చేయగా.. కోచ్ గంభీర్ స్వయంగా అతడిని పర్యవేక్షించాడు. ఆకాశ్ దీప్ స్థానంలో మరో పేసర్ ఆడనుండగా.. వాషింగ్టన్ సుందర్ స్థానంలో ధ్రువ్ జురెల్‌ను ఆడించే అవకాశాలు కనిపిస్తున్నాయి. పేస్ దళపతి జశ్‌ప్రీత్ బుమ్రా భీకర ఫామ్‌లో ఉండగా.. అతడికి మరో ఎండ్ నుంచి మద్దతు లభించటం లేదు. మహ్మద్ సిరాజ్ సిడ్నీలోనైనా మెరిస్తే వికెట్ల వేటలో బుమ్రాకు ఊరట దక్కనుంది.

కంగారూల జోష్

ఆస్ట్రేలియా సిడ్నీలో ఫేవరేట్‌గా బరిలోకి దిగుతోంది. ఈ గ్రౌండ్‌లో భారత్ రికార్డు సైతం పేలవంగా ఉంది. ఫామ్‌లో లేని ఆల్‌రౌండర్ మిచెల్ మార్ష్ దూరమైనా.. బ్యూ వెబ్‌స్టర్‌కు అరంగేట్ర అవకాశం దక్కనుంది. ఓపెనర్ శామ్ కాన్‌స్టాస్, వెబ్‌స్టర్‌లు భారత్‌ను ఎదుర్కొనేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. కెప్టెన్ పాట్ కమిన్స్ బంతితో, బ్యాట్‌తో అదరగొడుతున్నాడు. ఆల్‌రౌండ్ షోతో మెల్‌బోర్న్‌లో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. గత టెస్టులో ట్రావిశ్ హెడ్ విఫలమైనా.. సిడ్నీలో అతడు భారత్‌కు ప్రమాదకరమే. ఉస్మాన్ ఖవాజా, మార్నస్ లబుషేన్, స్టీవ్ స్మిత్ ఫామ్‌లోకి రావటం ఆసీస్‌కు కొండంత బలం. ఇప్పటివరకు బౌలర్లతో పోటీపడిన భారత్.. ఇక సిడ్నీలో బ్యాటర్లను ఎదుర్కొనేందుకు సైతం చెమటోడ్చక తప్పని పరిస్థితి ఏర్పడింది. ఈ టెస్టును డ్రా చేసుకున్నా.. బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ ఆసీస్ సొంతం కానుంది. కానీ భారత్ విజయం సాధిస్తే.. డిఫెండింగ్ విన్నర్‌గా ట్రోఫీని టీమ్ ఇండియా అట్టిపెట్టుకోనుంది. దీంతో విజయమే లక్ష్యంగా కంగారూలు సిడ్నీలో బరిలోకి దిగనున్నారు.

పిచ్, వాతావరణం

సిడ్నీ పిచ్ పేసర్లకు అనుకూలం. కానీ తొలి నాలుగు టెస్టులతో పోల్చితే ఇక్కడే ప్రతి వికెట్‌కు 34.85 పరుగుల చొప్పున సగటు నమోదైంది. ప్రస్తుతం పిచ్‌పై మంచి పచ్చిక కనిపిస్తోంది. పిచ్ నుంచి సీమర్లకు అదనపు సానుకూలత లభించనుంది. టెస్టులో చివరి రెండు రోజులు వర్షం కురిసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. టాస్ నెగ్గిన జట్టు తొలుత బ్యాటింగ్ ఎంచుకునే అవకాశం మెండుగా ఉంది.

తుది జట్లు (అంచనా)

భారత్ : రోహిత్ శర్మ/శుభ్‌మన్ గిల్, యశస్వి జైస్వాల్, కెఎల్ రాహుల్, విరాట్ కోహ్లి, రిషబ్ పంత్ (వికెట్ కీపర్), రవీంద్ర జడేజా, ధ్రువ్ జురెల్, నితీశ్ కుమార్ రెడ్డి, ప్రసిద్ కృష్ణ/హర్షిత్ రానా, జశ్‌ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్.

ఆస్ట్రేలియా : ఉస్మాన్ ఖవాజా, శామ్ కాన్‌స్టాస్, మార్నస్ లబుషేన్, స్టీవ్ స్మిత్, ట్రావిశ్ హెడ్, బ్యూ వెబ్‌స్టర్, అలెక్స్ కేరీ (వికెట్ కీపర్), పాట్ కమిన్స్ (కెప్టెన్), మిచెల్ స్టార్క్, స్కాట్ బొలాండ్, నాథన్ లయాన్.

38 టెస్టుల్లో 10,000 పరుగుల మైలురాయికి స్టీవ్ స్మిత్ 38 పరుగుల దూరంలో ఉన్నాడు. సిడ్నీలో 38 పరుగులు సాధిస్తే.. పది వేల క్లబ్‌లో ఆసీస్ దిగ్గజాలు అలెన్ బోర్డర్, స్టీవ్ వా, రికీ పాంటింగ్ సరసన స్మిత్ నిలువనున్నాడు.

24 ఆసీస్ స్పీడ్‌స్టర్ మిచెల్ స్టార్క్ సొంత మైదానం సిడ్నీ. కానీ ఈ గ్రౌండ్‌లో అతడికి మంచి గణాంకాలు లేవు. తొమ్మిది టెస్టుల్లో 44.16 సగటుతో 24 వికెట్లు మాత్రమే పడగొట్టాడు.

1 బోర్డర్ గవాస్కర్ సిరీస్ నిలుపుకోవటంపై దృష్టి నిలిపిన భారత్‌కు సిడ్నీ రికార్డు నిరాశ కలిగిస్తోంది. ఇక్కడ ఆడిన 13 టెస్టుల్లో టీమ్ ఇండియా ఒక్క మ్యాచ్‌లోనే విజయం సాధించింది.

రోహిత్‌కు మొండిచేయి?!



భారత కెప్టెన్ రోహిత్ శర్మకు సిడ్నీ టెస్టులో చోటు లేదా?. శుభ్‌మన్ గిల్ కోసం రోహిత్ శర్మను బెంచ్‌కు పరిమితం చేయనున్నారా? దీనికి సమాధానం అవుననే వస్తోంది. తుది జట్టులో రోహిత్ ఉంటాడా? అని విలేకరులు గౌతం గంభీర్‌ను అడుగగా.. ఉదయం పిచ్‌ను పరిశీలించి తుది జట్టుపై నిర్ణయానికి వస్తామని వెల్లడించాడు. దీంతో రోహిత్‌కు చోటు కష్టమేనని తెలుస్తోంది. ప్రాక్టీస్ సెషన్లోనూ రోహిత్ చురుగ్గా కనిపించలేదు. ఆలస్యంగా గ్రౌండ్‌కు వచ్చిన రోహిత్ త్రో డౌన్స్ ఎదుర్కొంటూ సాధన చేశాడు. గత తొమ్మిది టెస్టుల్లో రోహిత్ బ్యాటింగ్ సగటు 10.93. తాజా సిరీస్‌లో బ్యాటింగ్ సగటు 6.20 మాత్రమే. సాధారణంగా ప్రీ మ్యాచ్ ప్రెస్ కాన్ఫరెన్స్‌కు కెప్టెన్ హాజరవుతాడు. సిడ్నీలో చీఫ్ కోచ్ గౌతం గంభీర్ మీడియా సమావేశానికి వచ్చాడు. బ్రిస్బేన్‌లోనూ శుభ్‌మన్ గిల్ హాజరైనా.. అప్పుడు ప్రాక్టీస్ సెషన్‌కు రోహిత్ శర్మ హాజరు కాలేదు.





మను, గుకేశ్ ఖేల్ రత్నాలు

- హర్మన్‌ప్రీత్, ప్రవీణ్‌లకు సైతం..
- దీప్తి జీవాంజీకి అర్జున పురస్కారం

నవతెలంగాణ-న్యూఢిల్లీ







2024లో భారత ఖ్యాతిని రెట్టింపు చేసిన క్రీడాకారులను దేశ అత్యున్నత క్రీడా పురస్కారం ఖేల్ రత్న వరించింది. పారిస్ ఒలింపిక్స్‌లో రెండు కాంస్య పతకాలతో చరిత్ర సృష్టించిన మను బాకర్, ప్రపంచ చెస్ చాంపియన్ దొమ్మరాజు గుకేశ్ సహా హాకీ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్, పారా అథ్లెట్ ప్రవీణ్ కుమార్‌లు 2024 మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్ రత్న అవార్డులను దక్కించుకున్నారు. క్రీడా అవార్డుల సెలక్షన్ కమిటీ సిఫారసుల మేరకు కేంద్ర క్రీడామంత్రిత్వ శాఖ అవార్డుల విజేతలను గురువారం ప్రకటించింది. పారాలింపిక్స్‌లో కాంస్య పతకం సాధించిన తెలంగాణ అమ్మాయి దీప్తి జీవాంజి అర్జున అవార్డుకు ఎంపికైంది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన స్ప్రింటర్ జ్యోతి ఎర్రాజి సైతం అర్జున పురస్కారానికి ఎంపికైంది. 32 మంది అర్జున అవార్డుకు ఎంపిక కాగా.. 17 మంది పారా అథ్లెట్లు కావటం విశేషం. ఖేల్ రత్న విజేతకు రూ.25 లక్షలు, అర్జున అవార్డు విజేతలకు రూ.15 లక్షల చొప్పున నగదు బహుమతి దక్కుతుంది. జనవరి 17న రాష్ట్రపతి భవన్‌లో జరుగబోయే కార్యక్రమంలో ఈ పురస్కారాలను ప్రెసిడెంట్ ద్రౌపది ముర్ము అందజేయనున్నారు.

22 ఏండ్ల మను బాకర్ ఓ ఒలింపిక్స్‌లో రెండు పతకాలు సాధించిన ఏకైక భారత అథ్లెట్‌గా నిలిచింది. పారిస్‌లో 10మీ ఎయిర్ పిస్టల్, 10 మీ ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ ఈవెంట్‌లో మను కాంస్య పతకాలు సాధించింది. ఖేల్ రత్న అవార్డుకు మను బాకర్ పేరును పరిగణనలోకి తీసుకోవటం లేదని వార్తలు రాగా.. తాజాగా అవార్డుల జాబితాలో ఆమె నిలిచింది. పారిస్ ఒలింపిక్స్‌లో భారత హాకీ జట్టును హర్మన్‌ప్రీత్ సింగ్ ముందుండి నడిపించాడు. ఒలింపిక్స్‌లో హాకీ ఇండియా వరుసగా రెండో కాంస్య పతకం సాధించింది. 18 ఏండ్ల గుకేశ్ అత్యంత పిన్న వయసులో ప్రపంచ చెస్ చాంపియన్‌గా నిలిచాడు. చైనా గ్రాండ్‌మాస్టర్ డింగ్ లిరెన్‌ను ఓడించి చదరంగం రారాజుగా అవతరించాడు. పారాలింపిక్స్‌లో ప్రవీణ్ కుమార్ హైజంప్‌లో టీ64 ఈవెంట్‌లో పసిడి పతకం సాధించాడు. వరుసగా రెండు ఒలింపిక్స్‌లో పసిడి పతకాలు సాధించిన పారా షూటర్ అవనీ లేఖర అత్యున్నత క్రీడా పురస్కారం జాబితాలో చోటు సాధించలేదు.

క్రీడా పురస్కార విజేతలు :

మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న : దొమ్మరాజు గుకేశ్ (చెస్), హర్మన్‌ప్రీత్ కౌర్ (హాకీ), ప్రవీణ్ కుమార్ (పారా అథ్లెటిక్స్), మను బాకర్ (షూటింగ్).

అర్జున అవార్డులు : జ్యోతి ఎర్రాజి (అథ్లెటిక్స్), అన్ను రాణి (అథ్లెటిక్స్), నీతు (బాక్సింగ్), సవీటీ (బాక్సింగ్), వంటిక అగర్వాల్ (చెస్), సలీమ టెటె (హాకీ), అభిషేక్ (హాకీ), సంజయ్ (హాకీ), జర్మన్‌ప్రీత్ సింగ్ (హాకీ), సుఖ్‌జీత్ సింగ్ (హాకీ), రాకేశ్‌కుమార్ (పారా ఆర్చరీ), ప్రీతీ పాల్ (పారా అథ్లెటిక్స్), దీప్తి జీవాంజి (పారా అథ్లెటిక్స్), అజీత్ సింగ్ (పారా అథ్లెటిక్స్), నవదీప్ (పారా అథ్లెటిక్స్), నితీశ్ కుమార్ (పారా బ్యాడ్మింటన్), తులసిమతి మురుగేశన్ (పారా అథ్లెటిక్స్), నిత్య శ్రీ సుమతి శివన్ (పారా బ్యాడ్మింటన్), మనీశ్ రామదాస్ (పారా బ్యాడ్మింటన్), కపిల్ పర్మార్ (పారా జూడో), మోన అగర్వాల్ (పారా షూటింగ్),రూబిన ఫ్రాన్సిస్ (పారా షూటింగ్), స్వప్నిల్ సురేశ్ కుశాలె (షూటింగ్), సరబ్జోత్ సింగ్ (షూటింగ్), అభయ్ సింగ్ (స్క్వాష్), సాజన్ ప్రకాశ్ (స్విమ్మింగ్), అమన్ సెహ్రావత్ (రెజ్లింగ్).

అర్జున అవార్డు (లైఫ్‌టైమ్) : సుచా సింగ్ (అథ్లెటిక్స్), మురళీకాంత్ రాజారామ్ (పారా స్విమ్మింగ్).

ద్రోణాచార్య అవార్డు : సుభాశ్ రానా (పారా షూటింగ్), దీపాళి దేశ్‌పాండే (షూటింగ్), సందీప్ సంగ్వాన్ (హాకీ).

ద్రోణాచార్య అవార్డు (లైఫ్‌టైమ్) : ఎస్ మురళీధరన్ (బ్యాడ్మింటన్), ఆర్మాండో (ఫుట్‌బాల్).



మా 'ఓజీ..' శంకరే - రాజమౌళి

'ప్రస్తుతం ఉన్న కుర్ర దర్శకులు మమ్మల్ని చూసి గర్వపడు తుంటారు. కానీ మేం మాత్రం శంకర్‌ని చూసి గర్వపడు తుంటాం. ఆయనే డైరెక్టర్లకు 'ఓజీ'. ఒరిజినల్ గ్యాంగ్ స్టర్. మనకున్న పెద్ద కలల్ని సినిమాగా తీస్తే, డబ్బులు వెనక్కి వస్తాయని అందరికీ కాన్ఫిడెంట్ ఇచ్చిన డైరెక్టర్ శంకర్' అని దర్శకుడు రాజమౌళి అన్నారు.

రామ్ చరణ్ కథానాయకుడిగా శంకర్ దర్శకత్వంలో రూపొందిన భారీ బడ్జెట్ చిత్రం 'గేమ్ చేంజర్'. ఈ సినిమాను అనిత సమర్పణలో శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్, జీ స్టూడియోస్, దిల్ రాజు ప్రొడక్షన్ బ్యానర్స్‌పై దిల్ రాజు, శిరీష్ నిర్మించారు. తెలుగు, తమిళ, హిందీ భాషల్లో ఈ మూవీ ఈనెల 10న రిలీజ్ అవుతోంది. ఈ నేపథ్యంలో గురువారం ఈ చిత్ర ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. ఈ వేడుకకు దర్శకుడు రాజమౌళి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ట్రైలర్ రిలీజ్ అనంతరం ఆయన మాట్లాడుతూ, 'ఈ మూవీతో వింటేజ్ శంకర్‌ని చూస్తాం. 'ఒకే ఒక్కడు' నాకు చాలా ఇష్టమైన సినిమా. ఆ స్థాయిని మించేలా ఈ సినిమా ఉంటుందనిపిస్తుంది. ట్రైలర్ చూస్తే.. ప్రతీ షాట్, సీన్ ఎగ్జైట్‌మెంట్ ఇచ్చింది' అని అన్నారు.

'ఈ చిత్రంలో అన్ని రకాల అంశాలు ఉంటాయి. సోషల్ కమర్షియల్, మాస్, ఎంటర్టైనర్‌గా ఉంటుంది. ఓ పొలిటికల్ లీడర్, ఓ ఐఏఎస్ ఆఫీసర్ మధ్య జరిగే కథ. హీరో పాత్రకు ఓ ఫ్లాష్ బ్యాక్ ఉంటుంది. రామ్ చరణ్ అద్భుతంగా నటించారు. అందరూ శంకరాత్రి అని అంటున్నారు. కానీ ఇది రామ నవమి. కార్తీక్ సుబ్బరాజ్ వద్ద కథను తీసుకుని ఈ మూవీని చేశాను. ఇది కూడా నాకు ఓ గేమ్ ఛేంజర్ లాంటిదే' అని డైరెక్టర్ శంకర్ చెప్పారు.

రామ్ చరణ్ మాట్లాడుతూ, 'ట్రైలర్‌ను రిలీజ్ చేసిన రాజమౌళికి థ్యాంక్స్. రాజమౌళి, శంకర్ ఏ విషయంలోనూ కాంప్రమైజ్ అవ్వరు. వారు అనుకున్నది అనుకున్నట్టుగా వచ్చే వరకు షూట్ చేస్తుంటారు. అందరి పర్ఫామెన్స్‌లతోనే ఈ సినిమా ఎలివేట్ అవుతోంది' అని అన్నారు. 'తమిళ్ సినిమాను శంకర్ పాన్ ఇండియాగా చేశారు. రాజమౌళి తెలుగు సినిమాను గ్లోబల్ స్థాయికి తీసుకెళ్లారు. ఆ ఇద్దరి వల్లే ఇప్పుడు ఇలాంటి భారీ చిత్రాలు వస్తున్నాయి. ఈ సినిమాని ఎవ్వరూ ఊహించ లేరు. ఇదొక గొప్ప సినిమా కానుంది' అని దిల్ రాజు చెప్పారు.



అదే.. గ్లోపిక్స్ లక్ష్యం


వినోద రంగంలో విప్లవాత్మక మార్పుల్ని తీసుకువచ్చేందుకు మరో కొత్త ఓటీటీ రాబోతోంది. బెంగళూరు బేస్డ్‌గా ఈ కొత్త ఓటీటీ సంస్థ 'గ్లోపిక్స్' కార్యకలాపాలు సాగించనుంది. గురువారం గ్లోపిక్స్ లోగోను అధికారికంగా లాంచ్ చేశారు. వేసవిలో పూర్తి స్థాయిలో ఈ సంస్థ అందుబాటులోకి రానుంది. గ్లోపిక్స్‌ను విన్సే ఎల్ ఏ, అనిత సంయుక్తంగా స్థాపించగా, లోకేష్ సన్నయ్య ఫౌండర్ మెంబర్, సిఎమ్‌ఓ ఫౌండింగ్ మెంబర్‌గా వ్యవహరిస్తున్నారు. మారుతి రాజీవ్ ఫౌండర్ మెంబర్/సిటిఓ, రూపేశ్ మామిళ్లపల్లి హైదరాబాద్ కంటెంట్ హెడ్‌గా వ్యవహరించనున్నారు.

గురువారం ఈ లోగోను బెంగళూరు, కొచ్చి, హైదరాబాద్ వంటి ప్రదేశాల్లో ఘనంగా లాంచ్ చేసారు. ఇక ఈ ఫ్లాట్ ఫాంలో ఆసక్తికరమైన చిత్రాలు, వెబ్ సిరీస్‌లు, డాక్యుమెంటరీలు, రియాల్టీ షోలు అంటూ 360 డిగ్రీల ఎంటర్టైన్మెంట్‌ను అందించబోతున్నారు.

గ్లోపిక్స్ ఫౌండర్ మెంబర్ మారుతి రాజీవ్ మాట్లాడుతూ, 'మా గ్లోపిక్స్ లోగోను లాంచ్ చేయడం ఆనందంగా ఉంది. మన కల్చర్, మన సంస్కృతి, మన మూలాల్లోంచి కథలను గ్లోబల్‌గా అందించేందుకు దీన్ని ప్రారంభిస్తున్నాం. మంచి కంటెంట్, కాన్సెప్ట్‌లను అందించేందుకు ఈ కొత్త ఫ్లాట్ ఫాంను తీసుకొస్తున్నాం' అని చెప్పారు. 'ప్రాంతీయతను చాటేలా, లోకల్ టాలెంట్, కల్చర్‌ను ఎంకరేజ్ చేసేందుకు గ్లోపిక్స్‌ను స్టార్ట్ చేస్తున్నాం' అని ఫౌండింగ్ మెంబర్ లోకేష్, హైదరాబాద్ కంటెంట్ హెడ్ రూపేశ్ తెలిపారు.

నవచిత్రం

ఊహించని శక్తులతో పోరాటం



విరాజ్ రెడ్డి చీలం హీరోగా అను ప్రొడక్షన్స్ బ్యానర్‌పై రూపొందుతున్న యాక్షన్, లవ్ ఎంటర్‌టైనర్ 'గార్డ్'. జగా పెద్ది దర్శకత్వంలో అనసూయ రెడ్డి నిర్మిస్తున్నారు. 'రివేంజ్ ఫర్ లవ్' అనేది ట్యాగ్‌లైన్. మిమి లియోనార్డ్, శిల్పా బాలకృష్ణన్ హీరోయిన్స్‌గా నటిస్తున్నారు.

మెల్‌బోర్న్‌లో నివసించే పాతికేళ్ల కుర్రాడైన సుశాంత్ సెక్యూరిటీ గార్డ్‌గా వర్క్ చేస్తుంటాడు. తను కష్టపడి సొంతంగా ఓ సెక్యూరిటీ ఏజెన్సీని స్టార్ట్ చేయాలని అనుకుంటాడు. ఆ క్రమంలో సామ్ అనే సైకాలజిస్ట్‌తో అతనికి పరిచయం ఏర్పడుతుంది. ఆమెతో ప్రేమలో కూడా పడతాడు సుశాంత్. అనుకోని పరిస్థితుల్లో అతని జీవితం ఓ మలుపు తీసుకుంటుంది. తన జీవితంలో ప్రేమ కోసం సుశాంత్ ఊహించని శక్తులతో ఎలాంటి పోరాటం చేశాడనే కథాంశంతో రూపొందిన చిత్రమే 'గార్డ్'. ఈ మూవీ మోషన్ పోస్టర్‌ను గురువారం మేకర్స్ విడుదల చేశారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ జరుపుకుంటున్న ఈ చిత్రాన్ని తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషలతో పాటు ఇంగ్లీష్, చైనీస్ భాషల్లోనూ రిలీజ్ చేయబోతున్నారు.


ఈ తరం ప్రేక్షకుల కోసం..



రవికృష్ణ

దక్షిణ భాషా చిత్రాలలో కల్ట్ క్లాసిక్ సినిమాగా నిలిచిన వాటిలో '7జీ బృందావన కాలనీ' చిత్రం ఒకటి. సినిమా విడుదలై రెండు దశాబ్దాలవుతున్నా, ఇప్పటికీ ఎందరికో అభిమాన చిత్రంగా ఉంది. అలాంటి కల్ట్ క్లాసిక్ చిత్రానికి సీక్వెల్‌గా '7జీ బృందావన కాలనీ 2' రూపొందుతోంది.

శ్రీ సూర్య మూవీస్ పతాకంపై నిర్మాత ఎ.ఎం.రత్నం ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రేక్షకులంతా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ సీక్వెల్ చిత్రీకరణ తుది దశకు చేరు కుందని నూతన సంవత్సరం సందర్భంగా చిత్ర బృందం ప్రకటించింది. ఈ చిత్రానికి సెల్వరాఘవన్ దర్శకత్వం వహిస్తున్నారు. కట్టిపడేసే కథాకథనాలు, హత్తుకునే భావోద్వేగాలతో ప్రేక్షకులకు గొప్ప అనుభూతిని అందించేలా అద్భుతంగా ఈ సీక్వెల్‌ను తెరకెక్కిస్తున్నారు. మొదటి భాగంలో తన అద్భుతమైన నటనతో ప్రేక్షకుల మనసు గెలిచిన రవికృష్ణ, మరోసారి తనదైన శైలిలో మెప్పించడానికి సిద్ధమవుతున్నారు. ఆయన సరసన అనశ్వర రాజన్ నటిస్తున్నారు. నిర్మాత ఎ.ఎం.రత్నం మాట్లాడుతూ, '7జీ బృందావన కాలనీ' ప్రేక్షకుల హృదయాలను హత్తుకున్న చిత్రం. సినీ చరిత్రలో ఈ చిత్రం ఒక ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉంది. ఇప్పుడు సీక్వెల్‌తో నేటి ప్రేక్షకుల అభిరుచికి తగ్గట్టుగా సరికొత్త, ఆకట్టుకునే కథనాన్ని అందించి, అప్పటి మ్యాజిక్‌ను పునఃసృష్టి చేయాలని మేం లక్ష్యంగా పెట్టుకున్నాం' అని అన్నారు.



బాలకృష్ణ, ఊర్వశి రౌతేలా

'దబిడి..దిబిడి' పక్కా మాస్ సాంగ్

బాలకృష్ణ హీరోగా నటించిన సినిమా 'డాకు మహారాజ్'. ఈ చిత్రంపై భారీ అంచనాలు ఉన్నాయి. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు, పాటలు విశేషంగా ఆకట్టు కున్నాయి. తమన్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రం నుంచి ఇప్పటివరకు రెండు పాటలు విడుదల కాగా, రెండింటికీ మంచి స్పందన లభించింది.

ఇక మూడవ గీతం 'దబిడి దిబిడి'ని తాజాగా చిత్ర బృందం విడుదల చేసింది. విడుదలైన కొద్ది నిమిషాల్లోనే ఈ పాట సామాజిక మాధ్యమాల్లో ఒక ఊపు ఊపుతోంది. బాలకృష్ణ అంటే డైలాగ్‌లకు పెట్టింది పేరు. అలాంటి బాలకృష్ణ చిత్రాలలోని అత్యంత ప్రజాదరణ పొందిన డైలాగ్‌లతో రూపుదిద్దుకున్న 'దబిడి దిబిడి' పాట అభిమానులను నిజమైన కనువిందు చేస్తోంది.

ఈ పాటలో బాలకృష్ణతో కలిసి ఊర్వశి రౌతేలా ఆడి పాడారు కదిపారు. బాలకృష్ణ సినిమా అంటే తమన్ ఏ స్థాయిలో సంగీతం అందిస్తారో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఇప్పుడు 'దబిడి దిబిడి' కోసం తమన్ మరోసారి అద్భుతమైన సంగీతాన్ని అందించారు. వాగ్దేవి తన శక్తివంతమైన గాత్రంతో పాటను మరో స్థాయికి తీసుకెళ్లారు. గీత రచయిత కాసర్ల శ్యామ్ సాహిత్యం గురించి ప్రత్యేకంగా మాట్లాడుకుంటారు అని చిత్రయూనిట్ తెలిపింది.

బాబీ కొల్లి దర్శకత్వంలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. శ్రీకరా స్టూడియోస్ సమర్పిస్తోంది. సంక్రాంతి కానుకగా ఈనెల 12న భారీస్థాయిలో విడుదల కానుంది.

పుట్టిన వారికి మరణం తప్పదు..

జెడి చక్రవర్తి, నరేష్ అగస్త్య, సీరత్ కపూర్ లీడ్ రోల్స్‌లో శ్రవణ్ జొన్నాడ రచన, దర్శకత్వం వహించిన యాక్షన్ థ్రిల్లర్ 'జాతస్య మరణం ధ్రువం'. త్రిష ప్రెజెంటర్‌గా సురక్ష్ బ్యానర్‌పై మల్కాపురం శివ కుమార్ నిర్మిస్తున్నారు. ఈ సినిమాతో బాలీవుడ్ నటి ప్రీతీ జింగానియా కూడా రీఎంట్రీ ఇస్తోంది. ఈ చిత్రానికి 'జాతస్య మరణం ధ్రువం'అనే టైటిల్ ఖరారు చేసిన మేకర్స్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ని లాంచ్ చేశారు. ఒక సంస్కృత పద బంధం నుంచి వచ్చిన ఈ టైటిల్‌కు 'పుట్టినవారికి మరణం తప్పదు' అని అర్థం. తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళం భాషల్లో ఈ సినిమా పాన్ ఇండియా రిలీజ్ కానుంది. రాజేష్ శర్మ, తనికెళ్ల భరణి, లావణ్య షావుకారు, హిట్లెన్ తేజ్వాణి, మస్త్ అలీ, తులసి, ఈటీవీ ప్రభాకర్, జెమినీ సురేష్, షీనా చౌహాన్, షబీనా, ఇంధు, సోనియా, తాగుబోతు రమేశ్ నటిస్తున్న ఈ చిత్రానికి రచన, సంగీతం – జిబ్రాన్, రాజ్, ఎడిటర్– విప్లవ్ నైషదం.



సీరత్ కపూర్

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

మాకు సమయం ఇవ్వండి

- ఈడీని కోరిన అరవింద్ కుమార్, బీఎల్ఎన్ రెడ్డి

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

ఫార్ములా-ఈ కార్ రేసు కేసుకు సంబంధించి విచారణకు హాజరు కావటానికి తమకు సమయం కావాలని హెచ్ఎండీఏ మాజీ కమిషనర్ అరవింద్ కుమార్, చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డిలు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులను గురువారం కోరారు. ఏసీబీ ఎఫ్ఐఆర్ ఆధారంగా ఫార్ములా-ఈ కార్ రేసింగ్ వ్యవహారంపై కేసులను నమోదు చేసిన ఈడీ అధికారులు.. అరవింద్ కుమార్, బీఎల్ఎన్ రెడ్డిలను తమ ఎదుట హాజరు కావాలని నోటీసులు ఇచ్చిన విషయం తెలిసిందే. 2న బీఎల్ఎన్ రెడ్డి, 3న అరవింద్ కుమార్ హాజరు కావాల్సి ఉంది. కాగా, అనివార్య కారణాల వలన తాను హాజరు కాలేకపోతున్నానని మొదట బీఎల్ఎన్ రెడ్డి, తర్వాత అరవింద్ కుమార్‌లు ఈడీకి ఈ-మెయిల్ సమాచారాన్ని పంపారు. దానిపై స్పందించిన ఈడీ అధికారులు.. తర్వాత ఎప్పుడు హాజరు కావాలో తేదీలు నిర్ణయించి సమాచారం అందజేస్తామని తెలిపారు.

మహిళా జర్నలిస్టులపై అవమానకర పోస్టులు

- నటులు ఎస్.వి. శేఖర్‌కు జైలుశిక్షను సమర్థించిన హైకోర్టు

చెన్నై : మహిళా జర్నలిస్టులపై అవమానకర పోస్టులు కేసు 2018లో నటులు ఎస్.వి.శేఖర్‌కు ట్రయిల్ కోర్టు విధించిన ఒక నెల జైలుశిక్షను మద్రాస్ హైకోర్టు గురువారం సమర్థించింది. ఈ విషయంలో జోక్యం చేసుకోవడానికి నిరాకరించింది. ఎంపి, ఎమ్మెల్యేల ప్రత్యేక కోర్టు గత ఏడాది ఫిబ్రవరిలో ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ శేఖర్ వేసిన పిటీషన్‌ను జస్టిస్ పి.వేల్మురుగన్ కొట్టివేశారు. అయితే సుప్రీంకోర్టులో అప్పీల్‌కు వెళ్లేందుకు వీలుగా శేఖర్‌కు జైలుశిక్షను 90 రోజుల పాటు నిలిపివేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. మహిళా జర్నలిస్టులకు వ్యతిరేకంగా అమానకరమైన పోస్టులు షేర్ చేసినట్లు దోషి శేఖర్ స్వయంగా అంగీకరించి, బేషరతుగా క్షమాపణలు చెప్పిన తరువాత వేరే విచారణ అవసరం లేదని జస్టిస్ వేల్మురుగన్ వ్యాఖ్యానించారు. తాను షేర్ చేసిన సందేశాన్ని వేరే ఎవరో రాశారని, సరిగ్గా చదవకుండా, అనుకోకుండా షేర్ చేశానని పిటీషనర్ చెప్పడాన్ని జడ్జీ తప్పుపట్టారు. విద్యావంతులు, భారీ సంఖ్యలో అభిమానులను కలిగి రాష్ట్రంలో ప్రముఖ వ్యక్తి కూడా ఫేస్‌బుక్ పోస్టును జాగ్రత్తగా చదవకుండా షేర్ చేయడంపై ఆశ్చర్యం వ్యక్తం చేశారు. 'ఫేస్‌బుక్‌లో మీకు వచ్చిన ప్రతీదాన్ని షేర్ చేస్తారా..' అని ప్రశ్నించారు. షేర్ చేసిన పోస్టులో ఉన్న కంటెంట్ చాలా జుగుప్సాకరంగా ఉందని, తమిళనాడు రాష్ట్రంలో ఉన్న మొత్తం మీడియాను అవమానించేవిధంగా ఉందని జడ్జీ పేర్కొన్నారు. 2018 ఏప్రిల్ 19న శేఖర్ చేసిన పోస్టులకు వ్యతిరేకంగా ఈ కేసు నమోదయింది.

వైసీపీ నేత గౌతమ్ రెడ్డికి ఊరట

- రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

వైసీపీ నేత గౌతమ్ రెడ్డికి అరెస్టు నుంచి మధ్యంతర రక్షణ కల్పిస్తూ సుప్రీంకోర్టు ఉత్తర్వులిచ్చింది. హత్యాయత్నం కేసులో రాష్ట్ర హైకోర్టు బెయిల్ నిరాకరిస్తూ ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ గౌతమ్‌రెడ్డి వేసిన పిటిషన్‌ను గురువారం న్యాయమూర్తులు జస్టిస్ పార్థీవాలా, జస్టిస్ మహదేవన్‌తో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. తదుపరి విచారణ వరకు ఎలాంటి తీవ్రమైన చర్యలు తీసుకోవద్దని మధ్యంతర ఉత్తర్వులిచ్చింది. రాష్ట్ర ప్రభుత్వానికి, ఫిర్యాదుదారుకు నోటీసులు జారీ చేసింది. వారం రోజుల్లో ప్రభుత్వం కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశించింది. గౌతమ్ రెడ్డిపై టీడీపీ ప్రభుత్వం అక్రమంగా హత్యాయత్నం కేసు నమోదు చేసిందని సీనియర్ న్యాయవాది సిద్ధార్థ దవే, న్యాయవాది అల్లంకి రమేష్ వాదనలు వినిపించారు. ఈ కేసులో రాష్ట్ర ప్రభుత్వం కెవియట్ ఎలా దాఖలు చేస్తుందని, ఫిర్యాదుదారు కాకుండా, ప్రభుత్వమే ఎందుకు యాక్టివ్‌గా ఉందని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. అనంతరం కేసు విచారణ వాయిదా వేసింది.

'అన్నా యూనివర్శిటీ' కేసును రాజకీయం చేస్తున్నారు

- మద్రాస్ హైకోర్టు జడ్జి



చెన్నై : అన్నా యూనివర్సిటీ లైంగిక వేధింపుల కేసులో అసలు సమస్యను వదిలివేసి, ఈ కేసును రాజకీయం చేస్తున్నారని మద్రాస్ హైకోర్టు జడ్జి జస్టిస్ వి.వేల్మురుగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలను లొంగదీసుకుని, వారిపై అఘాయిత్యాలకు పాల్పడుతున్నారని ఈ కేసు సమాజానికి మేలుకొలుపుగా ఉండాల్సింది పోయి, రాజకీయం చేస్తున్నారని జడ్జి విమర్శించారు. అన్నా యూనివర్సిటీ లైంగిక వేధింపుల అంశంపై నిరసన చేయానికి పట్టలి మక్కల్ కట్చి (పిఎంకె) పార్టీ మహిళా విభాగానికి రాష్ట్ర పోలీసులు అనుమతి నిరాకరించారని ఆ పార్టీ న్యాయవాది కె.బాలు వేసిన పిటీషన్ విచారణలో జడ్జి ఈ వ్యాఖ్యలు చేశారు. రాజకీయ పార్టీల నిరసనలు కేవలం మీడియా దృష్టిని ఆకర్షించే లక్ష్యంతో ఉన్నాయని, నిజమైన సమస్యపై చేయడం లేదని తెలిపారు. మీడియా కూడా బాధ్యతాయుతంగా వ్యవహరించలేదని, గత నెలలో ఈ సంఘటన వెలుగులోకి వచ్చినప్పటి నుంచి టివి న్యూస్ ఛానళ్లలో 'మీడియా విచారణ' జరుగుతుందని జడ్జీ అన్నారు. ఒక హైకోర్టు జడ్జిగా ఈ విషయం చెప్పడం లేదని, ఒక సామాన్య మనిషిగా తన వేదనను వ్యక్తం చేస్తున్నానని జస్టిస్ వేల్మురుగన్ తెలిపారు. తన వ్యాఖ్యల మధ్యలో ప్రభుత్వ న్యాయవాది జోక్యం చేసుకునే ప్రయత్నాన్ని కూడా జడ్జి మందలించారు. 'నేను మీ వైపు తిరిగితే విషయం వేరుగా ఉంటుంది. నన్ను రెచ్చగొట్టవద్దు. ప్రస్తుత కాలంలో కూడా మహిళలపై లైంగిక వేధింపులు వంటి సంఘటనలు చూసి మనమంతా సమిష్టిగా సిగ్గుపడాలి' అని జడ్జి తెలిపారు. ఈ కేసును విచారణ చేయడానికి కోర్టు మహిళా ఐపిఎస్ అధికారుల బృందాన్ని ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. సరైన విచారణ జరగపోతే, ఎలా వ్యవహరించాలో కోర్టుకు తెలుసునని తెలిపారు.

తాజా దాడుల్లో 60మంది పాలస్తీనియన్ల మృతి

చలి పంజాకు మరో చిన్నారి కన్నుమూత

- అల్‌జజీరా కార్యకలాపాలను నిషేధించిన పాలస్తీనా అథారిటీ



గాజా : నిర్వాసితులు తల దాచుకున్న శిబిరాలను వదిలిపెట్టకుండా విచక్షణారహితంగా ఇజ్రాయిల్ ఆర్మీ గాజావ్యాప్తంగా కొనసాగిస్తున్న బాంబు దాడుల్లో గురువారం ఉదయం నుండి 52మంది మరణించారు. సురక్షిత, మానవతా జోన్‌గా ప్రకటించిన అల్ మావసి శిబిరంపైనా ఆర్మీ బాంబు దాడులు జరిపింది. ఈ దాడిలో 12మంది పాలస్తీనియన్లు మరణించారు. పశ్చిమ గాజా నగరమైన లాబాబిడి జంక్షన్‌కు సమీపంలో జరిగిన దాడిలో ముగ్గురు మరణించారు. దక్షిణ ఖాన్ యూనిస్ నగరంలో హోం శాఖ భవనంపై జరిగిన దాడిలో ఆరుగురు మరణించగా, పలువురు గాయపడ్డారు. తాజాగా మరో చిన్నారి చలి పులికి చిక్కి కన్నుమూసింది. దీంతో ఇప్పటివరకు ఇలా మరణించిన చిన్నారుల సంఖ్య 8కి చేరింది. దాడుల కారణంగా ఇల్లూ వాకిలి పోగొట్టుకుని వీధుల పాలై శిబిరాల్లో తల దాచుకుంటున్న వేలాది కుటుంబాలు తీవ్రంగా వున్న చలికి తట్టుకోలేక ఇబ్బందుల పాలవుతున్నాయి. భారీ వర్షాలు ముంచెత్తినపుడు కూడా ఇదే రకమైన పరిస్థితి నెలకొంది. కేవలం ప్లాస్టిక్ పరదాలతో ఉన్న శిబిరంలో తల దాచుకోవడం వల్ల చలిగాలులను పిల్లలు తట్టుకోలేకపోతున్నారని, ఇప్పటికే ప్రజలు ఈ దాడులతో బలహీనపడిన పడిన నేపథ్యంలో శీతల గాలుల వల్ల తలెత్తే ముప్పులను సమర్ధవంతంగా ఎదుర్కోలేకపోతున్నారని బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 15మాసాలుగా కొనసాగుతున్న దాడుల్లో గాజాలో 45,581మంది మరణించగా, 1,08,438మంది గాయపడ్డారు.

అల్‌జజీరాపై నిషేధం

పాలస్తీనా భూభాగాల్లో అల్‌జజీరా ప్రసారాలను పాలస్తీనా అథారిటీ నిలుపుచేసింది. రెచ్చగొట్టే, తప్పు దారి పట్టించే సమాచారాన్ని ప్రసారం చేస్తోందంటూ పాలస్తీనా అథారిటీ అధికారిక వార్తా సంస్థ వఫా పేర్కొంది. అల్ జజీరా ఈ నిర్ణయాన్ని తీవ్రంగా ఖండించింది. ఇప్పటికే ఇజ్రాయిల్‌లో అల్‌జజీరా కార్యకలాపాలను నిషేధించారు.

ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ప్రభుత్వంతో దీర్ఘకాలంగా వున్న విభేదాల నేపథ్యంలో ఈ నిషేధ ఉత్తర్వులు వెలువడ్డాయి. తప్పుడు సమాచారం, రెచ్చగొట్టే వార్తలు, దేశద్రోహం, పాలస్తీనా అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడం వంటి కారణాలన్నీ ఈ చర్యలు తీసుకోవడానికి దారి తీశాయని వఫా బుధవారం పొద్దుపోయిన తర్వాత ప్రకటించింది.

దేశ వ్యాప్తంగా ప్రార్థన స్థలాల చట్టాన్ని అమలు చేయండి



- సుప్రీంకోర్టులో ఎంఐఎం నేత అసదుద్దీన్ పిటిషన్
- ఇదే తరహాలో దాఖలైన పలు పిటిషన్లతో సీజేఐ ధర్మాసనం ట్యాగ్
- తదుపరి విచారణ ఫిబ్రవరి 17కు వాయిదా

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

దేశవ్యాప్తంగా ప్రార్థనా స్థలాల చట్టం 1991ను అమలు చేయాలని సుప్రీంకోర్టులో ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు పరిగణనలోకి తీసుకుంది. ఇదే అంశంపై గతంలో దాఖలైన ఇతర పిటిషన్లతో కలిపి విచారించేందుకు అంగీకరించింది. 1947 ఆగస్టు 15 నుంచి మతపరమైన స్వభావాన్ని కొనసాగించాలని కోరే 1991 నాటి ప్రార్థనా స్థలాల చట్టాన్ని అమలు చేయాలని కోరుతూ అసదుద్దీన్ ఒవైసీ తరపు న్యాయవాది ఫుజైల్ అహ్మద్ అయ్యూబీ డిసెంబర్ 17న సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను గురువారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ముందు విచారణకు వచ్చింది. ఈ సందర్భంగా ఒవైసీ తరపు న్యాయవాది నిజాం పాషా వాదనలు వినిపిస్తూ... ఈ ప్రార్థనా స్థలాల చట్టంపై ఇప్పటికే కోర్టులో పలు పిటిషన్లు పెండింగ్‌లో ఉన్నాయని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. అందువల్ల తమ పిటిషన్‌ను కూడా వాటితో జత చేయాలని కోరారు. ఈ విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకున్న సీజేఐ ధర్మాసనం ఈ వ్యవహారంలో దాఖలైన పలు పిటిషన్లతో ఈ పిటిషన్‌నూ ట్యాగ్ చేస్తున్నట్టు వెల్లడించారు. వాటితో పాటు వచ్చే ఫిబ్రవరి 17న ఈ పిటిషన్ పై విచారణ చేపడతామని స్పష్టం చేశారు.

విద్యార్థినితో మాట్లాడాడని దాడి

- అవమానంతో విద్యార్థి ఆత్మహత్య

నవతెలంగాణ - గంభీరావుపేట



తోటి విద్యార్థినితో మాట్లాడినందుకు దాడి చేయడంతో అవమానంగా భావించిన విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని మల్లారెడ్డిపేట గ్రామంలో గురువారం జరిగింది. ఎస్ఐ శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. మల్లారెడ్డిపేట గ్రామానికి చెందిన చింతకింది సత్యనారాయణ కుమారుడు శివ కిషోర్(16) పదో తరగతి చదువుతున్నాడు. అయితే, తన క్లాస్‌మేట్ అయిన బాలికతో నూతన సంవత్సరం సందర్భంగా మాట్లాడాడు. దాంతో అదే గ్రామానికి చెందిన అంబటి హరిబాబు, కందుకూల నవీన్, గెరిగంటి రాకేష్, కాసారం ప్రవీణ్, సోమరపు నివాస్ శివను తీవ్రంగా కొట్టారు. తన క్లాస్‌మేట్ అని చెప్పినా వినకుండా కొట్టడంతో కుటుంబ సభ్యులకు చెప్పి రోదించాడు. మరోసారి తన కుటుంబ సభ్యులను కూడా అవమానించారని మనస్తాపానికి గురైన శివ కిశోర్ ఇంట్లో ఉరేసుకున్నాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ శ్రీకాంత్ ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పే రోల్ ఐడి ఇవ్వాలి

- తెలంగాణ మోడల్ స్కూల్, హాస్టల్ ఎంప్లాయీస్ యూనియన్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ప్రతి ఒక్కరికి పేరోల్ ఐడీ ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర మోడల్ స్కూల్, హాస్టల్ ఎంప్లాయీస్ యూనియన్(సీఐటీయూ) రాష్ట్ర కమిటి ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం రాష్ట్ర ప్రభుత్వ స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్‌కు వినతి పత్రాన్ని ఆ సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు జె వెంకటేశ్, రాష్ట్ర కన్వీనర్ ఎడ్ల రమేష్, అధ్యక్షులు అరుణ, ప్రధాన కార్యదర్శి రేణుక అందజేశారు. విద్యాశాఖలో విలీనం చేసి రెగ్యులర్ ఉద్యోగుల వలే వేతనాలు ఇవ్వాలనీ, తదితర 12 డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు.

తొలి పంతులమ్మ సావిత్రీబాయిపూలే

- ఆమె జయంతిని మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించడం హర్షనీయం : సీతక్క

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఆనాటి సామాజిక పరిస్థితులను ఎదురొడ్డి అణగారిన మహిళలకు చదువు చెప్పి వారి జీవితాల్లో వెలుగులు నింపిన మహనీయురాలు సావిత్రాబాయి పూలే అని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ(సీతక్క) కొనియాడారు. ఆమె జయంతిని మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు సీతక్క ఒక ప్రకటన విడుదల చేశారు. సావిత్రీబాయి పూలే స్ఫూర్తితో మహిళలను అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలపడమే తమ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.

పరిశుభ్రతేది?

- జిల్లా కోర్టులలో మహిళల వాష్‌రూమ్‌ల పరిస్థితిపై ఢిల్లీహైకోర్టు ఆగ్రహం



న్యూఢిల్లీ : జిల్లా కోర్టులలో మహిళల వాష్‌రూమ్‌లు అపరిశుభ్రంగా ఉండడంపై ఢిల్లీ హైకోర్టు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసింది. పరిశుభ్రతను పాటించాలని ఆదేశించింది. పురుషులు, వికలాంగుల వాష్‌రూమ్‌లతో సహా అన్ని సౌకర్యాలలో పరిశుభ్రత, కార్యాచరణ ఏకరీతి ప్రమాణాలను నిర్ధారించాలని తెలిపింది. ఢిల్లీలోని అన్ని జిల్లా కోర్టులలో మహిళా వాష్‌రూమ్‌ల పరిస్థితులకు సంబంధించి ఒక నివేదిక విషయంలో జస్టిస్ సంజీవ్ నరూలా స్పందించారు. ఈ సౌకర్యాలను కల్పించటంలో ప్రదర్శించిన నిర్లక్ష్యాన్ని విస్మరించలేమని అన్నారు. పరిశుభ్రత ఉత్పత్తులు, మౌలిక సదుపాయాల లోపాల కొరతపై తక్షణ చర్యలు అవసరమని చెప్పారు. నివేదికను సమీక్షించి పరిష్కార చర్యలు గుర్తించాలనీ, వాటి అమలును నిర్ధారించి పురోగతి నివేదికను దాఖలు చేయాలని అన్ని జిల్లాల కోర్టుల ప్రిన్సిపల్ జిల్లా, సెషన్స్ జడ్జిలను జస్టిస్ నరూలా ఆదేశించారు. న్యాయవాదుల ఛాంబర్‌లోని వాష్‌రూమ్‌ల పరిస్థితి అధ్వానంగా ఉన్నదని నివేదిక నుంచి కోర్టు గ్రహించింది. బ్లాక్‌ల పరిధిలో వాష్‌రూమ్‌ల నిర్వహణను నిర్ధారించాలనీ, సమ్మతి నివేదికను సమర్పించాలని అన్ని జిల్లా కోర్టుల బార్ అసోసియేషన్‌లను న్యాయస్థానం కోరింది. న్యాయవాదుల ఛాంబర్ బ్లాక్‌లలోని చాలా మహిళా వాష్‌రూమ్‌లలో సరైన వెలుతురు, వెంటిలేషన్, సబ్బు, ఫంక్షనల్ శానిటరీ సదుపాయాలతో సహా తగిన మౌలిక సదుపాయాలు లేవనీ, తగిన సంఖ్యలో పారిశుధ్య సిబ్బంది లేనందున సాధారణ నిర్వహణ, శుభ్రపర్చటం జరగటం లేదని కోర్టు కమిషనర్ దాఖలు చేసిన నివేదిక పేర్కొన్నది. సాకేత్ జిల్లా కోర్టులోని న్యాయవాదుల ఛాంబర్ బ్లాక్‌లోని వాష్‌రూమ్ సౌకర్యాల దయనీయ, అపరిశుభ్ర పరిస్థితులను హైలెట్ చేస్తూ ఒక మహిళా న్యాయవాది వేసిన పిటిషన్‌పై న్యాయస్థానం ఈ ఆదేశాలు జారీ చేసింది. ఈ పిటిషన్ తదుపరి విచారణను కోర్టు ఫిబ్రవరిలో చేపట్టనున్నది.

న్యూయార్క్ నైట్ క్లబ్ వెలుపల కాల్పులు

- 10మందికి తీవ్ర గాయాలు
- న్యూ ఆర్లీన్స్ దాడిలో 15కి పెరిగిన మృతులు
- సర్వత్రా ఖండనలు



న్యూయార్క్ : నూతన సంవత్సరాన్ని స్వాగతిస్తూ జరిగిన వేడుకల్లో అమెరికాలో గత రెండు రోజుల్లో వరుసగా కాల్పులు చోటు చేసుకున్నాయి. న్యూయార్క్ కాల్పుల్లో 10మంది గాయపడగా, న్యూ ఆర్లీన్స్‌లో వేడుకల సందర్భంగా ఒక వాహనాన్ని జనం మీదకు పోనిచ్చిన సంఘటనలో మరణించిన వారి సంఖ్య 15కు పెరిగింది. డజన్ల సంఖ్యలో గాయపడ్డారు. ఈ ఘటనను ఫ్రాన్స్, బ్రిటన్, చైనా, ఉక్రెయిన్, ఇయు, జర్మనీ, ఇజ్రాయిల్, టర్కీ, ఐక్యరాజ్య సమితి సహా అంతర్జాతీయంగా పలు దేశాలు తీవ్రంగా ఖండించాయి. మరో ఘటనలో న్యూయార్క్‌లోని క్వీన్స్ ప్రాంతంలో నైట్‌క్లబ్ వెలుపల జరిగిన కాల్పుల్లో పది మంది గాయపడ్డారు. అనుమానితులుగా భావిస్తున్న నలుగురు వ్యక్తులు పారిపోయారు. అమెజురా నైట్‌క్లబ్ వెలుపల నిలుచుని వున్న వారిపై దాదాపు 30రౌండ్లు కాల్పులు జరిగాయి. ఆ వెంటనే కాల్పులకు పాల్పడిన వారు అక్కడే ఆగివున్న సెడాన్ కారులోకి ఎక్కి పారిపోయారు. వేరే రాష్ట్రం నెంబర్ ప్లేట్‌లో ఆ కారు వుందని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. బుధవారం రాత్రి 11.15 గంటల సమయంలో 16 నుండి 20ఏళ్ల మధ్య వయసులో వున్న దాదాపు 15మంది వేచి వున్నారు. ఈలోగా నలుగురు వ్యక్తులు అక్కడకు వచ్చి, హఠాత్తుగా ఆ బృందంపై కాల్పులు జరిపారని గస్తీ బృందం చీఫ్ ఫిలిప్ రివెరా గురువారం తెల్లవారుజామున చెప్పారు. విచక్షణారహితంగా జరిగే ఇటువంటి కాల్పులను సహించేది లేదని పోలీస్ చీఫ్ స్పష్టం చేశారు. ఇది తీవ్రవాద చర్య కాదని, కానీ కాల్పులకు కారణం ఇంకా తెలియరాలేదని చెప్పారు.

మేం చేయగలిగినదంతా చేస్తాం

- నిమిష ప్రియా కేసులో ఇరాన్ అధికారులు



న్యూఢిల్లీ : ఉరిశిక్ష విధించిన భారత నర్సు నిమిష ప్రియా కేసుపై ఇరాన్ ప్రభుత్వం దృష్టిసారిస్తుందని ఆ దేశానికి చెందిన ఉన్నతాధికారి ఒకరు గురువారం ఇక్కడ హామీ ఇచ్చారు. యెమెన్ రాజధాని సనాలో జరిగిన విచారణలో నిమిష ప్రియాకు ఉరిశిక్ష విధించారు. ఈ శిక్షను గత సోమవారం యెమెన్ అధ్యక్షులు రషద్ అల్ అలిమి కూడా ఆమోదించారు. నెల రోజుల లోపు ఈ శిక్షను అమలు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. అయితే ప్రస్తుతం యెమెన్ ఇరాన్‌కు చెందిన హౌతీల ఆధీనంలో ఉంది. ఇలాంటి నేపథ్యంలో ఇరాన్ అధికారి నుంచి ఈ హామీ రావడం నిమిష ప్రాణాలను రక్షించడంలో భారత్‌కు సహాయపడొచ్చునని భావిస్తున్నారు. న్యూఢిల్లీలోని ఇరాన్ రాయబారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇరాన్ సీనియర్ అధికారి మాట్లాడుతూ 'భారత నర్సుకు సంబంధించిన కేసును మేం స్వీకరిస్తాం. మేం చేయగలిగినదంతా చేస్తాం' అని చెప్పారు. భారత దౌత్యవేత్తలతో చర్చల కోసం వచ్చిన ఇరాన్ బృందానికి ఈ అధికారి నేతృత్వం వహిస్తున్నారు. 'మేం చేయగలిగినదంతా చేస్తాం' అని తెలిపిన ఈ అధికారి ఈ కేసు అత్యంత తీవ్రమైనది అని అంగీకరించారు. 2017లో తన వ్యాపార భాగస్వామి తలాల్ అబ్దో మహదీని హత్య చేసిన కేసులో నిమిష ప్రియాకు ఉరిశిక్ష విధించారు.

కోర్టు పర్యవేక్షణ ఇక అవసరం లేదు

- గోవింద్ పన్సారే హత్యకేసు విచారణపై బాంబే హైకోర్టు



ముంబయి : ప్రముఖ సామాజిక కార్యకర్త గోవింద్ పన్సారే హత్యకు సంబంధించిన దర్యాప్తు పర్యవేక్షణను బాంబే హైకోర్టు ముగించింది. ఈ కేసులో ఇక కోర్టు పర్యవేక్షణ అవసరం లేదని వివరించింది. 2015, ఫిబ్రవరి 16న గోవింద్ పన్సారేను కొల్హాపూర్‌లో బైక్‌పై వచ్చిన ఇద్దరు దుండగులు కాల్చి చంపిన విషయం విదితమే. ఆ ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నప్పటికీ.. కోర్టు వారి ప్రమేయాన్ని సమర్థించదని తెలిపింది. న్యాయమూర్తులు జస్టిస్ ఎ.ఎస్ గడ్కరీ, జస్టిస్ కమల్ ఖాటాలతో కూడిన ధర్మాసనం ఈ నిర్ణయం తీసుకున్నది. నిందితులను అరెస్ట్ చేసిన తర్వాత కేసుకు సంబంధించిన అప్‌డేట్‌లను కొల్హాపూర్‌లోని ట్రయల్‌కోర్టుకు సమర్పించాలని ఆదేశించింది. కొల్హాపూర్ సెషన్స్ కోర్టులో కొనసాగుతున్న విచారణను రోజువారీ ప్రాతిపదికన నిర్వహించాలని తెలిపింది. ఈ కేసు దర్యాప్తులో మొదట సీఐడీ ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) పాల్గొన్నప్పటికీ.. 2022లో యాంటీ టెర్రిజం స్క్వాడ్‌కు ఇది బదిలీ అయింది. పరారీలో ఉన్న నిందితుల ఆచూకీ కోసం ప్రయత్నాలు కొనసాగిస్తూనే విచారణను సమర్థవంతంగా ముగించటంపై దృష్టిని సారించాల్సిన అవసరం ఉన్నదని కోర్టు తెలిపింది.

దలాల్ స్ట్రీట్‌కు ఎట్టకేలకు ఉపశమనం

సెన్సెక్స్‌కు 1436 పాయింట్ల లాభం

- ఐటీ, ఆటో స్టాక్స్ మద్దతు
- పెరిగిన రూ.6 లక్షల కోట్ల సంపద



ముంబయి : చాలా రోజులుగా తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్న దలాల్ స్ట్రీట్‌కు ఎట్టకేలకు ఉపశమనం లభించింది. ఫైనాన్సీయల్, ఆటో, ఐటీ స్టాక్స్‌ల్లో కొనుగోళ్ల మద్దతుతో గురువారం బిఎస్ఇ సెన్సెక్స్ 1436 పాయింట్లు లేదా 1.83 శాతం పెరిగి రూ.79,943కి చేరింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 446 పాయింట్ల లాభంతో 24,188 వద్ద ముగిసింది. సెన్సెక్స్ ఓ దశలో 1500 పాయింట్లు, నిఫ్టీ దాదాపు 450 పాయింట్లు ర్యాలీ చేసింది. ఉదయం కాసేపు స్తబ్దుగా సాగిన మార్కెట్లు.. ఆ తర్వాత ఏ దశలోనూ వెనక్కి తిరగకుండా పరుగులు పెట్టాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 80,033 గరిష్ట స్థాయిని తాకింది. దీంతో వరుసగా రెండో సెషన్‌లోనూ లాభాలు నమోదు చేసినట్లయ్యింది. సెన్సెక్స్ 30 సూచీలో ఒక్క సన్‌ఫార్మా మినహా మిగిలిన అన్ని సూచీలూ లాభపడ్డాయి. ముఖ్యంగా బజాజ్ ఫిన్‌సర్వ్, బజాజ్ ఫైనాన్స్, మారుతీ సుజుకీ, మహీంద్రా అండ్ మహీంద్రా, టైటాన్ షేర్లు అధికంగా లాభపడిన వాటిలో ఉన్నాయి.

ఒక్క పూటలోనే బీఎస్ఈలో లిస్టెడ్ కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.5.89లక్షల కోట్లు పెరిగి రూ.450.32 లక్షల కోట్లకు చేరింది. దీంతో దాదాపు రూ.6 లక్షల కోట్ల సంపద పెరిగినట్లయ్యింది. నిఫ్టీలో ఆటో, ఫైనాన్సీయల్ సర్వీసెస్, ఐటీ, కన్స్యూమర్ డ్యూరేబుల్స్ రంగాలు 1.5 శాతం నుంచి 3.8 శాతానికి పెరిగాయి. మంగళవారం వరకు వరుసగా నాలుగు సెషన్లలో నష్టాలను నమోదు చేసిన ఐటి స్టాక్స్ గురువారం లాభాలను నమోదు చేయడం సానుకూలంగా మారింది.

సానుకూలాంశాలు..

గతేడాది 2024 చివర్లో అంతర్జాతీయ, జాతీయ మార్కెట్లు భారీగా అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. అంతర్జాతీయంగా అమెరికా, యూరోపియన్ స్టాక్ ఫ్యూచర్స్ దిగిరావడంతో ఆయా ఎక్స్ఛేంజీల్లో కొనుగోళ్ల మద్దతు లభించింది. ఈ క్రమంలో కొత్త సంవత్సరంలో భారీగా కొనుగోళ్లు జరపడంతో యూరో స్టాక్స్ 50, నస్డాక్ 100 ఫ్యూచర్స్ 0.5 శాతం మెరుగుపడ్డాయి. 2023 చివరి నెలతో పోల్చితే గడిచిన డిసెంబర్‌లో జీఎస్టీ వసూళు 7.3 శాతం పెరిగి 1.77 లక్షల కోట్లకు చేరుకున్నాయి. ఇది వినియోగంలో రికవరీకి సంకేతమనే విశ్లేషణలు రావడంతో ఇన్వెస్టర్లలో విశ్వాసం పెరిగింది. అదే విధంగా డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో ఆటో మోటివ్, ఫైనాన్షియల్స్ తో పాటు కీలక రంగాల నుంచి సానుకూల ప్రకటనలు రావడం ఉత్సాహాన్ని నింపింది.

బిజినెస్

నాలుగేండ్ల కనిష్టానికి కార్ల అమ్మకాలు

- పట్టణ మార్కెట్‌పై ఒత్తిడి
- విక్రయాలపై ప్రభావం



న్యూఢిల్లీ : హెచ్చు ధరలతో పట్టణ ప్రజలపై ఆదాయ ఒత్తిడిలు నెలకొనడంతో కార్ల అమ్మకాలు ఆశించిన స్థాయిలో జరగలేదు. గడిచిన ఏడాది 2024లో కార్ల అమ్మకాల వృద్ధి 5 శాతానికి పరిమితమై.. నాలుగేండ్ల కనిష్టానికి పడిపోయాయి. ఇంత తక్కువ వృద్ధి చోటు చేసుకోవడం ఇదే తొలిసారి. మరోవైపు స్పోర్ట్స్ యుటిలిటీ వెహికల్స్ (ఎస్‌యూవీ)ల అమ్మకాలకు ప్రజాదరణ పెరిగింది. కాగా.. పట్టణ మార్కెట్లు సవాళ్లను ఎదుర్కొన్నాయి. పెరుగుతున్న కార్ల ధరలు, పేలవమైన డిమాండ్ అమ్మకాలను ప్రభావితం చేశాయని పరిశ్రమ వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. మారుతీ సుజుకీ, టాటా మోటార్స్ రికార్డు స్థాయిలో అమ్మకాలను నమోదు చేయగా, హ్యుందాయ్ దాదాపు యథాతథ వృద్ధిని ప్రకటించింది. భవిష్యత్ అమ్మకాలను పెంచుకోవడానికి వాహన తయారీదారులు ప్రభుత్వ ప్రోత్సాహకాలు, పన్ను తగ్గింపులను డిమాండ్ చేస్తున్నారు. ప్రాథమిక అంచనాల ప్రకారం.. 2024లో 5 శాతం పెరుగుదలతో 43 లక్షల వాహనాల అమ్మకాలు జరిగాయి. ఇంతక్రితం 2023లో 41.1 లక్షల యూనిట్ల విక్రయాలు నమోదయ్యాయి. మొత్తం అమ్మకాల్లో 54 శాతం ఎస్‌యూవీలు ఉండటం విశేషం. తక్కువ అమ్మకాల వృద్ధి భవిష్యత్తులో మరిన్ని సవాళ్లను విసురొచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. 2024లో చాలా వరకు డిమాండ్ తక్కువగా ఉంది. ముఖ్యంగా సంవత్సరం చివరిలో అమ్మకాలను పెంచడానికి వాహన తయారీదారులు దూకుడుగా ధరల తగ్గింపును ప్రకటించారు. ఇటీవల కఠినమైన భద్రత, ఉద్గార నిబంధనల అమలు కారణంగా పెరుగుతున్న కార్ల ధరలు ప్రజల వాహన కొనుగోలు స్థోమతను దెబ్బతీస్తున్నాయి. ఇది పట్టణ విక్రయాలపై మరింత ఒత్తిడి పెంచింది. కొత్త ఏడాది 2025లో పరిశ్రమ అమ్మకాలు ప్రభుత్వ విధానంపై ఆధారపడి ఉండొచ్చని నిపుణులు పేర్కొంటున్నారు. చాలా మంది వాహన తయారీదారులు ఆదాయపు పన్ను రేట్లలో తగ్గింపును, సహా ప్రోత్సాహకాల కోసం రాబోయే బడ్జెట్‌లో ఎదురు చూస్తున్నారని భావిస్తున్నారు. పన్నులు తగ్గించడం ద్వారా వినియోగాన్ని పెంచడానికి, ఆర్థిక స్థోమత మెరుగుదలకు మద్దతునివ్వనుందని విశ్లేషిస్తున్నారు. విస్తృత మార్కెట్ మందగమనాన్ని ఎదుర్కోవడానికి గ్రామీణ మార్కెట్లలోనూ కార్ల పరిశ్రమ ఊపందుకునేలా.. బలమైన డిమాండ్ పెంచడంపై ప్రభుత్వ దృష్టి సారించాలని సూచిస్తున్నారు.